

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16
సంచిక: 324
మంగళవారం 6-8-2024
SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'రాష్ట్రాన్ని దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'



బేర్ విశ్వరూపం
13 లో

అమెరికాలో మాంద్యం భయాలు మార్కెట్లను ముంచేశాయి. దేశీయ షేర్ల విలువ భారీగా పెరిగిపోవడంతో అమ్మకాల సునామీ వెల్లువెత్తింది. ఫలితంగా సెన్సెక్స్ 2,223 పాయింట్లు క్షీణించగా నిఫ్టీ 662 పాయింట్లు పతనమైంది. రూపాయి విలువ జీవితకాల కనిష్టానికి దిగి వచ్చింది.




అవి మృత్యుకుహరాలు..
ఢిల్లీలోని కోచింగ్ కేంద్రాలు డెత్ ఛాంబర్లుగా తయారై అభ్యర్థుల జీవితాలతో చెలగాట మాడుతున్నాయని సుప్రీంకోర్టు మండిపడింది.
వివరాలు 6లో ▸



సర్వేలో హారిస్ ముందంజ
అమెరికా అధ్యక్ష రేసులో ఉన్న ట్రంప్ కంటే కమలా హారిస్‌కే ఆదరణ ఎక్కువగా ఉందని సీబీఎస్ న్యూస్, యూగవ్ సర్వేలో తేలింది.
వివరాలు 6లో ▸



కేజ్రీవాల్ అరెస్టు సబబే
మద్యం కేసులో సీబీఐ తనను అరెస్ట్‌చేయ డాన్ని సవాల్ చేస్తూ ఢిల్లీ హైకోర్టు మెట్లెక్కిన ఆ రాష్ట్ర సీఎం కేజ్రీవాల్‌కు చుక్కెదురైంది.
వివరాలు 6లో ▸



బడ్జెట్‌కు లోక్‌సభ ఆమోదం
2024–25 ఆర్థిక సంవత్సర కేంద్ర బడ్జెట్‌కు సోమవారం పార్లమెంట్ దిగువసభ ఆమోదముద్ర వేసింది.
వివరాలు 6లో ▸


ఆగ్రహం
బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా నివాస భవనంపైకి ఎక్కిన ఆందోళనకారులు


ఆనందం
హసీనా ప్రధాని పదవికి రాజీనామా చేశాక ఢాకాలో ఆందోళనకారుల సంబరాలు



సంక్షోభ బంగ్లా

రాజీనామా చేసి దేశం వీడిన బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా

- ఢాకాకు నిరసనకారుల 'లాంగ్ మార్చ్'.. డిమాండ్లకు తలొగ్గి ప్రధాని పలాయనం
- సైన్యం చేతుల్లోకి దేశం.. తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటుకు యత్నాలు
- హసీనా ఇంటిని, పార్లమెంటును ముట్టడించిన జనం
- భారత్ చేరిన హసీనా, త్వరలో లండన్ వెళ్లే చాన్స్

ఢాకా/న్యూఢిల్లీ: పొరుగుదేశం బంగ్లాదేశ్ పెను రాజకీయ సంక్షోభంలో చిక్కుకుంది. సోమవారం రోజంతా అత్యంత నాటకీయ పరిణామాలు చకచకా జరిగిపోయాయి. ప్రధాని షేక్ హసీనా (76)కు వ్యతిరేకంగా కొద్ది రోజులుగా జరుగుతున్న దేశవ్యాప్త ఆందోళనలు ఉధృత రూపం దాల్చాయి. నిరసనకారుల 'లాంగ్ మార్చ్' పిలుపుకు స్పందిస్తూ జనమంతా కర్ఫ్యూను ధిక్కరించి మరీ దేశ నలుమూలల నుంచీ రాజధాని ఢాకాకు తండోపతండాలుగా తరలారు. దాంతో ప్రజల డిమాండ్‌కు హసీనా తలొగ్గారు. ప్రధాని పదవికి రాజీనామా చేశారు. జనాగ్రహానికి జడిసి పలాయన మంత్రం పఠించారు. ఉన్నపళంగా దేశం వీడారు. సోదరితో కలిసి కట్టుబట్టలతో సైనిక విమానంలో భారత్ చేరుకున్నారు. వెంటనే సైన్యం పరిస్థితిని తమ చేతుల్లోకి తీసుకుంది. సైన్యాధ్యక్షుడు జనరల్ వకారుజ్జమాన్ జాతినుద్దేశించి టీవీలో ప్రసంగించారు. ప్రధాని రాజీనామాను అధికారికంగా ప్రకటించారు. ''శాంతిభద్రతలతో పాటు మిగతా 6వ పేజీలో ▶

అప్రతిష్ట మూటగట్టుకున్న ఐరన్ లేడీ!
6 లో

పరిస్థితిని సమీక్షించిన మోదీ
బంగ్లా సంక్షోభం నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో భద్రతపై కేబినెట్ కమిటీ అత్యవసరంగా సమావేశమైంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భేటీలో పాల్గొన్నారు. బంగ్లాలో తాజా పరిస్థితిని మోదీకి జైశంకర్ నివేదించారు.

సరిహద్దుల్లో అప్రమత్తత
బంగ్లాదేశ్‌తో 4,096 కిలోమీటర్ల పొడవునా సరిహద్దుల వెంబడి భద్రతను కట్టుదిట్టం చేశారు. బీఎస్ఎఫ్ హై అలర్ట్ జారీ చేసింది. అదనపు బలగాలను మోహరించారు.

మన విద్యార్థులు వెనక్కు
బంగ్లాదేశ్‌లో భారత విద్యార్థులు వెనక్కొస్తున్నారు. జూలై చివరికల్లా 2,894 మంది తిరిగొచ్చారు. మరో 3,000 మంది త్వరలో రానున్నట్టు అధికారులు వెల్లడించారు.

రాజకీయ పాలనే

మళ్లీ ఆకస్మిక తనిఖీలు మొదలు పెడతా
కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు



కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, సీఎస్ నీరభ్, డీజీపీ తిరుమలరావు

- వైఎస్సార్ సీపీ రాజధానిలో పేదలకిచ్చిన 50,800 ఇళ్ల స్థలాలు రద్దు!
- ఇంటింటికీ రేషన్ సరుకుల డోర్ డెలివరీ పథకం కూడా రద్దు
- ఇసుక రవాణా వ్యయం 5 రెట్లు పెరిగింది
- సచివాలయంలోనే బుకింగ్, రవాణా చార్జీల చెల్లింపు
- గతంలో ఇసుక దోపిడీపై సీఐడీ విచారణ జరిపి తప్పుచేసిన వారిని శిక్షిస్తాం
- డ్రాపౌట్స్‌ను ప్రైవేట్ స్కూళ్లలోనూ చేర్చాలి
- రోడ్లు అన్నీ పీపీపీ విధానంలో చేపట్టాలి
- ఎమ్మెల్యేలు, మంత్రుల మాట అధికారులు వినాలి.. రహదారుల నిర్వహణ, వైద్య సేవలు ఔట్ సోర్సింగ్‌కు..
- అదనంగా జిల్లాకో జాయింట్ కలెక్టర్
- అక్టోబర్ 2న ఏపీ విజన్ డాక్యుమెంట్
- త్వరలో జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లతో కొత్త మద్యం పాలసీ

10 లో

నాడు పారదర్శక ప్రజా పాలన
- విద్య, వైద్యం, పౌర సేవలు, సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యమిచ్చిన వైఎస్ జగన్
- నవరత్నాలతో అందరి ఆకాంక్షలను నెరవేరుస్తూ అడుగులు.. సిఫార్సులతో పనిలేకుండా అర్హతే ప్రామాణికంగా సంతృప్త స్థాయిలో లబ్ధి
- పూర్తి భిన్నంగా చంద్రబాబు తీరు.. హామీల ఊసే లేకుండా రాజకీయ సమావేశంగా కలెక్టర్ల సదస్సు

10 లో

తాన.. తందాన తాన!
సీఎం సమీక్షలో శాఖాధిపతుల ముఖస్తుతి
రాజకీయ నేతల్లా గత సర్కారుపై విమర్శలు
10 లో



మనిక మెరిసె
ఒలింపిక్స్ టేబుల్ టెన్నిస్ మహిళల టీమ్ ఈవెంట్‌లో భారత జట్టు శుభారంభం చేసింది. భారత్ 3–2తో రొమేనియాను బోల్తా కొట్టించి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. బ్యాడ్మింటన్ కాంస్య పతక పోరులో లక్ష్యసేన్ ఓడిపోయాడు. పురుషుల 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్ ఈవెంట్‌లో భారత అథ్లెట్ అవినాశ్ సాబ్లే ఫైనల్‌కు అర్హత సాధించాడు.
12 లో

నన్ను అంతమొందించడమే కూటమి లక్ష్యం

అందుకే నా భద్రతను భారీగా కుదించారు
3-6-24 నాటికి నాకున్న భద్రతను పునరుద్ధరించేలా ఆదేశాలివ్వండి
హైకోర్టులో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిటిషన్



- నాకున్న ప్రాణహానిని రాష్ట్ర ప్రభుత్వం సరిగ్గా మదింపు చేయలేదు
- టీడీపీ నేతల బహిరంగ బెదిరింపులనూ పరిగణనలోకి తీసుకోలేదు
- నోటీసు కూడా ఇవ్వకుండా ఏకపక్షంగా భద్రతను తగ్గించారు
- ఇంటి వద్ద, కార్యాలయం వద్ద భద్రతను పూర్తిగా తొలగించారు
- దీంతో ప్రస్తుతం నా చుట్టూ ఇద్దరు భద్రతాధికారులే ఉన్నారు
- ఇచ్చిన బుల్లెట్‌ప్రూఫ్ వాహనం కూడా సరిగ్గాలేదు
- నా సొంత బుల్లెట్‌ప్రూఫ్ వాహనం వాడుకుంటానన్నా అనుమతివ్వలేదు
- వారిచ్చిన వాహనాన్నే వాడాలని చెప్పారు

2 లో

నాగార్జున సాగర్ నుంచి దిగువకు ప్రవహిస్తున్న కృష్ణమ్మ


సాగర్ నుంచి కృష్ణమ్మ పరుగులు
- నాగార్జున సాగర్ నుంచి దిగువకు 1.20 లక్షల క్యూసెక్కుల విడుదల
- మరో రెండు రోజుల్లో నిండనున్న పులిచింతల ప్రాజెక్టు
- నేడు శ్రీశైలంలోకి ఇదే రీతిలో కొనసాగనున్న వరద ప్రవాహం

3 లో

ఇంఢంజానా


పాడి రైతుపై కక్ష?

అమూల్‌కు కూటమి ప్రభుత్వం సహాయ నిరాకరణ
ప్రైవేటు డెయిరీల మేలే లక్ష్యంగా మహిళల ఆదాయానికి గండి

- పాలసేకరణ సిబ్బందిని వెనక్కి పంపేసిన ప్రభుత్వం.. విధిలేని పరిస్థితుల్లో పాల సేకరణ నిలిపివేస్తున్న అమూల్
- 11 నుంచి అనంతపురం, 21 నుంచి తిరుపతి జిల్లాల్లో పాలసేకరణ నిలిపివేత
- సెప్టెంబరు 1కి మిగతా జిల్లాల్లోనూ నిలిపివేత
- మహిళా పాడి రైతుల ఆందోళన.. తిరుపతి, అనంతపురంలో నిరసన
- ఇప్పటికే 4,798 గ్రామాల నుంచి 2 వేల గ్రామాలకు తగ్గిన పాలసేకరణ
- పాలు పోసే వారి సంఖ్య 1.25 లక్షల నుంచి 30 వేలకు పరిమితం
- మూడున్నరేళ్లలో 20 కోట్ల లీటర్ల సేకరణ
- రూ.925 కోట్లు చెల్లించిన అమూల్


తిరుపతి కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న పాడి రైతులు

సాక్షి, అమరావతి: పాడి రైతుపై బాబు కూటమి ప్రభుత్వం కక్ష కట్టింది. నాలుగేళ్లుగా గిట్టుబాటు ధర పొందుతున్న రైతుల పొట్టకొడుతోంది. పాలు సేకరించే క్షేత్ర స్థాయి సిబ్బందిని ఉపసంహరించడంతో పాటు అమూల్‌కు సహాయ నిరాకరణ చేస్తూ ప్రైవేటు డెయిరీల దోపిడీకీ తెర తీస్తోంది. ముఖ్యంగా సొంత డెయిరీకి మేలు చేయడమే లక్ష్యంగా రాయలసీమ జిల్లాల్లో అమూల్‌కు మోకాలడ్డుతోంది. ప్రభుత్వ పెద్దల నుంచి వస్తున్న ఒత్తిడి తట్టుకోలేక మిగతా 3వ పేజీలో ▶

ప్రభుత్వ తీరును నిరసిస్తూ పుట్టపర్తి కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన చిరుద్యోగులు


సర్కారు తీరుపై చిరుద్యోగుల కన్నెర్ర

అక్రమ తొలగింపులు, రాజకీయ వేధింపులపై రాష్ట్రవ్యాప్త నిరసనలు

- కలెక్టరేట్‌ల వద్ద ధర్నాలు నిర్వహించి గళమెత్తిన చిరుద్యోగులు
- బలవంతంగా తొలగించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని అల్టిమేటం
- నాయకుల తీరు మారకపోతే ఉద్యమాల్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరిక

2 లో

రాష్ట్ర ప్రభుత్వ తీరుపై చిరుద్యోగులు కన్నెర్ర చేశారు. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన స్కీమ్ వర్కర్లు, కార్మికులు రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో కదం తొక్కారు. చిరుద్యోగులపై అధికార పార్టీ నాయకుల వేధింపులను తక్షణమే మానుకోవాలని, బలవంతంగా తొలగించిన ఉద్యోగులను వెంటనే విధుల్లో చేర్చుకోవాలనే నినాదాలు ఎక్కడికక్కడ మార్మోగాయి. వారి ఆందోళనలతో రాష్ట్రం అట్టుడికింది.

క్లుప్తంగా...

వైఎస్సార్‌సీపీ నేతకు నేడు వైఎస్ జగన్ పరామర్శ

సాక్షి, అమరావతి: ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో టీడీపీ మూకల దాడిలో గాయపడి విజయవాడ సన్‌రైజ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ నేత గింజుపల్లి శ్రీనివాసరావును మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించనున్నారు. అనంతరం ఆయన తాడేపల్లిలోని తన నివాసానికి చేరుకుంటారు. బుధవారం, గురువారం ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో వైఎస్ జగన్ వరుసగా సమావేశాలు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో ఆయన ఇతరులను కలిసే అవకాశం ఉండదని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం తెలిపింది. ఈ విషయాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు గమనించాలని సూచించింది.

ఒకటో తేదీనే జీతాలు ఉత్తిదే

వైద్యశాఖలో 16 వేల మందికి రాలేదు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు జమచేశామని కూటమి ప్రభుత్వం గప్పాలు కొట్టుకుంటున్నప్పటికీ అది వాస్తవ విరుద్ధమని క్షేత్రస్థాయి పరిస్థితులు చూస్తే అర్థమవుతోంది. ఆగస్టు మొదటి వారం ముగుస్తున్నా నేటికీ కొందరు ఉద్యోగులకు ఇంకా వేతనాలు అందలేదు. ఉదా.. వైద్యశాఖలోని నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులది ఇదే పరిస్థితి. ఎన్‌హెచ్‌ఎంలో రాష్ట్రవ్యాప్తంగా 20 వేల మంది ఉద్యోగులుండగా సుమారు 4 వేల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 2న వేతనాలు జమచేశారు. 16 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులకు సోమవారానికి కూడా జీతాలు జమచేయలేదు. వీరిలో గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌ల ద్వారా ప్రజలకు వైద్యసేవలందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సీహెచ్‌ఓ) 10 వేల మందికి పైగా ఉన్నారు.

వలంటీర్లను బాబు నట్టేట ముంచేశారు

'ఎక్స్'లో వైఎస్సార్‌సీపీ

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం చేసిన నమ్మక ద్రోహంతో వలంటీర్లకు జరిగిన అన్యాయంపై వైఎస్సార్‌సీపీ సోమవారం 'ఎక్స్' వేదికగా స్పందించింది. 'సీఎం చంద్రబాబు మొదటి నుంచీ వలంటీర్ వ్యవస్థపై అక్కసు వెళ్లగక్కుతూనే ఉన్నారు. ఎన్నికల్లో లబ్ధికోసం అప్పట్లో కపట హామీలతో వారిని మభ్యపెట్టారు. తీరా ఎన్నికల్లో గెలిచాక చంద్రబాబు వారిని నట్టేట ముంచేశారు. వలంటీర్ల గ్రూపులన్నింటినీ తొలగించాలని అధికారులకు ఆదివారం ఆదేశాలొచ్చాయి. చంద్రబాబు తేనెపూసిన కత్తికి బలైపోయిన లక్షలాది మంది వలంటీర్లు రోడ్డున పడ్డారు' అని పేర్కొంది.

చంద్రబాబు 'స్కిల్' కేసు విచారణ వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ : స్కిల్ కుంభకోణం కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలంటూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ ను 2 వారాలు వాయిదా వేసింది. ఈ పిటిషన్ సోమవారం జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ సతీష్‌చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటై న్యాయవాదులు మారారని చంద్రబాబు తరపు న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తెచ్చారు. వకాల్తానామా వేయడానికి సమయం కావాలని కోరడంతో ధర్మాసనం అంగీకరించింది.

అన్యాక్రాంతమైనా పట్టించుకోవడం లేదు

హైకోర్టులో అగ్రిగోల్డ్ పిటిషన్


Agri Gold

సాక్షి, అమరావతి: ఉమ్మడి కృష్ణాజిల్లా అంబాపురం పరిధిలోని సర్వే నంబరు 88లో సీఐడీ జప్తుచేసిన అగ్రిగోల్డ్ భూమి అన్యాక్రాంతమైనా అధికారులు పట్టించుకోవడంలేదని అగ్రిగోల్డ్ యజమాన్యం హైకోర్టును ఆశ్రయించింది. ఈ వ్యాజ్యంపై సోమవారం విచారించిన న్యాయమూర్తి జస్టిస్ బొప్పన వరాహల క్ష్మీనరసింహ చక్రవర్తి పూర్తి వివరాలను తమ ముందుంచాలని అధికారులను ఆదేశించారు. విచారణను 2 వారాలకు వాయిదా వేశారు. సర్వే నంబరు 88లో సీఐడీ జప్తు చేసిన తమ భూమిని ఇతరులు సర్వే నంబరు 87గా వారి పేరుపై రాయించుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదని అగ్రిగోల్డ్ యజమానుల వారసులు అవ్వా వెంకటవీణ సంతోషి, మరికొందరు పిటిషన్ దాఖలు చేశారు.

నాలుగేళ్లు ఎక్కడ చదివితే అక్కడే లోకల్

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ విద్యలో స్థానికేతర కోటా ప్రామాణికతను ఉన్నత విద్యామండలి నిర్ధారించింది. 6 నుంచి ఇంటర్ వరకు చదివిన స్థానికతను లెక్కలోకి తీసుకుంటోంది. ఈ ఏడేళ్లలో నాలుగేళ్లు ఎక్కడ విద్యాభ్యాసం చేస్తే ఆ రాష్ట్రానికి చెందిన స్థానికుడిగానే పరిగణిస్తామంది. ఇంజనీరింగ్ ప్రవేశాల్లో 15 శాతం కోటాను స్థానికేతరులకు కేటాయిస్తారు. ఉదా.. ఏపీకి చెందిన ఎస్వీ, ఏ ఎన్‌యూ విద్యార్థులను స్థానికేతరులుగా పరిగణిస్తారు. వీరిలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు నాలుగేళ్లు ఎక్కడ చదివినా, అతని స్థానిక రాష్ట్రం అక్కడేనని నిర్ధారిస్తారు.

70,00,000 తాగునీటి కుళాయిలు




సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో 95.45 లక్షల ఇళ్లు ఉంటే, అందులో 70.04 లక్షల ఇళ్లకు ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికే తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేశారని కేంద్రం స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర జలశక్తి శాఖ డిపార్ట్‌మెంట్ ఆఫ్ డ్రింకింగ్ అండ్ శానిటేషన్ 2023–24 ఆర్థిక సంవత్సరం వార్షిక నివేదికను కేంద్ర ప్రభుత్వం ఆగస్టు ఒకటో తేదీన విడుదల చేసింది. దేశంలోని గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షిత తాగునీటిని వారి ఇంటి ఆవరణలోనే అందజేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్రాల ఉమ్మడి భాగస్వామ్యంతో కలిసి 2019 ఆగస్టు 15వ తేదీన జలజీవన్ మిషన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి దేశవ్యాప్తంగా 60 శాతం గ్రామీణ ప్రాంత ఇళ్లలో తాగునీటి కుళాయిలు అందుబాటులోకి రాగా, ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ ప్రాంత ఇళ్లలో 73.38 శాతం ఇళ్లకు 2024 మార్చి నెలాఖరుకే అందుబాటులోకి వచ్చాయని నివేదిక పేర్కొంది.

- రాష్ట్రాల వారీగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి పరీక్షల నిర్వహణలో మొత్తం 700 మార్కుల ప్రాతిపదికన ఆ రాష్ట్రాల పురోగతిని పరిశీలిస్తే 699.93 మార్కులతో తమిళనాడు మొదటి స్థానంలో ఉండగా, ఆంధ్రప్రదేశ్ 657.10 శాతం మార్కులతో రెండో స్థానంలో నిలిచిందని నివేదిక పేర్కొంది.
- రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు రెండున్నర లక్షల తాగునీటి వనరులు ఉండగా, నీటిశుద్ధి పరీక్షల అనంతరం 25,546 తాగునీటి వనరుల్లో నీరు వివిధ కారణాలతో కలుషితమైనట్టు గుర్తించగా, ఆయా ప్రాంతాల్లో అప్పటికప్పుడే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు నివేదిక స్పష్టం చేసింది.

కేంద్ర జలశక్తి శాఖ నివేదిక ప్రకారం..

95.45 లక్షలు	70.04 లక్షలు	18,357	18,302	41,303	40,097	42,331	40,895
రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం ఇళ్లు	తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేసినవి	రాష్ట్రంలో మొత్తం గ్రామాలు	వీటిలో నీటిశుద్ధి పరీక్షలు పూర్తయిన గ్రామాలు	రాష్ట్రంలో మొత్తం ప్రభుత్వ పాఠశాలలు	అందులో తాగునీటి శుద్ధి పరీక్షలు పూర్తయినవి	రాష్ట్రంలో మొత్తం అంగన్ వాడీ కేంద్రాలు	అందులో నీటి శుద్ధి పరీక్షలు పూర్తయినవి

నన్ను అంతమొందించడమే కూటమి లక్ష్యం



అందుకే నా భద్రతను భారీగా కుదించారు

3–6–24 నాటికి నాకున్న భద్రతను పునరుద్ధరించేలా ఆదేశాలివ్వండి

హైకోర్టులో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిటిషన్

సాక్షి, అమరావతి: గతంలో తనకున్న జెడ్ ప్లస్ కేటగిరి భద్రతను కుదించడాన్ని సవాలు చేస్తూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. తనను అంతమొందించడమే ప్రస్తుత అధికార కూటమి ప్రధాన లక్ష్యమని, తనకున్న ప్రాణహానిని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదంటూ ఆయన సోమవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తనకున్న ప్రాణహానిని సరైన రీతిలో మదింపు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా తన భద్రతను కుదించిందని, ఈ నేపథ్యంలో.. 3–6–2024 నాటికి తనకున్న భద్రతను పునరుద్ధరించేలా ఆదేశించాలని ఆయన తన పిటిషన్‌లో కోర్టును కోరారు. అంతేగాక.. పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్లు, కౌంటర్ అసాల్ట్ టీమ్స్, జామర్లను సైతం అందుబాటులో ఉంచేలా ఆదేశాలివ్వాలని అభ్యర్థించారు. తన భద్రత కుదింపు విషయంలో చట్టం నిర్దేశించిన ప్రమాణాలకు, రాజ్యాంగ అధికరణలకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిందని జగన్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ వ్యాజ్యంపై బుధవారం హైకోర్టు విచారణ జరిపే అవకాశం ఉంది. వైఎస్ జగన్ తన పిటిషన్‌లో ఏం పేర్కొన్నారంటే..

నన్ను ప్రమాదంలోకి నెట్టేందుకే..

ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నాకున్న జెడ్ ప్లస్ భద్రతను ఇప్పుడు కూడా కొనసాగించాలని కోరుతూ మా పార్టీ ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. రాష్ట్ర ప్రభుత్వ చర్యలు, నిర్ణయాలు అధికార కూటమి లక్ష్యాలకు అనుగుణంగా ఉన్నాయి. నన్ను ప్రజల నుంచి దూరంగా ఉంచేందుకు, వ్యక్తిగతంగా నేను దాడులకు గురయ్యేలా చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం. రాష్ట్రంలో గత రెండునెలలుగా యథేచ్ఛగా వ్యవస్థీకృత రాజకీయ హింస కొనసాగుతోంది. ఇంత జరుగుతున్నా పోలీసు పెద్దలు చోద్యం చూస్తున్నారు. ఈ నేపథ్యంలో.. నాకున్న ప్రాణహానిని సరైన కోణంలో మదింపు చేయలేదు. ప్రజాసేవలు, రాజకీయ జీవితంలో, రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారికి భద్రతను కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని హైకోర్టు గతంలోనే స్పష్టమైన తీర్పునిచ్చింది. అయినా కూడా రాష్ట్ర ప్రభుత్వం అసాధారణ రీతిలో నా ఇంటి వద్ద, ఆఫీసు వద్ద భద్రతను ఉపసంహరించింది. నా భద్రతపై ఆందోళన వ్యక్తంచేస్తూ మా పార్టీ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసినా కూడా ఎలాంటి స్పందనలేదు. నా జీవితాన్ని, స్వేచ్ఛను ప్రమాదంలోకి నెట్టేందుకు ఈ అధికార కూటమి ప్రభుత్వం తన అధికారాన్ని వినియోగిస్తోంది. ఉన్నపళంగా, అకారణంగా, ఏకపక్షంగా నాకున్న భద్రతను కుదించింది. ఇటీవల నా భద్రతా వలయంలో ఉల్లంఘనలు జరిగినా కూడా పోలీసులు పట్టించుకోవడంలేదు. వారు కూటమి ప్రభుత్వ పెద్దల పల్లకీలు మోస్తున్నారు. ఉద్దేశపూర్వకంగా తమ విధులను వారు విస్మరించడంవల్లే ఇటీవల కాలంలో మా పార్టీ కేడర్‌పై, ఆస్తులపై వ్యవస్థీకృత హింస పెరిగిపోయింది. దీనిపై మేం ఢిల్లీలో నిరసన కార్యక్రమం కూడా చేపట్టాం. నన్ను భౌతికంగా లేకుండా చేయడమే అధికార కూటమి లక్ష్యం. ఈ విషయంలో టీడీపీ సీనియర్ నేతల మధ్య సంభాషణ కూడా జరిగింది. ఆ సంభాషణ మీడియాలో విస్తృతంగా వ్యాప్తి చెందింది. నర్సీపట్నం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రస్తుతం స్పీకర్‌గా ఉన్న అయ్యన్నపాత్రుడు నా గురించి మాట్లాడుతూ.. 'నేను ఎన్నికల్లో మాత్రమే ఓడిపోయానని, ఇంకా బతికే ఉన్నానని' ఆయన వ్యాఖ్యానించారు. అంతేగాక.. చచ్చేవరకు కొట్టాలని కూడా వారు మాట్లాడుకున్నారు.

సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా భద్రత కుదింపు..

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే నాకు భద్రతను కుదించారు. అది కూడా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, నోటీసులు ఇవ్వకుండా సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా తగ్గించారు. నాకు భౌతిక హాని తలపెడతామని కూటమి నేతలు ఎన్నికల సమయంలో పదేపదే చెప్పారు. అందులో భాగంగానే నాపై ఎన్నికల ప్రచార సమయంలో గులకరాయి దాడి జరిగింది. గతంలో నాపై కోడికత్తితో హత్యాయత్నం కూడా చేశారు. వీటన్నింటి దృష్ట్యా నాకు 3–6–2024 నాటికి ఉన్న భద్రతను పునరుద్ధరించేలా ఆదేశాలు జారీచేయండి.

నాకు రక్షణగా ఇద్దరు అధికారులే ఉన్నారు..

రాష్ట్రంలో రాజకీయ పార్టీల మధ్య వైరం ఉంది. అయితే, అధికార పార్టీ కూటమి నేతల రెచ్చగొట్టే ప్రసంగాలే మా పార్టీ కేడర్, నేతలపై దాడులు జరగడానికి పునాది. నా భద్రతను కుదించేందుకు అధికారుల వద్ద సహేతుక కారణాలుగానీ, ఆధారాలుగానీ ఏమీలేవు. అత్యున్నత భద్రత వ్యవస్థ అయిన జెడ్ ప్లస్ నుంచి నా భద్రతను కుదించారు. వాస్తవానికి జెడ్ ప్లస్ కేటగిరి భద్రతను తొలగించనప్పటికీ, నా చుట్టూ ఉన్న భద్రత సిబ్బందిని మాత్రం బాగా కుదించారు. నాకు రక్షణగా ఇద్దరు భద్రతాధికారులు మాత్రమే ఉన్నారు. నా ఇంటి వద్ద, ఆఫీసు వద్ద భద్రతను పూర్తిగా తొలగించారు. అధికార పార్టీ నుంచి నిరంతరం నేను బహిరంగ బెదిరింపులు ఎదుర్కొంటున్నాను. అందువల్ల ప్రభుత్వం నాకు ఇంటి వద్ద, ఆఫీసు వద్ద భద్రతను ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉంది. నాకు అత్యంత సమీపంలో ఉండే క్యాట్ ఆక్టోపస్ టీమ్స్‌ను ఈ ప్రభుత్వం ఉపసంహరించింది. దీంతో ప్రస్తుతం నా చుట్టూ ఇద్దరు భద్రతాధికారులు మాత్రమే ఉంటున్నారు. గతంలో ఇలా 10 మంది ఉండేవారు. ప్రస్తుతం ఎమ్మెల్యేల వద్ద ఉన్న వ్యక్తిగత భద్రతాధికారుల కంటే నా వద్ద ఉన్న వ్యక్తిగత భద్రతాధికారుల సంఖ్యే తక్కువ. గతంలో ఇల్లు, ఆఫీసు వద్ద 11 మంది గార్డులు ఉండేవారు. ఇప్పుడు ఇద్దరే ఉన్నారు. ఇక నా భద్రత విషయంలో ప్రభుత్వం ఎంత సీరియస్‌గా ఉందన్న విషయం నాకు రక్షణగా ఇచ్చిన బుల్లెట్‌ప్రూఫ్ కారును చూస్తే అర్థమైపోతుంది. అద్దాలు పగుళ్లు వచ్చి ఉన్నాయి. వెనుక డోర్ తెరుచుకోవడంలేదు. అత్యవసర పరిస్థితుల్లో కారు నుంచి బయటకొచ్చే పరిస్థితిలేదు. మధ్యలో ఆగిపోతోంది. ఇటీవల ఓ పర్యటనకు వెళ్తుండగా మధ్యలో ఆగిపోవడంతో పర్యటనను అర్థాంతరంగా ముగించాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో.. నేను నా వ్యక్తిగత బుల్లెట్‌ప్రూఫ్ కారు వాడుకునేందుకు అనుమతి కోరగా అధికారులు అనుమతినివ్వలేదు. పైగా వాళ్లు ఇచ్చే కారునే వాడాలన్నారు. నేను ప్రజలను కలవకుండా ఇంటి వద్దనే ఉండాలన్న కారణంతోనే అలాంటి కారును ఇచ్చారు.

చెవిని సృష్టించిన ఎయిమ్స్ వైద్యులు

పుట్టుకతోనే చెవి లేని బాలుడు



బీబీనగర్: పుట్టుకతో చెవి లేకుండా ఉన్న ఓ బాలుడికి సర్జరీ ద్వారా చెవిని సృష్టించారు యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ ఎయిమ్స్ వైద్యులు. ఏపీలోని విజయవాడకు చెందిన 7వ తరగతి చదువుతున్న 11 ఏళ్ల బాలుడికి పుట్టుకతో కుడి చెవి పూర్తిగా మూసుకుపోయింది. చాలా ఆస్పత్రులకు తిరిగినా ఫలితం లేకపోయింది. ఎయిమ్స్‌లో సర్జరీల ద్వారా అరుదైన శస్త్రచికిత్సలు చేస్తున్న విషయం తెలుసుకున్న ఆ బాలుడి తల్లిదండ్రులు.. జూలై నెలలో ప్లాస్టిక్ సర్జరీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మూలా రోహిత్‌బాబును సంప్రదించారు. జూలై 24న డాక్టర్ రోహిత్‌బాబు పర్యవేక్షణలో బాలుడికి శస్త్ర చికిత్స నిర్వహించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి మూసుకుపోయిన చెవికి రంధ్రం ఏర్పాటు చేశారు. బాలుడి ఛాతీభాగం నుంచి మృదులాస్థి ఎముకను తీసి చెవి ఆకారంలో చెక్కి చెవిలేని ప్రదేశంలో అమర్చారు. అనంతరం వారం రోజుల పాటు ఆస్పత్రిలోనే తమ పర్యవేక్షణలో బాలుడిని ఉంచుకున్నారు. అతనికి ఎలాంటి ఆరోగ్యపరమైన సమస్య తలెత్తకపోవడం, ఇతరులు చెప్పే మాటలు స్పష్టంగా వినిపిస్తుండడంతో ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు. చెక్ చేయించుకునేందుకు బాలుడు మరోసారి సోమవారం ఎయిమ్స్ రాగా డాక్టర్లు పరిశీలించి ఎలాంటి సమస్య లేదని చెప్పారు.

మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్‌లోకి ట్రాన్స్‌జెండర్లు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కొనసాగుతున్న మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ల (కూంబింగ్)లో ట్రాన్స్‌జెండర్లు సైతం రాణిస్తున్నారు. మావోయిస్టుల ఏరివేత కోసం 2021లో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బస్తర్, దంతెవాడ, కాంకేర్, బీజాపూర్, నారాయణపూర్, సుక్మా, కొండగావ్ జిల్లాల్లో బస్తర్ ఫైటర్స్ పేరిట ప్రత్యేక దళాలను ఏర్పాటు చేశారు. ఈ విభాగంలో మొత్తం 2,100 మంది పనిచేస్తున్నారు. వీరిలో 90 మంది మహిళా కమాండోలు ఉండగా, 13 మంది ట్రాన్స్‌జెండర్లు సైతం ఉన్నారు.

సర్కారు తీరుపై చిరుద్యోగుల కన్నెర్ర

అక్రమ తొలగింపులు, రాజకీయ వేధింపులపై రాష్ట్రవ్యాప్త నిరసనలు

సాక్షి నెట్‌వర్క్: బలవంతపు తొలగింపులు, రాజకీయ వేధింపులకు నిరసనగా ఐకేపీ, వీఓఏలు, మధ్యాహ్న భోజన పథకం, పారిశుద్ధ్య కార్మికులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లతోపాటు వివిధ రంగాలకు చెందిన చిరుద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా సోమవారం ధర్నాలు నిర్వహించారు. చిరుద్యోగులపై అధికార పార్టీ నాయకుల వేధింపులను తక్షణమే మానుకోవాలని, బలవంతంగా తొలగించిన ఉద్యోగులను వెంటనే విధుల్లో చేర్చుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో చిరుద్యోగుల తొలగింపు, రాజకీయ వేధింపులు నిలిపివేయాలని కోరుతూ విజయవాడలో సోమవారం ధర్నా జరిగింది. ప్రభుత్వ విభాగాలకు చెందిన చిరుద్యోగులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. చిరుద్యోగుల తొలగింపు, రాజకీయ వేధింపులు ఆపకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డీఆర్వోకు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. బాపట్ల కలెక్టరేట్ ఎదుట ప్రభుత్వ శాఖల్లోని చిరుద్యోగులు ధర్నా చేపట్టారు. స్కీమ్ వర్కర్లు, చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపకపోతే ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన చిరుద్యోగులంతా పుట్టపర్తి చేరుకుని అధికార పార్టీ నాయకుల వేధింపులకు నిరసనగా కదం తొక్కారు. అనంతరం కలెక్టరేట్‌కు చేరుకుని ధర్నా నిర్వహించారు. ఓడీచెరువు మండలం వీరప్పగారిపల్లి అంగన్‌వాడీ కార్యకర్త నాగమణి ఆత్మహత్యాయత్నం, మరో కార్యకర్త సుహాసినిపై దాడికి కారణమైన టీడీపీ కార్యకర్త ఆంజనేయులు కుటుంబంపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమని నినదించారు.



తిరుపతి కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న చిరుద్యోగులు

ఖాళీ ప్లేట్లతో నిరసన

అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని వివిధ సంఘాల ఆధ్వర్యంలో చిరుద్యోగులు ధర్నాలు నిర్వహించారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపును నిరసిస్తూ.. చేసిన పనులకు వేతనాలు చెల్లించాలంటూ ఖాళీ ప్లేట్లతో ఉపాధి కూలీలు అమలాపురంలోని కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొన్నారు. విధుల నుంచి తొలగించిన ఉద్యోగులను తిరిగి తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్కీమ్ వర్కర్లు, చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు తక్షణం నిలుపుదల చేయాలని, ఏ ఒక్క ఉద్యోగినీ తొలగించరాదని డిమాండ్ చేస్తూ తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. కాకినాడలో అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన వర్కర్లు, యానిమేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లపై కూటమి నేతల రాజకీయ వేధింపులను నిరసిస్తూ భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. పార్వతీపురంలోని కలెక్టరేట్ ఎదుట చిరుద్యోగులు ధర్నా చేపట్టారు. అంతకుముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించి స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలంటూ నినాదాలు చేశారు.

మా ఉద్యోగం మమ్మల్ని చేసుకోనివ్వండి

'మా ఉద్యోగం మమ్మల్ని చేసుకోనివ్వండి.. మాకు రాజకీయ మరకలు పూయకండి' అంటూ చిరుద్యోగులు తిరుపతి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. తమ పొట్టగొడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. చిరుద్యోగులను తొలగిస్తున్న ప్రభుత్వ తీరును నిరసిస్తూ ప్రకాశం జిల్లాకు చెందిన ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, వీఓఏలు, అంగన్‌వాడీ హెల్పర్లు ఒంగోలులో కదం తొక్కారు. లేనిపోని కారణాలు చూపుతూ చిరుద్యోగులను బలవంతంగా తొలగించడం, స్థానిక నాయకులు జోక్యం చేసుకుని వేధింపులకు గురిచేయడం ఆపకపోతే నిరవధిక ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్‌కు చేరుకుని భారీ ధర్నా నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఈ కార్యక్రమాల్లో సీఐటీయూ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు.



చిరుద్యోగుల తొలగింపును నిరసిస్తూ విజయవాడ ధర్నా చౌక్‌లో ఆందోళన


తెలంగాణ స్కిల్స్ వర్సిటీ చైర్మన్‌గా ఆనంద్ మహీంద్ర



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఆఫ్ తెలంగాణ' చైర్మన్‌గా ప్రముఖ పారిశ్రామికవేత్త, పద్మభూషణ్ ఆనంద్ మహీంద్ర వ్యవహరిస్తారు. ఈ మేరకు ఆనంద్ మహీంద్ర అంగీకారం తెలిపినట్లు అమెరికా పర్యటనలో భాగంగా సోమవారం న్యూజెర్సీలో జరిగిన ఒక కార్యక్రమంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. త్వరలోనే ఆనంద్ మహీంద్ర బాధ్యతలు స్వీకరిస్తారన్నారు. తెలంగాణ యువతను ప్రపంచంలోనే ఉత్తమ నైపుణ్యం కలిగిన వనరులుగా తీర్చిదిద్దేందుకు ఏర్పాటు చేసిన స్కిల్స్ యూనివర్సిటీకి అంతర్జాతీయంగా పేరున్న ప్రముఖుడిని చైర్మన్‌గా నియమిస్తామని సీఎం అసెంబ్లీ వేదికగా ప్రకటించడం విదితమే. ఇటీవల ఆనంద్ మహీంద్రాతో ఈ విషయమై రేవంత్ చర్చించారు. రంగారెడ్డి జిల్లా ముచ్చర్ల కేంద్రంగా అభివృద్ధి చేయనున్న 'ఫ్యూచర్ సిటీ' పరిధిలోని బ్యాగరికంచె వద్ద స్కిల్స్ యూనివర్సిటీ భవనానికి సీఎం ఇటీవల శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే.

దళిత కమిషనర్‌ను చుట్టుముట్టి.. కుర్చీలోకి నెట్టి..

- రాజంపేటలో టీడీపీ అరాచకం
- మరోసారి మున్సిపల్ కమిషనర్‌పై దౌర్జన్యం
- ఉద్యోగాలివ్వాలంటూ బెదిరింపు
- బాత్‌రూమ్‌కి కూడా వెళ్లకుండా అడ్డుకున్న వైనం
- రక్షణ కల్పించాలంటూ కలెక్టర్‌కు, పోలీసులకు కమిషనర్ వినతి



దళిత కమిషనర్ నల్లా రాంబాబును చుట్టుముట్టిన టీడీపీ వర్గీయులు

రాజంపేట: అన్నమయ్య జిల్లా రాజంపేట మున్సిపల్ కార్యాలయంలో టీడీపీ వర్గీయులు సోమవారం వీరంగం వేశారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మున్సిపల్ కమిషనర్ నల్లా రాంబాబుపై మరోసారి దౌర్జన్యం చేశారు. ఇప్పటికే పలుమార్లు కమిషనర్‌తో అమర్యాదకరంగా ప్రవర్తించిన వారు సోమవారం ఆయన్ని ముట్టడించారు. అనారోగ్యంతో ఉన్న ఆయన్ని చుట్టుముట్టి బెదరగొట్టారు. బాత్‌రూమ్‌కి కూడా వెళ్లకుండా అడ్డుకున్నారు. తమకు ఉద్యోగాలివ్వాలంటూ దుర్భాషలాడుతూ, కేకలు వేస్తూ ఇష్టారీతిన ప్రవర్తించారు. కమిషనర్ రాంబాబు విధుల్లో ఉన్న సమయంలో రాజంపేట రూరల్ టీడీపీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు, తాళ్లపాకకు చెందిన గోవర్ధన్, ముళ్లగూరి సుబ్రహ్మణ్యం, మనుబోలు మస్తాన్, కొలిమివీధి రంగప్రసాద్, మేస్త్రీ వెంకటయ్య కుమారుడు, నందలూరు, రాజంపేటకు చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు మూకుమ్మడిగా వచ్చారు. గతంలో ఇక్కడ పని చేస్తూ మానేసిన తమవారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తనకు ఆ అధికారం లేదని, సీడీఎంఏ నుంచి అనుమతి రావాలని కమిషనర్ చెప్పారు. దీంతో నాయకులు ఆగ్రహంతో ఊగిపోయారు. కమిషనర్‌ని అనరాని మాటలంటూ సెలవుపెట్టి వెళ్లిపోవాలని డిమాండ్ చేశారు. కుర్చీలోంచి లేచిన కమిషనర్‌ను వెనక్కినెట్టి బలవంతంగా కూర్చోబెట్టారు. ఎక్కడికి పోతావంటూ బెదిరించారు. ఈ సమాచారం అందుకున్న ఎస్‌ఐ మోహన్‌గౌడ్ సిబ్బందితో వచ్చారు. పోలీసుల ముందే టీడీపీ నాయకులు కమిషనర్‌తో వాగ్వాదానికి దిగారు. పోలీసులు కమిషనర్‌ను కారెక్కించి ఇంటికి పంపించారు. కొద్దిసేపటి తరువాత కార్యాలయానికి వచ్చిన కమిషనర్‌కు టీడీపీ వారు వినతిపత్రం ఇచ్చారు. తాము చెప్పిన వారిని ఉద్యోగంలోకి తీసుకోవాలని కోరారు. కాగా, మున్సిపల్ కార్యాలయానికి వచ్చినవారు తనను భయపెట్టడమేకాక, విధులకు ఆటంకం కలిగించారని, తనకు రక్షణ కల్పించాలని కమిషనర్ రాంబాబు పట్టణ ఎస్‌ఐకి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును కలెక్టరు, జేసీ, సబ్‌కలెక్టర్‌లకూ పంపినట్లు కమిషనర్ తెలిపారు.

క్లుప్తంగా...

ఇంటింటికీ కుళాయిలపై 9 నుంచి సర్వే



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ తాగునీటి కుళాయిల ఏర్పాటుకు సంబంధించిన జల్‌జీవన్ మిషన్ అమలుపై ఈ నెల 9 నుంచి 13 వరకు పల్స్ సర్వే చేయనున్నారు. కేంద్ర వార్షిక(2023–24) నివేదిక ప్రకారం ఏపీలోని గ్రామీణ ప్రాంతాల్లో 95.45 లక్షల ఇళ్లు ఉన్నాయి. అందులో ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి 70.04 లక్షల ఇళ్లకు కుళాయిల ఏర్పాటు పూర్తయ్యింది. కాగా, గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్ల ద్వారా ఈ సర్వే నిర్వహించనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ సోమవారం ఆదేశాలు జారీ చేసింది. అలాగే ఈ సర్వే నిర్వహణకు ప్రత్యేక యాప్‌ను సిద్ధం చేస్తోంది.

రేషన్ వాహనాలను తొలగించొద్దు

మంత్రి నాదెండ్లకు విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ లేఖ



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన రేషన్ సరుకుల పంపిణీ పథకం వల్ల రాష్ట్రంలో వందలాది మంది బడుగు బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలకు ఉపాధి లభించిందని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ చెప్పారు. అలాంటి పథకంలో భాగంగా ఉన్న మొబైల్ డిస్పెన్సరీ యూనిట్(ఎండీయూ) వాహనాలను తొలగించడం సరికాదంటూ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు శర్మ సోమవారం లేఖ రాశారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో వచ్చే నెల నుంచి ఎండీయూ వాహనాల సేవలను నిలిపివేస్తూ.. అత్యంత నిరుపేదలైన ఎస్టీ లబ్ధిదారులకు అన్యాయం చేయొద్దని కోరారు. ఈ పథకాన్ని రద్దు చేస్తే నష్టపోయేది పేదలైన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కుటుంబాలు, నిరుద్యోగులేనన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని సూచించారు.

వక్ఫ్ బోర్డు అధికారాల్లో కేంద్రం జోక్యం తగదు

ముస్లిం సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి ఖురేషి



సాక్షి, అమరావతి: వక్ఫ్ బోర్డ్ అధికారాల్లో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవడం తగదని ముస్లిం సంక్షేమ సంఘం ఏపీ, తెలంగాణ రాష్ట్రాల అధికార ప్రతినిధి ముహమ్మద్ సదర్ ఖురేషి అభ్యంతరం వ్యక్తంచేశారు. వక్ఫ్ చట్టంలో కేంద్ర ప్రభుత్వం సవరణలు చేయడాన్ని ఆయన తప్పుపట్టారు. ఈ మేరకు ఖురేషి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మతపరమైన ఆస్తులు, ధార్మికంగా ఇచ్చే ఆస్తులను పరిరక్షించడం మినహా వాటికి సంబంధించి మార్పులు చేసే అధికారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉండదని తెలిపారు. వక్ఫ్ బోర్డు అధికారాలను పరిమితం చేసేలా కేంద్రం సవరణలు చేయడం మత స్వేచ్ఛను దెబ్బతీయటమేనని పేర్కొన్నారు. వక్ఫ్ ఆస్తులను రక్షించాల్సిందిపోయి, వాటిని లాక్కునేలా బీజేపీ ప్రభుత్వం ప్రయత్నించడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వ చర్యలను అన్ని లౌకిక పార్టీలు వ్యతిరేకించాలని ఖురేషి విజ్ఞప్తి చేశారు.

పెట్టుబడుదారులకు విస్తృత అవకాశాలు

ప్రవాసాంధ్రులతో మంత్రి గొట్టిపాటి రవికుమార్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలకు విస్తృత అవకాశాలు ఉన్నాయని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. పెట్టుబడిదారులు నిశ్చింతగా పరిశ్రమలు పెట్టేందుకు ముందుకు రావాలని ఆయన ఆహ్వానించారు. అమెరికాలోని ప్రవాస భారతీయులతో మంత్రి సోమవారం వర్చువల్ సమావేశం నిర్వహించారు. రానున్న ఐదేళ్లకు సంబంధించి దేశంలో అత్యుత్తమ పారిశ్రామిక విధానాన్ని పెట్టుబడిదారుల కోసం త్వరలోనే తీసుకొస్తామని మంత్రి తెలిపారు. పెట్టుబడులతో పాటు స్థానికంగా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని చెప్పారు.

'పుంగనూరు' పోటీదారులంతా ప్రతివాదులు

హైకోర్టుకు నివేదన

సాక్షి, అమరావతి: పుంగనూరు శాసనసభ్యుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎన్నికను సవాలు చేస్తూ దాఖలు చేసిన వ్యాజ్యంలో పుంగనూరు అసెంబ్లీ స్థానానికి పోటీచేసిన అభ్యర్థులందరినీ ప్రతివాదులుగా చేర్చినట్లు భారత చైతన్య యువజన పార్టీ (బీసీవైపీ) అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ తరపున సీనియర్ న్యాయవాది వై.వి.రవిప్రసాద్, న్యాయవాది పి.వి.జి.ఉమేష్‌చంద్ర సోమవారం హైకోర్టుకు నివేదించారు. ఈ మేరకు అనుబంధ పిటిషన్ దాఖలు చేశామన్నారు. ఆ పిటిషన్‌ను అనుమతించాలని కోరారు. వారి అభ్యర్థనపై సానుకూలంగా స్పందించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఊటుకూరు శ్రీనివాస్ ఆ అనుబంధ పిటిషన్‌ను అనుమతించారు. విచారణను ఈ నెల 8కి వాయిదా వేశారు.

పాడి రైతుపై కక్ష?

▶ మొదటి పేజీ తరువాయి

అమూల్ కూడా పాల సేకరణ నిలిపివేస్తోంది. తిరుపతిలో ఈ నెల 21 నుంచి, అనంతపురం జిల్లాలో 11వ తేదీ నుంచి పాల సేకరణ నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. మిగిలిన రాయలసీమ జిల్లాల్లోనూ సెప్టెంబర్ 1 నుంచి పాల సేకరణ నిలిపివేసేందుకు చర్యలు చేపడుతోంది. బాబు చర్యలు రాష్ట్రంలోని లక్షలాది పాడి రైతులకు శరాఘాతంగా మారాయి. రాష్ట్రంలో పాడి రైతుల్లో అధిక శాతం మహిళలే. వారే ఇప్పుడు అమూల్ పాల సేకరణ కేంద్రాలు కొనసాగించాలంటూ ఆందోళన బాట పట్టారు. తిరుపతి, అనంతపురం జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్ల వద్ద వందలాది మహిళలు, రైతులు నిరసన వ్యక్తంచేశారు. అమూల్ రాకతో గడిచిన మూడేళ్లుగా లీటర్‌కు రూ.5 నుంచి రూ.20 వరకు అదనపు లబ్ధి పొందుతున్నామని, బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని కొత్త పశువులను కొన్నామని రైతులు చెబుతున్నారు. అమూల్ కేంద్రాలు మూసివేస్తే, ప్రైవేటు డెయిరీలు పాలసేకరణ ధరలు తగ్గించేస్తాయని, అప్పుడు తమ బతుకులు అంధకారంలో పడతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పొమ్మనకుండా పొగ

బాబు కూటమి అధికార పగ్గాలు చేపట్టింది మొదలు అమూల్ విషయంలో పొమ్మనకుండా పొగపెట్టేలా వ్యవహరిస్తోంది. వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో అమూల్ ప్రాజెక్టు విస్తరణ కోసం జిల్లాకో డెయిరీ డెవలప్‌మెంట్ అధికారిని నియమించారు. గ్రామ సచివాలయాల్లోని డిజిటల్, వెల్ఫేర్, యానిమల్ అసిస్టెంట్స్ పర్యవేక్షణలో పాలసేకరణ జరిగే ప్రతి 15–20 గ్రామాలకో మెంటార్‌నూ, ప్రతి 3–4 సచివాలయాల పరిధిలో ఒక రూట్ ఇన్‌చార్జిని నియమించారు. మండల స్థాయిలో ఎంపీడీవో, జిల్లా స్థాయిలో పశుసంవర్ధక శాఖ జేడీ, డీఆర్‌డీఏ పీడీ, జిల్లా సహకార శాఖాధికారులు పర్యవేక్షించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 4వ రోజునే వీరందర్ని వెనక్కి పంపేసింది. అంగన్‌వాడీ కేంద్రాలకు పాల సరఫరా బాధ్యతల నుంచి అమూల్‌ను తప్పించింది. అమూల్ ఎస్ఎన్ఎఫ్ శాతాన్ని 8.3 శాతానికి పెంచడం, పాలసేకరణ ధరను రూ.4 వరకు తగ్గించడం ప్రభుత్వ ఒత్తిళ్ల ఫలితమేనని చెబుతున్నారు. 4,798 గ్రామాల్లో జరగాల్సిన పాల సేకరణ ఇప్పుడు 2 వేల గ్రామాలకు పరిమితమైంది. పాలుపోసే వారి సంఖ్య 1.2 లక్షల నుంచి 30వేల మందికి తగ్గిపోయింది. ఇప్పటికే పాల ఉత్పత్తి పెరిగిందనే సాకుతో ప్రైవేటు డెయిరీలు లీటర్‌కు రూ.5 నుంచి రూ.10 వరకు తగ్గించేశాయి. అమూల్ పాలసేకరణ నిలిపివేస్తే, ఇక ప్రైవేటు డెయిరీలదే రాజ్యమని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



అనంతపురం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న పాడి రైతులు

కలెక్టరేట్ల వద్ద ఆందోళన

అనంతపురం అర్బన్/తిరుపతి అర్బన్: అమూల్ పాల సేకరణ రద్దు చేస్తే పాడి రైతులు నష్టపోతారని, పాల వెల్లువ పథకాన్ని కొనసాగించాల్సిందేనంటూ మహిళా పాడి రైతులు అనంతపురం, తిరుపతి కలెక్టరేట్ల వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. తిరుపతిలో పెద్ద సంఖ్యలో మహిళా రైతులు కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. అమూల్ పాల సేకరణ కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతపురంలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ఆందోళన చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన పరికరాలతో పాల తూకం, వెన్న శాతం, ఎస్ఎన్ఎఫ్ శాతం ఆటోమేటిక్‌గా నమోదవుతూ ప్రతి రైతుకూ వారి ఖాతాల్లోకి పది రోజుల్లో కచ్చితంగా డబ్బు జమయ్యేదని రైతు సంఘం నేతలు చెప్పారు. అమూల్ ద్వారానే రైతులకు మేలు జరిగేదన్నారు. ఎంతో పారదర్శకంగా సాగుతున్న ఈ మొత్తం ప్రక్రియను కూటమి ప్రభుత్వం రద్దు చేస్తోందని మండిపడ్డారు.

ప్రైవేటు డెయిరీల దోపిడీకి వైఎస్ జగన్ కళ్లెం

ప్రైవేటు డెయిరీల దోపిడీకి కళ్లెం వేసి, పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం ద్వారా సహకార డెయిరీలకు పూర్వ వైభవం తేవాలన్న సంకల్పంతో వైఎస్ జగన్ ప్రభుత్వం 2020 డిసెంబర్‌లో జగనన్న పాల వెల్లువ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సహకార డెయిరీ రంగంలో దేశంలోనే ప్రథమ స్థానంలో ఉన్న అమూల్‌తో అవగాహన ఒప్పందం చేసుకుంది. పాడి రైతులకు రక్షణ కల్పిస్తూ నాణ్యమైన పాల సేకరణ, సరఫరాయే లక్ష్యంగా దేశంలో ఎక్కడా లేని విధంగా పాల సేకరణ, నాణ్యమైన పాల వినియోగ చట్టం–2023ను తీసుకొచ్చింది. ప్రతి పాడి రైతుకు లీటర్‌పై రూ.4 మేర అదనపు ప్రయోజనం కల్పిస్తామంటూ ఎన్నికల్లో ఇచ్చిన హామీకి మిన్నగా రూ.10 నుంచి రూ.20 వరకు అదనపు లబ్ధి చేకూర్చింది.

వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఉద్యమంలా విస్తరణ

- 3 జిల్లాలు (వైఎస్సార్, చిత్తూరు, ప్రకాశం)తో మొదలై 19 జిల్లాలకు జగనన్న పాల వెల్లువ విస్తరణ
- 401 గ్రామాలు, 24,277 మంది రైతులతో మొదలై నేడు 4,798 గ్రామాలు 4.50 లక్షల మంది రైతుల భాగస్వామ్యం
- రోజూ పాలు పోసే వారి సంఖ్య 800తో మొదలై 1.25 లక్షలకు చేరిక
- పాల సేకరణ రోజుకు సగటున 1,800 లీటర్ల నుంచి 3.75 లక్షల లీటర్లకు చేరిక
- అమూల్ ద్వారా 3.5 ఏళ్లలో 20 కోట్ల లీటర్ల పాలసేకరణ
- రైతుల ఖాతాల్లో జమ అయిన డబ్బు రూ.925 కోట్లు

అందించిన ప్రయోజనాలు

- ✔ 180 రోజులు పాలు పోసే వారికి లీటర్‌కు రూ.0.50 చొప్పున బోనస్ రూపంలో రూ.6.50 కోట్ల అదనపు లబ్ధి
- ✔ లాభాపేక్ష లేకుండా నాణ్యమైన ఫీడ్ పంపిణీ
- ✔ 9,899 గ్రామాల పరిధిలో ఒక్కొక్కటి రూ.12.81 లక్షల అంచనాతో 11,800 పాల సేకరణ కేంద్రాలు (ఏఎంసీయూ) ఏర్పాటు
- ✔ ఒక్కొక్కటి రూ.20.42 లక్షల అంచనాతో 4,796 పాల శీతలీకరణ కేంద్రాల (బీఎంసీయూ) నిర్మాణానికి శ్రీకారం
- ✔ వర్కింగ్ క్యాపిటల్ రూపంలో గేదెకు రూ.30 వేలు, ఆవుకు రూ.25 వేలు సాయం
- ✔ కొత్త పాడి కొనుగోలుకు గేదెకు రూ.93 వేలు, ఆవుకు రూ.76 వేలు సాయం
- ✔ ఏఎంసీయూల్లో రూ.1.50 లక్షల, బీఎంసీయూల్లో రూ.15 లక్షల విలువైన పరికరాల ఏర్పాటు
- ✔ అమూల్ ద్వారా మూతపడిన మదనపల్లి డెయిరీ పునరుద్ధరణ
- ✔ చిత్తూరు డెయిరీకి ఉన్న రూ.182 కోట్ల అప్పులను తీర్చి రూ.385 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చిన అమూల్‌కు లీజుకు. ఇప్పటికే రూ.70 కోట్లతో రోజుకు లక్ష లీటర్ల సామర్థ్యంతో మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభం

పక్కాగా లెక్కగట్టి ఇచ్చేవారు

ప్రైవేటు డెయిరీలు 15 రోజులకోసారి పాల డబ్బులు చెల్లిస్తే అమూల్ 10 రోజులకే మా ఖాతాల్లో వేస్తోంది. పైగా ఫ్యాట్, ఎస్ఎన్ఎఫ్ శాతాన్ని బట్టి లీటర్‌కు రూ.32 నుంచి రూ.42 వరకు వరకు చెల్లిస్తున్నారు. ఇతర డెయిరీలు పాల శాతాన్ని కచ్చితంగా లెక్కించడంలేదు. రూ.25 నుంచి రూ.30 వరకు మాత్రమే ఇస్తున్నారు. 10 రోజుల్లో 35 లీటర్ల వరకు పాలు పోస్తాం. రూ.1500 వరకు జమవుతోంది. అమూల్ కేంద్రాలను కొనసాగించాల్సిందే..

– వెంకటశివారెడ్డి, రంగన్నగారిగడ్డ, తిరుపతి జిల్లా

మూతపడితే అగమ్యగోచరమే

ప్రైవేటు డెయిరీలు 15 రోజుల సరాసరి పాల శాతాన్ని గణించి రేటు నిర్ణయిస్తాయి. అమూల్ ఏ రోజుకారోజే పాల శాతాన్ని లెక్కిస్తుంది. దీంతో గిట్టుబాటు ధర వస్తోంది. పాడి కొనుగోలుకు అమూల్ రుణాలు కూడా ఇప్పించింది. ఇతర డెయిరీల్లో ఈ సౌకర్యం లేదు. 10 రోజుల్లో 30 లీటర్లు పాలు పోస్తా. రూ.1,400 వరకు జమవుతుంది. అమూల్ కేంద్రాలు మూతపడితే మా బతుకులు అగమ్య గోచరంగా మారతాయి.

– స్వామిదాస్, తిరుపట్టం, తిరుపతి జిల్లా

రైతులకు మరింత లబ్ధి

అమూల్ డెయిరీ 7 సార్లు పాలసేకరణ ధరలు పెంచడంతో 3.5 ఏళ్లలో లీటర్‌కు గేదెపాలపై రూ.18.29, ఆవు పాలపై రూ.9.49 చొప్పున పెరిగింది. ప్రస్తుతం గేదె పాలకు లీటర్‌కు రూ.89.76, ఆవు పాలకు లీటర్‌కు రూ.43.69 చొప్పున చెల్లిస్తున్నారు. అమూల్‌తో పోటీపడి ప్రైవేటు డెయిరీలు కూడా పాల సేకరణ ధరలు పెంచాల్సివచ్చింది. దీంతో వాటికి పాలు పోసే రైతులకు రూ.5 వేల కోట్ల మేర అదనంగా లబ్ధి చేకూరింది. అమూల్ సంస్థ ఫ్యాట్, ఎస్ఎన్ఎఫ్ శాతాన్ని పక్కాగా లెక్క గట్టి అణాపైసలతో సహా చెల్లిస్తుండడంతో గరిష్టంగా గేదె పాలకు లీటర్‌కు రూ.100, ఆవు పాలకు రూ.50కు పైగా ధర పొందగలిగారు. పాలుపోసిన 10 రోజుల్లోనే బ్యాంక్ ఖాతాల్లో సొమ్ము జమ చేయడంతో పాడి రైతుల్లో అమూల్ పట్ల నమ్మకం పెరిగింది.

సాగర్ నుంచి కృష్ణమ్మ పరుగులు

నాగార్జున సాగర్ నుంచి దిగువకు 1.20 లక్షల క్యూసెక్కుల విడుదల



నాగార్జున సాగర్ నుంచి రాత్రి 9:30కి విడుదలవుతున్న నీరు

సాక్షి, అమరావతి/విజయపురి సౌత్/శ్రీశైలం ప్రాజెక్ట్: పులిచింతల ప్రాజెక్టుదిశగా కృష్ణమ్మ పరుగులు తీస్తోంది. నాగార్జున సాగర్‌లో నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరుకోవడంతో సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒక్కో గేటు ఎత్తుతూ రాత్రి 9.30 సమయంలో మొత్తం 20 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 1,20,064 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రధాన కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 28,907 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. మొత్తం 1,48,971 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. సాగర్ నుంచి దిగువకు విడుదల చేసే నీటి పరిమాణం గంట గంటకూ పెంచుతుండటంతో పులిచింతలలోకి చేరుతున్న వరద క్రమేణా పెరుగుతోంది. పులిచింతల ప్రాజెక్టులోకి సోమవారం సాయంత్రం 6 గంటలకు 30,388 క్యూసెక్కులు చేరుతుండగా.. కృష్ణా డెల్టా అవసరాల కోసం 4 గేట్లు ఎత్తి 26,083 క్యూసెక్కులను ప్రకాశం బ్యారేజీకి తరలిస్తున్నారు. ప్రస్తుతం పులిచింతలలో 6.72 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. పులిచింతల ప్రాజెక్టు పూర్తి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు. ఎగువ నుంచి భారీ వరద వస్తున్న నేపథ్యంలో మరో రెండ్రోజుల్లో పులిచింతల ప్రాజెక్టు కూడా నిండనుంది. శ్రీశైలం ప్రాజెక్టులోకి 3,44,218 క్యూసెక్కులు చేరుతుండగా.. 10 గేట్లను 12 అడుగుల మేర ఎత్తి 3,10,840 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ఎడమ విద్యుత్ కేంద్రం నుంచి 26,481, కుడి విద్యుత్ కేంద్రం నుంచి 37,857 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. ఎగువన కర్ణాటకలో ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌లలోకి వరద ప్రవాహం కొంతమేర తగ్గింది. ఆ డ్యామ్‌లలో ఖాళీ ప్రదేశాలను నింపుతూ దిగువకు 1,89,700 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. మహారాష్ట్రలో భీమాపై నిర్మించిన ఉజ్జయిని ప్రాజెక్టు నిండిపోవడంతో గేట్లు ఎత్తి దిగువకు 1,27,705 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ఇక తుంగభద్రలో వరద ప్రవాహం కొంత తగ్గింది. తుంగభద్ర డ్యామ్‌లోకి 82 వేల క్యూసెక్కులు చేరుతుండగా.. ఖాళీ ప్రదేశాన్ని నింపుతూ దిగువకు 50 వేల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శ్రీశైలం ప్రాజెక్టులోకి మంగళవారం కూడా ఇదే రీతిలో వరద కొనసాగనుంది.

నిలకడగా గోదావరి

పోలవరం రూరల్: గోదావరి వరద నిలకడగా ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీరు క్రమేపీ తగ్గుతుండటంతో పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 31.320 మీటర్లకు నీటిమట్టం చేరుకుంది. స్పిల్‌వే నుంచి 7.26 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు చేరుతోంది. భద్రాచలం వద్ద 35.80 అడుగులకు నీటిమట్టం చేరుకుంది.

టెయిల్ పాండ్ నుంచి 1,32,411 క్యూసెక్కులు

సత్రశాల (రెంటచింతల): పల్నాడు జిల్లా రెంటచింతల మండలం సత్రశాల వద్ద కృష్ణా నదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రెండు యూనిట్లు, ఆరు క్రస్ట్‌గేట్లు ద్వారా మొత్తం 1,32,411 క్యూసెక్కులను పులిచింతల ప్రాజెక్ట్‌కు విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఏడీ ఎన్.జయశంకర్, ఏఈ జయపాల్ సోమవారం తెలిపారు. ఎగువనున్న నాగార్జున సాగర్ నుంచి టైల్‌పాండ్ ప్రాజెక్టు రిజర్వాయర్‌కు 1,32,794 క్యూసెక్కులు వరదనీరు వస్తోందన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలో అవకతవకలకు బాబు కుట్ర

- అందుకే బలం లేకపోయినా పోటీకి దిగుతున్నారు
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ ధ్వజం



చోడవరం(అనకాపల్లి జిల్లా): విశాఖపట్నం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో అవకతవకలకు చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. అందుకే తగినంత బలం లేకపోయినా అభ్యర్థిని పోటీకి పెడుతున్నారని విమర్శించారు. సోమవారం ఆయన చోడవరంలో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, జెడ్పీటీసీలతో సమావేశమయ్యారు. మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. 'ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో 640కి పైగా ఓట్లు వైఎస్సార్‌సీపీవే. టీడీపీ కూటమికి 200 ఓట్లు కూడా లేవు. దురుద్దేశంతోనే చంద్రబాబు అభ్యర్థిని పోటీకి పెట్టినట్లు అర్థమవుతోంది. అయినా వైఎస్సార్‌సీపీ విజయం సాధించి తీరుతుంది. రాష్ట్రం దివాలా తీసిందనే మాట దేశం మొత్తమ్మీద ఏ ముఖ్యమంత్రీ చెప్పరు. కేవలం చంద్రబాబే చెబుతుంటారని దివంగత మాజీ సీఎం రోశయ్య అనేక సందర్భాల్లో చెప్పారు. ఎన్నికల్లో గెలవడం కోసం ఇష్టారీతిన హామీలిచ్చిన చంద్రబాబు ఇప్పుడు రాష్ట్రం అప్పుల్లో ఉందని చెప్పడం విడ్డూరం. 14 ఏళ్లు సీఎంగా చేసిన వ్యక్తికి రాష్ట్ర బడ్జెట్ గురించి తెలియదా? ఎన్నికల హామీలన్నీ కూటమి ప్రభుత్వం నెరవేర్చాల్సిందే. తమ ప్రభుత్వం ఉన్నప్పుడు భూ ఆక్రమణలు జరిగాయంటూ అధికార పార్టీ అనుకూల మీడియాలో ఊకదంపుడు వార్తలు రాయిస్తున్నారు. అధికారం చేతిలో ఉన్నవారు విచారణ చేయించొచ్చుగా? లేనిది ఉన్నట్టు అనుకూల పత్రికల్లో కథనాలు రాయించి బురదజల్లితే చూస్తూ ఊరుకోం. మా నాయకుడు వైఎస్ జగన్ ప్రజలకు సుపరిపాలన అందించారు. శాసనమండలిలో ఉత్తరాంధ్ర వాణి వినిపించేందుకు నన్ను గెలిపించండి' అని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, మాజీ ఎమ్మెల్సీ దాట్ల సూర్యనారాయణరాజు, మాడుగుల సమన్వయకర్త ఇ.అనురాధ తదితరులు పాల్గొన్నారు.

నేడు నోటిఫికేషన్

మహారాణిపేట(విశాఖ దక్షిణ): విశాఖపట్నం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు జిల్లా జాయింట్ కలెక్టర్, ఎన్నికల అధికారి కె.మయూర్ అశోక్ మంగళవారం నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ కూడా ప్రారంభమవుతోంది. ఈనెల 30వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది.

ప్రాణహాని లేదన్న ఎస్ఆర్‌సీ నివేదికను సవాలు చేసుకోండి

పెద్దిరెడ్డికి హైకోర్టు వెసులుబాటు



సాక్షి, అమరావతి: ప్రాణహాని లేదంటూ భద్రత సమీక్ష కమిటీ (ఎస్ఆర్‌సీ) ఇచ్చిన నివేదికపై అభ్యంతరం ఉంటే దాన్ని సమీక్షించాలని ఉన్నతాధికారుల వద్దకు వెళ్లాలని, లేదా ఆ నివేదికను హైకోర్టులో సవాలు చేసుకోవాలని పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి హైకోర్టు స్పష్టం చేసింది. మంత్రిగా ఉన్నప్పుడు తనకున్న 5+5 భద్రతను కొనసాగించేలా ఆదేశాలివ్వాలంటూ తాను దాఖలు చేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు పెద్దిరెడ్డికి హైకోర్టు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పన వరాహలక్ష్మీనరసింహ చక్రవర్తి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.

ఎస్ఆర్‌సీ నివేదిక మిథున్‌రెడ్డికి ఇవ్వండి

ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి ప్రాణహాని లేదంటూ ఎస్ఆర్‌సీ ఇచ్చిన నివేదికను ఆయనకు అందచేయాలని పోలీసులను న్యాయమూర్తి ఆదేశించారు. విచారణను రెండు వారాలకు వాయిదా వేశారు. తనకు 4+4 భద్రతను కొనసాగించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ మిథున్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.


మేం చాలా మంచి దొంగలం!

నంద్యాల మండలం చాబోలు గ్రామ శివారులోని ఓ షాప్‌లో ఆదివారం దొంగలు పడి కేవలం నగదు మాత్రమే దోచుకుని వస్తువులను తాకకుండా వదిలి వెళ్లిపోయిన ఘటన ఇది. యజమాని వేణుగోపాల్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. చాబోలు శివారులో విఘ్నేశ్వర అగ్రి కల్చర్ డ్రోన్స్ అండ్ సర్వీసెస్ షాప్‌ను ఆదివారం యథావిధిగా మూసి వెళ్లిపోయాడు. సోమవారం ఉదయం షాపు తెరిచేందుకు రాగానే తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గుర్తించాడు. ఆందోళన చెంది లోనికి వెళ్లి చూస్తే ఎక్కడి వస్తువులు అక్కడే పడి ఉన్నాయి. టేబుల్ మీద ఒక లెటర్‌ను గుర్తించి దానిని చదివాడు. అందులో.. అన్నా, మేము డబ్బు కోసమే వచ్చాము.. డబ్బు తప్ప ఏమీ తీసుకుపోలేదు.. యూ డోంట్ వర్రీ..' అని రాసి ఉంది. క్యాష్ కౌంటర్‌లోకి చూస్తే దానిలో ఉన్న రూ.9,500 మాయమయ్యాయి. లక్షలాది రూపాయలు విలువ చేసే డ్రోన్ పరికరాలను వదిలేసి కేవలం నగదు మాత్రమే తీసుకెళ్లిన దొంగ నిజాయితీకి యజమాని ఏడ్వలేక నవ్వాడు. ఘటనపై తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

– బొమ్మలసత్రం



చెల్లాచెదురుగా పడి ఉన్న వస్త్రాలు



టేబుల్‌పై దొంగ రాసిపెట్టిన లెటర్

బంగ్లాదేశ్‌లో బీ కేర్‌ఫుల్

ప్రవాసాంధ్రులు సురక్షిత ప్రదేశాల్లో ఉండాలన్న ఏపీ ఎన్ఆర్టీఎస్

- ఇబ్బందులుంటే 0863–2340678 నంబర్‌కు కాల్ చేయండి
- ఇజ్రాయెల్‌లోని ప్రవాసాంధ్రులు తక్షణమే తమ పేర్లను రాయబార కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచన

సాక్షి, అమరావతి: బంగ్లాదేశ్‌లో సైనిక పాలన, హింసాత్మక ఘటనల నేపథ్యంలో విద్య, ఉపాధి కోసం అక్కడికి వెళ్లిన ప్రవాసాంధ్రులు బయటకు రాకుండా సురక్షిత ప్రదేశాల్లో ఉండాలని ఏపీ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీ ఎన్ఆర్టీఎస్) విజ్ఞప్తి చేసింది. ప్రవాసాంధ్రులను బంగ్లాదేశ్ నుంచి సురక్షితంగా తీసుకురావడానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఏపీ ఎన్ఆర్టీఎస్ సీఈవో హేమలత తెలిపారు. ప్రత్యేక హెల్ప్‌లైన్‌తో పాటు ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా ప్రవాసాంధ్రులను చేరుకోవడానికి కృషి చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. సుమారు 500 మంది విద్యార్థులు బంగ్లాదేశ్‌లో ఉన్నట్లు ఏపీ ఎన్ఆర్టీఎస్ అంచనా వేస్తోంది. బంగ్లాదేశ్ నుంచి భారత్ రావడానికి ఇబ్బంది పడుతున్న విజయనగరానికి చెందిన అభిషేక్‌ను ఏపీ ఎన్ఆర్టీఎస్ రాష్ట్రానికి తీసుకొచ్చింది. ఇంకా బంగ్లాదేశ్‌లో ఉన్నవారు ఢాకాలోని భారత రాయబార కార్యాలయం 880–1937400591లో కానీ లేదా ఏపీ ఎన్ఆర్టీఎస్ హెల్ప్‌లైన్ నంబర్లు 0863–2340678 లేదా వాట్సాప్ నంబర్ 91 8500027678లో సంప్రదించాలని కోరింది.

ఇజ్రాయెల్, బ్రిటన్ పరిస్థితులూ గమనిస్తున్నాం

ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య హింసాత్మక ఘటనల నేపథ్యంలో ఇజ్రాయెల్‌లో నివసిస్తున్న తెలుగు వారిని క్షేమంగా తీసుకురావడానికి ఏపీ ఎన్ఆర్టీఎస్ కృషి చేస్తోంది. ఇజ్రాయెల్ రాయబార కార్యాలయంలో తమ వివరాలను తక్షణం నమోదు చేసుకోవాలని, ఇబ్బందులున్న వారు భారత రాయబార కార్యాలయంలోని 98 21887551035/989128109115 నంబర్లు లేదా cons.tehran-@mea.gov.in ఈ–మెయిల్‌లో సంప్రదించాలని కోరింది. బ్రిటన్‌లోనూ వలసదారుల లక్ష్యంగా దాడులు జరుగుతున్న నేపథ్యంలో అక్కడి తెలుగు వారు జాగ్రత్తగా ఉండాలని సూచించింది.

పిఠాపురంలో ఆయ్ చిత్రం యూనిట్ సందడి

గొల్లప్రోలులో సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ , టీజర్ ఆవిష్కరణ



గొల్లప్రోలు ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సందడి చేస్తున్న ఆయ్ చిత్రం యూనిట్ సభ్యులు

పిఠాపురం: కాకినాడ జిల్లా పిఠాపురంలో ఆయ్ చిత్రం యూనిట్ సందడి చేసారు. గొల్లప్రోలులో సోమవారం సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించిన సినిమా యూనిట్ సినిమా టీజర్‌ను ఆవిష్కరించారు. తొలుత పిఠాపురం నియోజకవర్గం ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఉమా కుక్కుటేశ్వర దేవాలయంలో ఆయ్ చిత్రం యూనిట్ బృందం ఆగస్టు 15వ తేదీన విడుదల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమంలో హీరో నితిన్ హీరోహిన్ ప్రొడ్యూసర్ బన్నీ వాసు ఈ సినిమా అఖండ విజయం చేకూరాలని కోరుకున్నామని అన్నారు. ఈ సినిమా ప్రొడ్యూసర్ బన్నీ వాసు మీడియాతో మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే విధంగా కమర్షియల్ ఎలిమెంట్స్ తో కామెడీ ఎంటర్టైన్మెంట్ తో తీశామని తెలిపారు. అనంతరం గొల్లప్రోలు సత్య కృష్ణ కన్వెన్షన్‌లో ప్రీ రిలీజ్ ఈవెంటును అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్ కు ముఖ్య అతిథులుగా జనసేన పార్టీ ఇన్చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.ఎస్.ఎన్.వర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ సినిమాలో నటీనటులు మాట్లాడుతూ ఇది ఉభయ తూర్పుగోదావరి జిల్లాల నేటి వీటితో మిలీనమై ఉంటుందని ఈ సినిమా ద్వారా తమనూ మరింత ప్రేక్షక దేవుడులు ఆదరిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయ్ చిత్రం యూనిట్ హీరో హీరోయిన్స్, చిత్ర నిర్మాత సహనిర్మాత, డైరెక్టర్,ఎం.స్వామి , సినిమా బృందం తదితరులు పాల్గొన్నారు.

బీసీలపై కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు

- అఖిల భారత బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లగుడు గోవిందరావు
- ఈనెల 9న ఛలో పార్లమెంట్ కార్యక్రమం

సాక్షి, న్యూఢిల్లీ: బీసీలను కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని అఖిల భారత బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లగుడు గోవిందరావు ఆరోపించారు. పేరుకు బీసీ వ్యక్తి ప్రధానిగా ఉన్నారే కానీ.. బీసీలకు ఆయన చేసిందేమీ లేదని విమర్శించారు. సోమవారం ఢిల్లీలో ఏపీ భవన్ వద్ద అఖిల భారత బీసీ సంక్షేమ సంఘం కేంద్ర ప్రభుత్వం తీరుపై నిరసన వ్యక్తం చేసింది. అనంతరం లగుడు గోవిందరావు మీడియాతో మాట్లాడుతూ.. చట్ట సభల్లో బీసీ సామాజిక వర్గాలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లోనే ఈవిషయంపై స్పష్టత రావాలని డిమాండ్ చేశారు. ఈఅంశంపై ఈనెల 9న ఛలో పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. జంతర్‌మంతర్ వద్ద వందలాది బీసీలతో ధర్నా చేస్తున్నట్లు లగుడు గోవిందరావు తెలిపారు.



దీపం వెలుగులో ఒంటరిగా కూర్చొని,
తెరచి ఉన్న పుస్తకంలోని కనబడని తరాల మనుషులతో
సన్నిహితంగా సంభాషించటం పోలిక లేని ఆనందం.
– యోషిదా కెంకో

సాక్షి
మంగళవారం, 6 ఆగస్టు 2024

సంక్షుభిత బంగాళం

భయపడినంతా అయింది. బంగ్లాదేశ్ రాజకీయ సంక్షోభంలో కూరుకుపోయింది. హింసాత్మకంగా మారిన విద్యార్థుల నిరసనలు, వెల్లువెత్తుతున్న ప్రజాగ్రహం మధ్య అవామీ లీగ్ పార్టీ సారథి షేక్ హసీనా ప్రధానిగా రాజీనామా చేసి, సైనిక విమానంలో దేశం విడిచిపోవాల్సి వచ్చింది. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా సాగిన 1971 నాటి బంగ్లాదేశ్ స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్నవారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వోద్యోగాల్లో 30 శాతం రిజర్వేషన్లు కల్పించిన వివాదాస్పద కోటా విధానంపై మొదలైన రచ్చ చివరకు ఇంతకు దారి తీసింది. జూలైలో ఢాకా యూనివర్సిటీలో ఆరంభమైన విద్యార్థుల నిరసన ప్రదర్శనలు ఇంతలు అంతలై, ఘర్షణలకు దారి తీశాయి. గత నెలలోనూ, అలాగే ఈ ఆదివారమూ కలిపి 300 మందికి పైగా అమాయకుల ప్రాణాలు పోవడంతో బంగ్లాలో పరిస్థితులు వేగంగా మారాయి. గత నెలలో సుప్రీమ్ కోర్ట్ జోక్యం చేసుకొని, అన్నీ కలిపి 56 శాతమున్న రిజర్వేషన్లను 7 శాతానికి తగ్గించినప్పుడు నిరసనలు తగ్గి, ప్రశాంతత నెలకొంటుందని భావించారు. అప్పటికి కాస్త ఆగినట్టనిపించినా, మృతుల కుటుంబాలకు న్యాయం పేరిట మళ్ళీ నిరసనలు రేగాయి. ప్రభుత్వ అనుకూల, ప్రతికూల వర్గాల మధ్య మళ్ళీ రేగిన ఘర్షణల్లో ఒక్క ఆదివారమే 100 మంది దాకా చనిపోవడం, విద్యార్థుల 'చలో ఢాకా' ప్రదర్శన నేపథ్యంలో అగ్నిపర్వతం బద్దలైంది.

క్షేత్రస్థాయిలో ప్రజల మనోభావాలను గుర్తించకుండా, నిరంకుశంగా వ్యవహరిస్తే ఎంతటి పాపులర్ నేతకైనా ఎలాంటి దురవస్థ తలెత్తుతుందో సోమవారం నాటి దృశ్యాలు కళ్ళకు కట్టాయి. దేశవ్యాప్త కర్ఫ్యూ, ఇంటర్నెట్ సేవల సస్పెన్షన్ విధించినా ఢాకాలో రోడ్ల నిండా జనం, ప్రధాని నివాసాన్ని వారు చుట్టుముట్టిన తీరు, హసీనా రాజీనామా, విలాసవంతమైన ఆమె నివాసంలోకి జనం చొచ్చుకుపోయి లూటీ సాగించిన తీరు చూస్తుంటే... సరిగ్గా రెండేళ్ళ క్రితం 2022 జూలైలో శ్రీలంకలో అధ్యక్షుడు రాజపక్సేకు ఎదురైన ఘటనలు గుర్తుకొస్తాయి. దేశాలు, ప్రజలు వేరైనా, రెండు ఘటనల్లోనూ నిరంకుశ పాలన, అవినీతి, ఆశ్రిత పక్షపాతాలే ఇంతటి జనాగ్రహానికి కారణమయ్యాయని మరిచిపోరాదు. అయితే, బంగ్లాలో రెచ్చిపోయిన జనం ప్రధాని నివాసంలోకే కాక, ఆఖరికి దేశ పార్లమెంట్‌లోకి చొరబడి యథేచ్ఛగా ప్రవర్తించడం విస్మయం కలిగిస్తుంది. షేక్ హసీనా తండ్రి, బంగ్లాదేశ్ జాతిపిత అయిన ముజిబుర్ రెహమాన్ విగ్రహాన్ని సైతం ధ్వంసం చేయడం, బంగబంధు మ్యూజియమ్‌ను తగలబెట్టడం, అధికార అవామీ లీగ్ ఆఫీసులకూ – పోలీస్ స్టేషన్లకూ – ప్రభుత్వ ఆఫీసులకూ నిప్పు పెట్టడం ప్రజాస్వామ్య వాదులకు ఆవేదన, ఆందోళన కలిగించక మానవు.

అయిదు దశాబ్దాల స్వతంత్ర బంగాళం ఇటీవలెన్నడూ చూడని హింస, రాజకీయ సంక్షోభం ఇది. ఒక రకంగా ఇది అయిదుసార్లు బంగ్లా ప్రధానిగా వ్యవహరించిన 76 ఏళ్ళ హసీనా స్వయంకృతం. 2009 జనవరి నుంచి పదహారేళ్ళుగా నిర్విరామంగా అధికారంలో ఉన్న ఈ ఉక్కుమహిళ అనేక సంక్షోభాలనూ, హత్యాయత్నాలనూ దాటి వచ్చి, దేశాన్ని ఆర్థికంగా పైకి తెచ్చిన మాట నిజమే. ఒక దశలో ఇస్లామిక్ ప్రపంచంలో ప్రజాస్వామ్య, లౌకికవాదాలకు నమూనాగా తెచ్చుకున్న పేరూ పెద్దదే. కానీ, ప్రతిపక్ష నేతల్ని జైలులో పెట్టి, విమర్శకులను దేశద్రోహులుగా చిత్రించి, చట్టంతో పని లేకుండా ప్రత్యర్థుల్ని అడ్డు తొలగించుకుంటూ వచ్చి అభిమానుల్లో సైతం అప్రతిష్ఠ తెచ్చుకున్నారు. కోవిడ్ అనంతర పరిస్థితులు, రష్యా – ఉక్రెయిన్ యుద్ధంతో ఆర్థిక వ్యవస్థ అల్లకల్లోలమైంది. పెరిగిన ధరలు, పెచ్చుమీరిన నిరుద్యోగం, అణచివేతలతో అన్ని వర్గాల్లో అసంతృప్తి పేరుకుంది. పైగా, గడచిన రెండు తడవలుగా బంగ్లా ఎన్నికలు పరిహాసప్రాయమయ్యాయి. ముఖ్యంగా ఈ ఏటి జనవరి ఎన్నికలు వట్టి రిగ్గింగ్ అనే ఆరోపణలూ వచ్చాయి. ఇప్పుడామె రాజీనామాతో రోడ్డు మీద కొచ్చి ఆడామగా ఆనందిస్తున్న తీరు చూస్తే మార్పుకై జనం ఎంతగా మొహం వాచారో అర్థమవుతుంది.

హసీనా రాజీనామాతో ప్రస్తుతం బంగ్లాదేశ్ సైన్యం కనుసన్నల్లోకి వెళ్ళింది. రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్మీ ఛీఫ్ సమావేశమైనట్టు వార్తలు వస్తున్నాయి. ప్రస్తుత ఆందోళనలకు అడ్డుకట్ట వేసి పరిస్థితిని చక్కదిద్దుతామనీ, త్వరలోనే తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటవుతుందనీ ఆర్మీ ఛీఫ్ ప్రకటించారు. అయితే, అది అంత సులభమేనా? దేశమంతా అల్లకల్లోలంగా ఉంది. పాలనా యంత్రాంగం పూర్తిగా పడకేసింది. సాక్షాత్తూ సైన్యం ఎదుటే ప్రదర్శకులు రెచ్చిపోతున్న దృశ్యాలూ కనిపించాయి. గత వారం నిషేధానికి గురైన జమాతే ఇస్లామీ వర్గీయులు సహా ఇంతకాలం అణచివేతకు గురైన ప్రతిపక్షాల మద్దతుదారులూ రోడ్డెక్కడంతో నిరసనకారుల్లో అందరూ విద్యార్థులే అనుకోలేం. అనూహ్య విధ్వంసం చూస్తుంటే, అసాంఘిక శక్తులు చేరాయన్న అనుమానాలూ వినిపిస్తున్నాయి.

బంగ్లాదేశ్ పరిణామాలు భారత్‌పై చూపే ప్రభావమూ ఎక్కువే. కొన్నేళ్ళుగా భారత అనుకూల హసీనా ఏలుబడి మనకు కలిసొచ్చింది. ఇప్పుడిక ప్రతికూల పార్టీలు అక్కడ అధికారంలోకి వస్తే చిక్కులు తప్పవు. మళ్ళీ ఒకప్పటిలా సరిహద్దులో తీవ్రవాద సంస్థల పీడ పెరుగుతుంది. అవి అక్కడ తిష్ఠ వేసి, మన ఈశాన్య రాష్ట్రాల్లో సమస్యలు సృష్టిస్తాయి. చొరబాట్లూ ఎక్కువవుతాయి. కోటీ 30 లక్షల మంది హిందువులున్న బంగ్లాలో భారత మైనారిటీల భద్రత ప్రశ్నార్థకమవుతుంది. హసీనా ఉండగానే వారి పైన దాడులు తప్పలేదు. ఇక, ఛాందసవాద, ప్రతికూల శక్తులు గద్దెనెక్కితే పరిస్థితి ఎలా ఉంటుందో? అలాగే, ఢాకా దృశ్యాలను చూస్తే, ఇదే అదనుగా తీవ్రవాద శక్తులు విజృంభించకుండా బంగ్లా సమాజం అప్రమత్తం కావాలనిపిస్తోంది. ముందుగా శాంతిభద్రతలు నెలకొనడం అవసరం. ఎలాంటి సర్కారుతో సాగాలి, మళ్ళీ ఎన్నికలు లాంటివన్నీ ఆ తర్వాతే! అది పూర్తిగా ఆ దేశ అంతర్గత వ్యవహారం, ప్రజాభీష్టం. ఏమైనా రానున్నరోజులు బంగ్లాకే కాదు భారత్‌కూ కీలకం.

నైపుణ్యమే 'అగ్ని'కి ఆజ్యం!

విశ్లేషణ



మనోజ్ జోషీ

అగ్నిపథ్ విషయంలో మొదటి నుంచీ సమస్య ఉంది. పైగా అగ్నివీర్‌లను కేవలం ఆరు నెలల శిక్షణతో సైన్యంలోకి చేర్చుకున్నారు. నిజానికి గ్రామీణ నేపథ్యం, విద్యా స్థాయులు, చేర్చుకున్న వయస్సు దృష్ట్యా, అగ్నివీరుడు సమర్థమైన నైపుణ్యాలతో బయటకు వచ్చే అవకాశం లేదు. ప్రాణాంతక ఆయుధాల వ్యవస్థలు, సంక్లిష్టమైన యంత్రాలు, ఎలక్ట్రానిక్స్ ఆపరేషన్ లేదా నిర్వహణను కొత్తగా చేరినవారికి అప్పగించాలంటే వారి అనుభవం చాలదు. అలాగని మొత్తానికే ఈ పథకాన్ని అవతల పడేయవలసిన అవసరం లేదు. ఈ పథకాన్ని రద్దు చేసే బదులు శిక్షణ, నైపుణ్యాభివృద్ధి వంటి లోపాలను అధిగమించ డానికి ప్రభుత్వం ఈ పథకాన్ని సవరించాలి. అగ్నివీర్ పదవీ కాలాన్ని నాలుగేళ్ల నుండి ఏడేళ్లకు పొడిగించడం మంచి ఆలోచన కావచ్చు.

కార్గిల్ జిల్లాలోని హిల్ స్టేషన్ అయిన ద్రాస్‌లో గత శుక్రవారం జరిగిన కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగిస్తూ, కాస్త తీవ్రంగానే స్పందించి ఉండవచ్చు. అగ్నిపథ్ అంశాన్ని ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయని ఆయన ఆరోపణ. సైన్యాన్ని నిత్య యవ్వనంతో ఉంచడం, అలాగే దానిని నిరంతరం యుద్ధానికి సన్నద్ధం చేయటం ఈ పథకం లక్ష్యం. "దురదృష్టవశాత్తు కొంత మంది వ్యక్తులు జాతీయ భద్రతకు సంబంధించిన ఈ సున్నితమైన విషయాన్ని రాజకీయ అంశంగా మార్చారు" అని ఆయన అన్నారు.

మోదీ మరింత శక్తిమంతంగా చెప్పడానికి మరిన్ని పదాలు వాడి ఉండవచ్చు కానీ ఈ సందర్భం వాటికి తగినదా అనేది ఒక ప్రశ్న. నిజానికి ఒక ఆదర్శవంతమైన, హుందా అయిన సంప్రదాయానికి నాంది పలుకుతూ ప్రతిపక్షం, ప్రధానమంత్రి ఈ వేదికను ఉమ్మడిగా పంచుకుని ఉండవలసింది. కానీ బహుశా అది మరీ ఎక్కువగా ఆశించటమే అవుతుంది.

గడచిన 10 ఏళ్లలో సైన్యాన్ని సంస్కరించడం కోసం చాలా ఎక్కువగానే కృషి జరిగిందనటంలో సందేహం లేదు. 'చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్' నియామకం, 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ మిలిటరీ అఫైర్స్' ఏర్పాటు, 'డిఫెన్స్ అక్విజిషన్ పాలసీ' సంస్కరణ, రక్షణ పరిశ్రమ నిర్బంధ స్వదేశీకరణ, అలాగే రక్షణ పరిశ్రమలో ప్రైవేట్ రంగానికి తలుపులు తెరవడం, ఆ రంగానికి డిఫెన్స్ 'ఆర్ అండ్ డి' నిధుల నుండి 25 శాతం అందించడం... వీటిలో కొన్ని.

కానీ అగ్నిపథ్ దానికై అదిగా అత్యంత ప్రతిష్ఠాత్మకమైనది. ఈ పథకం కింద, ఒక అగ్నివీర్ సైనికుడిని 17–21 సంవత్సరాల వయస్సులో నియమిస్తారు. అతను/ఆమె నాలుగు సంవత్సరాలు సైన్యానికి సేవలందిస్తారు. ఆ తర్వాత సైన్యం నుంచి వేరుపడి తగిన ప్యాకేజీతో నిష్క్రమిస్తారు. ఇలా రిటైరైన వారిలో 25 శాతం మందికి మరో 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువ కాలం పాటు తిరిగి సైన్యంలో చేరే అవకాశం ఉంటుంది. బహుశా వీరు పెన్షన్‌కు అర్హులు అవుతారు. ఇక అగ్నివీర్‌లలో ఎక్కువ మంది విషయానికొస్తే, వారిలో 75 శాతం మంది వివిధ ప్రభుత్వ ఉద్యోగాలలో చేరే అవకాశం కలిగి ఉంటారు. అక్కడ వారు ప్రాధాన్యతా ప్రాతిపదికన రిక్రూట్‌మెంట్‌కు అర్హులు అవుతారు.

2023 చివరలో, మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎమ్ఎమ్ నరవణే తన అముద్రిత జ్ఞాపకాల రచనలో ఈ పథకం నౌకాదళానికి, వాయుసేనకు పిడుగుపాటు వంటిది అని వ్యాఖ్యానించారు. ఆ రెండింటికీ కాకుండా దీనిని తాను కేవలం సైన్యం (ఇండియన్ ఆర్మీ) కోసం మాత్రమే, అది కూడా 75 శాతం సిబ్బందిని ఉంచుకొని 25 శాతం సిబ్బందిని వదిలించుకోవాలనీ ప్రతిపాదించానని వ్యాఖ్యానించారు. అయితే రక్షణ మంత్రిత్వ శాఖ దీనిని కాస్తా మార్చేసి, 75 శాతం అగ్నివీర్‌లను



పంపించి, 25 శాతం మందిని మాత్రమే ఉంచుకోవటం జరుగుతోందని అనడంతో వివాదం తలెత్తింది.

అగ్నిపథ్ విషయంలో మొదటి నుంచీ సమస్య ఉంది. సైన్యం కోసం ఒక అగ్నివీర్ ఏమి చేయగలడు లేదా ఏమి చేయాలి? అన్నదే ఆ ప్రశ్న. ఆర్మీ సగటు వయస్సును అగ్నిపథ్ తగ్గించేస్తుంది అనేది ప్రాథమిక వాదన. ఒక ప్రభుత్వ అఫిడవిట్... ప్రపంచ వ్యాప్తంగా కనిష్ఠస్థాయి ర్యాంక్ సిబ్బంది సగటు వయస్సు 26 సంవత్సరాలు కాగా, ఇండియాలోనే ఆ సగటు వయస్సు 32 ఏళ్ల అని పేర్కొంది. కానీ మన సైన్యంలో నియామక వయస్సు దశాబ్దాలుగా 16.5–21 ఏళ్ల వయస్సులోనే ఉంటోంది. ఇప్పుడు అగ్నిపథ్‌లో భాగంగా 75 శాతం అగ్నివీర్‌లను బయటికి పంపించటం ద్వారా, ప్రతి వలయంలో కొత్త సిబ్బందిని చేర్చడం ద్వారా, ఈ పథకం సైనిక వయస్సును తగ్గించాలని ఆశిస్తోంది. అయితే దాని వల్ల ప్రతిఫలంగా ఏం పొందుతుంది?

భారతీయ నియామకాలలో గ్రహించవలసిన కొన్ని వాస్తవాలు ఉన్నాయి. యువకులు లేదా యువతులు మొదట సైనికులుగా నియమితులు అయినప్పుడు వారు తరచుగా తక్కువ బరువుతో, పోషకాహార లోపంతో ఉండి, విభిన్న నేపథ్యాల నుండి వచ్చినవారై ఉన్నారు. తొమ్మిది నెలల ప్రాథమిక శిక్షణ కేవలం శరీరాకృతి, క్రమశిక్షణ పరంగా వారిని ఒక కొలిక్కి తెస్తుంది. ఆ తర్వాత ట్యాంకులు, ఫిరంగిదళాలు, వాయు రక్షణ వ్యవస్థల నిర్వాహకులుగా మరింత సాంకేతిక ఉద్యోగాలు చేయగలిగిన పదాతిదళానికి తగినట్లుగా వీరికి వృత్తిపరమైన శిక్షణ అవసరం. ఇది కేవలం నైపుణ్యం కోసం. ఇది కాక మరొక సంవత్సరం వరకు ఎక్కడైనా వీరికి శిక్షణ అవసరం కావచ్చు.

ఇప్పుడు, అగ్నివీర్‌లను కేవలం ఆరు నెలల శిక్షణతో సైన్యంలోకి చేర్చుకున్నారు. గ్రామీణ నేపథ్యం, విద్యా స్థాయులు, చేర్చుకున్న వయస్సు దృష్ట్యా, అగ్నివీరుడు సమర్థమైన నైపుణ్యాలతో బయ టకు వచ్చే అవకాశం లేదు. మెరుగైన దేశాల్లో, ఒక రిక్రూట్ అయిన సైనికుడు ముందే డ్రైవింగ్ వంటి నైపుణ్యంతో వస్తాడు, కానీ భారత దేశంలో దానికి మాత్రమే మూడు నెలలు పట్టవచ్చు.

కాగా, మాజీ అడ్మిరల్ అరుణ్ ప్రకాశ్ ఒక సందర్భంలో మాట్లాడుతూ... పదాతి దళ సిబ్బందికి, సాంకేతిక పరిజ్ఞానం ఎక్కువగా అవసరం లేని సైన్యానికి అగ్నిపథ్ ఉపయోగపడుతుందనీ, అయితే వైమానిక దళానికి, నౌకాదళానికి ఇది పెద్ద సమస్యగా మారుతుందనీ పేర్కొన్నారు. "ప్రాణాంతక ఆయుధాల వ్యవస్థలు, సంక్లిష్టమైన యంత్రాలు, ఎలక్ట్రానిక్స్ ఆపరేషన్ లేదా నిర్వహణను అప్పగించడానికి ముందు తగినంత అనుభవాన్ని పొందడానికి కనీసం అయిదారేళ్ల సమయం అవసరం అవుతుంది" అంటారాయన.

అగ్నిపథ్ పథకంలో యువతీయువకుల ప్రొఫైల్ మిలటరీ అవసరాలకు కాకుండా మరి దేనికోసమో ఉద్దేశించినట్లు అనిపిస్తోందన్న ఆరోపణలు ఉండగా ప్రభుత్వం వాటిని ఖండించింది. వాస్తవానికి ప్రభుత్వం పునరాలోచన తర్వాతనైనా ఈ పథకం దేశానికి ఆర్థిక పరిపుష్టిని చేకూర్చే అంశాలతో ప్రేరేపితమైందనే వాస్తవాన్ని ముందుగా తెలియజేయాల్సింది. అయితే ఈ పరిపుష్టి ఒక దశాబ్దం తర్వాత మాత్రమే ప్రారంభమవుతుంది. తాజా బడ్జెట్ ప్రకారం రూ. 1.41 లక్షల కోట్లు లేదా రక్షణ బడ్జెట్‌లో 22.7 శాతాన్ని వినియోగిస్తున్న పెన్షన్ బిల్లు సైన్యానికి గుదిబండ అయింది.

యువశక్తి కోసం గతంలో వచ్చిన పిలుపుల దృష్ట్యా, మనం మొత్తానికే ఈ పథకాన్ని అవతల పడేయవలసిన అవసరం లేదు. ఈ పథకాన్ని రద్దు చేసే బదులు శిక్షణ, నైపుణ్యాభివృద్ధి వంటి లోపాలను అధిగమించడానికి ప్రభుత్వం ఈ పథకాన్ని సవరించాలి. అగ్నివీర్ పదవీ కాలాన్ని నాలుగు సంవత్సరాల నుండి ఏడేళ్లకు పొడిగించడం మంచి ఆలోచన కావచ్చు. ఇది కొంతకాలంగా ఉన్న ఆలోచన. ఇది శిక్షణ కోసం తగినంత సమయాన్ని నిర్ధారిస్తుంది. అలాగే సేవకు సమర్థవంతమైన సహకారాన్ని అందిస్తుంది. అగ్నివీర్‌లు సైన్యం నుంచి బయటికి వచ్చినప్పుడు వారి వయస్సు 24–28 సంవత్సరాల మధ్య ఉంటుంది, ఇది వారికి కొంత ఆలస్యంగా తెరచుకునే అనేక అవకాశాలకు అనువుగా ఉంటుంది.

1999లో కార్గిల్ యుద్ధంలో మరణించిన 550 మంది సైనికులు అగ్నివీరులు కాదని, శిక్షణ పొందిన, దృఢమైన, అంకితభావం కలిగిన సైనికులు అనే విషయం గుర్తుంచుకోండి. ఆ రకమైన సామర్థ్య పరీక్ష ఇప్పటికీ అగ్నివీర్ పథకం కోసం వేచి ఉంది.

వ్యాసకర్త న్యూఢిల్లీలోని అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్‌లో డిస్టింగ్విష్డ్ ఫెలో । ('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఐదేళ్ల డివిడెండ్



నేను, నా భార్య జూలై నెలలో కశ్మీర్‌లో 3 వారాల పాటు ప్రయాణించాము. పర్యాటకం అభివృద్ధి చెందింది. ప్రతి చోటా పిల్లల విహారాలతో కళకళలాడుతూ ఉంది. ఆర్టికల్ 370ని రద్దు చేసిన 2019 ఆగస్టు 5 నుండి గత ఐదేళ్లలో కశ్మీర్‌కు లభించిన డివిడెండ్ ఈ ప్రశాంతత.

– వినోద్ భాటియా, రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్

చీకటి రోజు



ఆర్టికల్ 370ని రద్దు చేసినా ఏమీ మారలేదు. కశ్మీరీల స్వయం ప్రతిపత్తిని లాక్కుని, రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించిన ఆగస్టు 5వ తేదీ జమ్ము–కశ్మీర్ ప్రజలకు బ్లాక్ డేగా మిగిలిపోతుంది.

– గుఫ్రార్ అహ్మద్, జమ్ము–కశ్మీర్ న్యాయవాది

'షా' వారసుడు!



పానిపట్ యుద్ధంలో మరాఠాలను ఓడించిన అఫ్గాన్ పాలకుడు అహ్మద్ షా అబ్దాలీ 'రాజకీయ వారసుడు' అమిత్ షా. ప్రభుత్వంపై నియంత్రణను కొనసాగించటానికి రాజకీయ పార్టీలను విచ్ఛిన్నం చేయటం ద్వారా బీజేపీ 'పవర్ జిహాద్'లో మునిగిపోయింది.

– ఉద్ధవ్ ఠాక్రే, యూబీటీ (ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే) చీఫ్

క్రాష్ అవకండి



అస్థిర సమయంలో పరిణతి చెందిన, అనుభవజ్ఞులైన పెట్టుబడిదారులు ఎలా ప్రవర్తిస్తారు? వారు ఏమీ చేయరు. భయపడరు. ఆ క్షణాలను ఆనందిస్తారు. (స్టాక్ మార్కెట్ పతనంపై వ్యాఖ్యగా... ఊగుతున్న రంగులరాట్నంలోని తొట్టెలో ఒక్కడే అదరక బెదరక కూర్చొని ఉన్న చిన్న బాలుడి వీడియోను జత చేస్తూ).

– నీతూ ఖండేల్‌వాల్, ఇన్వెస్టర్

మౌనంగానే ఎదగమని!



మూడో రౌండ్‌లో తన ప్రత్యర్థి అయిన క్విన్వెన్ ఝెంగ్‌తో కరచాలనానికి నిరాకరిస్తూ, "నేను నిన్ను పోటీదారుగానే గౌరవించను" అని అమెరికన్ క్రీడాకారిణి ఎమ్మా నవార్రో ఆమెను అవమానించారు. అందుకు సమాధానమా అన్నట్టు ఫైనల్స్‌లో ఝెంగ్ విజయం సాధించి, ఒలింపిక్స్ టెన్నిస్ సింగిల్స్‌లో చైనా తొలి బంగారు పతక విజేతగా నిలిచారు.

– కై వాంగ్, స్పోర్ట్స్ ఎనలిస్ట్

ఇన్ బాక్స్

చరిత్రలో మాయని మచ్చలు

జపాన్‌లోని హిరోషిమా నగరంపై 1945 ఆగస్టు 6న, నాగసాకిపై ఆగస్టు 9న అమెరికా జారవిడిచిన అణుబాంబులు సుమారు 2 లక్షలకుపైగా పౌరులను బలి తీసుకున్నాయి. ఇవి చరిత్రలో మాయని మచ్చలు, అతిపెద్ద దుస్సంఘటనలు. అయినా దేశాలు చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోవడం లేదు. ఒక్క క్షణంలో ప్రపంచాన్ని భస్మీపటలం చేసే అణ్వాయుధాలను పోగేస్తూనే ఉన్నాయి.


'స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' (సిప్రి) 2024 నివేదిక, అమెరికా వద్ద 5,044 అణ్వాయుధాలు ఉన్నట్టు తెలిపింది. అదే నివేదిక ప్రకారం, రష్యా దగ్గర 5,580, ఫ్రాన్స్ దగ్గర 290, చైనా దగ్గర 500, బ్రిటన్ దగ్గర 225, భారత్ దగ్గర 172 అణ్వాయుధాలు ఉన్నాయి. పాకిస్తాన్, ఉత్తర కొరియా, ఇజ్రాయెల్ కూడా అణుసంపత్తిని కలిగి ఉన్నాయి. పైగా ఈ దేశాలన్నీ తమ అణ్వాయుధాలను పెంచుకోవడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాయి. చైనా దగ్గర గతేడాది 410 ఉండగా, ఇప్పుడది 500కు చేరింది. యుద్ధాల కారణంగా ప్రపంచ దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరగడం, రాజకీయ దౌత్య సంబంధాలు క్షీణిస్తున్న నేపథ్యంలో అణ్వస్త్రాల పాత్ర ప్రముఖంగా మారిందని 'సిప్రి' రిపోర్ట్ పేర్కొన్నది.

అణ్వాయుధాలతో పాటు ఆయుధాలు కూడా ప్రపంచ శాంతికి విఘాతం కలిగించేవే. ప్రపంచంలో ఆయుధాలు ఎగుమతి చేస్తున్న దేశాలలో అమెరికా అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఇక ఆయుధాలను దిగుమతి చేసుకుంటున్న దేశాలలో భారత్ మొదటి స్థానంలో ఉన్నది. భారత్ అతిపెద్ద ఆయుధ సరఫరాదారుగా రష్యా కొనసాగుతున్నది. భారత దిగుమతులలో రష్యా వాటా 36 శాతం. ఆయుధాల దిగుమతుల్లో మొదటి ఐదు స్థానాల్లో ఇండియా, సౌదీ అరేబియా, ఖతార్, ఉక్రెయిన్, పాకిస్తాన్ ఉన్నాయి. రష్యా–ఉక్రెయిన్, ఇజ్రాయిల్–పాలస్తీనా యుద్ధాలు కొనసాగుతున్న వేళ అణ్వాయుధాల భయం మళ్లీ పెరిగింది. ఆయా దేశాలు రక్షణ పేరుతో ఆయుధాలు పెంచుకుంటూ పోవడం ఆయుధ పోటీకి దారి తీస్తున్నది.

– నర్సింగు కోటయ్య, మిర్యాలగూడ
(హిరోషిమాపై అణుదాడికి నేటితో 80 ఏళ్లు)

బాట మార్చుకున్న మానవతావాది


సందర్భం



బి.ఎస్. రాములు

దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక శాంతియుత పరివర్తన రావాల్సింది పోయి, ఎక్కడికక్కడ ఉద్యమాలు తలెత్తాయి. కేంద్రం, రాష్ట్రాల నుండి బ్రిటిష్ పాలకులు వైదొలిగారు. కానీ గ్రామీణ వ్యవస్థలు మారలేదు. భూమిపై ఉన్న హక్కులు రద్దు కాలేదు. దాంతో భూస్వాముల వర్గం అన్ని రంగాల్లోనూ ఎదుగుతూ వచ్చింది. అంబేడ్కర్ భూమిని జాతీయం చేయాలన్నారు. ప్రజాస్వామ్యం ద్వారా సోషలిజాన్ని బహుళ పార్టీ వ్యవస్థలో సాధించడం ఎలాగో రోడ్ మ్యాప్ వేశారు. కానీ అది జరగలేదు. పర్యవసానంగా ప్రజలు భూమి కోసం ఉద్యమ బాట పట్టారు. ప్రభుత్వాలు సమస్యను పరిష్కరించే బదులు బల ప్రయోగంతో అణిచి వేయాలని చూశాయి.

రాజ్యాంగం మహోన్నత లక్ష్యాలతో రాయబడింది గానీ ప్రజలకు దాన్ని అందించలేదు, వివరించలేదు, చదివించలేదు. ఏదో రష్యాలో, చైనాలో గొప్పగా వుందట అని చెపితే జనం నమ్మారు. మార్క్సిజం సిద్ధాంతాలు చెప్తే బాగుందనుకున్నారు. ఆదర్శ సమాజం అనే భావన ఆకర్షించింది. ఆ బాటలో సాగిన గద్దర్ తన ప్రత్యేకతను చాటుకున్నాడు. అంటరాని కులంలో పుట్టి, ప్రభుత్వ హాస్టల్లో ఉండి చదివి, బ్యాంకులో ఉద్యోగం చేసి, తాను నమ్మిన కళ కోసం, సాంస్కృతిక విప్లవం కోసం ఉద్యోగాన్ని వదిలి, దిగంతాలకు ఎదిగిన మహా కళాకారుడయ్యాడు. అరుదైన గాయకుడిగా, ప్రజా కవిగా విప్లవోద్యమానికి ఊపిరులు ఊదాడు. ప్రజా వాగ్గేయ కారుడిగా విశ్వ వ్యాప్తం అవుతూ వచ్చాడు. గద్దర్ ఆట, పాట, కాలి అందెల సవ్వడి జనాన్ని ఉర్రూతలూగించి వేలాదిమంది యువకులను ఉద్యమాల బాట పట్టించింది. భారతదేశ చరిత్రలో ఒక గొప్ప విప్లవోద్యమానికి ఊపిరులు ఊదిన గద్దర్ ఫలితాలు రాక, విస్తరణ కోల్పోయిన ఉద్యమ దశను కళ్లారా చూశాడు. ఆశలు అడియాసలై, ఆత్మావలోకం చేసుకొని ఉద్యమకారులు అజ్ఞాతంలో ఉండి సాధించేది శూన్యం అని గుర్తెరిగి ప్రజాస్వామ్యం వైపు పరివర్తన చెందాడు.



గద్దర్

అనుభవం నేర్పిన పాఠాలతో ఉద్యమాల బాట సాధించేది ఏమీలేదనీ, ప్రజాస్వామ్య బాటనే భేష్ అనీ భారత రాజ్యాంగాన్ని ఆలస్యంగా అధ్యయనం చేయడం ప్రారంభించాడు. అప్పటికి జరగరాని నష్టం జరిగిపోయింది. వేలాది మంది యువకులు నేలకొరిగారు. నడిచిన దారి తప్పు అని చెప్తే ఒక బాధ, చెప్పకపోతే ఇంకొక బాధ. ఈ రెండింటి మధ్య గద్దర్ చాలాకాలం నలిగి పోయాడు. ఈలోపు మలి తెలంగాణ ఉద్యమం రాజు కోవడంతో ఉవ్వెత్తున లేచాడు. చంద్రబాబు ప్రభుత్వ కాలంలో గద్దర్‌పై కాల్పులు జరిగాయి. 6 తూటాలు దిగాయి. అయినా తెలంగాణ కోసమే బతికినట్టయింది.


ఆ మధ్య ఒక విలేఖరి ఇలా ప్రశ్నించాడు: "మీరు భారత రాజ్యాంగం, దాని మౌలిక లక్ష్యాలు చదవకుండా, రాజ్యాంగ ఆచరణతో సమాజంలో, జీవితాల్లో వచ్చిన మార్పులు పరిశీలించకుండా మార్క్సిజం, మావోయిజం కరెక్టు అని ఎలా అనుకున్నారు? సాయుధ విప్లవంలో ఎందుకు చేరారు?" "రాజ్యాంగంలో ఎన్నో గొప్ప విషయాలు ఉన్నాయని మాకెవరూ చెప్పలేదు. సోషలిజం సాయుధ పోరాటంతోనే వస్తుందనుకున్నాం. భారత రాజ్యాంగం చదవకుండా విప్లవం చేయాలనుకోవడం తప్పే. సోషలిస్టు రష్యాలో, పీపుల్స్ చైనాలో ప్రజల హక్కులు, ప్రభుత్వ నిర్వహణ, న్యాయ వ్యవస్థ ఎలా ఉన్నాయో తెలుసుకోకుండా విప్లవం చేయాలనుకోవడం పొరపాటే. అందుకే ఇపుడు భారత రాజ్యాంగ మౌలిక లక్ష్యాల సాధన, రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజలను చైతన్యవంతం చేస్తున్నాం" అని చెప్పాను.

గద్దర్ ఆశయం ప్రజాస్వామ్య సోషలిజం సాధన. బౌద్ధం, అంబేద్కరిజం, భారత రాజ్యాంగ మౌలిక లక్ష్యాల సాధన అంతిమ లక్ష్యం. అంటరానితనం, అసమానతలు, దోపిడీ, మనిషి పై మనిషి ఆధిపత్యం చేసే సంస్కృతి పోవడం గద్దర్‌తో పాటు మన లక్ష్యం కూడా కావాలి. అదే గద్దర్‌కు నిజమైన నివాళి.

వ్యాసకర్త తెలంగాణ బీసీ కమిషన్ తొలి ఛైర్మన్
(నేడు గద్దర్ తొలి వర్ధంతి)

కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే!

అభిప్రాయం




సంగిరెడ్డి హనుమంత రెడ్డి

ప్రజాసంక్షేమం, దేశ భవిష్యత్తుకు కృషిచేయడం రాజనీతిజ్ఞత. స్వలాభం, ఎన్నికల్లో గెలుపు, తరతరాల సంపాదన కోసం గడ్డితినడం రాజకీయం. స్వార్థానికి మనుషులను శవాలుగా మార్చడం కార్పొరేట్ల లక్షణం. అమెరికాలో బహుళజాతి, ఆయుధ సంస్థల పక్షపాతులే అధికారంలో ఉంటారు. ఏ పార్టీ కుర్చీనెక్కినా ఈ సంస్థల ప్రయోజనాలే వాటి లక్ష్యం.

నెహ్రూ కాలు నాటి స్వదేశీ సంస్థలు సహకరించలేదు. పరిశ్రమలను ప్రభుత్వమే స్థాపించి నిర్వహించమన్నాయి. పరిశ్రమలకు నీరు, విద్యుత్తు, రోడ్లు, అనువైన భూమి వంటి మౌలిక వసతుల లేమి వాటి ఆలోచనకు కారణం. ప్రభుత్వం వీటిని కల్పించాక మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో ప్రవేశించాయి. లాభాలివ్వని విద్య, వైద్యం, గ్రంథాలయ, సాహిత్య, సాంస్కృతిక సంస్థలను ప్రభుత్వమే స్థాపించింది. ఇందిరా గాంధీ ఆధిక్యత కోల్పోయిన నేపథ్యంలో... వామపక్షాల ప్రోద్బలంతో బ్యాంకుల జాతీయీకరణ, రాజభరణాల రద్దు చేశారు. వాజపేయి వర్గం వీటిని విరోధించింది. న్యాయస్థానంలో సవాలు చేసింది. చట్టంతో ఇందిర వీటిని అమలు చేశారు. తర్వాత ప్రభుత్వం, కార్పొరేట్లు సహకరించుకున్నాయి. తమకు అనుకూలంగా ఉండమని ప్రభుత్వాలను, ప్రజా ప్రతినిధులను కార్పొరేట్లు ప్రలోభ పెట్టేవి. తర్వాత తమ తాబేదారులు ప్రజా ప్రతినిధులుగా ఎన్నికయేట్లు చేసేవి. క్రమేపీ తామే శాసన నిర్మాతలై అనుకూల చట్టాలు చేయించి, లాభాలను పెంచుకునేవారు. కాంగ్రెస్ క్రమేపీ తగ్గింది. మిశ్రమ ప్రభుత్వాలు వచ్చాయి. పాలక, ప్రతిపక్షాలను తృప్తి పరచడానికి కార్పొరేట్ల ఖర్చు పెరిగింది. వాజపేయి సర్కారు కొంత ఫలితాలనిచ్చింది. కానీ అప్పటి అవినీతి యూపీఏ హయాంలో పెరిగింది.

గుజరాత్‌లో కార్పొరేట్లకు అపరిమిత లాభాలు కట్టబెట్టిన మోదీ బీజేపీ ప్రధాని అభ్యర్థి కావడంలో కార్పొరేట్లు నెగ్గారు. బదులుగా అనేక రూపాల్లో మోదీ సాయం కార్పొరేట్లకు కొనసాగుతోంది. 2024 ఎన్నికల ఫలితాలు మోదీకి హెచ్చరికన్న భావన భ్రమే. మోదీ ఏ ప్రభుత్వాన్ని నడిపినా కార్పొరేట్లకు సహకారం, పరస్పర ప్రయోజన సూత్ర పాలన కొనసాగుతాయి. బీజేపీ మిత్ర పక్షాల భావజాలం మోదీయానికి భిన్నం కాదు. వారికీ కార్పొరేట్ల ప్రయోజనాల్లోనే లాభాలున్నాయి. అందుకే మోదీ ఆశ్రిత పక్షపాతాలు వారికీ అనుకూలమే, అవసరమే, ఆమోదమే.

ప్రాంతీయ పార్టీల పాలిత రాష్ట్రాల్లో గెలుపోటములపై విభిన్న విశ్లేషణలు జరిగాయి. ఆంధ్ర ఫలితాల కారణం వేరు. గత రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో దలారీలకు, కార్పొరేట్లకు, వారి ప్రతినిధులకు మేళ్ళు లేవు. ప్రజలకు ప్రయోజనాలు సమయానికి ఇళ్ళకే చేరేవి. పాత పాలక పార్టీపై కార్పొరేట్లకు కోపమొచ్చింది. విచిత్ర ప్రచారాలతో ఓటర్ల సమీకరణకు, ప్రజాభిప్రాయ నిర్మాణానికి కసితో పనిచేశాయి.



గెలుపు మీద నమ్మకం లేక, వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రతిపక్షాలు మతోన్మాద పార్టీతో కూటమి కట్టాయి. కార్పొరేట్ల అండ లేని పార్టీ కంటే కార్పొరేట్ల కేంద్ర పాలక పార్టీ పొత్తే ప్రయోజనమని కార్పొరేట్ల ప్రతినిధులు ప్రచారం చేశారు.

కొత్త పాలకులు కేంద్ర ప్రభుత్వ ప్రమేయం లేకుండా అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు చేసుకున్న చారిత్రీకులు. ముఖ్యమంత్రిగా కాక ముఖ్య కార్యనిర్వాహకాధికారిగా వ్యవహరించిన వారు. అమరావతిలో 50 లక్షల జనాభా కూడుతుందని దానికి 52 వేల ఎకరాల సారవంతమైన నీటి వసతి గల వ్యవసాయ భూమిని సేకరించారు. సామాన్యుడు రాజధానిలో ఇంటి స్థలం కొనలేదు, ఇళ్ళు కట్టలేదు, అద్దెకుండలేదు.

కార్పొరేట్లు తమ మిత్రత్రయాన్ని గెలిపించాయి. ఈ త్రయం మోదీయానికి బేషరతు మద్దతిచ్చింది. రాష్ట్ర విభజన చట్టంలోని కేంద్ర పథకం పోలవరాన్ని, నిర్వాసితుల పునరావాసంతో సహా పూర్తిచేయాలనీ, వారే వాగ్దానమిచ్చిన రాజధానిని నిర్మించమనీ, పదేళ్ళ ప్రత్యేక హోదా ఇమ్మనీ మోదీ గ్యారంటీని మాత్రం అడగలేదు!

వ్యాసకర్త ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి । 94902 04545

గ్రహం అనుగ్రహం శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, **తిథి:** శు.విదియ సా.6.08 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** మఖ సా.5.17 వరకు , తదుపరి పుబ్బ, **వర్జ్యం:** రా.2.02 నుండి 3.47 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.16 నుండి 9.07 వరకు, తదుపరి రా.10.57 నుండి 11.41 వరకు, **అమృతఘడియలు:** ప.2.43 నుండి 4.22 వరకు, మంగళ గౌరీ వ్రతం; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.43, **సూర్యాస్తమయం:** 6.28.

క్లుప్తంగా...

సత్యదేవుని దేవేరికి వజ్రకిరీటం సమర్పణ

నేడు సత్యదేవుని జయంత్యుత్సవం సందర్భంగా అమ్మవారికి అలంకరణ



అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరంలో రత్నగిరిపై కొలువైన శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రముఖ దాత, పెద్దాపురం శ్రీలలితా రైస్ ఇండస్ట్రీస్ అధినేతల్లో ఒకరైన మట్టే సత్యప్రసాద్ రూ.1.50 కోట్లతో చేయించిన వజ్ర కిరీటాన్ని సోమవారం సమర్పించారు. సత్యదేవుని 134వ ఆవిర్భావ దినోత్సవం (జయంత్యుత్సవం) ప్రారంభం సందర్భంగా ఈ కిరీటాన్ని ఆయన దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈవో కె.రామచంద్ర మోహన్‌లకు స్వామి సన్నిధిలో అందజేశారు. సత్యదేవుని జయంతి సందర్భంగా మంగళవారం తెల్లవారుజామున జరిగే స్వామివారి మహన్యాస పూర్వక రుద్రాభిషేకంలో ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారికి వజ్రకిరీటాన్ని అలంకరిస్తారని అధికారులు తెలిపారు.

శ్రీశైలంలో శ్రావణ మాసోత్సవాలు ప్రారంభం



శ్రీశైలం టెంపుల్: శ్రీశైలంలోని శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో శ్రావణ మాసోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. వేకువజాము నుంచే భక్తులు భారీగా తరలివచ్చి పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని శ్రావణ శని, ఆది, సోమవారాలు, స్వాతంత్ర్య దినోత్సవం, వరలక్ష్మీ వ్రతం, శ్రావణ పౌర్ణమి తదితర రోజుల్లో (మొత్తం 16 రోజుల పాటు) గర్భాలయ అభిషేకాలు, సామూహిక అభిషేకాలు, ఆర్జిత కుంకుమార్చనలు పూర్తిగా నిలుపుదల చేశారు. భక్తులకు అన్నప్రసాద వితరణ భవనంలో అన్నప్రసాదం అందించారు.

టీటీడీ నిర్లక్ష్యంపై భక్తుల ఆందోళన


రాత్రి 9.30 అయినా బ్రేక్ దర్శనాల సమాచారం లేదంటూ ధర్నా



సాక్షి టాస్క్‌ఫోర్స్: టీటీడీ అధికారుల నిర్లక్ష్యంపై భక్తులు సోమవారం రాత్రి ఆందోళనబాట పట్టారు. రాత్రి 9.30 గంటలవుతున్నా బ్రేక్ దర్శనాలకు సంబంధించి ఎటువంటి సమాచారం రాలేదంటూ తిరుమలలో ధర్నా చేపట్టారు. బ్రేక్ దర్శనం కోసం భక్తులు సోమవారం ఉదయం ఎంపీ, ఎమ్మెల్యేల సిఫారసు లేఖలు సమర్పించారు. ఆ లేఖలకు సంబంధించి బ్రేక్ దర్శనాలు ఖరారయ్యాయా? లేదా? అనే విషయం అదే రోజు రాత్రి 8.30 గంటలలోపు భక్తుల మొబైల్ ఫోన్లకు టీటీడీ నుంచి సమాచారం వస్తుంది. అయితే.. సోమవారం రాత్రి 9.30 గంటలైనా బ్రేక్ దర్శనాలకు సంబంధించి ఎటువంటి సమాచారం రాకపోవడంతో భక్తులు టీటీడీ అధికారులకు ఫోన్లు చేశారు. విధుల్లో ఉన్న అధికారులను అడిగారు. రాత్రి 7.30 గంటలకే సమాచారం ఇచ్చేశామని చెప్పటంతో తమకు బ్రేక్ దర్శనం ఉందా? లేదా? అనే సమాచారం రాలేదని అధికారులను నిలదీశారు. అధికారులు నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వటంతో 'డౌన్ డౌన్ ఈవో' అంటూ నినాదాలు చేశారు. అయితే టీటీడీ ఉద్యోగులు డబ్బులు తీసుకుని ఇద్దరిని లోనికి పంపడం చూసిన భక్తులు నిలదీశారు. ఈ విషయాన్ని భక్తులు టీటీడీ అదనపు ఈవోకు ఫిర్యాదు చేశారు.

గత ప్రభుత్వం పెట్టిన కార్పొరేషన్‌లను కొనసాగించాలి

సీఎం చంద్రబాబుకు కేవీపీఎస్ లేఖ



సాక్షి, అమరావతి: గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన మాల, మాదిగ, రెల్లి కార్పొరేషన్‌లను కొనసాగించి వాటి పరిధిలోని 59 ఉప కులాల అభివృద్ధికి తగిన నిధులు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు పలు డిమాండ్లపై సీఎం చంద్రబాబుకు రాసిన లేఖను కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి సోమవారం మీడియాకు విడుదల చేశారు. ఎస్సీల్లోని 59 కులాల కాలనీలు అభివృద్ధి చేయాలని, ప్రత్యేక నిధులతో భూములు కొనివ్వాలని, శ్మశాన సమస్యల పరిష్కారం కోసం తెచ్చిన జీవో 1235 అమలు కోసం నిధులు కేటాయించాలని, డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలనే ఏడు ప్రధాన డిమాండ్లపై సీఎంకు లేఖ రాశారు.

ఆరోగ్య 'మిత్రు'లకూ అన్యాయమే!

ఆరోగ్యశ్రీ స్థానంలో బీమా విధానానికి కూటమి ప్రభుత్వం చర్యలు

- బీమా విధానం వస్తే పథకం దళారుల చేతుల్లోకి
- ఆందోళనలో ఆరోగ్యమిత్రలు, ట్రస్ట్ ఉద్యోగులు
- తమ ఉద్యోగాలకు భద్రత ఉండదని ఆవేదన
- రాష్ట్ర వ్యాప్తంగా 2,600 మందికి పైగా ఉద్యోగులు
- మిత్రలు, టీం లీడర్లకు వేతనాలు పెంచి భరోసానిచ్చిన గత ప్రభుత్వం
- ఇప్పుడు వారి జీవితాలను అంధకారంలోకి నెడుతున్న కూటమి



సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా పేదలకు సేవలందించిన వలంటీర్లకు మొండిచేయి చూపించిన కూటమి ప్రభుత్వం.. ఇప్పుడు పేద రోగులకు అండదండగా నిలిచే 'ఆరోగ్య మిత్ర'లకూ అన్యాయాన్ని తలపెట్టే దిశగా సాగుతోంది. ఇప్పటివరకు పేద రోగులకు అత్యాధునిక వైద్యాన్ని అందిస్తున్న ఆరోగ్య శ్రీ పథకం స్థానంలో బీమా విధానాన్ని ప్రవేశపెట్టడానికి చంద్రబాబు ప్రభుత్వం ప్రయత్నిస్తుండటంతో ఆరోగ్య మిత్రలు, ఆరోగ్య శ్రీ ట్రస్టు సిబ్బందిలో ఆందోళన మొదలైంది. బీమా రూపంలో దళారి వ్యవస్థ వస్తే తమ ఉద్యోగాలకు భద్రత ఉండదని ఆరోగ్య మిత్రలు, టీం లీడర్లు, ఇతర ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటివరకూ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వమే ఆరోగ్య శ్రీ పథకాన్ని నిర్వహిస్తోంది. పేద, మధ్యతరగతి ప్రజలకు ఆరోగ్యశ్రీ పథకం సేవలను అందించడంలో ఆరోగ్య మిత్ర పాత్ర ఎంతో కీలకం. జబ్బుల బారిన పడిన వారు. ప్రమాదాల్లో గాయపడి ఆస్పత్రులకు వచ్చిన వారికి పథకం కింద ఉచిత వైద్య సేవలు అందించి, వారు కోలుకుని చిరునవ్వుతో ఇంటికి తిరిగి వెళ్లే వరకు ఆరోగ్య మిత్రలు, టీం లీడర్లు వారికి వెన్నంటి ఉంటారు. ఈ పథక అమలుకు రాష్ట్రవ్యాప్తంగా 2,600 మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. 2012 మంది ఆరోగ్య మిత్రలు, 101 మంది టీం లీడర్లు, జిల్లా కార్యాలయాలు, ట్రస్ట్‌లో 500 మంది వరకు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పేద, మధ్య తరగతి ప్రజల సేవలో నిమగ్నమై ఉన్నారు. నెలన్నర క్రితం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆరోగ్య శ్రీ స్థానంలో బీమా విధానం ప్రవేశపెడతామంటూ చేసిన ప్రకటన ఈ చిరుద్యోగులను కలవరపాటుకు గురిచేస్తోంది. డిగ్రీ, పీజీ, బీఎస్సీ నర్సింగ్, బీఫార్మసీ వంటి ఉన్నత చదువులు చదివి 16 ఏళ్ల నుంచి వీరంతా ఆరోగ్య శ్రీ పథకం అమలులో భాగస్వాములై ఉన్నారు. కొత్తగా తమను ప్రభుత్వ ఆధ్వర్యంలో కాకుండా బీమా సంస్థకు అప్పజెబితే ఆ సంస్థ లాభాపేక్షతో ఉద్యోగాల్లో కోత పెడుతుందని, అప్పుడు తమ పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను ప్రభుత్వంలోనే కొనసాగించాలని కోరుతున్నారు.

భరోసానిచ్చిన గత ప్రభుత్వం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆరోగ్య శ్రీలో విప్లవాత్మక సంస్కరణలతో పథకాన్ని బలోపేతం చేసింది. ప్రొసీజర్‌లు, వైద్య సేవల ఖర్చుల పరిమితి, నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఖ్యను పెంచడమే కాకుండా కీలకమైన ఆరోగ్య మిత్రలు, టీం లీడర్ల వేతనాలను పెంచి, వారికి భరోసా కల్పించింది. 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వంలో మిత్రలకు రూ.6 వేలు, టీం లీడర్లకు రూ.10,600 చొప్పున వేతనాలు ఉండేవి. వైఎస్ జగన్ ప్రభుత్వం రాగానే 2019 నవంబర్‌లో మిత్రల వేతనాలను రూ.12 వేలకు, టీం లీడర్ల వేతనాలను రూ.15 వేల వరకు పెంచింది. ఇప్పుడు చంద్రబాబు మరోసారి సీఎం కావడంతో వీరి ఉద్యోగాలకే ఎసరు వచ్చింది. ఆరోగ్య శ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసి, పేదల సేవలో ఉన్న మిత్రలు, ఇతర సిబ్బంది భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ప్రయత్నం జరుగుతోంది.

ఆరోగ్య మిత్రల ముఖ్యమైన విధులు

- నెట్‌వర్క్ ఆస్పత్రిలో సేవా కేంద్రం నిర్వహణ
- రోగి ధ్రువపత్రాల పరిశీలన, అనంతరం రోగిని ఆస్పత్రిలో చేర్చడం
- రోగికి అవసరమైన చికిత్సల వివరాలతో కూడిన ప్రతిపాదనను ట్రస్ట్‌కు పంపడం. వాటికి ఆమోదం వచ్చాక, చికిత్సలు అందేలా సమన్వయపరచడం.
- వైద్య సేవలు పొందడంలో రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవడం
- చికిత్స అనంతరం డిశ్చార్జి అయి ఇంటికి వెళ్లే రోగి నుంచి వైద్య సేవలపై అభిప్రాయసేకరణ చేయడం
- 10 రోజులకు సరిపడా మందులను ఉచితంగా అందించడం
- విశ్రాంతి సమయంలో భృతి కోసం ఆరోగ్య ఆసరా నగదును రోగి/కుటుంబ సభ్యుడి బ్యాంక్ ఖాతాలో ప్రభుత్వం జమ చేయడానికి వీలుగా ప్రతిపాదనలు పంపడం

ఉద్యోగ భద్రత కల్పించాలి

బీమా విధానంలో ఆరోగ్య శ్రీ పథకాన్ని అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. 16 ఏళ్లుగా ఈ పథకం కింద సేవలు అందిస్తున్నాం. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నిర్దేశించిన అర్హతలు, నియమ నిబంధనలకు లోబడి మేం నియమితులమయ్యాం. ప్రభుత్వం మాకు ఉద్యోగ భద్రత కల్పించాలి. బీమా విధానం అమలు చేసినప్పటికీ మమ్మల్ని ప్రభుత్వం పరిధిలోనే కొనసాగించి రెగ్యులర్ చేయాలి.

– సీహెచ్ గోవింద్, రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ వైద్య మిత్రా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్

'సెల్ ఫోన్'తో సొల్లు కథ

మంత్రి అనగాని సత్యప్రసాద్, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో ఆ పార్టీ నేతల పేకాట, కోడి పందేల కేంద్రాల వ్యవహారాన్ని మరుగున పరిచేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, ఇతర టీడీపీ నేతలు ప్రయత్నిస్తున్నారన్న విషయం విస్పష్టంగా బయటపడింది. చిన్న లాజిక్ మిస్సయిన టీడీపీ నేతలు అడ్డంగా దొరికిపోయారు.

– సాక్షి ప్రతినిధి, బాపట్ల

- భట్టిప్రోలు గొడవను మరుగున పెట్టేందుకు టీడీపీ నేతల యత్నాలు
- టీడీపీ నేతలను నిలువరించిన పోలీసులపై దౌర్జన్యం
- ఎస్సై చొక్కా పట్టుకొన్న వీడియో బయట పెట్టింది టీడీపీ నేతలే
- ఆ వీడియోలో స్పష్టంగా కనిపించిన వారిద్దరి పెనుగులాట
- దానిని మరుగున పెట్టేందుకు బాబు, లోకేశ్ సెల్‌ఫోన్ కథ
- దాని మాటున సాక్షి, వైఎస్సార్‌సీపీపై అక్కసు
- కింద పడ్డ సెల్‌ఫోన్ తీయాలంటే ఎస్సై చొక్కా పట్టుకోవాలా?
- ఇక్కడే దొరికిపోయిన సీఎం బాబు, లోకేశ్, ఇతర నేతలు

నగరం మండలం వెలమవారిపాలెంలో ఇటీవల ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి పేకాట కేంద్రంలో రోజుకు కోట్లలో ఆట ఆడిస్తున్నారు. ఈ ఒక్క కేంద్రం నుంచే స్థానిక టీడీపీ నేతకు నెలకు రూ. 60 లక్షలు ఇచ్చేలా ఒప్పందం కుదిరింది. దీనిని స్థానిక పోలీసుల సహకారంతో నడిపిస్తున్నారు. ఈ కేంద్రాల బారిన పడి వందలాది మంది ఆర్థికంగా చితికిపోతున్న విషయాన్ని వైఎస్సార్‌సీపీ నేత వరికూటి అశోక్‌బాబు బయటపెట్టడంతో టీడీపీ నేతలు బహిరంగ సవాళ్లు విసిరారు. పోలీసులు అశోక్‌బాబును గృహ నిర్బంధం చేయగా, టీడీపీ నేత సాయిబాబు, ఆయన అనుచరులు భట్టిప్రోలులో టీడీపీ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున చేరారు. వారిని నిలువరించే సందర్భంలోనే పోలీసులపై టీడీపీ కార్యకర్తలు దౌర్జన్యానికి దిగారు. నగరం ఎస్సైని టీడీపీ కార్యకర్త చొక్కా పట్టుకొని నెట్టిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది. దీంతో ఉలిక్కిపడిన అధికార పార్టీ నేతలు దాని నుంచి తప్పించుకునేందుకు అది ఫేక్ అంటూ ఓ సెల్ ఫోన్ కథ అల్లారు. వాస్తవంగా ఈ ఘర్షణను వీడియో తీసింది టీడీపీ నేతలే. గొప్ప కోసం వారు సోషల్ మీడియా గ్రూపుల్లో పెట్టుకున్నారు. టీడీపీ కార్యకర్త నగరం ఎస్ఐ చొక్కా పట్టుకోవడం, వారిద్దరి పెనుగులాట వాటిలో స్పష్టంగా ఉంది. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఇతర టీడీపీ నేతలు మాత్రం ఆ వీడియోను ఎడిట్ చేసి, కొత్త కథ అల్లారు. సెల్ ఫోను కిందపడితే టీడీపీ కార్యకర్త తీసి ఇవ్వబోయాడంటూ కట్టుకథ అల్లారు. కలెక్టర్ల సమావేశంలోనూ సీఎం చంద్రబాబు ఎడిట్ చేసిన వీడియో క్లిప్‌ను చూపించి సాక్షి మీడియా, ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీపై బురద జల్లే ప్రయత్నం చేశారు. సెల్ కిందపడితే కిందికి వంగి తీసివ్వాలి తప్ప ఎస్సైతో పెనుగులాడాల్సిన అవసరం ఏముందన్న వాస్తవాన్ని వారు మరిచారు. పైగా, నలుగురు పోలీసుల మధ్య నుంచి టీడీపీ కార్యకర్త దూరి మరీ ఎస్సై చొక్కా పట్టుకొన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. వీటన్నింటినీ మరుగునపెట్టి, పేకాట, కోడిపందాల వ్యవహారాన్ని తొక్కి పెట్టేందుకే చంద్రబాబు, లోకేశ్ కొత్త డ్రామాకు తెరలేపినట్లు టీడీపీ వారి వీడియోలను పరిశీలిస్తే స్పష్టంగా అర్థమవుతుంది.



ఎస్ఐ చొక్కా పట్టుకున్న టీడీపీ కార్యకర్త (ఫైల్)

సుముహూర్తాల 'శ్రావణం'!



పామర్రు: గత మూడు నెలలుగా వివాహాలకు ముహూర్తాల్లేక ఇబ్బంది పడుతున్న తల్లిదండ్రులు, యువతీయువకులకు శ్రావణ మాసం 'శుభ' ఘడియలు తెచ్చింది. ఇప్పటి వరకు ఆషాఢం, శూన్య మాసాల నేపథ్యంలో ముహూర్తాల్లేక వివాహాది కార్యక్రమాలు నిలిచిపోయాయి. సోమవారం నుంచి శ్రావణమాసం ప్రారంభమవడంతో పెళ్లిళ్ల బాజాలు మోగనున్నాయి. ఈ నెల 7వ తేదీ నుంచి 28 వరకు మంచి ముహూర్తాలున్నాయి. దీంతో పెళ్లి సందడి మొదలైంది. ఈ శ్రావణ మాసంలో 7, 8, 9, 10, 11, 15, 17, 18, 22, 23, 24, 28 తేదీలు వివాహాలకు, గృహ ప్రవేశాలకు మంచి ముహూర్తాలు కాగా, 17, 18 తేదీలు అత్యంత శుభ ముహూర్తాలని పురోహితుడు భేతనభొట్ల ఫణికుమార్‌శర్మ తెలిపారు. దీంతో చాలా రోజుల తర్వాత కల్యాణ మండపాలు కళకళలాడనున్నాయి. చాలా మందికి చేతి నిండా పని దొరకనుంది. పురోహితులు, భజంత్రీలు, పూల అలంకరణలు, ట్రావెల్స్, షామియానాలు, క్యాటరింగ్, బ్యూటీషియన్లు, డీజేలతో పాటు కూలీలకు మంచి డిమాండ్ పలకనుంది.

హంద్రీ-నీవా కాలువకు గండి

కర్నూలు జిల్లాలో నీట మునిగిన 150 ఎకరాలు • దెబ్బతిన్న కంది, పత్తి, కొర్ర పంటలు



హంద్రీ-నీవా కాలువకు పడిన గండి

వెల్దుర్తి(కృష్ణగిరి): హంద్రీ-నీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం ప్రధాన కాలువకు 58 కిలోమీటరు వద్ద గండి పడింది. దీనివల్ల దాదాపు 150 ఎకరాలు ముంపునకు గురయ్యాయి. కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం పరిధిలోని మల్లెపల్లె పంపింగ్ స్టేషన్-3 వద్ద నుంచి హంద్రీ-నీవా ప్రధాన కాలువలోకి ఆదివారం నీటిని విడుదల చేశారు. అదేరోజు రాత్రి పంపింగ్ స్టేషన్‌కు 200 మీటర్ల దూరంలో కుడి వైపున కరకట్ట కింద చిన్న రంధ్రం ఏర్పడి నీరు లీకవడం మొదలైంది. సోమవారం ఉదయానికి ఆ రంధ్రం పెరిగి గండిగా మారిపోయింది. రైతులు, లస్కర్లు అందించిన సమాచారం మేరకు హంద్రీ-నీవా సుజల స్రవంతి ఎత్తిపోతల సీఈ నాగరాజు, డీఈ హరిప్రసాద్, ఏఈ నాగేశం, సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. అప్పటికే కరకట్ట ఏడు మీటర్ల మేర కోసుకుపోయి పెద్ద ఎత్తున నీరు పంట పొలాల్లోకి వెళుతోంది. దీంతో కాలువలోకి నీటి విడుదలను నిలిపివేసి గండిని పూడ్చే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. కాలువకు గండి పడటం వల్ల వెల్దుర్తి మండలం మల్లెపల్లె, కల్లూరు మండలం కొంగనపాడు, కోడుమూరు మండలం లద్దగిరి పరిధిలోని రైతులకు చెందిన దాదాపు 150 ఎకరాల్లో పత్తి, కంది, కొర్ర తదితరలు పంటలు నీటి మునిగాయి. రెండు రోజుల్లో గండిని పూడ్చివేస్తామని సీఈ నాగరాజు తెలిపారు.



పొలాలను ముంచెత్తుతున్న నీరు

ఐదు ఎకరాల్లో పంట నీట మునిగింది



హంద్రీ-నీవా కాలువకు గండి పడడంతో నీరుపారి నేను ఖరీఫ్‌లో సాగు చేసిన 2.5 ఎకరాల పత్తి, 2.5 ఎకరాల కొర్ర పంటను ముంచేసింది. మోకాళ్ల లోతులో నీళ్లు చేరడంతో రెండు నెలల పంట పూర్తిగా దెబ్బతిన్నది. రూ.లక్షల్లో నష్టం వచ్చినట్లే. ప్రభుత్వం ఆదుకోవాలి. అధికారులు కరకట్ట వెంట సిమెంట్ లైనింగ్ పనులు చేసి, గండ్లు పడకుండా చూడాలి. – జి.పురుషోత్తం, రైతు, మల్లెపల్లె, వెల్దుర్తి మండలం

టీడీపీకి సీనియర్ నాయకుడు గుడ్‌బై!

- ఇక మీ సేవలు అవసరం లేదని అవమానించిన తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి
- మనస్తాపంతో రాజీనామా చేసిన రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యేశ్వరరావు



సుబ్రహ్మణ్యేశ్వరరావు

విస్సన్నపేట(తిరువూరు): ఎన్టీఆర్ జిల్లా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సొంత పార్టీ నేతలనే టార్గెట్ చేశారు. సీనియర్ నాయకులను బలవంతంగా పార్టీ నుంచి బయటకు పంపేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో విస్సన్నపేట మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, ఆ పార్టీ అనుబంధ రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన్ జాతీయ అధ్యక్షుడు జి.సుబ్రహ్మణ్యేశ్వరరావు (బుడ్డయ్య)కు శుక్రవారం ఫోన్ చేసి 'మీ సేవలు పార్టీకి అక్కర్లేదు. మీరు ఇంట్లో పడుకోవచ్చు' అంటూ వ్యంగ్యంగా మాట్లాడారు. దీంతో మనస్తాపం చెందిన బుడ్డయ్య 'నా అవసరం పార్టీకి లేనప్పుడు రాజీనామా చేయడం మంచిదని భావిస్తున్నా' అని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీనికి కౌంటర్‌గా 'బుడ్డోడికి బుజ్జగింపులుండవు.. చెడ్డోడికి చాన్సులుండవు.. థట్సాల్' అంటూ ఎమ్మెల్యే కొలికపూడి శనివారం ఓ పోస్ట్ పెట్టారు. దీంతో బుడ్డయ్యకు జరిగిన అవమానాన్ని తమకు జరిగినట్లు భావించిన గ్రామంలోని పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆయన ఇంటికి చేరుకుని తాము కూడా పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తామని ప్రకటించారు. వారికి మండల నాయకులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ససేమిరా అంటూ రాజీనామా చేస్తున్నట్లు స్పష్టంచేశారు. ఈ విషయం ప్రస్తుతం మండలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యే తీరుపై సొంత పార్టీ నేతలే గుర్రుగా ఉన్నారు. ఈ నెల 7వ తేదీన ఎమ్మెల్యే నరసాపురం గ్రామంలో పర్యటిస్తారని, ఆ సమయంలో బుడ్డయ్య వర్గీయులు ఏ విధంగా స్పందిస్తారనేది కూడా చర్చనీయాంశంగా మారింది.



ఎమ్మెల్యే కొలికపూడి పెట్టిన పోస్టు

ఇంజక్షన్ వికటించి ఐదుగురికి అస్వస్థత

- తిరువూరు ప్రభుత్వాస్పత్రిలో కలకలం
- ఇద్దరి పరిస్థితి విషమం.. విజయవాడ తరలింపు

తిరువూరు: ఎన్టీఆర్ జిల్లా తిరువూరు ప్రభుత్వాస్పత్రిలో జ్వరంతో బాధపడుతున్న వారికి వైద్యులు చేసిన ఇంజక్షన్ వికటించింది. ఐదుగురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తిరువూరు శాంతినగర్‌లో మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఐదుగురు సోమవారం తిరువూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స కోసం వచ్చారు. వీరికి వైద్యులు రాంటక్ ఇంజక్షన్ ఇచ్చారు. కొద్దిసేపటికే వారు తీవ్ర అస్వస్థులయ్యారు. కళ్లు తిరిగాయి. ఆయాసం, వాంతులతో బాధపడ్డారు. వారికి చేసిన ఇంజక్షన్ వికటించడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని గుర్తించిన వైద్యులు వెంటనే అత్యవసర చికిత్స చేశారు. ముగ్గురి పరిస్థితి కుదుటపడటంతో అక్కడే చికిత్స కొనసాగిస్తున్నారు. ఆలీమొయిన్, షేక్ నాగుల్ మీరా పరిస్థితి విషమంగా ఉండటంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇంజక్షన్ వికటించడంతో ఐదుగురి పరిస్థితి ప్రమాదకరంగా ఉందని, వీరిలో ఇద్దరికి అత్యవసర చికిత్స అవసరమని గుర్తించి విజయవాడ తరలించామని ఆస్పత్రి వైద్యాధికారి గార్గేయ చెప్పారు. దీనిపై విచారించి సత్వరం వారికి మెరుగైన వైద్యం అందించాలని తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు వైద్యుల్ని ఆదేశించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని డీఎంహెచ్‌వో సుహాసిని పరామర్శించారు. బాధితులు ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చి ఇక్కడ మగ్గం పనులు చేసుకుంటున్నారు.



అస్వస్థతకు గురైన నాగుల్‌మీరా



తీవ్ర అస్వస్థతకు గురైన ఆలీ మొయిన్

మీ గొంతు మూగబోయిందా లోకేశ్?

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఇప్పుడు ఎందుకు మాట్లాడటం లేదు

నెల్లూరులో ఏబీవీపీ నాయకుల ధర్నా.. ఈడ్చిపడేసిన పోలీసులు



ఏబీవీపీ నాయకులను లాగిపడేస్తున్న పోలీసులు

నెల్లూరు(టౌన్): 'ఫీజు రీయింబర్స్‌మెంట్ గురించి యువగళంలో మాట్లాడిన మీ గొంతు మంత్రి పదవి రాగానే మూగబోయిందా లోకేశ్..' అని ఏబీవీపీ నాయకులు ప్రశ్నించారు. 'యువగళంలో మాట్లాడిన నోరు మంత్రి పదవి రాగానే మూగబోయిందా..' అనే బ్యానర్ చేతపట్టుకుని ఏబీవీపీ నాయకులు సోమవారం నెల్లూరులోని వీఆర్సీ సెంటర్‌లో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కన్వీనర్ రాహుల్ మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన వెంటనే జీవో నంబర్ 77ను రద్దు చేస్తామని లోకేశ్ యువగళం పాదయాత్రలో హామీ ఇచ్చారని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ లేని కారణంగా ఎంతోమంది విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని, అయినా అధికారంలోకి వచ్చిన తర్వాత లోకేశ్ మాట్లాడటం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ విషయంపై మంత్రి లోకేశ్ వెంటనే స్పందించాలని, లేకపోతే ఎక్కడికక్కడ ఆయన పర్యటనలను అడ్డుకుంటామని, సీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. రోడ్డుపై బైఠాయించిన ఏబీవీపీ నాయకులను పోలీసులు బలవంతంగా ఈడ్చి పక్కన పడేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సమీర్, సుమన్, రాబర్ట్, వినోద్, హేమంత్, సుకుమార్, నవీన్ పాల్గొన్నారు.

మాజీ సైనికుల భూములకు రక్షణ కరువు

మదనపల్లెలో 3.9 ఎకరాలను ఆక్రమించిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే

సబ్ కలెక్టర్‌కు మాజీ సైనికుల ఫిర్యాదు



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద మాజీ సైనికులు

మదనపల్లె: దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టిన మాజీ సైనికుల భూములకు రాష్ట్రంలో రక్షణ లేకుండా పోతోంది. తమ భూమిని టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఆక్రమించారని మాజీ సైనికులు సోమవారం అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు వివరించారు. ఈ సందర్భంగా మాజీ సైనికుల సంఘం మదనపల్లె పట్టణ అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులు మాట్లాడుతూ బీకే పల్లె రెవెన్యూ గ్రామం సర్వే నంబర్.8/1లోని 3.9 ఎకరాల పోరంబోకు ప్రభుత్వ నిషేధిత భూమిలో రెవెన్యూశాఖ మాజీ సైనికులకు 2సీ పట్టాలు మంజూరు చేసిందని తెలిపారు. ఈ భూమిని టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ ఆక్రమించుకుని అక్కడ మున్సిపాలిటీ అనుమతి లేకుండా భవనం, షాపింగ్ రూములు నిర్మించి అద్దెకు ఇచ్చారని చెప్పారు. దీనిపై మాజీ సైనికుల సంఘంతోపాటు రెవెన్యూ అధికారులు కోర్టులో కేసులు వేయడంతో విచారణ జరుగుతోందన్నారు. ఆక్రమిత స్థలంలో నిర్మాణాలు చేపట్టవద్దని రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారని తెలిపారు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ స్థలంలో వే బ్రిడ్జి నిర్మాణం చేస్తున్నారని చెప్పారు. కలెక్టర్, సబ్ కలెక్టర్ జోక్యం చేసుకుని మాజీ సైనికులకు న్యాయం చేయాలని కోరారు. మాజీ సైనికులు అమరనాథ్, సుబ్బరాయుడు, ప్రతాప్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, నాగిరెడ్డి, సహదేవరెడ్డి, ఎస్.బాషా, మునివెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.


హసీనా నివాసాన్ని ఆక్రమించిన జనం


బెడ్రూంలో పడకపై పడుకుని పోజులు


పార్లమెంటులో సెల్ఫీలు, స్మోకింగ్


బాతులు, చేపలు, మేకలు, కుందేళ్లను తీసుకెళ్తూ...

సంక్షోభ బంగ్లా

రాజీనామా చేసి దేశం వీడిన హసీనా

▶ మొదటి పేజీ తరువాయి

దేశ బాధ్యతలన్నింటినీ తాత్కాలికంగా నేనే స్వీకరిస్తున్నా. దయచేసి సహకరించండి'' అని ప్రకటించారు. నిరసనకారులపై ఒక్క తూటా కూడా పేల్చొద్దని సైన్యాన్ని, పోలీసు శాఖను ఆదేశించారు. ''అందరికీ న్యాయం జరిగేలా చూస్తాం. నిరసనకారులు ఆందోళన విరమించాలి'' అని కోరారు. వీలైనంత త్వరగా మధ్యంతర ప్రభుత్వ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఆ వెంటనే పార్టీలతో భేటీ అయ్యారు. తర్వాత ఆయా పార్టీల నేతలతో కలిసి రాష్ట్రపతితో భేటీ అయ్యారు. అధికార అవామీ లీగ్ మినహా మిగతా పక్షాలు హాజరయ్యాయి. మరోవైపు హసీనా దేశం వీడారన్న వార్తతో ఆందోళనకారులంతా దేశవ్యాప్తంగా ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. హసీనా అధికార నివాసంలోకి చొరబడ్డారు. సర్వం లూటీ చేసి తమ ఆగ్రహావేశాలను ప్రదర్శించారు. ఆమె తండ్రి, బంగబంధు షేక్ ముజిబుర్ రెహ్మాన్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. అధికార అవామీ లీగ్ కార్యాలయానికి నిప్పు పెట్టారు. పార్లమెంటులోకీ చొరబడ్డారు.

పుట్టి ముంచిన రిజర్వేషన్లు

రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమాలతో కొద్ది నెలలుగా బంగ్లాదేశ్ అట్టుడికిపోతుండటం తెలిసిందే. బంగ్లా విముక్తి యుద్ధవీరుల వారసులకు ప్రభుత్వోద్యోగాల్లో 30 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరిస్తూ గత జూన్‌లో హసీనా సర్కారు తీసుకున్న నిర్ణయం చివరికి ఆమె పుట్టి ముంచింది. ఆ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ యువత, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో రోడ్డెక్కారు. దాంతో నెల క్రితం జరిగిన భారీ ఆందోళనలు, ఘర్షణల్లో 200 మందికి పైగా మరణించారు. చివరికి సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ఆ రిజర్వేషన్లను 5 శాతానికి తగ్గించింది. దాంతో సమస్య సమసినట్టేనని అంతా భావించారు. కానీ హసీనా తప్పుకోవాలంటూ వారం రోజులుగా మళ్లీ నిరసనలు వెల్లువెత్తాయి. 200 మంది అమాయకుల మృతికి ఆమే కారణమంటూ ఆందోళనలు తీవ్ర రూపు దాల్చాయి. హసీనా రాజీనామా డిమాండ్‌తో జనం మరోసారి రోడ్డెక్కారు. శని, ఆదివారాల్లో దేశవ్యాప్త ఘర్షణల్లో 100 మందికి పైగా మరణించారు. హసీనా సర్కారు ఓ మెట్టు దిగి వారిని చర్చలకు ఆహ్వానించినా ససేమిరా అన్నారు. దాంతో వారిపై హసీనా తీవ్రంగా మండిపడ్డారు. ఆ క్రమంలో, 'యువత ముసుగులో సంఘవిద్రోహ శక్తులే ఘర్షణలకు దిగుతున్నా'రంటూ ఆదివారం ఆమె చేసిన వ్యాఖ్యలతో పరిస్థితి పూర్తిగా చేయి దాటిపోయింది. హసీనాను గద్దె దింపడమే లక్ష్యంగా 'ఢాకా లాంగ్ మార్చ్'కు



నిరసనకారులు పిలుపునిచ్చారు. అది చివరికి హసీనా పలాయనానికి దారితీసింది. రిజర్వేషన్ల రగడ ఆమె 15 ఏళ్ల పాలనకు చివరికిలా తెరదించింది. నాలుగోసారి అధికారంలోకి వచ్చి ఆర్నెల్లు కూడా దాటకుండానే హసీనా సర్వం పోగొట్టుకుని శరణార్థిగా దేశం వీడాల్సి వచ్చింది!

ఆలయాల విధ్వంసం

హసీనా రాజీనామా చేశారన్న ప్రకటన వింటూనే దేశవ్యాప్తంగా జనం రెచ్చిపోయారు. ఢాకాలో ప్రధాని అధికార నివాసంతో పాటు హోం మంత్రి అసదుజ్జమాన్ ఖాన్ నివాసంలోకి చొచ్చుకెళ్లారు. వాటిని పూర్తిగా లూటీ చేశారు. హసీనా భర్త డాక్టర వాజెద్ మియా ఇంటిని కూడా వదిలిపెట్టలేదు. దానికి నిప్పు పెట్టారు. బంగబంధు స్మారక మ్యూజియంతో పాటు బంగ్లాదేశ్‌తో భారత ద్వైపాక్షిక సంబంధాలకు ప్రతీకగా నిలిచిన ఇందిరా సాంస్కృతిక కేంద్రం తదితరాలకు కూడా నిప్పు పెట్టారు. దేశ ప్రధాన న్యాయమూర్తి నివాసంపైనా అల్లరి మూకలు దాడికి దిగాయి. కాసేపటికే ఇంట్లోంచి కేకలు, ఆక్రందనలు, మూలుగులు విన్పించినట్టు స్థానిక మీడియా పేర్కొంది. దేశవ్యాప్తంగా హింసాకాండ, ఆస్తుల విధ్వంసం తదితరాలు కొనసాగాయి. నాలుగు ఆలయాలను ధ్వంసం చేశారు. ఎంపీలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాధికారుల నివాసాలు, కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లపై రాళ్లు రువ్వారు. వాటికి నిప్పు పెట్టారు.

రన్‌వే మీదా వెంటాడిన జనం...

త్రుటిలో తప్పించుకున్న హసీనా

సైనిక విమానంలో సోదరితో కలిసి ఉన్నపళంగా బంగ్లా వీడిన హసీనా తన సోదరి షేక్ రెహానాతో కలిసి ఢిల్లీ చేరుకున్నారు. ఆ క్రమంలో, వెల్లువెత్తిన జనాగ్రహం బారినుంచి ఆమె త్రుటిలో తప్పించుకున్నారు! హసీనాను వెంబడిస్తూ నిరసనకారులు ఢాకా విమానాశ్రయంలోకి కూడా చొచ్చుకొచ్చారు. వారిలో పలువురు గేట్లన్నింటినీ బద్దలు కొట్టుకుంటూ హసీనాకు వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తిస్తూ రన్‌వే మీదికి కూడా చేరుకున్నారు. అప్పటికే ఆమె, సోదరి బంగ్లా వైమానిక దళానికి చెందిన సి-130జె రవాణా విమానం ఎక్కేశారు. దాంతో నిరసన మూక బారిన పడకుండా తప్పించుకున్నారు. కాసేపటికి వారిద్దరూ ఢిల్లీ సమీపంలో గాజియాబాద్‌లోని హిండన్ వైమానిక స్థావరానికి చేరుకున్నారు. విమానం భారత వాయుతలంలోకి ప్రవేశించగానే మన వాయుసేన విమానాలు రక్షణగా తోడు వచ్చాయి. దేశం వీడి వెళ్లిపోయేందుకు హసీనాకు సైన్యం 45 నిమిషాల సమయం ఇచ్చినట్టు సమాచారం!

హసీనా ఇంటి ముట్టడి

రెండేళ్ల క్రితం శ్రీలంక అంతర్యుద్ధం సందర్భంగా ఏం జరిగిందో గుర్తుందా? అధ్యక్ష నివాసాన్ని ముట్టడించిన జనం భవనమంతా కలియదిరిగారు. అధ్యక్షుని కుర్చీలో విలాసంగా కూర్చుని ఫొటోలకు పోజులిచ్చారు. సెల్ఫీలు దిగారు. కిచెన్లో దూరి ఉన్నవన్నీ తింటూ సరదాగా గడిపారు. ఈత కొలనుల్లో ఈదులాడారు. సోమవారం ఢాకాలోనూ అవే దృశ్యాలు పునరావృతమయ్యాయి. ప్రధాని హసీనా రాజీనామా చేసి దేశం వీడినట్టు తెలియగానే నిరసనకారులు సంబరాలు చేసుకున్నారు. ఆమె అధికార నివాసం 'గణభదన్'ను భారీ సంఖ్యలో ముట్టడించారు. డ్రమ్ములు వాయిస్తూ, కొమ్ముబూరాలు ఊదుతూ విజయనాదం చేశారు. జాతీయ పతాకాలు చేబూని స్వేచ్ఛా నినాదాలు చేశారు. లాన్ల నిండా పరుగులు తీస్తూ, స్విమింగ్‌పూల్స్‌లో ఈదులాడుతూ, భవనమంతా కలియదిరుగుతూ హసీనాపై తమ ఆగ్రహాన్ని వెళిగక్కారు. భద్రతా సిబ్బందితో ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు. ప్రధాని కుర్చీలో కూర్చున్నారు. బెడ్రూంలో మంచంపై హాయిగా సేదదీరారు. వంట సామగ్రి మొదలుకుని ఫర్నిచర్, పురాతన వస్తువుల దాకా సర్వం ఎత్తుకెళ్లారు. ఎవరికి ఏది చేతికందితే అది తీసుకెళ్లారు. భవనాన్ని పూర్తిగా లూటీ చేసి వదిలారు. ఒక వ్యక్తి లిప్‌స్టిక్‌లు చేత బట్టుకుని మీడియా కంటబడ్డాడు. ''నియంత కబంధ హస్తాల నుంచి దేశాన్ని విముక్తం చేశాం



. మా పోరాటానికి ప్రతీకగా ఈ లిప్‌స్టిక్‌ను నా దగ్గరుంచుకుంటా'' అని చెప్పుకొచ్చాడు! దేశ పార్లమెంటులోకి కూడా జనం వెల్లువలా దూసుకెళ్లారు. ప్రజాప్రతినిధురల కుర్చీల్లో కూర్చుని విలాసంగా పొగ తాగుతూ, సెల్ఫీలు తీసుకుంటూ గడిపారు.

భారత్‌పై ప్రభావం ఎంత?!

బంగ్లాదేశ్ సంక్షోభం భారత్‌పై ఎలాంటి ప్రభావం చూపుతుందన్నది ఆసక్తికరంగా మారింది. హసీనా తొలి నుంచీ భారత్‌కు గట్టి మద్దతుదారు. ఆమె హయాంలో 15 ఏళ్లుగా ద్వైపాక్షిక బంధం నానాటికీ దృఢమవుతూనే వస్తోంది. ముఖ్యంగా బంగ్లాదేశ్‌లోని భారత వ్యతిరేకుల నోళ్లకు హసీనా గట్టిగా తాళం వేశారు. 2009లో ఆమె రెండోసారి గద్దెనెక్కినప్పుడు యూపీఏ-2 మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్నారు. ఆ ఐదేళ్లలో ఇరు దేశాల బంధం గట్టిపడింది. 2014లో నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాక సంబంధాలు మరింతగా బలపడుతూ వచ్చాయి. మన ప్రబల ప్రత్యర్థి చైనాకు బంగ్లాదేశ్ మరీ దగ్గరవకుండా ఉండేందుకు పలు అంశాల్లో బంగ్లాకు ఇతోధికంగా సాయపడుతూ వచ్చింది. ఖలీదా జియా హయాంలో ఇరు దేశాల మధ్య మనస్పర్థలు తలెత్తాయి. భారత వ్యతిరేకతే జియా ప్రధాన ఎన్నికల ప్రచారాస్త్రంగా ఉంటూ వస్తోంది కూడా! బంగ్లాదేశ్ మేలు కంటే హసీనా, అవామీ లీగ్ రాజకీయ ప్రయోజనాల పరిరక్షణే భారత్‌కు ప్రధానమని ఆ దేశంలో ఒక వర్గంలో ఉన్న అభిప్రాయానికి ఆమె గట్టి సమర్థకురాలు. జియా హయాంలో ఉల్ఫా తీవ్రవాదులు బంగ్లా కేంద్రంగా ఈశాన్య భారతంలో ధ్వంసరచన చేశారు. కొద్ది నెలల క్రితం బంగ్లాదేశ్‌లో సాగిన 'బాయ్‌కాట్ భారత్' ప్రచారానికి జియా, బీఎన్‌పీ నేతలు బాహాటంగా మద్దతిచ్చారు. ఈ నేపథ్యంలో జియా జైలు నుంచి విడుదలవడమే గాక సైన్యం దన్నుతో కూడిన మధ్యంతర ప్రభుత్వానికి సారథ్యం వహించవచ్చన్న వార్తలు భారత్‌కు ఇబ్బందికరమే.

హసీనాతో దోవల్ భేటీ



జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ హిండన్ ఎయిర్‌బేస్‌లో హసీనాతో భేటీ అయ్యారు. వారు ఏం చర్చించిందీ తెలియరాలేదు. అనంతరం ఆమెను సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఢిల్లీలో ఉన్న తన కూతురు సైమా వాజెద్‌ను కలిసిన అనంతరం హసీనా లండన్ వెళ్తారని సమాచారం. వాజెద్ ప్రపంచ ఆరోగ్య సంస్థలో ఆగ్నేయాసినా ప్రాంతీయ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు.

తిరిగి రారు: కుమారుడు



లండన్: హసీనా తిరిగి బంగ్లాదేశ్ రాజకీయాల్లో వేలు పెట్టబోరని ఆమె కుమారుడు సజీవ్ వాజెద్ జాయ్ ప్రకటించారు. ఆమె క్షేమం కోరి కుటుంబీకులమంతా ఒత్తిడి చేసిన మీదటే దేశం వీడారని బీబీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వెల్లడించారు.

ఖలేదా జియాకు విముక్తి



ఢాకా: జైలు శిక్ష అనుభవిస్తున్న మాజీ ప్రధాని ఖలేదా జియాను వెంటనే విడుదల చేయాలని బంగ్లాదేశ్ అధ్యక్షుడు మహ్మద్ షహబుద్దీన్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. షేక్ హసీనా ప్రధాని పదవికి రాజీనామా చేయడంతోపాటు దేశం విడిచిపెట్టిన కొన్ని గంటల్లోనే ఈ పరిణామం సంభవించడం గమనార్హం. అధ్యక్షుడు షహబుద్దీన్ ప్రతిపక్ష పార్టీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ) చీఫ్ ఖలేదా జియాను తక్షణమే విడుదల చేయాలని ఏకగ్రీవంగా నిర్ణయానికి వచ్చినట్లు ఒక అధికారిక ప్రకటన వెలువడింది. షేక్ హసీనా మొదటిసారిగా 1996లో దేశ ప్రధానిగా పగ్గాలు చేపట్టారు. ఆ తర్వాత ఖలేదా జియా అధికారంలోకి వచ్చారు. అప్పటి నుంచి ప్రధాని కుర్చీ వారిద్దరి మధ్య మారుతూ వచ్చింది.

నిరసనలు ఇలా...

జూన్ 5: స్వాతంత్ర్యసమర యోధుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 30 శాతం రిజర్వేషన్ల కోటాను పునరుద్ధరిస్తూ కోర్టు తీర్పు
జూన్ 6: యూనివర్సిటీల్లో మొదలైన ఆందోళనలు. దేశమంతటికీ వ్యాప్తి.
జూన్ 7: విద్యార్థుల రహదారుల దిగ్బంధం
జూన్ 15: పెరిగిన నిరసనల తీవ్రత
జూలై 15: హింసాత్మకంగా మారిన నిరసనలు
జూలై 18: ఆందోళనలు తీవ్రరూపం..19 మంది మృతి. కర్ఫ్యూ, రంగంలోకి సైన్యం
జూలై 19: దేశమంతటా హింస
జూలై 21: కోటాను 5 శాతానికి తగ్గిస్తూ సుప్రీంకోర్టు తీర్పు
ఆగస్టు 3: మృతి చెందిన వారి కుటుంబాలకు న్యాయం చేయాలంటూ మళ్లీ నిరసనలు
ఆగస్టు 4: దేశవ్యాప్త ఆందోళనల్లో మరో 100 మందికి పైగా మృతి. న్యాయ విచారణకు ప్రభుత్వం ఆదేశం. అయినా చల్లారని జనాగ్రహం
ఆగస్టు 5: ప్రధాని షేక్ హసీనా రాజీనామా. దేశం విడిచి పలాయనం



అప్రతిష్ట మూటగట్టుకున్న ఐరన్ లేడీ!

హసీనా ప్రస్థానం.. ఆద్యంతం వెలుగునీడలమయం

బంగ్లాదేశ్‌కు స్వేచ్ఛా వాయువులందించిన బంగబంధు షేక్ ముజిబుర్ రెహ్మాన్ గారాలపట్టి. ఆయన వారసురాలిగా తొలినాళ్లలో బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య పరిరక్షణకు గళమెత్తిన నేతగా అంతర్జాతీయ గుర్తింపు. అనంతర కాలంలో రాజకీయ రంగంపైనా తిరుగులేని ముద్ర. దేశ చరిత్రలో ఏకంగా ఐదుసార్లు ప్రధాని పదవిని అధిష్ఠించిన ఏకైక నేత. ఇంతటి ఘనమైన రికార్డులు షేక్ హసీనా సొంతం. అభిమానుల దృష్టిలో ఐరన్ లేడీగా పేరు. కానీ ప్రధానిగా 2009లో రెండో దఫా పగ్గాలు చేపట్టిన నాటినుంచీ నియంతగా ఆమె ఇంటా బయటా అప్రతిష్ఠ మూటగట్టుకున్నారు. గత గత జనవరిలో విపక్షాలన్నీ మూకుమ్మడిగా బహిష్కరించిన ఏకపక్ష ఎన్నికల్లో 'ఘనవిజయం' సాధించి వరుసగా నాలుగోసారి ప్రధాని అయ్యారు. కానీ ఆర్నెల్లు కూడా తిరగకుండానే ప్రజల ఛీత్కారాలకు గురయ్యారు. అవమానకర రీతిలో ప్రాణాలు అరచేతిలో పట్టుకుని దేశం వీడారు!

విద్యార్థిగానే రాజకీయాల్లోకి

1947లో నాటి తూర్పు పాకిస్తాన్ (నేటి బంగ్లాదేశ్)లో జన్మించారు హసీనా. ఢాకా వర్సిటీలో చదివే రోజుల్లోనే చురుగ్గా రాజకీయాల్లో పాల్గొన్నారు. 1975లో సైన్యం ముజిబుర్, ఆయన భార్య, ముగ్గురు కుమారులతో పాటు 18 మంది కుటుంబీకులను దారుణంగా కాల్చి చంపింది. హసీనా, ఆమె చెల్లెలు రెహానా విదేశాల్లో ఉండటంతో ఈ మారణకాండ నుంచి తప్పించుకున్నారు. భారత్‌లో ఆరేళ్ల ప్రవాసం అనంతరం 1981లో హసీనా బంగ్లా గడ్డపై కాలు పెట్టారు. సైనిక పాలనకు వ్యతిరేకంగా గళం విప్పారు. పలుమార్లు గృహనిర్బంధానికి గురయ్యారు. 1996లో తొలిసారి ప్రధాని అయ్యారు. 2001లో ఓటమి చవిచూసినా 2008 ఎన్నికల్లో రెండోసారి గద్దెనెక్కారు. నాటినుంచీ ప్రధానిగా కొనసాగుతున్నారు. 2004లో గ్రెనేడ్ దాడి నుంచి త్రుటిలో బయటపడ్డారు.


1996లో తొలిసారి ప్రధానిగా ప్రమాణం చేస్తూ..

విపక్షాలను వెంటాడి...

నిజానికి ప్రధానిగా హసీనా సాధించిన విజయాలు తక్కువేమీ కాదు. రాజకీయ అస్థిరతతో, ఆర్థిక అవ్యవస్థతో కొట్టుమిట్టాడిన బంగ్లాదేశ్‌ను ఒడుపుగా ఒడ్డున పడేశారు. కానీ 2009లో రెండోసారి పగ్గాలు చేపట్టాక విపక్ష నేతలే లక్ష్యంగా ప్రతీకార రాజకీయాలకు హసీనా తెర తీశారు. 1971 యుద్ధ నేరాల కేసులను తిరగదోడారు. ట్రిబ్యునల్ ద్వారా శరవేగంగా విచారణ జరిపి పలువురు ఉన్నతస్థాయి విపక్ష నేతలను దోషులుగా తేల్చారు. ఖలీదా సారథ్యంలోని విపక్ష బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బీఎన్‌పీ) కీలక భాగస్వాములను 2013లో ఎన్నికల్లో పాల్గొనకుండా నిషేధించారు. అవినీతి ఆరోపణలపై ఖలీదాకు 17 ఏళ్ల జైలుశిక్ష పడింది. వీటికి తోడు ఆర్థిక పరిస్థితి దిగజారింది. దేశంలో ఏకంగా 3.2 కోట్లమంది నిరుద్యోగులున్నారు. ఇలాంటి సమయంలో రిజర్వేషన్ల కోటాను తిరగదోడటం హసీనాకు రాజకీయంగా మరణశాసనం రాసింది. నాటి యుద్ధంలో ప్రధానంగా పాల్గొన్నది నేటి అధికార పార్టీ అవామీ లీగే. దాంతో, సొంత పార్టీ కార్యకర్తలకు అత్యధిక లబ్ధి చేకూర్చేందుకే రిజర్వేషన్లను తిరిగి తెరపైకి తెచ్చారంటూ దేశమంతా భగ్గుమంది. కీలక సమయంలో సైన్యం కూడా సహాయ నిరాకరణ చేయడంతో హసీనా రాజీనామా చేసి ప్రాణాలు కాపాడుకునేందుకు దేశం వీడాల్సి వచ్చింది.

నాడూ ఆరేళ్లు భారత్ ఆశ్రయం

ఆపత్కాలంలో షేక్ హసీనాకు భారత్ ఆశ్రయమివ్వడం కొత్తేమీ కాదు. ముజిబుర్‌ను సైన్యం పొట్టన పెట్టుకున్నాక 1975 నుంచి 1981 దాకా ఆరేళ్లపాటు సోదరి, భర్త, పిల్లలతో పాటు ఆమె భారత్‌లోనే ఆశ్రయం పొందారు. ఢిల్లీలోని లజ్‌పత్ నగర్, పండోరా రోడ్ నివాసాల్లో గడిపారు. రెండేళ్ల క్రితం ఓ ఇంటర్వ్యూలో నాటి రోజులను హసీనా గుర్తు చేసుకున్నారు. ''అప్పుడు నేను, నా భర్త పశ్చిమ జర్మనీలో ఉన్నాం. మాకు ఆశ్రయమిస్తామంటూ నాటి ప్రధాని ఇందిరాగాంధీ వర్తమానం పంపారు. ఢిల్లీలో దిగగానే నేరుగా ఆమెను కలిశాను. నా తండ్రితో పాటు కుటుంబంలో 18 మందిని సైన్యం పొట్టన పెట్టుకున్నట్టు ఆమె ద్వారానే నాకు తెలిసింది. రహస్యంగా ఢిల్లీలోనే కాలం వెళ్లదీశాం. నా భర్త ఇక్కడే ఉద్యోగం కూడా చేశారు'' అని చెప్పుకొచ్చారు హసీనా.

బడ్జెట్‌కు లోక్‌సభ ఆమోదం

న్యూఢిల్లీ: 2024-25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌కు సోమవారం లోక్‌సభ ఆమోదముద్ర వేసింది. గత వారం బడ్జెట్‌పై చర్చ ముగిశాక తాజాగా పార్లమెంట్ దిగువసభ తన ఆమోదం తెలిపింది. దీంతోపాటు సభ ఆమోదించిన బడ్జెట్ పద్దుల మేరకు సంచిత నిధి నుంచి మొత్తాలను వినియోగించేందుకు అనుమతించే ద్రవ్య వినిమయ బిల్లుకు లోక్‌సభ ఆమోదముద్ర వేసింది. రైల్వే, విద్య, ఆరోగ్యం, మత్స్యరంగాలకు సంబంధించిన గ్రాంట్‌ల వినియోగానికి సంబంధిన బిల్లుకూ లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కొత్తగా ప్రతిపాదించిన పన్ను శ్లాబుల సంబంధ ఫైనాన్స్ బిల్లుపై లోక్‌సభలో చర్చ జరగనుంది. రాజ్యసభలో వ్యవసాయం, పునరుత్పాదక శక్తి, సహకార రంగం, గృహ పట్టణాభివృద్ధికి కేటాయింపులపై చర్చ జరగనుంది. ఫైనాన్స్ బిల్లుపై రాజ్యసభలో చర్చ జరిగినా మార్పులు సిఫార్సు చేయబోదు. కేవలం ఆ బిల్లులను తిరిగి లోక్‌సభకు పంపగలదు. ఫైనాన్స్ బిల్లు ఆమోదం పొందాక బడ్జెట్ తంతు మొత్తం ముగుస్తుంది.

ఉద్యానవనాల కోసం రూ.18వేల కోట్లు

రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా వచ్చే ఐదేళ్లలో ఎగుమతి కోసం ఉద్దేశించి 100 ఉద్యానవనాల క్లస్టర్ల ఏర్పాటు కోసం మొత్తంగా రూ.18,000 కోట్లు కేటాయిస్తున్నట్లు కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ సోమవారం రాజ్యసభలో చెప్పారు. వంటనూనె దిగుమతి వ్యయం తగ్గించుకోవడంతో పాటు దేశీయంగా నూనెగింజల దిగుబడి పెంచేందుకు రూ.6,800 కోట్లను ఆయిల్‌సీడ్ మిషన్‌కు కేటాయిస్తున్నట్లు చౌహాన్ వెల్లడించారు. స్వాతంత్ర్య సిద్ధించాక సేద్యరంగం బాగు కోసం కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసిందేమీలేదని వ్యాఖ్యానించారు. దీనిపై విపక్ష సభ్యులు తీవ్ర నిరసన తెలిపారు. దిగ్విజయ్‌సింగ్ వంటి కాంగ్రెస్ నేతలు మాట్లాడేందుకు ప్రయత్నించినా ఛైర్మన్ ధన్‌ఖడ్ అనుమతించలేదు. దీంతో విపక్ష సభ్యులు వాకౌట్‌చేశారు.

సర్వేలో ముందంజలో కమలా హారిస్

వాషింగ్టన్: బైడెన్ అభ్యర్థిత్వం వేళ దాదాపు ఏకపక్షంగా కనిపించిన అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచార సరళిలో అనూహ్య మార్పులు కనిపిస్తున్నాయి. రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌తో ధీటుగా మాట్లాడలేక తడబడి, చివరకు తప్పుకున్న బైడెన్ అభ్యర్థిగా ఉన్నంతకాలం ట్రంప్ ముందంజలో ఉండటం తెల్సిందే. తాజా డెమొక్రటిక్ పార్టీ తరఫున కమలా హారిస్ రంగంలోకి దిగాక పోరు హోరాహోరీగా సాగుతోందని విశ్లేషణలు వెలువడ్డాయి. వీటికి బలం చేకూరుస్తూ తాజా సర్వేలో ట్రంప్ కంటే కమల హారిస్‌కే ఆదరణ ఒక శాతం ఎక్కువగా ఉందని తేలింది. తాజాగా ఆదివారం సీబీఎస్ న్యూస్/యూగవ్ సంస్థ చేపట్టిన సర్వేలో కమల ఆధిక్యం కనబరిచారు. ట్రంప్ అధ్యక్ష పదవిలో మానసికంగా స్థిమితంగా ఆలోచించగలరని 51 శాతం మంది, కమల మెరుగ్గా పరిపాలించగలరని 64 శాతం చెప్పారు.

మృత్యుకుహరాలా..

కోచింగ్ సెంటర్లపై సుప్రీంకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ: ఢిల్లీలోని కోచింగ్ కేంద్రాలు డెత్ ఛాంబర్‌లుగా తయారయ్యాయని సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. కోచింగ్ కేంద్రాలు అభ్యర్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని వ్యాఖ్యానించింది. రావూస్ స్టడీ సర్కిల్ బేస్‌మెంట్‌లో వరదనీరు పోటెత్తి ముగ్గురు విద్యార్థుల ప్రాణాలను బలిగొన్న ఉదంతంపై సూమోటోగా కేసును స్వీకరించిన సుప్రీంకోర్టు ధర్మాసనం వివరణ ఇవ్వాలంటూ సోమవారం కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులను జారీచేసింది. ''మేం చదివే అంశాలు భయంకరంగా ఉన్నాయి. వాస్తవానికైతే ఇలాంటి కోచింగ్ కేంద్రాలను మనం వెంటనే మూసేయించాలి. కానీ ప్రస్తుతానికి కోచింగ్ ఆపకూడదనే ఉద్దేశంతో వీటిని కేవలం ఆన్‌లైన్‌లో అయినా కొనసాగించాలి. భవన నిర్మాణ మార్గదర్శకాలు, భద్రతా ప్రమాణాలపై కఠినంగా వ్యవహరించాలి. ఇలాంటి కోచింగ్ సెంటర్లు డెత్ చాంబర్లుగా మారాయి. పోటీపరీక్షల ఆశావహుల ఆశలు, జీవితాలతో కోచింగ్‌కేంద్రాలు ఆటలాడుతున్నాయి. ఎన్నో కలలతో దేశరాజధానికొచ్చిన వారికి తమ కలల సాకారం ఎంతో కష్టమవుతోంది. ముగ్గురు అభ్యర్థుల మరణం నిజంగా మనందరికీ కనువిప్పు కల్గించే ఘటన. అసలు కోచింగ్ సెంటర్లలో ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారు? వాటిని ఏ మేరకు అమలుచేస్తున్నారో మాకు వివరణ ఇవ్వండి'' అంటూ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల సుప్రీంకోర్టు ధర్మాసనం కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాలను ఆదేశించింది.

కశ్మీర్ అసెంబ్లీకి సెప్టెంబర్‌లో ఎన్నికలు

కేంద్ర మంత్రి, జమ్మూకశ్మీర్ బీజేపీ ఇన్‌చార్జి జి.కిషన్ రెడ్డి వెల్లడి

ఆర్ఎస్‌పురా: జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి సెప్టెంబర్‌లో ఎన్నికలు జరుగుతాయని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి వెల్లడించారు. ఈ కేంద్ర పాలిత ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలు ఇకపైనా కొనసాగాలంటే బీజేపీకే అధికారమివ్వాలని ఆయన ప్రజలను కోరారు. ఆర్టికల్ 370 రద్దుకు ఐదేళ్లయిన సందర్భంగా సోమవారం జమ్మూ శివారులోని బానా సింగ్ స్టేడియంలో మహోత్సవ్ ర్యాలీనుద్దేశించిమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడారు.

కేజ్రీవాల్ అరెస్టు సబబే: ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ: మద్యం కేసులో సీబీఐ తనను అరెస్ట్‌చేయడాన్ని సవాల్ చేస్తూ ఢిల్లీ హైకోర్టు మెట్లెక్కిన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు చుక్కెదురైంది. అవకతవకల మద్యం విధానం ద్వారా అవినీతి చోటుచేసుకుందంటూ కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) కేజ్రీవాల్‌ను అరెస్ట్‌చేయడాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నీనా బన్సల్ కృష్ణ సమర్థించారు. న్యాయసమ్మతమైన కారణం లేకుండా అరెస్ట్ చేశారని అనలేమని వ్యాఖ్యానిస్తూ కేజ్రీవాల్ పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది. అయితే బెయిల్ కోసం ట్రయల్ కోర్టుకు వెళ్లే స్వేచ్ఛ కేజ్రీవాల్‌కు ఉందని ఈ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానించింది. సీబీఐ అరెస్ట్‌ను సవాల్ చేస్తూ ఈ అంశంపై గతంలోనే వాదనలు విన్న కోర్టు జూలై 17వ తేదీన తీర్పును రిజర్వ్‌చేసి సోమవారం వెలువరించింది.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
మంగళవారం । 6 । ఆగస్టు । 2024

వాల్మీకి నిధుల స్కాంలో చార్జిషీటు

యశవంతపుర: రాజకీయ ఆరోపణలకు కారణమైన వాల్మీకి ఆదివాసి అభివృద్ధి మండలి నిధుల కుంభకోణంలో సిట్ దర్యాప్తును పూర్తి చేసింది. సోమవారం బెంగళూరు నగర 3వ ఏసీఎంఎం కోర్టులో 3,071 పేజీల చార్జిషీటును సమర్పించింది. మండలి ఎండీ పద్మనాభ్, అకౌంటెంట్ పరశురామ్, మాజీ మంత్రి నాగేంద్ర, ఆయన ఆప్తుడు నెక్కంటి నాగరాజు, అతని బంధువులు నెక్కంటి నాగేశ్వరరావ్, హైదరాబాద్‌కు చెందిన ఫస్ట్ ఫైనాన్స్ క్రెడిట్ కో ఆపరేటివ్ బ్యాంక్ ఎండి సత్యనారాయణవర్మ, సత్యనారాయణ ఇటరి, సాయితేజ్‌తో పాటు 12 మందిని నిందితులుగా పేర్కొన్నారు. సోదాలు చేసి రూ.50 కోట్ల విలువగల బంగారం, నగదును స్వాధీనం చేసుకున్నట్లు సిట్ డీఎస్పీ శ్రీనివాస్ రాజ్ తెలిపారు. మండలికి చెందిన రూ. 187 కోట్లను ఇతర బ్యాంకులకు మళ్లించి స్వాహా చేశారని జూన్‌లో బయటపడింది. దీంతో మంత్రి బి.నాగేంద్ర పదవిని కోల్పోయారు. ఈడీ కూడా విచారణ సాగిస్తోంది.

న్యూస్‌రీల్

భీమ అమావాస్య పూజలు



బిక్కలసళ్ళి శివాలయంలో గోపూజ

గౌరిబిదనూరు: మంచేనహళ్ళి సమీపంలో ఉన్న బొక్కలహళ్ళి గ్రామంలో వెలసిన పురాతన శివాలయంలో ఆదివారం భీముని అమావాస్య పూజలను నిర్వహించారు. ప్రతి ఏటా మాదిరిగానే ఈసారి భక్తులే వచ్చి రుద్రునికి అభిషేకాలు నిర్వహించారు. రుద్రహోమం, రుద్రాభిషేకం, గంగపూజ ఇతర ప్రత్యేక పూజలు ధర్మకర్త బికె మంజునాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు ఫల పుష్ప నైవేద్యాలు సమర్పించి శివయ్యకు మొక్కులు తీర్చుకొన్నారు.

ట్రాఫిక్ ఉల్లంఘనులపై స్పెషల్ డ్రైవ్

- రూ.10 లక్షల జరిమానా వసూలు

యశవంతపుర: బెంగళూరులో ట్రాఫిక్ ఉల్లంఘనులను నియంత్రించేందుకు పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈస్ట్ డివిజన్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ట్రాఫిక్ నియమాలు ఉల్లంగించిన 2100 మందిపై కేసులు నమోదు చేసి రూ. 10.63 లక్షల జరిమానా వసూలు చేశారు. ఆదివారం ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టి సిగ్నల్ జంపింగ్, రాంగ్ పార్కింగ్, ఫుట్‌పాత్ పార్కింగ్, త్రిబుల్‌రైడింగ్, డ్రైవింగ్‌లో మొబైల్ వాడటంపై తదితర వాటిపై కేసులను నమోదు చేసి రూ. 10.53 లక్షల జరిమానా వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జూలో సింహం కన్నుమూత



సింహం ఆర్య (ఫైల్)

శివమొగ్గ: శివమొగ్గ శివార్లలోని త్యావరెకొప్పలోని జూ లో మగ సింహం మరణించిన ఘటన సోమవారం జరిగింది. 18 ఏళ్ల వయస్సు కలిగిన ఆర్య అనే సింహం లయన్ సఫారిలో ఉండేది. వయసు పెరిగిపోవడంతో కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆహారం కూడా తీసుకోలేకపోతోంది. 2008లో మైసూరు జూ నుంచి ఆర్యను ఇక్కడికి తీసుకొచ్చారు. సఫారీలో ఇంకా నాలుగు సింహాలున్నాయి.


ఎస్ఐ మృతి కేసు సీఐడీకి

- హోం మంత్రి పరమేశ్వర్

దొడ్డబళ్లాపురం: యాదగిరి సబ్‌ఇన్స్‌పెక్టర్ పరశురాం మృతి కేసును సీఐడీకి అప్పగించామని, ఆయన భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని హోం మంత్రి జీ పరమేశ్వర్ తెలిపారు. సదాశివనగర్‌లోని ఆయన నివాసం వద్ద మీడియాతో మాట్లాడుతూ, పోస్టుమార్టం రిపోర్టు కోసం ఎదురు చూస్తున్నామన్నారు. రిపోర్టు వచ్చాక ఎలా మృతి చెందారో తెలిసే అవకాశం ఉందన్నారు. బుధవారం పరశురాం ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శిస్తానని తెలిపారు. కుటుంబానికి పరిహారం ఇస్తామన్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్యే కుమారుడి విషయం మాట్లాడుతూ, ఈ కేసును ఇప్పటికే సీఐడీకి అప్పగించామని అన్నారు.

ప్రియురాలిని అంతమొందించి.. ఆత్మహత్య


- మండ్య జిల్లాలో విషాదం



మండ్య: ప్రేమను నిరాకరించిన యువతిని మచ్చు కత్తితో నరికి చంపిన భగ్న ప్రేమికుడు, ఆపై బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లాలోని మండ్య జిల్లా నాగమంగల తాలూకా దేవలాపుర ఫిర్కా సునగనహళ్లి వద్ద జరిగింది. మండ్య తాలూకాలోని హొసహళ్లి గ్రామానికి చెందిన శరత్ (30) అనే యువకుడు, అంచహళ్లి గ్రామంలోని అవ్వాతాతల ఇంటిలో ఉండేవాడు. అదే గ్రామానికి చెందిన ఓ యువతితో ఆరేడేళ్లుగా ప్రేమాయణం కొనసాగిస్తున్నాడు. అయితే ఇటీవల ఆ యువతి శరత్‌కు బ్రేకప్ చెప్పేసింది. దీంతో ఆగ్రహావేశానికి గురైన శరత్ ఆ యువతిపై మచ్చుకత్తితో దాడి చేశాడు, తీవ్ర గాయాలతో ఆమె ప్రాణాలు కోల్పోయింది. తరువాత మొబైల్‌ను స్విచాఫ్ చేసుకుని నాగమంగల తాలూకా సునగనహళ్లి సమీపంలోని పొలంలోని బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ రవికుమార్, పోలీసులు బావిలో నుంచి మృతదేహాన్ని వెలికితీయించి ఆదిచుంచనగిరి ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ సంఘటనతో ఇరు కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి.

గంగ ఉప్పొంగగా





వరదల వల్ల నదులు, జలపాతాలు ఉధృతరూపం దాల్చాయి. సోమవారం మండ్య జిల్లాలో గగనచుక్కి జలపాతం జోరు, శివమొగ్గ జిల్లాలో జోగ్ జలపాతం హొయలు

రాజ్‌భవన్ రహస్యం

- సీఎం సిద్దరామయ్య ప్రాసిక్యూషన్‌కు అనుమతిస్తారా?
- కేబినెట్ సలహాతో నోటీసులు వెనక్కి తీసుకుంటారా!
- గవర్నర్ నిర్ణయాలపై తీవ్ర ఉత్కంఠ
- 4 రోజులుగా ఢిల్లీలో చర్చలు
- సిద్దుకు మద్దతుగా నిరసనలు షురూ

బనశంకరి: కన్నడనాట రాజకీయాలు అనూహ్య మలుపులు తిరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఒక వైపు సీఎం, మరోవైపు గవర్నర్ నిలబడ్డారు. మైసూరులో ముడా ఇళ్ల స్థలాలను అక్రమంగా పొందారని, దానిపై వివరణ ఇవ్వాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ ఇదివరకే నోటీసులు జారీ చేయడంతో రాజకీయాలు వేడెక్కాయి. ఈ కేసులో సిద్దరామయ్యను విచారించడానికి (ప్రాసిక్యూషన్)కు అనుమతి ఇవ్వడంపై గవర్నర్ ఏ క్షణమైనా నిర్ణయం తీసుకోవచ్చని సమాచారం. గత నాలుగురోజులుగా ఢిల్లీలో మంత్రాంగాలు చేస్తున్న గవర్నర్ సోమవారం రాత్రికి బెంగళూరుకు చేరుకున్నట్లు తెలిసింది.

గవర్నర్ ఏం చేయబోతున్నారు?



సీఎం సిద్దరామయ్యకు మద్దతుగా సోమవారం కలబుర్గిలో ర్యాలీ



శివమొగ్గలో టైర్లు కాల్చి నిరసన



సీఎం సిద్దరామయ్య, గవర్నర్ గెహ్లోట్ ముఖాముఖి

సీఎం సిద్దరామయ్యను స్థలాల కేసులో ప్రాసిక్యూట్ చేయాలని సామాజిక కార్యకర్త టీజే అబ్రహం అర్జీ దాఖలు చేశారు. దీనిపై గవర్నర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు అనేదానిపై తీవ్ర కుతూహలం నెలకొంది. అబ్రహం అర్జీ మీదే సిద్దు సర్కారుకు గవర్నరు నోటీస్ జారీ చేయగా, రాష్ట్రంలో తీవ్ర చర్చకు దారితీసింది. తక్షణం నోటీసు వెనక్కి తీసుకోవాలని సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్, కేబినెట్ సమావేశంలో తీర్మానం చేశారు. గవర్నర్ గత 4 రోజుల నుంచి బెంగళూరులో లేని కారణంగా ఈ తీర్మానం గురించి, ప్రాసిక్యూషన్ పట్ల ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. రాజ్‌భవన్‌కు చేరుకోగానే ప్రాసిక్యూషన్ పై ఓ తీర్మానం తీసుకోనున్నారు. లేదా మంత్రివర్గం చేసిన వాపస్ తీర్మానాన్ని పాటిస్తారా? అనేది చర్చనీయాంశమైంది. ప్రాసిక్యూషన్‌కు అనుమతిస్తే సీఎం పదవికి ఎసరు రావచ్చు.

న్యాయపోరాటం చేస్తాం: హోంమంత్రి

గవర్నర్ గెహ్లోట్ సీఎం ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇస్తే కోర్టులో వ్యతిరేకిస్తామని హోంమంత్రి పరమేశ్వర్ తెలిపారు. నగరంలో విలేకరులతో మాట్లాడుతూ గవర్నర్ మంత్రివర్గ సలహాను ఒప్పుకుని నోటీస్‌ను వెనక్కి తీసుకుంటారనే నమ్మకం ఉందన్నారు. కేబినెట్ నిర్ణయాన్ని అంత సులభంగా తిరస్కరించబోరని చెబుతూ, ప్రాసిక్యూషన్‌కు అనుమతిస్తే మేము కూడా న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు.

సిద్దుకు మద్దతుగా ధర్నాలు

మరోవైపు సీఎం సిద్దరామయ్యకు గవర్నర్ కక్ష సాధింపుతో నోటీసులు ఇచ్చారని, సర్కారును పడగొట్టాలని బీజేపీ, జేడీఎస్‌లు కుట్ర చేస్తున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ కార్యకర్తలు, సిద్దు అభిమానులు పలు జిల్లాల్లో ధర్నాలు నిర్వహించారు. కలబుర్గి, శివమొగ్గ, బళ్లారి సహా అనేక ప్రాంతాల్లో ఆందోళనలు చేశారు.

నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య

దొడ్డబళ్లాపురం: హాస్టల్ మేడమీది నుంచి దూకి నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన నగరంలో సోలదేనహళ్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కేరళలోని పాలక్కాడ్‌కు చెందిన అతుల్య (19), చిక్కబాణావరలోని ఒక కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ ఫస్టియర్ చదువుతోంది. నెలన్నర క్రితమే వచ్చి హాస్టల్‌లో ఉంటోంది. ఇక్కడి వాతావరణం, చదువు నచ్చక ఊరికి వచ్చేస్తానని తల్లిదండ్రులకు కాల్ చేసి చెప్పేది. అయితే తల్లిదండ్రులు ధైర్యం చెప్పి ఇక్కడే ఉండేలా చేసారు. దీంతో తీవ్ర మానసిక వ్యథకు లోనైన అతుల్య సోమవారం హాస్టల్ మేడ మీద నుండి దూకడంతో గాయాలతో మరణించింది. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

స్థలాల మరక ఎందుకు సీఎం?

మైసూరు: ముడా నుంచి మీ భార్య పేరిట పొందిన ఆ 14 స్థలాలను వాపస్ ఇచ్చేసి సీఎం సిద్దరామయ్య గౌరవాన్ని కాపాడుకోవాలని సీనియర్ ఎమ్మెల్సీ హెచ్. విశ్వనాథ్ సలహా ఇచ్చారు. ఆయన సోమవారం పత్రికాభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. సీఎం సిద్దరామయ్య ఆ స్థలాలను వాపసు ఇస్తే ఆయన పెద్దరికం పెరగడంతో పాటు అభ్యుదయవాది అనేందుకు అర్థం వస్తుందన్నారు. ఉన్న ఒక్క కుమారుని కోసం మీకు ఇంకా ఎన్ని స్థలాలు కావాలి? అని ప్రశ్నించారు. ఒక కుమారుడు చనిపోయాడు, ఇంక ఒక కొడుకు ఉన్నాడు చాలు కదా అన్నారు. మీ తెల్ల పంచె మీద నల్ల మరక పడి మాసిపోక ముందే ఆ స్థలాలను వాపసు ఇప్పించి పెద్దరికాన్ని ప్రదర్శించాలని విశ్వనాథ్ హితవు పలికారు.

మాజీ జవాన్ గంజాయి వ్యాపారం

మైసూరు: ఒడిశా నుంచి గంజాయిని తెచ్చి విక్రయిస్తున్న మాజీ సైనికున్ని ఉదయగిరి సీసీబీ పోలీసులు అరెస్ట్ చేశారు. మైసూరు సాతగల్లి నివాసి శ్రీనివాస్.. బీఎస్ఎఫ్‌లో పనిచేస్తూ పలు కారణాల వల్ల సస్పెండ్ అయ్యాడు. దీంతో ఆదాయం కోసం పక్కదారి పట్టాడు. ఒడిశా నుంచి గంజాయి కొనుగోలు చేసి తెచ్చి మహదేవపుర రోడ్డులో రజాక్ అనే వ్యక్తి కోసం వేచి ఉన్నాడు. పోలీసుల రాకను గమనించి పారిపోయేందుకు ప్రయత్నించగా పట్టుకుని బ్యాగ్‌ను పరిశీలించగా, సుమారు రూ.75 వేల విలువ చేసే 3.5 కేజీల గంజాయి లభించింది. అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు. గత కొంతకాలం నుంచి గంజాయి వ్యాపారం చేస్తున్నాడని తెలిసింది.

బోనులో చిక్కిన చిరుత

మైసూరు: గ్రామస్తుల్లో భయాందోళన సృష్టించిన ఓ చిరుత పులి ఎట్టకేలకు బోనులో చిక్కిన ఘటన చామరాజనగర జిల్లా హనూరు తాలూకా మలెమహదేవేశ్వర అడవుల్లో బూదిపడగ గ్రామం వద్ద జరిగింది. పొలంలో అమర్చిన బోనులో సుమారు 6–7 ఏళ్ల వయస్సుగల చిరుత పడింది. కొన్ని రోజుల క్రితం ఈ ప్రాంత పొలాల్లో రైతులు కట్టివేసిన గొర్రెలు, మేకలు, కుక్కలు, పెంపుడు జంతువులపై చిరుత దాడి చేసి వాటిని చంపి తింది. దీంతో ప్రజలు భయాందోళన చెందారు. వారి ఫిర్యాదు మేరకు అటవీ సిబ్బంది పలు బోనులను అమర్చగా, చిరుత పట్టుబడింది. డీఆర్ఎఫ్ఓ కృష్ణప్ప నాయక్, సిబ్బంది విఠల్, యమునప్ప, పరివర్తన చిరుతను తరలించారు.

ఇద్దరికి రూ 1.34 కోట్ల శఠగోపం

- మైసూరులో సైబర్ నేరాల జోరు



మైసూరు: రాష్ట్రంలో సైబర్ నేరగాళ్లు మైసూరుపైనే కన్నేశారు. దీంతో తరచూ ఇక్కడ ప్రజలు పెద్దమొత్తంలో మోసపోతున్నారు. రెండు వేర్వేరు సంఘటనల్లో అధిక లాభాలకు ఆశపడి ఆన్‌లైన్ ద్వారా పెట్టుబడులు పెట్టి రూ.1.34 కోట్ల మేర ఇద్దరు మోసపోయారు.

రిటైర్డు అధికారికి రూ.1.07 కోట్లు

వివరాలు.. మొదటి కేసులో నగరంలోని కువెంపునగర నివాసి, రిటైర్డ్ అధికారి శంకర్‌రావు ఫేస్‌బుక్ చూస్తుండగా షేర్‌మార్కెట్‌లో పెట్టుబడి పెట్టాలని ఒక ప్రకటన వచ్చింది. అందులోని నంబర్‌కు కాల్ చేయగా తాము గోల్డ్‌మ్యాన్ శాక్స్ అనే యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఆ యాప్ ద్వారా బాధితుడు వివిధ బ్యాంకుల ఖాతాలకు రూ.1.07 కోట్లను బదిలీ చేశాడు. పెద్దమొత్తంలో లాభం వచ్చినట్లు నకిలీ మెసేజ్‌లు వచ్చాయి. లాభం, అసలు ఇవ్వాలని ఆయన మోసగాళ్లను కోరగా యాప్‌ను, ఫోన్ నంబర్లను బ్లాక్ చేశారు.

- రెండో కేసులో ఉదయగిరి నివాసి షరీఫ్ అనే వ్యక్తిని వంచకులుఒక షేర్ల ట్రేడింగ్ వాట్సాప్ గ్రూప్‌లో చేర్చారు. జీఎస్ కంపెనీ ద్వారా షేర్‌మార్కెట్‌లో డబ్బు పెట్టుబడి పెట్టాలని గ్రూప్ నిర్వాహకులు ఆయనను ఒత్తిడి చేశారు. ఇలా దశల వారీగా రూ.27 లక్షలను పెట్టుబడి పెట్టి మోసపోయాడు. ఈ రెండు ఘటనలపై సైబర్ పోలీసులు కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కెఫే పేలుడు రీ కన్‌స్ట్రక్షన్


- ఘటనాస్థలికి నిందితుడు ముసావిర్‌ను తీసుకొచ్చిన ఎన్ఐఏ
- త్వరలో చార్జిషీటు దాఖలు



రామేశ్వరం కెఫె



కెఫెలో బాంబు అమర్చిన నిందితుడు ముసావిర్



యశవంతపుర: బెంగళూరుతో పాటు రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మహదేవపుర వైట్‌ఫీల్డ్‌లో రామేశ్వర కెఫెలో బాంబ్ పేలుడు కేసులో ఉగ్రవాదిని సోమవారం ఉదయం ఎన్ఐఏ అధికారులు కెఫెకు తీసుకొచ్చి విచారణ చేశారు. కెఫెలో బాంబు పెట్టిన నిందితుడు ముసావిర్ హుసేన్ షాజిబ్‌ను తీసుకువచ్చి, మార్చి 1వ తేదీన ఎలా పేలుడుకు పాల్పడ్డారో సవివరంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా ఉదయమే పెద్దసంఖ్యలో పోలీసులు కెఫెకు వచ్చి జనాల్ని పంపించివేశారు. ఘటన జరిగిన రోజు నిందితుడు ఎక్కడి నుంచి కెఫెకు వచ్చాడు, ఎక్కడ బ్యాగ్ పెట్టి వెళ్లాడు అనేది సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేశారు. ఆ రోజున అతడు వేసుకున్న బట్టలు, క్యాప్‌ని తొడిగించి, బ్యాగ్‌ను తగిలించి మొత్తం వీడియో రికార్డింగ్ చేశారు. కెఫె సమీపంలోని బస్టాండ్ వద్దకు తీసుకెళ్లి నిందితుడు అక్కడ ఏం చేశాడో అలాగే చేయించారు. బస్సు కోసం ఎంతసేపు ఎక్కడ కూర్చున్నాడనేది కూడా వీడియో తీశారు. కొన్ని గంటలపాటు ఈ ప్రక్రియ సాగింది. జనం ఎవరూ ఫోటోలు తీయకుండా పోలీసులు అడ్డుకున్నారు.

కేసు క్రమం ఇదీ..

ఆ రోజు పేలుడులో ముగ్గురు హోటల్ సిబ్బందితో పాటు 15 మంది వరకూ గాయపడ్డారు. కేసును మొదట సీసీబీ పోలీసులు విచారణ చేయగా, ఆ తరువాత ఎన్ఐఏ స్వీకరించింది. చిక్కమగళూరులో ముజామిల్ షరీఫ్‌ను అరెస్ట్ చేసి విచారించగా ప్రముఖ నిందితుడు ముసావీర్, అబ్దుల్ మతీన్ తాహ గురించి చెప్పాడు. ఏప్రిల్ 16న ఇద్దరినీ పశ్చిమ బెంగాల్‌లో అరెస్ట్ చేశారు. ఐదవ నిందితుడు షోయబ్ అహమ్మద్ మీర్జాను అరెస్ట్ చేశారు. దేశంలో భయోత్పాతం సృష్టించడానికి తాము ఈ పేలుడుకు పాల్పడినట్లు తెలిపారు. విచారణ ముగింపు దశలో ఉందని, పూర్తి చేసి త్వరలోనే చార్జిషీటును దాఖలు చేస్తామని ఎన్ఐఏ అధికారులు తెలిపారు.

వయనాడుకు పసి హృదయాల సాయం



శ్రేయా

శివమొగ్గ: కేరళలో వయనాడులో భారీ వరదల వల్ల కొండచరియలు విరిగిపడి వందలాది మంది చనిపోగా మరెంతో మంది గాయపడ్డారు. వేలాది మంది కట్టుబట్టలతో మిగిలారు. ఈ సమయంలో కొందరు పెద్ద మనసుతో చేతనైన సహాయం చేస్తున్నారు. ఈ క్రమంలో శివమొగ్గ జిల్లా హొసనగర తాలూకా రిప్పన్‌పేటకు చెందిన 9వ తరగతి విద్యార్థిని, రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడాకారిణి శ్రేయా తనకు వచ్చిన క్రీడా ఉపకార వేతనం రూ. 10 వేలను వయనాడు బాధితులకు పంపుతున్నట్లు తెలిపింది. ఆమె సోదరుడు స్రవంత్ దాచుకున్న రూ.5 వేలను విరాళంగా అందించాడు. తహసీల్దార్ రష్మి వారి విరాళాన్ని స్వీకరించి అభినందించారు.

సీసీబీ సీఐ ఆత్మహత్య!

- బిడది వద్ద చెట్టుకు ఉరి



సీఐ తిమ్మేగౌడ(ఫైల్)

యశవంతపుర: బెంగళూరు సీసీబీ సీఐ తిమ్మేగౌడ (54) అనుమానాస్పదంగా ఆత్మహత్య చేసుకున్నారు. బిడది సమీపంలో చెట్టుకు ఉరి వేసుకున్న స్థితిలో తిమ్మేగౌడ శవమై తేలాడు. సోమవారం ఉదయం ఆ దృశ్యం చూసిన స్థానికులు వెంటనే బిడది పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని స్థానిక ఆస్పత్రికి తరలించారు.

టపాకుల పేలుళ్ల కేసులో సస్పెన్షన్

చన్నపట్టణ తాలూకాకు చెందిన తిమ్మేగౌడ మొదట ఎస్ఐగా చేరారు. విధానసౌధ ఎన్నికల సమయంలో బిడది నుంచి అత్తిబెలెకి బదిలీ చేశారు. 2023లో అత్తిబెలె వద్ద టపాకాయల పేలుడు జరిగి 10 మంది వరకూ మరణించారు, ఈ ఘటనలో స్థానిక సీఐ తిమ్మేగౌడను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. తరువాత కుంబళగోడులో పోస్టింగ్ ఇవ్వగా మళ్లీ బదిలీపై సీసీబీకి వచ్చారు. ఆయన బిడదిలో అద్దె ఇంట్లో నివసిస్తుండగా, కుటుంబం మైసూరులో ఉంటోంది. అవినీతి, అక్రమ ఆస్తులపై తిమ్మేగౌడపై లోకాయుక్తలో కేసు నడుస్తోంది. ఈ కేసులు, సస్పెన్షన్‌తో విరక్తి కలిగి ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఎలాంటి డెత్‌నోటు లభించలేదు. ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారో విచారణలో తెలుస్తుందని రామనగర ఎస్పీ కార్తీక్‌రెడ్డి తెలిపారు. యాదగిరిలోఎస్ఐ పరశురాం మృతి తరువాత మరో సీఐ ఆత్మహత్యతో పోలీసుశాఖలో కలకలం ఏర్పడింది.

డ్రైవర్ లేని మెట్రో రైళ్ల సంచారం

- ఎల్లో మార్గంలో ట్రయల్ రన్
- రైళ్లు, బోగీల కొరతతో పథకం ఆలస్యం!



ఎల్లో మార్గంలో నడిచే డ్రైవర్ రహిత రైలు

బనశంకరి: నమ్మ మెట్రో ఎల్లో మార్గంలో ప్రయోగాత్మకంగా రైలు సంచారం ప్రారంభమైంది. ఇందులో విశేషం ఏమిటంటే ఈ మార్గంలో డ్రైవర్ రహిత రైళ్లు సంచరిస్తాయి. కానీ పూర్తిస్థాయి సంచారం ఆలస్యమయ్యే అవకాశం ఉంది. 2017లో ఈ మార్గం మెట్రోపనులు ప్రారంభం కాగా స్టేషన్లతో పాటు వివిధ పనులు అంతిమ దశలో ఉన్నాయి. రెండు రైళ్లను చైనా నుంచి తెప్పించారు. 18.82 కిలోమీటర్ల పొడవైన ఎల్లో మార్గంలో సంచారం ప్రారంభమైతే నగర ట్రాఫిక్ రద్దీ కొంచెం తగ్గుతుంది. 30కి పైగా ప్రయోగాత్మక పరీక్షలు చేశారు. రైల్వే సురక్షతా కమిషనర్ పరిశీలించి ఆమోదం తెలిపితే ప్రయాణికులతో కూడిన సర్వీసులు మొదలవుతాయని మెట్రో అధికారులు తెలిపారు.

రైళ్లు, బోగీలు కావాలి

ఈ మార్గంలో ప్రస్తుతం రెండు రైళ్లు ప్రయోగాత్మకంగా నడుస్తున్నాయి. పూర్తి పరీక్షలకు మరికొన్ని రైళ్ల అవసరం ఉంది. ఇంజిన్లు వచ్చాయి కానీ బోగీలు ఇంకా నిర్మాణదశలో ఉన్నాయి. మూడు నాలుగు నెలల్లో బోగీలు వచ్చే అవకాశం ఉంది. ఈ మార్గంలో 6 రైళ్లు అవసరం. ఒక్కో రైలుకు 6 బోగీలు చొప్పున ఉంటాయి.

ఈ మార్గంలో స్టేషన్లు ఇవే

ఎల్లో మార్గంలో వచ్చే మెట్రోస్టేషన్లు.. బొమ్మసంద్ర, హెబ్బగోడి, హొస్కూరురోడ్డు, ఇన్ఫోసిస్ ఫౌండేషన్, ఎలక్ట్రానిక్ సిటీ, బిరిటిన అగ్రహార, హొసరోడ్డు, సింగసంద్ర, కూడ్లు గేట్, హొంగసంద్ర, బొమ్మనహళ్లి, సెంట్రల్ సిల్క్ బోర్డు, బీటీఎం లేఔట్, జయదేవ ఆసుపత్రి, రాగిగుడ్డ , ఆర్‌వీ.రోడ్డు స్టేషన్లు ఉన్నాయి.

క్లుప్తంగా

సీఎం పర్యటన రద్దు

దొడ్డబళ్లాపురం: రాష్ట్రంలో భారీ వర్షాలతో నష్టపోయిన ప్రదేశాల్లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య నేడు (మంగళవారం) విజయనగర, కొప్పళలకు భేటీ ఇవ్వాల్సి ఉండగా ఆ పర్యటన రద్దు చేశారు. ముడా కుంభకోణానికి సంబంధించి గవర్నర్ థావర్ చంద్ గెహ్లోట్ సీఎంకు వ్యతిరేకంగా ప్రాసిక్యూషన్‌కు అనుమతించాలా వద్దా అనే విషయంలో నిర్ణయం తీసుకోనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి కార్యక్రమాలు రద్దు చేసుకున్నారు. ఈ మేరకు సీఎంఓ ఒక ప్రకటన విడుదల చేసింది.

గవర్నర్ నోటీసు ఉపసంహరించుకోవాలి



ధర్నా చేస్తున్న కురుబ సంఘాల నాయకులు

తుమకూరు: అహింద వర్గాల నాయకుడు, ముఖ్యమంత్రి సిద్దరామయ్యపై అనవసర ఆరోపణలు చేసి ఆయన తేజోవధ చేసేందుకు బీజేపీ, జేడీఎస్ మిత్ర పక్షాలు రాష్ట్ర గవర్నర్ అధికారాన్ని దుర్వినియోగపరుచుకుంటున్నారని ఆరోపిస్తూ కురుబ సముదాయ నాయకులు సోమవారం కర్ణాటక ప్రదేశ కురుబ సంఘం నేతృత్వంలో ఆందోళన చేపట్టి జిల్లాధికారికి వినతిప్రతం సమర్పించారు. అంతకు ముందు నగరంలోని టౌన్‌హాల్ సర్కిల్ నుంచి జిల్లాధికారి కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ముఖ్యమంత్రికి ఇచ్చిన నోటీసును గవర్నర్ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో కనక యువసేన అధ్యక్షుడు కెంపరాజు, జిల్లా కురుబ సంఘం అధ్యక్షుడు టీఆర్ సురేష్, కనక మహిళా పరపతి సహకార సంఘం అధ్యక్షురాలు సునీతా నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మేకెదాటుకు అనుమతులు ఇప్పించండి

యశవంతపుర: మేకెదాటు పథకానికి అనుమతి ఇప్పించాలని రాష్ట్ర మంత్రి కృష్ణ బైరేగౌడ కేంద్రమంత్రి హెచ్‌డీ కుమారస్వామికి విజ్ఞప్తి చేశారు. సోమవారం చిక్కమగళూరులో విలేకరులతో మాట్లాడిన కృష్ణబైరేగౌడ భద్రా ఎగువకాలువ, కళస బండూరి పథకాలను కేంద్రం పట్టించుకోలేదని, బయలుసీమ జిల్లాలకు తాగునీరు అందించే మేకెదాటు పథకానికి కేంద్రం నుంచి అనుమతి ఇప్పించాలని, అప్పుడే తాను చేతులు జోడించి ధన్యవాదాలు చెబుతానని అన్నారు. అప్పుడే కేంద్రంలో మంచి పదవి లభించినందుకు సార్థకమవుతుందని అన్నారు.

రెండు కార్లు ఢీ.. ముగ్గురికి గాయాలు



ధ్వంసమైన కారు

విజయపుర: భత్రేనహళ్లి వద్ద రెండు కార్లు ఢీకొనడంతో శిశువుతో పాటు దంపతులు గాయపడిన ఘటన ఆదివారం జరిగింది. వివరాలు.. యలహంక తాలూకా హొసహళ్లికి చెందిన భరత్, సాధనగౌడ అనే దంపతులు తమ ఇద్దరు పిల్లలతో కలిసి శిడ్లఘట్ట తాలూకాలోని అప్పేగౌడనహళ్లి గేట్ సమీపంలోని బయలాంజనేయ స్వామి ఆలయానికి కారులో వెళ్లి దర్శించుకుని పూజలు చేసి తిరిగి వస్తుండగా బత్రేనహళ్లి చెరువు వద్ద విజయపుర వైపు నుంచి వేగంగా వస్తున్న థార్ జీపు గడ్డిమోపులను తరలిస్తున్న ద్విచక్ర వాహనదారుడిని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వచ్చిన స్విఫ్ట్ కారును ఢీకొట్టాడు. దీంతో స్విఫ్ట్ కారు ముందు భాగం నుజ్జయింది. థార్ జీప్ ముందు భాగం చక్రం ఊడిపోయింది. స్విఫ్ట్ కారులోని దంపతులు, ఒక కుమారుడికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను దేవనహళ్లిలోని మానస ఆస్పత్రిలో చేర్పించారు. థార్ కారులోని కణ్నూరుకు చెందిన యువకులకు గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేశారు.

సర్కారు త్వరలోనే పతనం: కుమార

దొడ్డబళ్లాపురం: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని, ప్రభుత్వం పతనమయ్యే సమయం వచ్చిందని కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి అన్నారు. బీజేపీ, జేడీఎస్ పార్టీలు చేపట్టిన చలో మైసూరు పాదయాత్రలో పాల్గొన్న కుమారస్వామి కెంగల్ ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పాపాల కుండ నిండిందన్నారు. పాలించడానికి కాంగ్రెస్ అర్హత పోగొట్టుకుంటోందన్నారు. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ పరిపాలన వదిలేసి నిత్యం తన పేరు స్తుతిస్తున్నారన్నారు. డీకే ఉత్తుత్తి బెదిరింపులకు తాను భయపడేది లేదన్నారు. మాజీ సీఎం యడియూరప్పను తాను జైలుకి పంపించలేదని, అప్పటి పరిస్థితులు అలా ఉన్నాయని చెప్పారు.

బాల కళాకారుల నృత్య కౌశల్యం

మైసూరు: నగరంలోని ముక్తగంగోత్రిలోని కర్ణాటక ఓపెన్ యూనివర్సిటీ స్నాతకోత్సవ భవనంలో రెండు గంటల పాటు సాగిన విద్యార్థుల నృత్యరూపకాలు రంజింపజేశాయి. పాఠశాల విద్యార్థులు 550 మంది ఎలాంటి విరామం లేకుండా చేసిన నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. వందేమాతరం, భారత్ మాతా కీ జై అంటూ నినదించి ప్రోత్సహించారు. కశ్మీర్‌లో దేశ భద్రత కోసం వీరయోధులు చేసే త్యాగబలిదానాల నృత్యరూపకం అలరించింది. ఈశాన్య భారతపు ప్రసిద్ధ వెదురు నృత్యం, కర్ణాటక పిళి నలికె, వీరగాసె, కోలాటం, డోలు నృత్యం, జార్ఖండ్‌కు చెందిన పైకా, లడాక్ కథోక్ చెన్మో, మధ్యప్రదేశ్ మట్కి, నాగాల్యాండ్ చాంగ్‌లూ, హిమాచల్‌ప్రదేశ్ నాటి, త్రిపుర హొజగిరి తదితర 36 రకాల నృత్యాలతో బాల కళాకారులను తన్మయుల్ని గావించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు బాలలను సన్మానించారు.





వివిధ రకాల నృత్యాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు



ప్రమాణపత్రాన్ని అందిస్తున్న దృశ్యం

ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇవ్వండి

బనశంకరి: బెంగళూరు మహానగర పాలికె పరిధిలో స్వచ్ఛత కాపాడటానికి ఖాళీ స్థలాలను గుర్తించి వాటి యజమానులకు నోటీస్ జారీచేసి జరిమానా విధించాలని బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ అధికారులకు సూచించారు. సోమవారం బీబీఎంపీలో వివిధ విషయాలకు సంబంధించి పాలికె కేంద్ర కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో తుషార్ మాట్లాడుతూ... ఆయా వలయాల పరిధిలో ఖాళీ స్థలాలను గుర్తించి యజమానులకు నోటీసు ఇవ్వాలన్నారు. అదే విధంగా పాలికె పరిధిలో అనధికార ప్రకటనలు ఫ్లెక్సీలు, బ్యానర్లకు అడ్డుకట్టవేసే ఉద్దేశంతో ఆయా వలయ పరిధిలో ప్రింటిగ్ ప్రెస్‌లకు నోటీస్ జారీచేసి హెచ్చరించాలని తెలిపారు. ఇక పాలికె పరిధిలో రోజు 160 నుంచి 170 డెంగీ కేసులు కనబడుతున్నాయని అన్నారు. సమావేశంలో ప్రత్యేక కమిషనర్లు మునీశ్ మౌద్గిల్, డాక్టర్ కే.హరీశ్‌కుమార్, సురళ్కర్ వికాస్‌కిశోర్, శివానంద్ కల్కెరె, అవినాశ్ మెనన్ రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తుషార్

వర్సిటీ స్నాతకోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

- ముగ్గురికి గౌరవ డాక్టరేట్లు
- 36 మందికి పీహెచ్‌డీ

తుమకూరు: ఈనెల 7న తుమకూరు విశ్వవిద్యాలయ 17వ స్నాతకోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వైస్ చాన్స్‌లర్ వెంకటేశ్వర్లు తెలిపారు. వర్సిటీలోని సర్ ఎం.విశ్వేశ్వరయ్య సభాంగణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్నాతకోత్సవంలో క్రీడలు, సంస్కృతి విభాగంలో జలక్రీడల సాహసికుడు, సామాజిక కార్యకర్తగా గుర్తింపు పొందిన జిల్లాలోని సుగ్గనపాళ్యకు చెందిన ఎస్‌సీ నాగానంద స్వామి, సామాజిక సేవా విభాగంలో పారిశ్రామికవేత్త హెచ్‌జీ చంద్రశేఖర్, ఆధ్యాత్మిక, సామాజిక సేవా విభాగంలో దావణగెరె జిల్లా హరిహర తాలూకా రాజనహళ్లి శ్రీమహర్షి వాల్మీకి గురుపీఠం శ్రీశ్రీశ్రీ జగద్గురు వాల్మీకి ప్రసన్నానందస్వామీజీతో సహా ముగ్గురికి గౌరవ డాక్టరేట్లు, 36 మంది అభ్యర్థులకు పీహెచ్‌డీలను ప్రదానం చేస్తారన్నారు. రాష్ట్ర గవర్నర్, వర్సిటీ చాన్స్‌లర్ థావర్‌చంద్ గెహ్లోట్ అధ్యక్షత వహిస్తారని, రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ మంత్రి, వర్సిటీ సమకులాధిపతి డాక్టర్ ఎంసీ సుధాకర్, ఇస్రో విశ్రాంత అధ్యక్షుడు డాక్టర్ ఏఎస్ కిరణ్‌కుమార్ పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో వర్సిటీ రిజిస్ట్రార్లు వాహిదీ జమ్‌జమ్, ప్రొఫెసర్ కే.ప్రసన్నకుమార్, జర్నలిజం విభాగాధిపతి సిబంతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ వెంకటేశ్వర్లు

రేవణ్ణ కేసులో ఉన్న హడావుడి వాల్మీకి కుంభకోణంలో లేదెందుకు ?

- ప్రతిపక్ష నేత ఆర్ అశోక్

దొడ్డబళ్లాపురం: రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్‌డీ రేవణ్ణ కేసుపై ఉన్న ఆసక్తి వాల్మీకి అభివృద్ధి మండలిలో జరిగిన కుంభకోణంపై ఎందుకు లేదని ప్రతిపక్ష నేత ఆర్ అశోక్ ప్రశ్నించారు. రేవణ్ణ కుటుంబం విషయంలో ప్రభుత్వం అర్జెంటుగా సిట్ ఏర్పాటు చేసి నోటీసులు ఇచ్చి, అరెస్టులు చేసారు. ఇదే శ్రద్ధ వాల్మీకి అభివృద్ధి మండలిలో జరిగిన అవినీతిపై ఎందుకు చూపించడం లేదని సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్‌లో ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు అశోక్ కొన్ని ప్రశ్నలు సంధించారు. సిట్ ఏర్పాటు చేసిన మీరు 40 రోజులు గడిచినా మాజీ మంత్రి నాగేంద్రకు, ఎమ్మెల్యే బసవరాజు దద్దల్‌కు ఎటువంటి నోటీసులు ఇవ్వలేదు. కనీసం పిలిచి విచారించలేదు. కాబట్టి ఈ అవినీతి వెలుగులోకి రావడం మీకు ఇష్టంలేదా? సిట్ మీ చేతిలో కీలుబొమ్మ అనడానికి పరశురాం, పద్మనాభ్‌ల మధ్య ఫోన్ సంభాషణ సాక్ష్యమన్నారు. ఈడీ, సీబీఐ అయితే తమకు జైలే గతి అని, అదే సిట్ అయితే చూసుకోవచ్చు అన్న పద్మనాభ్ మాటలు నిజమా కాదా అని ప్రశ్నించారు. మాజీ మంత్రి నాగేంద్ర అధికారులను పిలిచి తన పేరు ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పవద్దని, చెబితే మిమ్మల్ని కాపాడడం సాధ్యకాదని, తాను అధికారంలో ఉంటేనే మంచిదని చెప్పిన సంగతి నిజమా కాదా? అని ప్రశ్నించారు.


వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

మాలూరు: గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కెవై నంజేగౌడ తెలిపారు. సోమవారం తాలూకాలోని టేకల్ ఫిర్కా కెజి హళ్లి గ్రామంలో ఎంవిజె మెడికల్ కళాశాల, పరిశోధనా ఆస్పత్రి, కెజిహళ్లి గ్రామ పంచాయతీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రజలు కాలానుగుణంగా వైద్య పరీక్షలను చేయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, ఆస్పత్రి వైద్యులు, అధికారులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

గజ చొరబాట్ల నివారణపై సదస్సు



మైసూరు జిల్లాలో బండీపుర అడవుల్లో రహదారి పక్కన గజ సంచారం (ఫైల్)

- 12న జీకేవీకేలో నిర్వహణ: మంత్రి

బొమ్మనహళ్లి: కర్ణాటక అటవీ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన ప్రపంచ ఏనుగుల దినోత్సవం వేడుకలను నిర్వహించనున్నారు. అదే రోజు బెంగళూరు జీకేవీకేలో మానవ, ఏనుగుల సంఘర్షణ అనే అంశంపై అంతర్జాతీయ సదస్సును ఏర్పాటు చేసినట్లు అటవీ మంత్రి అయిన ఈశ్వర ఖండ్రె తెలిపారు. బెంగళూరు విధానసౌధలో ఆయన మీడియాతో మాట్లాడారు. అమెరికా, జర్మనీ, జపాన్, యూకేతో పాటు సుమారు 11 దేశాల నుంచి సుమారు 17 మందికి పైన ప్రతినిధులు, దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 660 మంది ప్రతినిధులు ఈ ఒక్క రోజు సదస్సులో పాల్గొంటారని తెలిపారు. వన్యప్రాణుల చొరబాట్లను అరికట్టేందుకు ఆయా దేశాల్లో అనుసరించే విధానాల గురించి సదస్సులో చర్చిస్తారని తెలిపారు.

ఏనుగులలో కర్ణాటక ప్రథమం

రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన చర్యల వలన వన్యప్రాణుల సంతతి పెరిగిందన్నారు. రాష్ట్రంలో 6,395 ఏనుగులు ఉన్నాయని, దేశంలో ఇది మొదటిస్థానమని మంత్రి చెప్పారు. 563 పులులతో దేశంలో 2వ స్థానంలో ఉందని చెప్పారు. అటవీ విస్తీర్ణం పెరగక పోవడంతో ఏనుగులు అడవుల నుంచి గ్రామాల్లోకి వచ్చి రైతులు సాగు చేసిన పంటలను నాశనం చేస్తున్నాయన్నారు. అడవుల్లో ఆహారం లేక నీరు లేక అనేక జంతువులు ఊళ్లలోకి వస్తున్నాయన్నారు.

ఈ విషయంలో కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

కెజీఎఫ్: తాలూకాలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు తమ సమస్యలను పరిష్కరించాలని సోమవారం తహసీల్దార్ నాగవేణికి వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ అర్హత ఆధారంగా ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులుగా ప్రమోషన్ ఇవ్వాలని కోరారు. సుమారు 80 వేల మంది ఉపాధ్యాయులు డిగ్రీతో పాటుగా బీఈడీ విద్యార్హత కలిగి ఉన్నారని, వీరిని పట్టభద్ర ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులుగా పరిగణించాలని డిమాండ్ చేశారు. సంఘం నేతలు నరసింహమూర్తి, నాగభూషణ, రవిచంద్ర నాయుడు, పివి శ్రీనివాస్ పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

మిస్ యూనివర్స్ సందడి



జ్యోతి వెలిగిస్తున్న దృశ్యం

బొమ్మనహళ్లి: బెంగళూరు నగరంలోని కనకపుర రోడ్డు రఘువనహళ్లిలో సోమవారం మిస్ యూనివర్స్, కర్ణాటక అవని కాకేకొచ్చిభట్ సందడి చేశారు. ఓ బ్యూటీ సెంటర్‌ను ఆమె ప్రారంభించారు. అనంతరం తన అందానికి ఇక్కడ మెరుగులు దిద్దుకున్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రముఖులు ప్రాంజల్ కుమార్, డైరెక్టర్లు అమిత్ కుమార్, సంజీవకుమార్ సిన్హా తదితరులు పాల్గొన్నారు.



తుంగభద్రకు తగ్గుతున్న వరద

హొసపేటె: తుంగభద్రకు వదరద తగ్గుముఖం పట్టింది. గత పది రోజుల నుంచి భారీగా వరద నీరు పోటెత్తిన విషయం తెలిసిందే. సోమవారం డ్యాంకు 83 వేల క్యూసెక్కుల మేర వరద నీరు వచ్చి చేరడంతో డ్యాం వద్ద 12 గేట్లను రెండు అడుగులు మేర పైకెత్తి దిగువకు సుమారు 32 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం డ్యాంలో నీటిమట్టం 1631.59 అడుగులకు, నీటి నిల్వ 98.820 టీఎంసీలకు వరకు చేరుకొంది.

కోలారు వార్తలు...

డిమాండ్లు పరిష్కరించండి

శ్రీనివాసపురం: తమ డిమాండ్లు పరిష్కరించాలని తాలూకాలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం పదాధికారులు సోమవారం బీఈఓ, తహసీల్దార్ ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు బయ్యారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల ప్రమోషన్ల విషయంలో అనేక గందరగోళాలు ఉన్నాయని, వాటిని సరిచేయాలని డిమాండ్ చేశారు. సుమారు 80 వేల మంది ఉపాధ్యాయులు డిగ్రీతో పాటు బీఈడీ విద్యార్హత కలిగి ఉన్నా వీరిని పట్టభద్ర ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులుగా పరిగణించకపోవడం దురదృష్టకరమన్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగాప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం ప్రధాన కార్యదర్శి శివణ్ణ, జిల్లా కోశాధికారి రోణూరు రెడ్డప్ప, తాలూకా ఉపాధ్యక్షుడు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

సర్కారుకు మద్దతుగా ధర్నా

కోలారు: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిర పరచడానికి బీజేపీ– జేడీఎస్‌లు కుట్రలు చేస్తున్నాయంటూ కాంగ్రెస్ పార్టీ, వెనుకబడిన వర్గాల సముదాయ నేతలు సోమవారం నగరంలోని బస్టాండు సర్కిల్ వద్ద ప్రతిఘటన నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎంఎల్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం సిద్దరామయ్యను అస్థిర పరచడానికి బీజేపీ – జేడీఎస్ కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాలు కలిసి గవర్నర్ తో కలిసి ప్రభుత్వాన్ని కూలదోసే ప్రయత్నం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం గవర్నర్ పోస్టును దుర్వినియోగం చేసుకుంటున్నారు. గవర్నర్ ముఖ్యమంత్రికి నోటీసులు ఇవ్వడంలో అర్థం లేదు. గవర్నర్ కేంద్రం చేతిలో కీలుబొమ్మగా మారిపోయారని ఆరోపించారు. ఈ ధర్నాలో కెవి గౌతం, ఊరుబాగిలు శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకుడు ఎల్ఎ మంజునాథ్, సీసంద్ర గోపాలగౌడ పాల్గొన్నారు.



ప్రతిఘటన నిర్వహిస్తున్న దృశ్యం

వీధి కుక్కలను నియంత్రించండి

కోలారు: బంగారు పేట పట్టణంలో వీధి కుక్కల బెడద అధికంగా ఉందని వాటిని నియంత్రించాలని కోరుతూ రైతు సంఘం పదాధికారులు సోమవారం పట్టణ పురసభ ముఖ్యాధికారి సత్యనారాయణకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె నారాయణగౌడ మాట్లాడుతూ.. పట్టణంలో వీధి కుక్కల సంతతి పెరిగిపోయిందని, దీంతో పలువురు కుక్కల దాడిలో గాయపడుతున్నారన్నారు. వీటి సంతతి నియంత్రించాలని పలుమార్లు పురసభ అధికారుల దృష్టికి తీసుకుపోయినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరచి కుక్కలను కట్టడి చేయాలన్నారు. అనంతరం అధికారికి వినతిపత్రం అందజేశారు. వినతి సమర్పించిన వారిలో జిల్లా అధ్యక్షుడు ఈకంబళ్లి మంజునాథ్, తాలూకా అధ్యక్షుడు కదరినత్త అప్పోజిరావ్, మంగసంద్ర తిమ్మణ్ణ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

గంజాయి విక్రేత అరెస్ట్



స్వాధీనం చేసుకున్న గంజాయి

కెజీఎఫ్: తాలూకాలోని బూదికోట పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి అతని వద్ద రూ. లక్ష 60 వేల విలువైన కేజీన్నర గంజాయి స్వాధీనం చేసుకున్నారు. బూదికోట సమీపంలో గంజాయిని విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ సునీల్ సిబ్బందితో వెళ్లి దాడి చేసి బంగారుపేట పట్టణానికి చెందిన సుశాంత్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు.

ట్రాక్టర్ బోల్తా.. రైతు మృతి



ప్రమాద దృశ్యం

మండ్య: పొలానికి వెళుతుండగా ట్రాక్టర్ అదుపు తప్పి విశ్వేశ్వరయ్య కాలువలోకి బోల్తా పడిన ఘటనలో ఓ రైతు మరణించిన ఘటన సోమవారం జిల్లాలోని పాండవపుర తాలూకా కాళేనహళ్లి గ్రామం వద్ద జరిగింది. గ్రామానికి చెందిన రైతు నవీన్ (34) పొలంలో దుక్కి దున్నేందుకు ట్రాక్టర్‌తో కాలువ గట్టుపై వెళుతుండగా అదుపు తప్పి ట్రాక్టర్‌తో సహా కాలువలోకి బోల్తా పడ్డాడు. కాలువలో నీరు నిండుగా ఉండటంతో నవీన్ మృత్యువాత పడ్డాడు. మృతదేహం కోసం గాలింపు చేపట్టడం కష్టకరం కావడంతో కాలువకు నీటి పరిమాణాన్ని తగ్గించిన పోలీసులు కాలువలో గాలించగా ప్రమాద స్థలానికి కొంతదూరంలో మృతదేహం లభించింది. మేలుకోటె పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ప్రవాహంలో పడి బాలుడు..

యశవంతపుర: కాలువలో జారి పడి బాలుడు మృతి చెందిన ఘటన బెళగావి జిల్లా చిక్కోడిలో జరిగింది. చిక్కోడి తాలూకా జోడకురళి గ్రామానికి చెందిన అరుణఖద్ది(4) మృతి చెందారు. ఘటప్రభ ఎడమ కాలువలో ఆడుకోవడానికి వెళ్లి కాలుజారి ప్రవహిస్తున్న నదిలో పడి మృతి చెందాడు. భారీ వానల కారణంగా కాలువ జోరుగా ప్రవహిస్తోంది. చిక్కోడి పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

ముందు మీ అన్నగారి లెక్కలు ఇవ్వండి

- కుమారస్వామికి డీసీఎం ప్రశ్న

దొడ్డబళ్లాపురం: ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కేంద్రమంత్రి కుమారస్వామి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రలపై మరోసారి ఫైర్ అయ్యారు. సోమవారం సదాశివనగర్‌లోని తమ నివాసం వద్ద మీడియాతో మాట్లాడిన ఆయన ముందు బీజేపీ, జేడీఎస్ వారు తమ ప్రశ్నలకు బదులిస్తే తరువాత తాము సమాధానాలు చెబుతామన్నారు. కుమారస్వామి ఆయన అన్నగారి ఆస్తులు లెక్కలు ఇవ్వాలన్నారు. కేంద్రం నుండి నిధులు ఎందుకు విడుదల కావడం లేదని ప్రశ్నించారు. కుమారస్వామి, తనది జాబితాలు పరస్పరం విడుదల చేద్దామని, ఇద్దరి లెక్కలు తేల్చుకుందామన్నారు. అంతకంటే ముందు కుమారస్వామి అన్నకు వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయో ఒక్కసారి చెప్పాలన్నారు.

ప్రశాంతంగా ఎస్‌ఎస్‌ఎల్‌సి -3 పరీక్షలు



పరీక్షా కేంద్రంలో పరిశీలిస్తున్న కలెక్టర్

కోలారు : పదవ తరగతి – 3 పరీక్షలను జిల్లాలోని 10 కేంద్రాలలో సోమవారం ప్రశాంతంగా నిర్వహించారు. మొత్తం 508 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ అక్రం పాషా, డీఈఓ కృష్ణమూర్తిలు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. జిల్లాలో 2322 మంది పరీక్ష రాయడానికి రిజిష్టరు చేసుకోగా 1814 మంది హాజరయ్యారు. పరీక్షలను సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ డీఈఓ కృష్ణమూర్తికి సూచించారు.

ఎస్ఐ మృతిపై ఆందోళన

కెజీఎఫ్: యాదగిరి పోలీస్ స్టేషన్ ఎస్ఐ పరశురాం అనుమానాస్పద మృతికి కారణమైన యాదగిరి ఎమ్మెల్యే, అతని కుమారునిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కర్ణాటక దళిత సమాజ సేన సంస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సూలికుంటె ఆనంద్ నేతృత్వంలో సోమవారం బంగారుపేట పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. కోరిన చోటుకు బదిలీ కావాలంటే రూ. 30 లక్షలు ఇవ్వాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారని ఆరోపించారు. ఎమ్మెల్యే ఒత్తిడి వల్లనే ఎస్ఐ మరణించారని ఆరోపించారు. కారకులపై కఠిన చర్యలు తీసుకుని ఎస్ఐ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అయ్యప్ప, ఆటో కర్ణ, గౌతం, శివ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గంగా జయంతి



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కోలారు : గంగా జయంతి కార్యక్రమంలో భాగంగా నగరంలోని శ్రీ గంగా పరమేశ్వరి దేవి అమ్మవారి దేవాలయంలో ఆదివారం రాత్రి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని అలంకరించిన పల్లకీలో అధిష్టించి పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు,.

క్లుప్తంగా

ఆదిపరాశక్తి ఆషాఢ పూజలు



గౌరిబిదనూరు: నగర సమీపంలోని నాగప్ప బ్లాక్ వద్ద ఉత్తర పినాకినీ నది గట్టున వున్న ఆది పరాశక్తి అమ్మవారి ఆషాడ మాస ఉత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఉదయం నవ గ్రహ హోమం, చండికా హోమం, సుదర్శన హోమం, గణపతి హోమం నిర్వహించారు. సాయంత్రం మహిళలు జ్యోతులను తీసుకొని వెండి పూల పల్లకీలో ఆది పరాశక్తి అధిష్టించి ఊరేగించారు. రాత్రి అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమం జరిగింది. ప్రతి శుక్రవారం ఇక్కడ ప్రత్యేక పూజలతో పాటు అన్నదాన కార్యక్రమం ఉంటుందని ఆలయ అధ్యక్షుడు వేణు స్వామి తెలిపారు. కార్యక్రమంలో సరోజమ్మ, విజయలక్ష్మి, భాగ్య, మంజుల, వెంకటాద్రి రవి, పరమేశ, అమర్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

మండ్య: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని ఎమ్మెల్యే పీ.రవికుమార్ పేర్కొన్నారు. ఆయన సోమవారం తాలూకా పంచాయతీ కార్యాలయం వద్ద రూ.4 కోట్లతో నిర్మించనున్న టీపీ భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేసి మాట్లాడారు. టీపీ కార్యాలయం 50 ఏళ్ల క్రితం నాటిది కావడంతో కొత్త భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. ఏడాదిలోగా నిర్మాణ పనులు పూర్తవుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. టీపీ ఈఓ ఎం.బాబు, ఈఓ ఎంఎస్ వీణా, నగరసభ మాజీ అధ్యక్షుడు హెచ్‌సీ మంజు, సభ్యులు గీతా, రవి, శ్రీధర్, ప్రముఖులు రుద్రప్ప, అప్పాజి, చిదంబర్, శివప్రసాద్, అభిషేక్, తహసీల్దార్ శివకుమార్ బిరాదార్, తాలూకా ప్రణాళికాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

9 నుంచి జ్యువెల్స్ షో



బంగారు ఆభరణాలు ప్రదర్శిస్తున్న అందాల భామలు

బనశంకరి: వరమహాలక్ష్మీ పండుగ సందర్భంగా దక్షిణ భారతదేశ అతిపెద్ద ఏష్యా జ్యువెల్స్ షో సందడి చేయనుంది. బెంగళూరు నగరంలోని రెసిడెన్సీరోడ్డు రిట్జ్-కర్ల్టన్ హోటల్‌లో 9 నుంచి 11 తేదీ వరకు మూడు రోజుల పాటు అతి పెద్ద ఏష్యా జ్యువెల్స్‌షో ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకుడు హరీశ్ తెలిపారు. సోమవారం నగరంలో విలేకరులతో హరీశ్ మాట్లాడుతూ వరమహాలక్ష్మీ పండుగ సందర్భంగా బంగారు ఆభరణాలు ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామని బంగారు ధర తగ్గడంతో కొనుగోలు చేయడానికి మహిళలకు సువర్ణ అవకాశమన్నారు. బెంగళూరు, ముంబై, ఢిల్లీ, జైపూర్, హైదరాబాద్ ప్రముఖ బ్రాండ్లతో బంగారు ఆభరణాలు ప్రదర్శిస్తారని తెలిపారు.

ఆర్ఐకి సన్మానం



పుష్పగుచ్ఛం అందిస్తున్న జేసీ దాక్షాయిణి

కృష్ణరాజపురం: గత ఏడాది కాలంలో 52వ వార్డు కేఆర్‌పుర సర్కిల్‌లోనే మొత్తం రూ.27.5 కోట్ల పన్ను వసూలు చేసిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కృష్ణకు మహదేవపుర జాయింట్ కమిషనర్ డాక్టర్ దాక్షాయణి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. రాబోయే రోజుల్లో మరింత ఎక్కువగా పన్ను వసూలు చేసి బీబీఎంపీకి ఆదాయం పెంపొందించాలని సూచించారు. ఇంకా నెల రోజుల పాటు ఓటీఎస్ (వన్ టైమ్ సెటిల్‌మెంట్) గడువును పొడిగించినందున, ఆ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని రెవెన్యూ పన్ను చెల్లింపుదారులకు ఆమె విజ్ఞప్తి చేశారు.

లారీ ఢీకొని సెక్యూరిటీ గార్డు దుర్మరణం

బనశంకరి: లారీ ఢీకొని సెక్యూరిటీ గార్డు దుర్మరణం చెందిన ఘటన చిక్కబాణవార ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. బిహార్‌కు చెందిన రమానాథ్ (49) మృతి చెందిన వ్యక్తి. ఇతను శివరామకారంత్ లేఔట్ సెక్టార్ 5లో పనులు చేపడుతున్నారు. ఆదివారం రాత్రి ఇక్కడ లారీలో పైపులను తీసుకువచ్చి అన్‌లోడ్ చేసి లారీని డ్రైవరు రివర్స్ తీసుకునే ప్రయత్నంలో సెక్యూరిటీగార్డు నిలబడి ఉండటం గమనించకుండా ఢీకొట్టాడు. దీంతో రమానాథ్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. చిక్కబాణవార పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పాదచారులపై ఆటోడ్రైవర్ల దాడి

కృష్ణరాజపురం: ఆటో వస్తున్నా పక్కకు జరగలేదంటూ కోపంతో పాదచారులపై ముగ్గురు ఆటోడ్రైవర్లు దాడికి పాల్పడిన ఘటన ఆదివారం రాత్రి మారతహళ్లి వద్ద జరిగింది. ఒకే ఆటోలో వెళుతున్న ముగ్గురు ఆటో డ్రైవర్లు ఆటో నుంచి కిందకు దిగి రోడ్డుపై వెళ్తున్న పాదచారులను చితకబాదారు. ఈ దాడి వీడియో దృశ్యాలను సమీపంలోని పాదచారులు తమ మొబైల్‌లో చిత్రీకరించారు. ఘటనపై మారతహళ్లి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

పశ్చిమ కనుమల్లో ప్రకృతి వినాశనం

- చట్ట విరుద్ధంగా తవ్వకాలకు అనుమతి
- ప్రమాదాలు పొంచి ఉన్నాయని నిపుణుల గగ్గోలు
- మాధవ గాడ్గిల్, కస్తూరి రంగన్ సిఫార్సులు పట్టించుకోని ప్రభుత్వాలు



ఏటవాలు ప్రాంతాలుగా ఉన్న కనుమలను చీల్చి రోడ్లు వేసిన దృశ్యం



ప్రకృతి సౌందర్యంతో కనువిందు చేసే పడమటి కొండలు

బనశంకరి: కొడగు-కేరళ ప్రదేశాల్లో భారీ వర్షాలు కొత్తేమికాదు. ప్రస్తుతం కురిసిన వర్షాలు తరహాలో గతంలో కూడా కుంభవృష్టి వర్షాలు కురిశాయి. అప్పుడు సంభవించిన దుర్ఘటనలు అందరికీ తెలిసిందే. వృక్ష సంపద నాశనం, అడవుల ఆక్రమణ, అక్రమ గనులు, కొండలు తవ్వి రిసార్ట్స్ నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ, సమర్థకమైన జాతీయ రహదారులు ఇతర రోడ్ల నిర్మాణం, కాంక్రీట్ రోడ్ల నిర్మాణంతో నీరు సహజంగా ప్రవహించడానికి నిర్బంధం, నది తీరాలు ఆక్రమణ, ఇసుక తవ్వకం, శోలా అడవులు నాశనం తదితర వాటితో కేరళ వయనాడ్ ప్రకృతి వైపరీత్యాలకు కారణమౌతున్నాయి. పర్యావరణ శాస్త్రవేత్తలు తెలిపిన ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులు ప్రక్రియలతో తలెత్తే ఇలాంటి అతివృష్టి లాంటి ప్రకృతి వైపరీత్యాలను అడ్డుకోవడం అసాధ్యం. కానీ వాటి దుష్పరిణామాలను చాలా వరకు తగ్గించడం సాధ్యంకావచ్చు. పశ్చిమ కనుమలు లాంటి సూక్ష్మ ప్రదేశాలు కాపాడటానికి గతంలో అనేక పోరాటాలు జరిగాయి. అంతేగాక పర్యావరణ శాస్త్రవేత్తలు అధ్యయనాలతో పశ్చిమ కనుమలు గురించి ఆధునికంగా వివరించారు. సూక్ష్మ ప్రదేశాలను సంరక్షించుకోవడానికి అత్యంత ఆధునిక విధానాలను సూచించారు.

పర్యావరణ రీత్యా సున్నితమైనది :

పశ్చిమ కనుమలు గుజరాత్ నుంచి కేరళ వరకు ఆరు రాష్ట్రాల్లో 44 జిల్లాలు, 142 తాలూకాల్లో విస్తరించిన దట్టమైన పర్వత శ్రేణులు. దక్షిణ భారతదేశ జీవనరేఖ. అనేకజీవ నదులు పుట్టుక స్థానం. ఇక్కడ గల సస్య వన్యజీవులు, పక్షులు కీటకాలు ఇతర జీవజంతువులు ప్రపంచంలోనే విశిష్టత కలిగి ఉన్నాయి. ప్రపంచంలో 34 అతి సూక్ష్మ పరిసర ప్రాంతాల్లో పశ్చిమ కనుమలు ఒకటి. ప్రస్తుతం సూక్ష్మ ప్రదేశాలు సంఖ్య అధికం కావచ్చు. కానీ వీటిని నాశనం చేయడం పరోక్షంగా మనల్ని మనం నాశనం చేసుకున్నట్లే. పశ్చిమ కనుమలు లాంటి ప్రదేశాలను కాపాడుకోవడం ఎలా ఇక్కడ నివాసులు అభ్యుదయం అనేదానిపై 2011లో ప్రొఫెసర్ మాధవగాడ్గిల్ అధ్యక్షుడిగా ఉన్న కమిటీ కేంద్ర పరిసరాలు అటవీశాఖ డైరెక్టర్ మేరకు నివేదిక అందజేసింది. గాడ్గిల్ నివేదిక ప్రకారం పశ్చిమ కనుమలు అత్యంత సూక్ష్మ వలయంగా గుర్తించారు. సూక్ష్మ వలయ విస్తీర్ణం 77 వేల చదరపు కిలోమీటర్లు. కానీ కస్తూరి రంగన్ నివేదికలో గుర్తించిన సూక్ష్మ ప్రదేశ విస్తీర్ణం 60 వేల చదరపు కిలోమీటర్లు. రెండో నివేదికలో సూక్ష్మవలయ విస్తీర్ణం 17 వేల చదరపు కిలోమీటర్లు తగ్గింది. మాధవ గాడ్గిల్ కమిటీ నివేదికలో తాలూకాలను మొత్తం సూక్ష్మవలయాలు చేర్చగా కస్తూరిరంగన్ నివేదికలో సూక్ష్మ ప్రదేశాలు పరిధిలో గల పల్లెలు జాబితాలను అందించారు. గాడ్గిల్ నివేదికలో గల ప్రదేశాలు వర్గీకరణ చాలావరకు సమంజసం. ఎందుకంటే కస్తూరి రంగన్ కమిటీ నివేదిక ప్రకారం గుర్తించిన సూక్ష్మ ప్రదేశాలు పల్లెలు పక్కన గల పశ్చిమ కనుమలు పల్లెలు సాంస్కృతిక వలయంలోకి వస్తాయి. మాధవ్‌గాడ్గిల్ నివేదిక ప్రకారం సూక్ష్మవలయం మూడులో చేసిన సిఫారసులు దేశంలోని అన్ని ప్రదేశాల్లో ఉండాలి. ఇలాంటి పరిసరస్నేహి, నియంత్రిత అభివృద్ధి అన్నిచోట్ల అత్యవసరం లేని పక్షంలో అన్నిచోట్ల ప్రస్తుతం ఉన్న మహానగరాలు, పారిశ్రామిక ప్రదేశాలు మితిమీరిన స్థితిగతులకు చూడాల్సి ఉంటుంది.



పశ్చిమ కనుమల్లోని కుగ్రామాలు



పర్యాటకులను కనువిందుచేసే ఎత్తైన పర్వతాలు

సిఫార్సులను పక్కన పెట్టారు

పశ్చిమ కనుమల్లోని సూక్ష్మప్రదేశాలు కాపాడటానికి ఏమి అవసరమో వాటిని సిఫారసు చేసింది. ఇంధనం, భూకబ్జా, హసిరు సాంకేతిక పరిజ్ఞానం, విద్య, రవాణా, కాలుష్యం, పశుసంపద, మత్స్యసంపద, అరణ్యంలో జీవవైవిధ్యం, గనులు, గ్రానైట్‌క్వారీ, ఇసుక తవ్వడం, పర్యాటకం గురించి సిఫారసులు వీటిని జారీ చేయడం కష్టతరం కాదు. ఇందులో ప్రధాన అంశం ఒక ప్రదేశం ధారణ శక్తిని పరీక్షించిన అనంతరమే అక్కడ అభివృద్ధి చేయాలా వద్దా అనేది నిర్ణయించాలని కమిటీ తెలిపింది. దీంతోపాటు గ్రామపంచాయతీలకు అధికారాలు సిఫారసు చేసింది. 2013లో కర్ణాటక ప్రభుత్వం ఏర్పాటు చేసిన పశ్చిమ కనుమలు కార్యపడ (అనంతహెగ్డే అశీసర అధ్యక్షుడు)గా కమిటీలో తమ రాష్ట్రంలో మలెనాడును కాపాడటం, అభివృద్ధికి సంబంధించిన విస్తృత నివేదికను అందజేసింది. పశ్చిమ కనుమల్లో పరిసరస్నేహి ఇంధనం, ప్రజల భాగస్వామ్యం, పాలన, చట్టానికి సంబంధించిన విషయాలు, ఖనిజ-ఐరన్ ఓర్ నిర్వహణ, జలాశయాలు అభివృద్ధి పరిసర రక్షణ, పశ్చిమ కనుమల్లోని ప్రతి జిల్లా సూక్ష్మ ప్రదేశాలు సంరక్షణ, పరిసర పర్యాటకరంగం, ఔషధ మొక్కలు సంరక్షణ, కాలుష్య నియంత్రణ, కరావళి సంరక్షణ, మలెనాడు సుస్థిర అభివృద్ధి కోసం సమగ్రచట్టం, వనవాసి, బుడకట్టు ప్రజలు శ్రేయోభివృద్ధి, కైగా అణుస్థావర ప్రదేశం పరిసర సంరక్షణ, అడవుల్లో అగ్నిప్రమాదాలు నియంత్రణ, మలెనాడు నగరాల చెత్త నియంత్రణ తదితర వాటిపై దృష్టి సారించాలని నివేదికలో ప్రస్తావించారు.

నీటి సరఫరాలో అంతరాయం

మైసూరు: మహానగర పాలికె ఆధ్వర్యంలో అత్యవసర మరమ్మతు పనులను చేపడుతున్నందున మంగళ, బుధవారాల్లో నగరంలోని కొన్ని ప్రాంతాలకు మంచినీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మహానగర పాలికె నీటి సరఫరా, డ్రెయినేజీ తూర్పు విభాగం ఈఈ తెలిపారు. 9వ వార్డు నుంచి 16 వరకు, 52, 53వ వార్డుల్లోని కెసరె, రాజేంద్రనగర, సుభాష్‌నగర, ఎన్ఆర్ మొహల్లా, గాంధీనగర, ఉదయగిరి, రాజీవ్‌నగర 1, 2, 3వ స్టేజ్, శాంతినగర, కల్యాణగిరి, డాక్టర్ రాజ్‌కుమార్ రోడ్డులోని యరగనహళ్లి, సిద్ధార్థనగర, ఆలనహళ్లి, నందిని బడావణె, గిరిదర్శిని బడావణె, గౌసియానగర, క్యాతమారనహళ్లి తదితర ప్రాంతాలకు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, ప్రజలు సహకరించాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

ఆస్తి పన్ను చెల్లింపు గడువు పొడిగింపు

బనశంకరి: నగరవాసులకు బీబీఎంపీ తీపి కబురు చెప్పింది. ఓటీఎస్ పథకం ద్వారా ఆస్తిపన్ను చెల్లించే వ్యవధిని మరో రెండు నెలలపాటు పొడిగించింది. జూలై 31తో అవకాశం ముగిసింది. అయితే కొన్ని సంఘ సంస్థల విజ్ఞప్తి మేరకు పన్ను చెల్లింపును మరో రెండు నెలల పాటు పొడిగించింది. సెప్టెంబరు 30 వరకు ఆస్తిపన్ను చెల్లించడానికి అవకాశం కల్పించాలని మంత్రి వర్గం ఆమోదం కోసం ప్రతిపాదన పంపారు. బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ ఈ విషయంపై మాట్లాడుతూ... నగరంలో చాలా వరకు ఆస్తి పన్ను బకాయిలు ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి చెల్లిస్తున్నారని తుషార్ తెలిపారు.

మారమ్మకు గంధం అలంకరణ



బొమ్మనహళ్లి: శ్రావణ మాసం మొదటి సోమవారం సందర్భంగా నగరంలోని బొమ్మనహళ్లిలోని హెచ్ఎస్ఆర్ లేఔట్ వార్డు పరంగిపాళ్య గ్రామంలో వెలసిన గ్రామ దేవత శ్రీ మారమ్మ దేవిని శ్రీగంధంతో అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు వినయ్ కుమార్ ఆధ్వర్యంలో శ్రావణమాసం పురస్కరించుకుని తెల్లవారుజామునే అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

గుండెపోటుతో మహిళా కార్యకర్త మృతి



శ్రద్ధాంజలి ఘటిస్తున్న నిఖిల్

యశవంతపుర: బీజేపీ-జేడీఎస్ చేపట్టిన ఛలో మైసూరు పాదయాత్రలో బీజేపీ మహిళా కార్యకర్త ఒకరు గుండెపోటుతో మృతి చెందారు. ఆమెను బసవనగుడి గౌరమ్మగా గుర్తించారు. బహిరంగ సమావేశానికి ముందు నడిచి వెళ్తున్న గౌరమ్మకు గుండెపోటు రావటంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందారు. తమ ప్రసంగాన్ని మధ్యలోనే వదిలి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, జేడీఎస్ యువ అధ్యక్షుడు నిఖిల్ కుమారస్వామిలు గౌరమ్మ అంతిమ దర్శనం చేసుకుని శ్రద్ధాంజలి ఘటించారు.

గవర్నర్‌పై వాటాళ్ ధ్వజం

మైసూరు: ముడాలో జరిగిన స్థలాల పంపిణీ గొడవలో ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు గవర్నర్ గెహ్లాట్ నోటీసులు జారీ చేయడాన్ని ఖండిస్తూ కన్నడ పోరాట నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వాటాళ్ నాగరాజ్ సోమవారం నగరంలోని హార్డింజ్ సర్కిల్‌లో ధర్నా చేశారు. సీఎంకు అనాలోచితంగా నోటీసులివ్వడం సరికాదన్నారు. ఇచ్చిన నోటీసును వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. గతంలో ఎప్పుడూ గవర్నర్ ఇంతలా ప్రభుత్వంపై దాడి చేయలేదన్నారు. అత్యవసర శాసనసభ సమావేశం ఏర్పాటు చేసి ఈ విషయంపై చర్చించాలన్నారు. అంతేకాని ప్రభుత్వాన్ని కూల్చాలని ప్రయత్నించడం భావ్యం కాదన్నారు. సీఎం సిద్దరామయ్య అనుభవం కలిగిన వ్యక్తి అన్నారు. గవర్నర్ నోటీసుకు ఆయన భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఈసందర్భంగా పలువురు కన్నడ పర సంఘాల పోరాటయోధులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

మండ్య: తమ ప్రభుత్వం రైతులకు మేలు చేయడంలో ముందంజలో ఉంటుందని సెస్క్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే రమేష్ బండిసిద్దేగౌడ తెలిపారు. ఆయన సోమవారం శ్రీరంగపట్టణ తాలూకా సుండహళ్లి, ఇండవాళు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి మాట్లాడారు. నీరివ్వరేమోనన్న ఆందోళన వద్దు, రైతులు ధైర్యంగా ఉండాలన్నారు. చట్టప్రకారమే అధికారులు వ్యవహరించారని, వారిని తప్పుబట్టడం తగదని హితవు పలికారు. జీపీ అధ్యక్షురాలు రేఖా, సభ్యులు తేజ, సతీష్, చిక్కయ్య, ప్రముఖులు సిద్దరాజు, కాశేనహళ్లి మంజు, సోమశేఖర్, సీడీపీఓ కుమారస్వామి, పీడీఓ యోగేష్, కాంట్రాక్టర్ సుధీర్ నాయుడు పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటావా..ఫోటోలు పోస్ట్ చేయాలా?

మైసూరు: పెళ్లికి నిరాకరించిన యువతి అశ్లీల ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తానని బెదిరించిన యువకుని ఉదంతమిది. వివరాలు.. మైసూరులో ఓ మాల్‌లో పని చేస్తున్న బాధిత యువతికి కల్యాణగిరి నివాసి మహ్మద్ వసీం అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. ఇద్దరి మధ్య స్నేహం పెరిగింది. ఆమె తల్లిని కలిసి యువతిని పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. తొలుత అంగీకరించని యవతి.. యువకుని కుటుంబం ఒత్తిడికి తలొగ్గి అంగీకరించింది. నిశ్చితార్థం జరిగిన తరువాత ఇద్దరూ కలిసి తిరిగారు. ఆ సమయంలో ఆమెతో కొన్ని అశ్లీల ఫొటోలు తీశాడు. కొన్ని రోజుల తర్వాత మహ్మద్ వసీం ప్రవర్తన నచ్చక అతనితో పెళ్లికి యువతి నిరాకరించింది. దీంతో ఉన్మాదిగా మారిన మహ్మద్ వసీం నాతో పెళ్లికి ఒప్పుకో, లేకుంటే సన్నిహితంగా ఉండే ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తానని బెదిరిస్తూ అశ్లీల ఫోటోలను ప్రియురాలి తల్లికి పంపించాడు. వాటిని చూసిన తల్లి దిగ్భ్రాంతికి గురైన యువతి తల్లి ఫిర్యాదు మేరకు ఎన్ఆర్ మొహల్లా పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

డెంగీపై జాగృతి పెంపొందించండి



మాట్లాడుతున్న జిల్లాధికారి కుమార్

మండ్య: జిల్లాలో డెంగీ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో పాఠశాలలు, కాలేజీల్లో జాగృతి కార్యక్రమాలను పెంపొందించాలని జిల్లాధికారి డాక్టర్ కుమార్ ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. ఆయన సోమవారం తమ కార్యాలయ సభాంగణంలో డెంగీపై ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ సమితి సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. జిల్లాలో జూలై నెలలో మొత్తం 395 కేసులు నమోదయ్యాయన్నారు. మండ్య నగరంలో 75, గ్రామీణంలో 147, మద్దూరులో 61, మళవళ్లిలో 24, పాండవపురలో 19, శ్రీరంగపట్టణలో 34, కేఆర్‌పేటలో 14, నాగమంగలలో 21 కేసులు నమోదైనట్లు వివరించారు. ప్రజలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ మోహన్, జెడ్పీ సీఈఓ షేక్ తన్వీర్ ఆసిఫ్, నగర కోశ యోజన నిర్దేశకురాలు తుషారమణి, రిటైర్డ్ డీహెచ్ఓ డాక్టర్ మరీగౌడ, మలేరియా నియంత్రణాధికారి డాక్టర్ కాంతరాజు, బీఈఓ చంద్రకాంత్, మిమ్స్ వైద్యుడు డాక్టర్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

హోసూరు వార్తలు..


ఆర్థిక సాయం అందజేత



చెక్కును అందజేస్తున్న కలెక్టర్

హోసూరు: హరియానా రాష్ట్రంలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన క్రిష్ణగిరి సైనిక కుటుంబానికి సోమవారం క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో ఆర్థిక సాయాన్ని అందజేశారు. జిల్లా కలెక్టర్ శరయు అధ్యక్షతన ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం జరిగింది. 270 వినతులను అందజేశారు. వాటిని పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖాధికార్లకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కొద్ది రోజుల క్రితం క్రిష్ణగిరి జిల్లా బర్గూరు యూనియన్ బాలేపల్లి గ్రామానికి చెందిన సైనికుడు రాజేంద్రన్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతని భార్య జ్యోతికి రూ. 50 లక్షల చెక్కును కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌వో సాధనకురల్, అధికారులు పన్నీర్‌సెల్వం, బాబు, రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణ జన్మాష్టమి నిర్వహణపై సమీక్ష



హోసూరు: శ్రీకృష్ణ జన్మాష్టమి నిర్వహణపై చేపట్టవలసిన కార్యక్రమాలపై విశ్వ హిందూపరిషత్, భజరంగ్‌దళ్ కార్యకర్తల సమావేశంలో తీర్మానించారు. జిల్లా అధ్యక్షులు దేవరాజ్ మాట్లాడుతూ... ఆగస్ట్ 26వ తేదీ వస్తున్న శ్రీకృష్ణ జన్మాష్టమి, సెప్టంబర్‌లో వస్తున్న వినాయక చవితి వేడుకలను పట్టణంలోని అన్ని వార్డులలో నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.. కార్యక్రంలో కార్యకర్తలు బాబు, మంజు, లోకేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ఇద్దరి అరెస్ట్

హోసూరు: భవన నిర్మాణ కార్మికుడిని హత్య చేసిన కేసులో పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ ఘటన పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. వివరాలు...హోసూరు తేరుపేట ప్రాంతానికి చెందిన సురేష్ (27) భవన నిర్మాణ కార్మికుడు. గత 2వ తేదీ రాయకోట రోడ్డులోని అశోక్ పిల్లర్ వద్ద టీ దుకాణంలోకి వెళ్లాడు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన అన్నాడీఎంకే నాయకుడు ఆది శంకర్ (29), డీఎంకే నాయకుడు బాలాజీ (36)లు సిగరెట్ తాగుతున్న సురేష్‌ను నిలదీశారు. దీంతో వారి మధ్య గొడవ జరిగింది. ఆగ్రహంతో సురేష్ వారెళ్లిన కారుపై రాళ్లు రువ్వి అద్దాలను ధ్వంసం చేశాడు. దీంతో ఆది, బాలాజీ సురేష్‌ను వెంబడించి అతనిపై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన సురేశ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితులను అరెస్ట్ చేశారు.

నగలు, నగదు చోరీ

కెలమంగలం: ఇళ్లల్లో ఎవరూ లేని సమయంలో దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి 14 తులాల బంగారు నగలు, 3.50 లక్షల నగదు దోచుకెళ్లిన ఘటన డెంకణీకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు...డెంకణీకోటలోని యారబ్‌దర్గాలో ఆదివారం ఉరుసు జరిగింది.ఈ క్రమంలో పలువురు ఉరుసు చూడటానికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు పట్టణంలోని నవాస్‌ఖాన్ (42) ఇంటి తాళాలు పగులగొట్టి 11 పౌన్ల నగలు, 1.25 లక్షల నగదు, 1.5 కిలోల నగలను దోచుకెళ్లారు. అనంతరం సమీపంలోని వెంకటేష్ అనే వ్యక్తి ఇంటి తాళాలు బద్దలు కొట్టి 2 పౌన్ల నగలు, 2.25 లక్షల నగదు, 600 గ్రాముల వెండి నగలను దోచుకెళ్లారు. అదే ప్రాంతానికి చెందిన కార్తిక్ ఇంట్లో కూడా ఒక పౌన్ బంగారు నగలను దోచుకెళ్లారు. ఉరుసు ముగించుకొని ఇంటి వచ్చిన బాధితులు చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు .

ఉద్యోగి రూ. 5.50 లక్షలు టోకరా

హోసూరు: పార్ట్ టైం ఉద్యోగంతో పాటు పెట్టుబడి ద్వారా అధిక డబ్బులు సంపాదించవచ్చని ఓ ప్రైవేట్ కంపెనీ ఉద్యోగి వద్ద సైబర్ కేటుగాళ్లు లక్షల నగదును కాజేసిన ఘటన చోటు చేసుకుంది. వివరాలు...హోసూరు ప్రాంతానికి చెందిన 30 ఏళ్ల వ్యక్తి ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగి. ఇతనికి గత జూన్‌లో అతని వాట్సప్‌కు ఒక మెసేజ్ వచ్చింది. దీంతో స్పందించి సంప్రదించాడు. ఈ సమయంలో పార్ట్ టైం ఉద్యోగంతో పాటు మేము సూచించిన కంపెనీలలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మబలికారు. దీంతో వారి మాటలను నమ్మి వారు సూచించిన ఖాతాలకు రూ. 5.50 లక్షలు జమ చేశాడు. అనంతరం వారిని నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి క్రిష్ణగిరి క్రైం బ్రాంచ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు



పోలీసుల అదుపులో వెంకటరాజ్

కెలమంగలం: కెలమంగలం సమీపంలో వ్యక్తి హత్య కేసులో నిందితున్ని పోలీసులు అరెస్ట్ చేశారు. కెలమంగలం సమీపంలోని జే. కారుపల్లి పంచాయతీ కామనపాళ్యం గ్రామానికి చెందిన మునిరాజ్ (45), కారుపల్లి కూడలి రోడ్డులోని ఓ మామిడితోటలో కుటుంబంతో కలిసి నివాసముంటున్నాడు. ఇతని కూతురు (17) కంప్యూటర్ శిక్షణకు వెళ్లేది, ఆ సమయంలో జే.కారుపల్లికి చెందిన వెంకటరాజ్ (24) ఆమెను కిడ్నాప్ చేసి వేధించాడు. ఈ ఘటనపై విద్యార్థిని తండ్రి ఫిర్యాదు మేరకు డెంకణీకోట మహిళా పోలీసులు వెంకటరాజ్‌పై పోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. గత కొద్ది రోజుల క్రితం జామీనుపై బయటకొచ్చిన ఇతను శనివారం రాత్రి బాలికను కిడ్నాప్ చేస్తుండగా తండ్రి మునిరాజ్ అడ్డుపడ్డాడు. ఈ సమయంలో ఆవేశానికి గురైన వెంకటరాజ్ కత్తితో పొడిచి మునిరాజ్‌ను హత్య చేశాడు. విషయం తెలుసుకొన్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని స్వాధీనపరుచుకొని క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

కాపలాదారునిపై దాడికి యత్నం

హోసూరు: హోసూరు సమీపంలో ఎస్టేట్ కాపలాదారునిపై దాడికి యత్నించిన ఘటనలో నిందితుల కోసం బాగలూరు పోలీసులు గాలిస్తున్నారు. వివరాలు... హోసూరు తాలూకా బాగలూరు సమీపంలోని గుట్లపల్లి గ్రామానికి చెందిన శ్రీనప్ప (63). వెంకటేశపురం సమీపంలోని రాజారామ్‌కు చెందిన ఎస్టేట్‌లో కావలాదారునిగా పని చేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం విధుల్లో ఉండగా అక్కడికి వచ్చిన ఐదుగురు వ్యక్తులు అతనిపై దాడికి యత్నించారు.. దీంతో శీనప్ప గట్టిగా కేకలు వేయడంతో వారు పారిపోయారు. గాయపడిన శ్రీనప్పను హోసూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై బాగలూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. పాతకక్షల కారణంగా శ్రీనప్పపై హత్యా ప్రయత్నం చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

భూమిని అప్పగించాలని ధర్నా



సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు

హోసూరు: గిరిజన కుటుంబానికి ప్రభుత్వం అందజేసిన పట్టాభూమిని మరొకరు స్వాధీనం చేసుకున్నారని, ఈ విషయం కోర్టు దాకా వెళ్లి తీర్పునిచ్చినా పట్టాదారుని స్వాధీనానికి రాలేదని గిరిజన కుటుంబం సోమవారం ఉదయం హోసూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వివరాలు... అంచెట్టి తాలూకా తగ్గట్టి గ్రామానికి చెందిన గిరిజన రైతు నీలిసిద్దన్(65). ఇతనికి చెందిన 1.84 ఎకరాల పట్టాభూమిని అదే గ్రామానికి చెందిన వ్యక్తి ఆక్రమించుకున్నాడు. ఈ విషయంపై బాధిత రైతు చెన్నై హైకోర్టులో కేసు దాఖలు చేశాడు. గత ఫిబ్రవరిలో పట్టాదారునికే భూమిని ఇప్పించాలని రెవెన్యూ అధికార్లకు ఆదేశాలు జారీ చేస్తూ తీర్పును వెల్లడించారు. ఈ ఘటనపై బాధిత రైతు తనకు సొంతమైన భూమిని అప్పగించాలని హోసూరు సబ్‌కలెక్టర్, జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో వినతిపత్రం అందజేశాడు. సంబంధిత శాఖాధికార్లు పట్టించుకోకపోవడంతో సోమవారం కుటుంబంతో కలిసి హోసూరు సబ్‌కలెక్టర్ కార్యాలయ ముఖద్వారం వద్ద ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకొన్న పట్టణ పోలీసులు కుటుంబ సభ్యులతో చర్చించారు. సబ్‌కలెక్టర్ ప్రియాంక స్పందించి వారం రోజుల్లో సమస్యకు పరిష్కారం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

రాజకీయ పాలనే


సమావేశంలో పాల్గొన్న సీనియర్ ఐఏఎస్ అధికారులు

మళ్లీ ఆకస్మిక తనిఖీలు మొదలు పెడతా.. కలెక్టర్ల సమావేశంలో తేల్చి చెప్పిన సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇక రాజకీయ పాలనే ఉంటుందని, అధికార యంత్రాంగం అందుకనుగుణంగా పని చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఇసుక రవాణా వ్యయం ఐదు రెట్లు పెరిగిందని, రవాణా చార్జీలు పెరిగినా తామే పెంచామనుకుంటారని చెప్పారు. సచివాలయాల్లోనే ఇసుక బుక్ చేసుకుని రవాణా చార్జీలు సైతం చెల్లించవచ్చన్నారు. వినియోగదారుడికి ఇసుక అందినట్లు నిర్ధారించుకున్నాకే రవాణా ఛార్జీలు ట్రక్కు యజమానికి విడుదలయ్యే పద్ధతి తెస్తామన్నారు. ఇసుక తరలించే ట్రక్కులను ప్రీపెయిడ్ టాక్సీల తరహాలో ఊబరైజేషన్ చేస్తామన్నారు. లారీలు ఇసుక రీచ్‌ల దగ్గరకు వచ్చి రెండేసి రోజులు ఉండకూడదన్నారు. బడి మానేసిన పిల్లలను తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లోనే కాకుండా ప్రైవేట్ స్కూళ్లలోనూ చేర్పించాలని నిర్దేశించారు. రోడ్లు అన్నీ పీపీపీ విధానంలోనే నిర్మాణం చేపట్టాలన్నారు. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్‌నకు ఆకాశమే హద్దని, అమరావతిలో ప్రత్యేకంగా ఒక పీపీపీ విభాగం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రహదారుల నిర్వహణను 50 కి.మీ. చొప్పున అవుట్ సోర్సింగ్‌కు ఇవ్వాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలనూ అవుట్ సోర్సింగ్‌కు అప్పగించాలని పేర్కొన్నారు. ఉద్యోగాల కల్పనకు ప్రైవేట్ రంగంలో వర్చువల్ వర్కింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో చేపట్టిన 4 పోర్టులు, 9 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణాన్ని కొనసాగించాలని ఆదేశించారు. సోమవారం సచివాలయంలో కలెక్టర్లు, మంత్రులు, ఉన్నతాధికారులతో శాఖల వారీగా సీఎం చంద్రబాబు సమీక్షించారు. సమావేశం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 వరకు కొనసాగింది. అనంతరం సచివాలయం గార్డెన్‌లో కలెక్టర్లకు విందు ఏర్పాటు చేశారు. సహజ వనరులైన ఇసుక, మైనింగ్ వ్యవహారాల్లో ఇబ్బందులను తొలగించాలని అంతకుముందు సమావేశంలో సీఎం సూచించారు. ఉచిత ఇసుకపై సరైన నిర్ణయం తీసుకోకుండా ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చేలా వ్యవహరిస్తే వారిని అక్కడ నుంచి తప్పిస్తామని స్పష్టం చేశారు. రవాణా చార్జీలు పెరగకుండా రీచ్‌లను దగ్గరగా ఏర్పాటు చేయాలన్నారు. గత ప్రభుత్వంలో ఇష్టానుసారంగా సహజ వనరుల దోపిడీ జరిగిందని, సుప్రీం కోర్టును కూడా మభ్యపెట్టారని ఆరోపించారు. ఇసుక రీచ్‌లో ఏం జరిగిందో సుప్రీం కోర్టుకు వాస్తవాలు చెప్పాలని, లేదంటే మీకు ఇబ్బందులు వస్తాయని కలెక్టర్లకు స్పష్టం చేశారు. గత సర్కారులో ఇసుక దోపిడీపై సీఐడీతో విచారణ జరిపి తప్పుచేసిన వారిని శిక్షిస్తామన్నారు. వరదను ఒడిసిపట్టి తక్షణమే రిజర్వాయర్లను నింపాలని జలవనరులపై సమీక్షలో ఆదేశించారు. ఎక్కడైనా గేట్లు కొట్టుకుపోతే తక్షణమే ఏఈ, డీఈని డీమ్డ్ సస్పెన్షన్ చేస్తామని హెచ్చరించారు.

డ్రాప్ అవుట్స్ సున్నాకు రావాలి

బడికి వెళ్లే పిల్లలకు కిట్స్ ఇవ్వడం ఇప్పటికే మూడు నెలలు జాప్యం అయిందని, వీలైనంత త్వరగా అనంతపురం, కర్నూలు జిల్లాలకు పంపిణీ పూర్తి చేయాలని సూచించారు. సకాలంలో పంపిణీ చేయడంలో విఫలమైన ఏజెన్సీని పక్కనబెట్టాలని ఆదేశించారు. డ్రాప్ అవుట్స్ సున్నాకు రావాలన్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పామని, అందుకోసం ప్రైవేట్‌లో వర్చువల్ వర్కింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. తద్వారా 5 – 10 లక్షల మందికి ఉపాధి లభిస్తుందన్నారు.

రోడ్లు అన్నీ పీపీపీలోనే

రహదారులన్నీ పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంలో చేపట్టాలని, రాష్ట్ర హైవేలన్నీ కూడా పీపీపీలోనే ఉండాలని సీఎం చెప్పారు. పీపీపీలో విధానంలో చేపట్టేందుకు 14 ప్రాజెక్టులను గుర్తించామని అధికారులు పేర్కొనగా ఇంకా పాత మూసలోనే ఉన్నారని సీఎం వ్యాఖ్యానించారు. టోల్ గేట్ల ఏర్పాటు ద్వారా వ్యయం రాబట్టాలన్నారు. నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారులకు సంబంధించి ఒక్క ఫిర్యాదు కూడా తనకు రాకూడదన్నారు.

వైద్య సేవలు అవుట్ సోర్సింగ్

ప్రభుత్వ ఆస్పత్రుల్లో గతంలో 20 సేవలకు పైగా అవుట్ సోర్సింగ్‌కు ఇచ్చామని, ఇప్పుడు కూడా అవుట్ సోర్సింగ్‌కు వైద్య సేవలను అప్పగించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గత ప్రభుత్వం నాలుగు పోర్టులు, తొమ్మిది ఫిషింగ్ హార్బర్లను పీపీపీ విధానంలో కాకుండా ఈపీసీ విధానంలో చేపట్టిందని చంద్రబాబు పేర్కొన్నారు. ఈపీసీ విధానంలో పోర్టుల నిర్మాణానికి డబ్బులు, గ్యారెంటీ ప్రభుత్వం ఎలా ఇస్తుందని ప్రశ్నించారు. దీనిపై ఇప్పుడు తాను వెనక్కు వెళితే చెడ్డపేరు వస్తుందని, అందువల్ల వాటిని పూర్తి చేయాలని ఆదేశించారు.

డ్రోన్లతో డ్రైనేజీల పూడికల గుర్తింపు

సోలార్ పవర్‌కు భూములిచ్చేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారని, మడకశిర ప్రాంతంలో నాలుగైదు వేల ఎకరాలు ఇవ్వడానికి ముందుకు వచ్చారని సీఎం చెప్పారు. దీన్ని ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాన్నింటిపై సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 1,000 నుంచి 2,000 ఫీడర్లలో సోలార్ పవర్ ద్వారా వ్యవసాయానికి పగటి పూట విద్యుత్ సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఎలక్ట్రిక్ వాహనాల విధానాన్ని తెస్తామన్నారు. గతంలో దోమల నివారణకు డ్రోన్స్ వినియోగించామని, ఇప్పుడు డ్రైనేజీల పూడికలు, రహదారుల మరమ్మతులను డ్రోన్స్ ద్వారా గుర్తించాలని సీఎం సూచించారు. జిల్లాకో జాయింట్ కలెక్టర్‌ను అదనంగా నియమించేలా చర్యలు తీసుకోవాలని సీఎస్‌కు సూచించారు.



సమావేశంలో పాల్గొన్న వివిధ జిల్లాల కలెక్టర్లు, సీనియర్ ఐఏఎస్ అధికారులు

రాజధానిలో పేదలకిచ్చిన 50,800 ఇళ్ల స్థలాలు రద్దు!

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో విజయవాడ, గుంటూరు వాసులకు రాజధాని అమరావతిలో ఇచ్చిన ఇళ్ల స్థలాల స్థానంలో ప్రత్యామ్నాయంగా మరోచోట ఇవ్వాలని కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. గత ప్రభుత్వం రాజధాని మాస్టర్ ప్లాన్‌లోని ఆర్-5 జోన్‌లో లేఅవుట్లు వేసి సుమారు 50,800 మందికి ఇచ్చిన ఇళ్ల స్థలాలను వెనక్కి తీసుకోవాలని అధికారులకు సూచించారు. అక్కడి లబ్ధిదారులకు వారి ప్రాంతాల్లోనే ఇళ్లు కేటాయించాలన్నారు. అవసరమైతే టిడ్కో తరహా ఇళ్లను నిర్మించి, ప్రథమ ప్రాధాన్యం వారికే ఇవ్వాలని పేర్కొన్నారు.

ఉపాధి పెండింగ్ బిల్లులు చెల్లిస్తాం..

రాష్ట్రంలో ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ నిర్మించి ఇస్తామని సీఎం చెప్పారు. పీఎంఏవై–అర్బన్, రూరల్, ఎన్టీఆర్ రూరల్ హౌసింగ్ తదితర పథకాల కింద 9,11,594 గృహాలు పెండింగ్‌లో ఉండగా 5,74,710 ఇళ్ల నిర్మాణం అసలు చేపట్టలేదన్నారు. వాటిని పూర్తి చేయాల్సిన బాధ్యత తీసుకుంటామన్నారు. 25 లక్షల ఇళ్లు కడతానని గొప్పగా చెప్పి కేవలం 7 లక్షలు మాత్రమే చేపట్టారన్నారు. నీరు – చెట్టు, ఉపాధి హామీ పెండింగు బిల్లులు కూడా త్వరలో చెల్లిస్తామని తెలిపారు.

సంపద సృష్టించండి.. వంద రోజుల్లో మార్పు

కలెక్టర్లు, అధికారులు వినూత్న ఆలోచనతో సంపద సృష్టించాలని సీఎం సూచించారు. అక్టోబర్ 2న రాష్ట్ర విజన్ డాక్యుమెంట్ విడుదల చేస్తామన్నారు. జిల్లాల్లోనూ కలెక్టర్లు విజన్ డాక్యుమెంట్లు తయారు చేయాలన్నారు. సెప్టెంబర్ 20న ప్రభుత్వ పాలన వంద రోజులు పూర్తయ్యేనాటికి మార్పు కనిపించాలని చెప్పారు. సూపర్ సిక్స్ హామీలకు కట్టుబడి ఉన్నామని, ఎన్నికల మేనిఫెస్టో అందరి దగ్గరా ఉంటుందని తెలిపారు. సమర్థులైన అధికారులు గత ఐదేళ్లలో నిర్వీర్యమైపోయారని చెప్పారు. తాను కూడా మళ్లీ ఆకస్మిక తనిఖీలు మొదలు పెడతానని, గతంలో స్పీడు మళ్లీ చూపిస్తానని వ్యాఖ్యానించారు. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయాలంటే చాలా సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని చెప్పారు. మూడు నెలలకు ఒకసారి కాన్ఫరెన్స్ ఉంటుందని చెప్పారు. తనకు వచ్చిన ఐదు వేల పిటిషన్లలో సగం భూమికి సంబంధించిన సమస్యలే ఉన్నాయని చెప్పారు.

ప్రతి శనివారం సీఎంవో పనితీరుపై సమీక్ష

గత ప్రభుత్వంలో బటన్ నొక్కడం మినహా ప్రజలను పరామర్శించ లేదన్నారు. పేదరికాన్ని సున్నాకి తీసుకురావడం తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతి శనివారం సీఎంవో పనితీరుపై సమీక్ష చేస్తానని తెలిపారు. ప్రజా ప్రతినిధులు చెప్పే అంశాలను కలెక్టర్లు, అధికారులు వినాలని స్పష్టం చేశారు. త్వరలో పరిపాలనకు సంబంధించి ఒక యాప్ తెస్తామని తెలిపారు. ఢిల్లీ వెళ్లి ధర్నాలు చేసి ఏపీలో 36 మందిని చంపామని ఆరోపణలు చేశారని, నిజంగా అలా జరిగి ఉంటే ఎఫ్ఐఆర్‌లు ఇవ్వాలని చంద్రబాబు పేర్కొన్నారు.

అడవులంటే పవన్‌కు ఇష్టం..

2014–19 మధ్య ఉచితంగా నిర్వహించిన భూసార పరీక్షలను మళ్లీ మొదలు పెట్టాలని వ్యవసాయ శాఖపై సమీక్షలో సీఎం పేర్కొన్నారు. అడవులంటే పవన్ కళ్యాణ్‌కు చాలా ఇష్టమని, వాటి విస్తీర్ణం పెంచాలని సూచించారు. ఈ నెల 7వ తేదీన చేనేత దినోత్సవాన్ని చీరాలలో నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో ఏ మున్సిపాల్టీలోనూ చెత్త కనపడటానికి వీల్లేదన్నారు. గత ఐదేళ్లుగా స్వచ్ఛ భారత్ నిధుల యుటిలైజేషన్ సర్టిఫికెట్ ఇవ్వలేదని కేంద్ర అధికారులు తనకు ప్రధానంగా ఫిర్యాదు చేస్తున్నారని చెప్పారు.

కొత్త లిక్కర్ పాలసీ..

రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యం, భవిష్యత్ గురించి ఆలోచించి కొత్త లిక్కర్ పాలసీ తీసుకొస్తున్నట్లు సీఎం చంద్రబాబు చెప్పారు. జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లతో ఏపీలోకి లిక్కర్‌ను అనుమతిస్తామన్నారు. తద్వారా మద్యం అక్రమ రవాణాను అరికడతామన్నారు. కొత్తగా ఇండస్ట్రియల్ పాలసీ, ఎంటర్ ప్రెన్యూర్ పాలసీ, ఎఫ్డీఐ, ఎంఎస్ఎంఈ, హార్డ్ వేర్ ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్, స్టార్టప్ పాలసీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఎనర్జీ, పీపీపీ మోడల్‌లో పోర్టులు, ఎయిర్ పోర్టులు, రోడ్లు, వయబులిటీ గ్యాప్ ఫండింగ్, వాటర్, లాజిస్టిక్, యూత్, స్పోర్ట్స్ పాలసీలు తెస్తున్నట్లు ప్రకటించారు. జిల్లాల్లో కలెక్టర్, ఎస్పీలు సమన్వయంతో పని చేయాలన్నారు. అసమర్థ ప్రభుత్వం అనిపించుకోవడానికి తాను సిద్ధంగా లేనన్నారు. శాంతి భద్రతల నిర్వహణపై యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. ఐదేళ్ల కిందట రూ.వందల కోట్లు ఖర్చు చేసి 15 వేల కెమెరాలు ఏర్పాటు చేస్తే అవి ఏమయ్యాయో తెలియడం లేదన్నారు. గత ప్రభుత్వంలో అసైన్డ్ భూములను ఫ్రీ హోల్డ్ చేసి కొట్టేసే పరిస్థితికి వచ్చారన్నారు. ఐదేళ్లలో జరిగిన తప్పులను వెలికితీసి శిక్షిస్తామన్నారు. 'ఇంటింటికీ రేషన్ పంపిణీ' అంటూ వాహనాలు తెచ్చి రూ.2వేల కోట్లు ఖర్చు పెట్టారు. రేషన్ పంపిణీకి 15రోజుల పాటు ఇద్దరిని నియమించి వారికి జీతాలు ఇచ్చారు. పంపిణీ పూర్తయ్యాక ఆ వాహనాలను మళ్లీ వేరే పనులకు ఉపయోగించుకుంటున్నారు. రేషన్ దుకాణాలకు రాలేని వారి ఇంటికి వెళ్లి ఇవ్వాలి. కాకినాడలో ఒకే ఫ్యామిలీ నుంచి సివిల్ సప్లై శాఖకు సంబంధించి మూడు పదవులు నిర్వహిస్తున్నారు. దీంతో దొంగల చేతికి తాళాలు ఇచ్చినట్లయింది. ఇలాంటి వాటిని నియంత్రించాలి' అని సీఎం పేర్కొన్నారు.

సార్.. హామీలు నెరవేర్చండి

సీఎం చంద్రబాబు సమావేశం సందర్భంగా లైవ్‌లో విన్నపాలు వెల్లువెత్తాయి. ఉదయం నుంచి రాత్రి వరకు జరిగిన సమావేశాన్ని సమాచార శాఖ యూట్యూబ్ లింక్ ద్వారా లైవ్ ఇచ్చింది. దీన్ని ప్రత్యక్షంగా చూసిన పలువురు పలు సమస్యలను వివరిస్తూ కామెంట్లు పెట్టారు. సీఎం సార్.. హామీలు నెరవేర్చండంటూ తమ గోడు వెళ్లబోసుకున్నారు. వలంటీర్లను విధుల్లోకి తీసుకుని చంద్రబాబు ఇచ్చిన హామీని నెరవేర్చాలంటూ 'వీజీఎస్' అనే పేరుతో కామెంట్ చేశారు. ఎంఎల్‌హెచ్‌పీలకు జీతాలు రాలేదంటూ విజయ్‌కుమార్ అనే వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశాడు. పేదలకు స్థలాలు, ఇళ్లు ఇచ్చి ఆదుకోవాలని గౌరి నాయుడు కోరాడు. ప్రతి ఇంటికి ఉచిత విద్య, వైద్యం అందించే దిశగా విద్యా సంస్థలు, ఆసుపత్రులను సన్నద్ధం చేయాలని చంద్రధర్ అనే వ్యక్తి సూచించాడు. కేజీబీవీ టీచర్ల క్రమబద్ధీకరణ, నిరుద్యోగ సమస్యలను కొందరు ప్రస్తావించారు.


చంద్రబాబు నిర్వహించిన కలెక్టర్ సమావేశం లైవ్ లింక్ లో పలు విజ్ఞాపనలు చేసిన ప్రజలు

వ్యవస్థల బలోపేతం



గత ప్రభుత్వం వ్యవస్థలను ఆటబొమ్మలుగా మార్చింది. వ్యవస్థలను బలోపేతం చేయాలని రాజకీయాల్లోకి వచ్చా. పంచాయతీల బలోపేతానికి అందరూ సహకరించాలి. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 13,326 గ్రామ పంచాయతీల్లో ఒకేసారి గ్రామ సభలు నిర్వహించి తీర్మానాలు చేస్తున్నాం. పిఠాపురంలో ద్రవ వ్యర్థాల నిర్వహణను పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించాం.
– పవన్ కళ్యాణ్, ఉపముఖ్యమంత్రి

త్వరలో ల్యాండ్ గ్రాబింగ్ చట్ట సవరణ



ప్రతి పేదవాడికి న్యాయం జరిగేలా ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ చట్టాన్ని సవరిస్తాం. గత ప్రభుత్వ పాలనలో 9 లక్షల ఎకరాల అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పించగా అందులో దాదాపు 25 వేల ఎకరాల రిజిస్ట్రేషన్లు కూడా జరిగాయి. మాకు అందే విజ్ఞప్తుల్లో 80 శాతం రెవెన్యూకు సంబంధించినవే ఉన్నాయి.
అనగాని సత్యప్రసాద్, రెవెన్యూ మంత్రి

కలెక్టర్లకు వంద రోజుల ప్రణాళిక



రాబోయే 100 రోజుల్లో ప్రభుత్వం చేపట్టాల్సిన కార్యక్రమాలకు సంబంధించి రూపొందించిన ప్రణాళికను కలెక్టర్లు సమర్థంగా అమలు చేయాలి. ప్రజా సమస్యలకు అత్యంత ప్రాధాన్యమివ్వాలి. కలెక్టర్ల స్థాయిలో సమస్యలు పరిష్కారం కాకుంటే ఆయా విభాగాల ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించేలా చొరవ చూపాలి.
నీరభ్ కుమార్ ప్రసాద్, సీఎస్

మరో కీలకం పథకం రద్దు!

రాష్ట్రంలో ఇంటింటికీ రేషన్ బియ్యం పథకాన్ని (రేషన్ డోర్ డెలివరీ) రద్దు చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. ఎండీయూ వాహనాల వల్ల ప్రభుత్వంపై అదనపు భారం పడుతోందన్నారు. ఇంటింటికీ వాహనాలు వెళ్లలేక వీధి చివరన నిలపడంతో ప్రజలు అక్కడికి వెళ్లి రేషన్ తెచ్చుకుంటున్నారని, అక్కడికి వెళ్లిన వారు రేషన్ దుకాణానికి వెళ్లలేరా? అనే చర్చ సీఎం సమీక్షలో జరిగింది. ఈ వాహనాల ద్వారా అక్రమంగా బియ్యం రవాణా జరుగుతోందని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొనడంతో ఇంటింటికీ రేషన్ పథకాన్ని రద్దు చేసి వాహనాలు, రేషన్ డీలర్లను ఎలా ఉపయోగించుకోవాలి? అనే అంశంపై త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటామని సీఎం చంద్రబాబు చెప్పారు.

తాన..! తందాన తాన!

- సీఎం సమీక్షలో శాఖాధిపతుల ముఖస్తుతి
- రాజకీయ నేతల్లా గత సర్కారుపై విమర్శలు

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం నిర్వహించిన కలెక్టర్ల తొలి సమావేశం ఆద్యంతం ముఖస్తుతి.. పరనింద ధోరణిలో సాగింది. పలువురు శాఖాధిపతులు సీఎంను ప్రసన్నం చేసుకునేందుకు పోటీ పడ్డారు. ఆయా శాఖల పనితీరు, కార్యాచరణను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించే క్రమంలో రాజకీయ నేతలను తలదన్నే రీతిలో గత ప్రభుత్వంపై విమర్శలకు దిగారు.

గత నాలుగేళ్లలో అక్రమ తవ్వకాలు: మీనా

ప్రభుత్వం ఉచితంగా ఇసుక ఇస్తున్న విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా కలెక్టర్లకు సూచించారు. గత నాలుగేళ్లలో అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగాయన్నారు. చివరకు ఈ అక్రమ తవ్వకాల విషయంలో సుప్రీం కోర్టు కూడా జోక్యం చేసుకోవాల్సి వచ్చిందన్నారు. సుప్రీం కోర్టుకు కూడా తప్పుడు నివేదికలు ఇచ్చారని, అలాంటి అధికారులపై చర్యలు తీసుకుంటున్నామని, ఇటీవలే ఒక అధికారిని సస్పెండ్ చేశామని చెప్పారు. ఇసుక రవాణా కోసం కొంత ఖర్చు అవుతున్నప్పటికీ అది నామమాత్రమేనన్నారు. స్టాక్ యార్డుల్లో దాదాపు 33 లక్షల టన్నుల ఇసుక లభ్యత ఉందన్నారు.

☛ గత ఐదేళ్లలో వ్యవసాయ రంగం ఆశాజనకంగా లేదని, ఉత్పత్తి పడిపోయిందని వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ చెప్పారు. సహకార బ్యాంకుల్లో పూర్తి స్థాయి ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు.

☛ అడవుల విస్తీర్ణం పెంపు దిశగా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.అనంతరామ్ కోరారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా గత నాలుగేళ్లుగా రాష్ట్రంలో మొక్కలు నాటే కార్యక్రమం జరగలేదన్నారు.

ఆ భూములపై పునఃపరిశీలన చేయాలి: సిసోడియా

శ్రీసత్యసాయి, తిరుపతి, చిత్తూరు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, ప్రకాశం తదితర జిల్లాల్లో ఫ్రీ హోల్డ్ (యాజమాన్య హక్కులు కల్పించినవి) భూముల రిజిస్ట్రేషన్లు (గిఫ్ట్, సేల్) ఎక్కువగా జరిగాయని, వీటిపై పున:పరిశీలన చేయాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా పేర్కొన్నారు. నిషేధిత జాబితా (22 ఏ) నుంచి అసైన్డ్, చుక్కలు, ఇనాం, షరతులు గల పట్టాల భూములను తొలగించిన తీరును కూడా పరిశీలించాలన్నారు. భూ వివాదాల పరిష్కారం, ఫైళ్ల పరిరక్షణ చాలా ముఖ్యమన్నారు. మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో రెవెన్యూ రికార్డుల దహనం కేసును సిసోడియా ప్రత్యేకంగా ప్రస్తావించారు.

నాడు పారదర్శక ప్రజా పాలన

విద్య, వైద్యం, పౌర సేవలు, సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యమిచ్చిన వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వివక్ష లేని పారదర్శక పాలన అందించాలని 2019 జులై 24వ తేదీన నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. తాజాగా సీఎం చంద్రబాబు అందుకు పూర్తి భిన్నంగా తన హయాంలో రాజకీయ పాలనే ఉంటుందని కలెక్టర్లకు మార్గనిర్దేశం చేయడం గమనార్హం. ప్రజలకిచ్చిన నవరత్నాల హామీల అమలు లక్ష్యంగా ప్రతి మంత్రి, అధికారి వద్ద మేనిఫెస్టో ఉండాలని, అందుకు అనుగుణంగా వాగ్దానాలను నెరవేర్చాలని కలెక్టర్లతో తొలి సదస్సులో వైఎస్ జగన్ నిర్దేశించారు. ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు హామీల అమలు గురించి ప్రస్తావించకుండా.. ఆత్మస్తుతి, పరనిందను ప్రోత్సహించారు. గ్రామ, వార్డు సచివాలయాల ఏర్పాటు, వలంటీర్ల నియామకంతోపాటు వైద్య, ఆరోగ్య రంగం, పౌరుల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ నాడు వైఎస్ జగన్ కలెక్టర్ల సదస్సు నిర్వహించారు. సీఎం చంద్రబాబు మాత్రం గత ప్రభుత్వాన్ని తప్పుబట్టడమే లక్ష్యంగా కలెక్టర్ల సదస్సును రాజకీయ సమావేశంగా మార్చేశారు. రహదారుల నిర్మాణాన్ని ప్రైవేట్ పరం చేయడం, ఆస్పత్రుల్లో సేవలు, రోడ్ల నిర్వహణను అవుట్ సోర్సింగ్‌కు అప్పగించడమే ధ్యేయమని తన అంతరంగాన్ని ఆవిష్కరించారు. నవరత్నాలను పార్టీలు, కులాలు, మతాలు చూడకుండా, సిఫారసులతో పనిలేకుండా, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంతృప్త స్థాయిలో లబ్ధి చేకూర్చాలని నాడు కలెక్టర్లకు వైఎస్ జగన్ సూచించారు. ప్రభుత్వ రంగంలో విద్య, వైద్య రంగాలను బలోపేతం చేయడానికి వైఎస్ జగన్ ప్రాధాన్యం ఇవ్వగా ఇప్పుడు చంద్రబాబు వాటిని ప్రైవేట్ పరం చేయడమే లక్ష్యంగా సాగుతున్నట్లు స్పష్టమవుతోంది.

పాలకులం కాదు.. ప్రజా సేవకులం

నాడు హామీలన్నీ నెరవేర్చాలనే సంకల్పంతో వైఎస్ జగన్ కలెక్టర్ల సదస్సు నిర్వహించగా నేడు చంద్రబాబు ఆ ఊసే ఎత్తకుండా జాగ్రత్త పడ్డారు. ప్రభుత్వం వద్ద డబ్బుల్లేవని, ఆలోచనలు మాత్రం ఉన్నాయని, అధికారులు సహకరించాలని చంద్రబాబు చెప్పారు. పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీకి అవసరమైన భూములను సత్వరం గుర్తించాలని నాడు వైఎస్ జగన్ అధికారులకు సూచిస్తే చీప్ పాపులారిటీ కోసం ఏపీఐఐసీ భూములను తీసుకున్నారంటూ సీఎం చంద్రబాబు నిరుపేదలను అవమానించారు. ఇంటికే రేషన్ పంపిణీపై నాడు వైఎస్ జగన్ కలెక్టర్ల సదస్సులో చర్చిస్తే ఇప్పుడు చంద్రబాబు ఆ విధానాన్ని తప్పుబట్టారు. సరుకులు రేషన్ దుకాణాల్లో ఉంటే ప్రజలకు తీరినప్పుడు వెళ్లి తీసుకునేవారని చెప్పారు. అక్రమాలను సహించేది లేదని, మనం పాలకులం కాదు.. ప్రజా సేవకులం అనే సందేశాన్ని కలెక్టర్ల సదస్సు ద్వారా నాడు వైఎస్ జగన్ ఇచ్చారు. తాజాగా సీఎం చంద్రబాబు అంతా రాజకీయ పాలనే ఉంటుందని కలెక్టర్లకు స్పష్టం చేయడం ద్వారా ఇక అంతా రాజకీయాలే చేస్తామని, ఆ కోణంలోనే చూస్తామనే సంకేతాలిచ్చారు. రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితమని, ఆ తరువాత ప్రజల ప్రయోజనాలు, సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా వ్యవహరిస్తామని వైఎస్ జగన్ పలుదఫాలు స్పష్టం చేసిన విషయం తెలిసిందే. రైతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు నవరత్నాల ఫలాలను అందించడానికి ప్రాధాన్యం ఇవ్వాలని, ఇందులో రాజకీయ పార్టీలు, కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా వ్యవహరించాలని వైఎస్ జగన్ నాడు యంత్రాంగానికి దిశా నిర్దేశం చేశారు.

రెడ్‌బుక్ రాజ్యాంగానికి లోబడే పాలన

- కలెక్టర్ల సమావేశంలోనూ హామీల ప్రస్తావన లేదు
- మాజీమంత్రి పేర్ని నాని ఫైర్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రెండు నెలలుగా అంబేడ్కర్ రాజ్యాంగం బదులు.. నారా లోకేశ్ ప్రకటించిన రెడ్‌బుక్ రాజ్యాంగానికి లోబడి పరిపాలన సాగుతోందని మాజీ మంత్రి పేర్ని నాని మండిపడ్డారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం శాంతిభద్రతలను కాపాడే పోలీసులను కొత్త పోకడలతో నడిపించే పరిస్థితి కనిపిస్తోందని ఆయనన్నారు. గతంలో ఎప్పుడూలేని పోకడలు రెండు నెలలుగా రాష్ట్రంలో చూస్తున్నామని చెప్పారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో యూపీ, బిహార్‌లో ఇలా ప్రభుత్వ ప్రేరేపిత హింసను చూశామని.. ఇప్పుడా పరిస్థితి మన రాష్ట్రంలో నెలకొందన్నారు. పోలీసుల సమక్షంలోనే ఇదంతా జరుగుతోందని.. చివరకు వారిపైనా దాడులు జరుగుతున్నాయన్నారు. ఇంత జరుగుతున్నా, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నోరు మెదపడం లేదని ఆక్షేపించారు. నంద్యాల జిల్లా మహానంది మండలం సీతారామాపురంలో జరిగిన దారుణ హత్య అత్యంత హేయమని చెప్పారు. 'రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని ఓ రిటైర్డ్ డీజీపీ, రిటైర్డ్ ఐజీ ఇద్దరూ కలిసి అమలుచేస్తున్నారు. జగ్గయ్యపేటలో గంజిపల్లి శ్రీనివాస్‌పై పచ్చమూకలు అత్యంత దారుణంగా దాడికి తెగబడ్డాయి. సీతారామాపురం హత్య ఘటనపై కూటమి ప్రభుత్వ పెద్దలు సిగ్గుపడాలి. ఇక వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అప్పటి కలెక్టర్లు, ఎస్పీల సమావేశంలో నాటి సీఎం జగన్ పార్టీలకతీతంగా, అర్హతే ప్రామాణికంగా పథకాలు అమలు చేయాలని చెప్పారు. కానీ, సోమవారం నాటి కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో రాజకీయ పార్టీ తరహాలోనే ప్రభుత్వాన్ని నడుపుతామని చంద్రబాబు చెప్పారు.' అని అన్నారు.



ఉచిత ఇసుక.. నేటి ధరలు..

ఇసుక ఉచితం... ఉచితం... ఉచితం... అంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. కానీ ఎక్కడ ఉచితంగా ఇస్తున్నారు...? ఎవరికి ఇస్తున్నారు...? ఎప్పుడు ఇస్తున్నారు...? ఎవరైనా చెప్పగలరా..? అని సామాన్యులు అడిగితే మాత్రం ఎవరూ సమాధానం చెప్పలేరు. ఎందుకంటే ఎక్కడా ఉచితంగా ఇసుక ఇవ్వడం లేదు. ఇటు స్టాక్ పాయింట్లు... అటు రీచ్‌ల వద్ద టీడీపీ నేతలు దంపయ్యారు. డిమాండ్‌ను బట్టి ఇసుక ధరను నిర్ణయిస్తున్నారు. ఇసుకను అత్యంత ఖరీదైన వస్తువుగా మార్చేశారు. రాష్ట్రంలోనే అత్యధికంగా కర్నూలు నియోజకవర్గంలో సోమవారం 18 టన్నుల ఇసుక లారీ ధర రవాణా చార్జీలతో కలిపి రూ.54వేలు పలకడమే ఇందుకు నిదర్శనం. చంద్రగిరి నియోజకవర్గంలో రూ.43,600, గూడూరు నియోజకవర్గంలో రూ.42,660, వెంకటగిరి నియోజకవర్గంలో రూ. 42,620 చొప్పున అత్యధిక ధర పలుకుతోంది. ఇక సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో కూడా 18 టన్నుల ఇసుకకు రవాణా చార్జీలతో కలిపి రూ.36వేలు చెల్లించాల్సి వస్తోంది. ఇలా 175 నియోజకవర్గాల్లో ఇసుక ధరలను 'సాక్షి' పరిశీలించగా... ఎక్కడా ప్రభుత్వం చెబుతున్నట్లు సామాన్యులు పన్నులు మాత్రమే చెల్లించి ఉచితంగా ఇసుక తీసుకువెళ్లే పరిస్థితి లేదు. దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ ఇసుక ధరలు చుక్కలనంటుతున్నాయి.

అసెంబ్లీ నియోజకవర్గాలు	నియోజకవర్గంలోని చివరి పాయింట్‌కు చేరవేయడానికి అయ్యే ఖర్చు రూపాయల్లో (18 టన్నుల లారీ)
1. కర్నూలు	54,000
2. చంద్రగిరి	43,600
3. గూడూరు	42,660
4. వెంకటగిరి	42,620
5. అరకు	38,000
6. కుప్పం	36,000
7. పాడేరు	36,000
8. నగరి	36,000
9. గుడివాడ	35,000
10. కందుకూరు	35,000
11. డోన్	32,000
12. మైదుకూరు	31,500
13. శ్రీకాళహస్తి	30,600
14. యలమంచిలి	30,550
15. సూళ్లూరుపేట	30,370
16. పాయకరావుపేట	30,050
17. చోడవరం	30,050
18. మాడుగుల	30,550
19. పుంగనూరు	30,000
20. మదనపల్లె	29,700
21. మంత్రాలయం	28,000
22. ఇచ్ఛాపురం	27,720
23. యర్రగొండపాలెం	27,000
24. సత్యవేడు	26,600
25. విశాఖ తూర్పు	26,600
26. పామర్రు	26,100
27. రంపచోడవరం	26,000
28. పుట్టపర్తి	26,000
29. రైల్వేకోడూరు	26,000
30. ప్రత్తిపాడు	26,000
31. గాజువాక	25,660
32. విశాఖ వెస్ట్	25,660
33. అనకాపల్లి	25,660
34. పెందుర్తి	25,660
35. విశాఖ నార్త్	25,600
36. విశాఖ సౌత్	25,600
37.భీమిలి	25,600
38. పలాస	25,200
39. అవనిగడ్డ	25,200
40. గజపతినగరం (బొబ్బిలి రీచ్ నుంచి బొండపల్లికి)	25,000
41. ఉంగుటూరు	25,000
42. కోవూరు	25,000
43. శ్రీశైలం	25,000

న్యూస్‌మేకర్స్



● రమజనోవా



● నదా హఫెజ్

అమ్మతనం ఆటకు అడ్డు కాలేదు

గర్భిణి స్త్రీలు ప్రతి విషయంలో ఆచితూచి ఉండాలి. అయితే కొన్ని సందర్భాలు సవాళ్లు విసురుతాయి. దేశం కోసం నిలబడమంటాయి. పారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్స్‌లో ఇద్దరు మహిళలు గర్భంతో పోటీల్లో నిలిచి ఆశ్చర్యపరిచారు. ఈజిప్ట్ ఫెన్సర్ నదా హఫెజ్ ఆరునెలల గర్భంతో, అజర్‌బైజాన్ ఆర్చర్ యయలాగుల్ రమజనోవా ఐదున్నర నెలల గర్భంతో ప్రత్యర్థులతో పోరాడారు. గెలుపు ఓటముల కంటే కూడా వాళ్లు పాల్గొనడమే పెద్ద గెలుపు. వీరు మాత్రమే కాదు, గర్భిణులుగా బరిలోకి దిగిన అథ్లెట్స్ గత ఒలింపిక్స్ లోనూ ఎంతోమంది ఉన్నారు.

ప్రీ క్వార్టర్ రౌండ్‌లో ఓటమి తరువాత తాను ఏడు నెలల గర్భిణిని అని ప్రకటించింది ఈజిప్ట్ ఫెన్సింగ్ క్రీడాకారిణి నదా హఫీజ్. ఆమె ప్రకటన సంచలనం కలిగించింది. నిజానికి గర్భిణిగా ఒలింపిక్స్‌లోకి అడుగుపెట్టిన క్రీడాకారులు, ఒలింపిక్స్‌లోకి అడుగు పెట్టిన తరువాత గర్భిణి అని తెలుసుకున్న వారు ఎంతోమంది ఉన్నారు....

ఎలినార్ బర్కర్: టోక్యో ఒలింపిక్స్‌లో పాల్గొన్నప్పుడు బ్రిటిష్ సైకిలింగ్ స్టార్ ఎలినార్ బర్కర్ మూడు నెలల గర్భిణి. ఒలింపిక్స్‌లో సిల్వర్ మెడల్ గెలుచుకున్న ఎలినార్ ఆ తరువాతే తాను గర్భిణిని అనే విషయం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రకటించింది. 'రేసుకు కొద్దిరోజుల ముందు టోక్యోలో నేను గర్భవతినని తెలుసుకున్నాను. ఇది నేను ఊహించని విషయం. ఆ సమయంలో ఒత్తిడికి గురయ్యాను' ఆరోజును గుర్తు చేసుకుంటుంది ఎలినార్. ఎలినార్ బార్కర్ ఎండోమెట్రియోసిస్‌తో బాధపడుతుండేది. దీని వల్ల గర్భిణులకు సమస్యలు ఎదురయ్యే అవకాశాలు ఉండడం ఆమె ఒత్తిడికి కారణం. కొద్దిరోజుల్లో ఆట, మరో వైపు కొండంత ఒత్తిడి. టీమ్ డాక్టర్, సైకియాట్రిస్టును సంప్రదించి సలహాలు తీసుకుంది. ధైర్యం తెచ్చుకుంది. మెడల్ గెలుచుకుంది.

ఆంకీ వాన్ గ్రన్స్వెన్: డచ్ డ్రెస్సేజ్ ఛాంపియన్ ఆంకీ వాన్ గ్రన్స్వెన్ అయిదు నెలల గర్భిణిగా ఒలింపిక్స్ బరిలోకి దిగి స్వర్ణ పతకం సాధించింది.

క్రిస్టీ మూర్: అయిదు నెలల గర్భిణిగా 2010 ఒలింపిక్స్ బరిలోకి అడుగు పెట్టింది కెనడియన్ కర్లర్ క్రిస్టీ మూర్. కాస్త వెనక్కి వెళితే...ఒకరోజు కర్లింగ్ టీమ్ నుంచి క్రిస్టీకి ఫోన్ కాల్ వచ్చింది. 'ఐయామ్ ప్రెగ్నెంట్' అని చెప్పింది క్రిస్టీ. 'ఆడడం మీకు కష్టమవుతుందా' అవతలి గొంతు.

ఎటూ తేల్చుకోలేని పరిస్థితి. ఆ సమయంలో తన టీమ్‌మెట్ ఒకరు.... 'నువ్వు ప్రెగ్నెంట్ మాత్రమే. చనిపోలేదు' అన్నది. దీని అర్థం 'నీలో పోరాడే సత్తా' ఉంది అని. దీంతో మరో ఆలోచన చేయకుండా ఒలింపిక్ బరిలోకి దిగింది క్రిస్టీ మూర్.

'ఒలింపిక్స్‌లో పాల్గొనడం, మాతృత్వం... రెండూ అపురూపమే. పెద్ద సవాలు అని తెలిసినా ముందుకు వెళ్లాను' ఆ రోజులను గుర్తు చేసుకుంటుంది క్రిస్టీ మూర్.

మరి కొందరి విషయానికి వస్తే....

అమెరికన్ ఐస్-హాకీ ప్లేయర్ **లీసా బ్రౌన్ మిల్లర్** 1998 వింటర్ ఒలింపిక్స్‌లో పాల్గొంది, అక్కడికి వెళ్లాకే తాను ప్రెగ్నెంట్ అనే విషయం తెలిసింది. అమెరికన్ సాఫ్ట్‌బాల్ ప్లేయర్ **మిషల్ గ్రెంజర్** మూడు నెలల గర్భిణిగా 1996 ఒలింపిక్స్‌లోకి అడుగు పెట్టింది. జర్మన్ ఆర్చర్ **కర్నోలియ** ఏడు నెలల గర్భిణిగా 2004 ఒలింపిక్స్‌లోకి అడుగుపెట్టింది... ఈ జాబితా ఇంకా ఉంది. వీరిలో స్వర్ణాలు గెలుచుకున్నవారు ఉన్నారు. గెలవకపోయినా సత్తా చాటిన వారు ఉన్నారు.

'వీడు కడుపులో ఉన్నప్పుడే నాతో పాటు ఒలింపిక్స్ ఆడాడు' అని తమ బిడ్డల గురించి గర్వంగా చెబుతుంటారు ఆ అథ్లెట్ తల్లులు.

ఆ సమయంలో...

రక్తస్రావంలాంటి సమస్యలు ఉన్నప్పుడు తప్ప సాధారణంగా తేలికపాటి వ్యాయామాలను గర్భిణి అథ్లెట్లకు సూచిస్తాం. ప్రెగ్నెన్సీ మొదటి మూడు నెలల్లో రొటీన్ ఎక్సర్‌సైజ్‌లు చేసినా ఫరవాలేదు. ఎక్కువగా చేయడానికి ప్రయత్నించవద్దు. మితంగా చేస్తే చాలు అని చెబుతుంటాం. బ్యాడ్మింటన్, టెన్నిస్‌లాంటి ఆటలు ఆడాలనుకునేవారికి మాత్రం సాధ్యమైనంత వరకు వద్దనే చెబుతాం.

– డా. ఆశా దలాల్, సర్ హెచ్‌ఎన్ రిలయన్స్ హాస్పిటల్స్ ఉమెన్ సెంటర్ డైరెక్టర్

వయనాడ్ లాస్ట్ కాల్

ఆమె గొంతుక మన గుండెల్లో...



● నీతూ జోజో

'దయచేసి మమ్మల్ని రక్షించండి' వణుకుతున్న గొంతుతో సహాయం కోసం నీతూ జోజో చేసిన ఆర్తనాదం కొందరి ప్రాణాలను రక్షించగలిగింది. వయనాడ్‌లో జూలై 30 వరదల సందర్భంగా సహాయం కోసం మొదట వచ్చిన ఫోన్ కాల్ నీతూ జోజోదే. ఆ కాల్ రికార్డ్ కావడంతో ఇప్పుడు సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ అవుతోంది. తన కుటుంబమే కాదు ఇరుగు పొరుగు కుటుంబాలు కూడా సురక్షితంగా ఉండేలా ప్రయత్నిస్తున్న క్రమంలో ప్రాణాలు కోల్పోయింది నీతూ జోజో...

కేరళ వరదల (2018)పై గత సంవత్సరం వచ్చిన మలయాళ చిత్రం '2018'లో వరద బీభత్సం, చావుకు బతుకుకు మధ్య ఊగిసలాడిన బాధితుల దృశ్యాలు, వరద అనే అష్టదిగ్బంధనంలో కూరుకుపోయిన ఇండ్లు... ఒళ్లు జలదరింప చేసే దృశ్యాలెన్నో కనిపిస్తాయి. ఇప్పుడు వాటికి మించిన దృశ్యాలు వయనాడ్‌లో కనిపిస్తున్నాయి. '2018' సినిమాలో ఇతరులను రక్షించాలని తపించిన వారిని ఉద్దేశించి 'ఎవ్రీ వన్ ఈజ్ ఏ హీరో' అనే పెద్ద అక్షరాలు తెరమీద కనిపిస్తాయి. అలాంటి ఒక హీరో నీతూ జోజో.

నీతు వయనాడ్‌లోని మూపెన్స్ మెడికల్ కాలేజీలో నర్స్. 'కొండచరియలు విరిగిపడ్డాయి. నేను ఇక్కడ పాఠశాల వెనకాల నివసిస్తున్నాను. దయచేసి మాకు సహాయం చేయడానికి ఎవరినైనా పంపగలరా. మీకు ఫోన్ చేయడానికి ముందు నేను చాలా



● ధ్వంసమైన నీతూ ఇల్లు

మందికి ఫోన్ చేశాను' అంటూ చెప్పడి గ్రామం నుంచి మూపెన్ మెడికల్ కాలేజీకి ఫోన్ చేసింది నీతు.

సిబ్బంది ఆమె నుంచి అన్ని వివరాలు అడిగి తెలుసుకొని సహాయ బృందాలు వస్తాయని భరోసా ఇచ్చారు. సమీపంలో నివసిస్తున్న ఏడు కుటుంబాలు తన ఇంట్లో ఆశ్రయం పొందారని, శిథిలాల మధ్య చిక్కుకుపోయిన తమ ఇంట్లోకి నీళ్లు వస్తున్నాయని ఫోన్‌లో చెప్పింది నీతు.

'ఆమె చాలా ఆందోళన, బాధతో ఫోన్ చేసింది. నేను వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాను. ఆసుపత్రి నుంచి మా అంబులెన్స్ నీతు ఉంటున్న ప్రాంతానికి బయలుదేరింది' అంటుంది మూపెన్స్ మెడికల్ కాలేజీ డీజీఎం షనవాస్ పల్లియాల్.

అయితే చెట్లు విరిగిపడడంతో రోడ్డు బ్లాక్ అయింది. అంబులెన్స్ ముందుకు వెళ్లలేని పరిస్థితి. దీంతో నీతూకు ధైర్యం చెప్పడానికి అంబులెన్స్ డ్రైవర్, ఇతర సిబ్బంది నాన్‌స్టాప్‌గా ఫోన్‌లు చేస్తూనే ఉన్నారు. రెండోసారి కొండ చరియలు విరిగిపడిన తరువాత ఫోన్ కనెక్షన్ కట్ అయింది.

రోడ్లు బ్లాక్ కావడం, చూరల మాల వంతెన కొట్టుకుపోవడం వల్ల సహాయ సిబ్బంది నీతూ దగ్గరకు చేరుకోలేక పోయారు. భర్త, బిడ్డ, అత్త , ఇరుగు పొరుగు వారు ప్రాణాలతో బయటపడినప్పటికీ నీతూ చనిపోయింది.

'నేను నీతూకు ఫోన్ చేసినప్పుడు తాము మృత్యువు నుంచి తప్పించుకున్నామనే ధైర్యం ఆమె గొంతులో వినిపించింది. నీతూకు ధైర్యం ఇవ్వగలిగాం గానీ దురదృష్టవశాత్తు రక్షించలేకపోయాం' అంటుంది షనవాస్ పల్లియాల్.

ఆరోజు అర్ధరాత్రి దాటిన తరువాత... చెప్పడి గ్రామంలోని నీతు ఇంటిపై కొండచరియలు విరిగిపడ్డాయి. నీరు ఇంట్లోకి ప్రవేశించడంతో అప్రమత్తమైంది. ఇరుగు పొరుగు వారిని అలర్ట్ చేసింది. ఒకవైపు తమను రక్షించమని ఫోన్ చేస్తూనే, మరో వైపు తన ఇంటి వారిని, పొరుగువారిని సురక్షిత ప్రాంతానికి తీసుకువెళ్లడానికి రకరకాల ప్రయత్నాలు చేసింది.

అయితే తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో మరోసారి కొండచరియలు విరిగిపడడంతో మృత్యువు చెంతకు వచ్చింది. ఇక ఎంత మాత్రం తప్పించుకోలేని పరిస్థితి. నీతూతో పాటు ముగ్గురి ప్రాణాలూ గాలిలో కలిసిపోయాయి.

'మా ఇంట్లో ఉంటే సురక్షితం అని మమ్మల్ని తీసుకువెళ్లడమే కాదు. మాకు ధైర్యం చెప్పింది. ఇలా అవుతుందని అనుకోలేదు' అని నీతును గుర్తు తెచ్చుకుంటూ కళ్లనీళ్లు పెట్టుకుంది పొరుగింటి మహిళ.

'నీతూ ఫోన్ కాల్ ఇప్పటికీ చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే ఉంది. చిన్న చిన్న గాయాలతో బయటపడుతుంది అనుకున్నాం. దురదృష్టవశాత్తు ఆమెను నిర్జీవంగా చూడాల్సి వచ్చింది' శోకతప్త హృదయంతో అంటుంది నీతూతో కలిసి మూపెన్స్ మెడికల్ కాలేజీలో పనిచేసిన ఉద్యోగి.

బీభత్సాలు జరిగినప్పుడు తమ ప్రాణాలు అడ్డేసి ఇతరుల ప్రాణాలు కాపాడేవారు ఉంటారు. నీతు జోసెఫ్‌ను వయనాడ్ ప్రజలు తలుచుకుంటూనే ఉంటారు.

విజేత

వచ్చాడు గెలిచాడు!



● అవిర్భవ్

తుమ్ ముజేనా యూ బచానా పావోవే'... రఫీ పాడిన ఈ పాటను ఏడేళ్ల అవిర్భవ్ వేదిక మీద పాడుతుంటే అందరికీ కన్నీరు వచ్చింది. ఇంత బాగా పాడిన ఈ బుడతడిని సోనిలో సూపర్‌స్టార్ సింగర్ సీజన్ 3 (మార్చి 20 24 నుంచి ఆగస్టు 2024 వరకు) చూసిన వారెవరూ అంత సులభంగా మర్చిపోలేరు. అందుకే మొత్తం 11 మంది ఫైనలిస్టులలో తమ ఓటింగ్ ద్వారా అవిర్భవ్‌నే విజేతగా నిలిపారు. పది లక్షల రూపాయల బహుమతి వచ్చేలా చూశారు. జడ్జిల చాయిస్‌గా అధర్వ బక్షి అనే మరో చిన్నోడు విజేతగా నిలిచినా ఈ సీజన్‌లో సంగీత ప్రియుల హృదయాలను కొల్లగొట్టింది మాత్రం అవిర్భవే. చిన్నగా కోమలమైన ఆకారంతో ఉన్నప్పటికీ అవిర్భవ్ రేంజ్ చాలా గొప్పది. కేరళకు చెందిన అవిర్భవ్ తన సోదరి అనిర్విన్య దగ్గర రెండేళ్ల వయసు నుంచే సంగీతం నేర్చుకున్నాడు. తెలుగు షోస్‌లో కూడా పాల్గొన్నాడు. కాని ఇపుడు సూపర్‌స్టార్ సింగర్ ద్వారా ప్రపంచ ప్రఖ్యాతమయ్యాడు. అర్జిత్ సింగ్ ఇతడి ఫేవరెట్ సింగర్. పెద్దయ్యాక గాయకుణ్ణి అయ్యి సల్మాన్, షారుక్‌ఖాన్‌లకు పాడతానని అంటున్నాడు అవిర్భవ్.

సినిమా

విష్ణు మంచు టైటిల్ రోల్‌లో రూపొందుతోన్న చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో శివ భక్తుడు కన్నప్ప పాత్రలో విష్ణు నటిస్తున్నారు. ప్రభాస్, మోహన్‌బాబు, అక్షయ్ కుమార్, మోహన్‌లాల్, శరత్ కుమార్, బ్రహ్మానందం, కాజల్ అగర్వాల్, మధుబాల, ప్రీతి ముకుందన్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు.

నాయకుడు వచ్చాడు



● దేవరాజ్

ఈ మూవీలో నటిస్తున్న నటీనటుల లుక్‌ను ఒక్కొక్కటిగా రివీల్ చేస్తున్నారు మేకర్స్. తాజాగా కన్నడ నటుడు దేవరాజ్ పాత్ర లుక్‌ని రిలీజ్ చేశారు. ''కన్నప్ప'లో ఎరుకల తెగ నాయకుడైన ముండడు పాత్రలో దేవరాజ్ నటిస్తున్నారు. ఆయన పాత్ర ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్ షూటింగ్ చివరి దశకు చేరుకుంది'' అని చిత్రబృందం పేర్కొంది. అవా ఎంటర్‌టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకాలపై మంచు మోహన్‌బాబు నిర్మిస్తున్న 'కన్నప్ప' డిసెంబరులో ప్రేక్షకుల ముందుకు రానుంది.

క్లైమాక్స్‌లో పుష్ప



● అల్లు అర్జున్

హైదరాబాద్‌లో ఫైట్ చేస్తున్నాడు పుష్ప రాజ్. అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న చిత్రం 'పుష్ప: ది రూల్'. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇదే కాంబినేషన్‌లో వచ్చిన 'పుష్ప: ది రైజ్' 2021 డిసెంబరు 17న విడుదలై బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. 'పుష్ప: ది రైజ్'కి సీక్వెల్‌గా 'పుష్ప: ది రూల్' తెరకెక్కుతోంది. ప్రస్తుతం ఈ సినిమా క్లైమాక్స్ సన్నివేశాలను హైదరాబాద్‌లో చిత్రీకరిస్తున్నారు. ''పుష్ప: ది రైజ్' సూపర్ హిట్ కావడంతో 'పుష్ప: ది రూల్' కోసం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో భారీ ఖర్చుతో వేసిన సెట్‌లో జరుగుతోంది. హీరోతో పాటు సినిమాలోని కీలక నటీనటులపై పతాక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నాం. ఈ సీన్స్ హైలైట్‌గా ఉంటాయి. డిసెంబరు 6న మా చిత్రం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది'' అని యూనిట్ పేర్కొంది. సునీల్, అనసూయ, ఫాహద్ ఫాజిల్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మిరోస్లా క్యూబా బ్రోజెక్, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

నా లోకమే నా మైమరపు



● ఎన్టీఆర్, జాన్వీ కపూర్

దేవరపై తన ప్రేమనంతా పాట రూపంలో చూపించేసింది తంగమ్. 'చుట్టమల్లె చుట్టేస్తావె తుంటరి చూపు... ఊరికే ఉండదు కాసేపు... అస్తమానం నీ లోకమే నా మైమరపు... చేతనైతే నువ్వే నన్నాపు...' అంటూ తన ప్రేమను వ్యక్తపరిచింది. దేవరగా ఎన్టీఆర్, తంగమ్‌గా జాన్వీ కపూర్ నటిస్తున్న 'దేవర' చిత్రంలోని పాట ఇది. కొరటాల శివ దర్శకత్వంలో నందమూరి కల్యాణ్ రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ .కె ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తొలి భాగం సెప్టెంబర్ 27న తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మ్యూజికల్ ప్రమోషన్స్ ఆరంభించి, ఒక్కో పాట విడుదల చేస్తున్నారు. సోమవారం 'చుట్టమల్లె చుట్టేస్తావె...' అంటూ సాగే ఈ సినిమాలోని రెండో పాటను రిలీజ్ చేశారు. అనిరుధ్ రవిచందర్ స్వరపరచిన ఈ రొమాంటిక్ మెలోడీ సాంగ్‌కు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా శిల్పా రావ్ పాడారు. బాస్కో మార్టిస్ కొరియోగ్రఫీ చేశారు.హై యాక్షన్ మాస్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న 'దేవర' చిత్రానికి కెమెరా: ఆర్. రత్నవేలు.

తెలుగులో సూపర్ డీలక్స్



● సమంత, విజయ్ సేతుపతి, ఫాహద్

వైవిధ్యమైన పాత్రలతో విలక్షణ నటుడిగా పేరు తెచ్చుకున్న విజయ్ సేతుపతి ట్రాన్స్‌జెండర్‌గా నటించిన చిత్రం 'సూపర్ డీలక్స్'. సమంత కథానాయకగా నటించగా ఫాహద్ ఫాజిల్ ఓ కీ రోల్‌లో నటించారు. త్యాగరాజన్ కుమార రాజా దర్శత్వంలో రూపొందిన ఈ తమిళ చిత్రం ఘనవిజయం సాధించింది. ఈ చిత్రం తెలుగులో ఈ నెల 9న థియేటర్లలో విడుదల కానుంది. సీఎల్ఎన్ మీడియా తెలుగులో విడుదల చేయనుంది. ''సూపర్ డీలక్స్'ని నాలుగు వందల థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నాం. నాలుగు విభిన్న కథలను జోడించి దర్శకుడు ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. ఈ చిత్రం తెలుగులోనూ మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అని తెలుగులో విడుదల చేస్తున్న సీఎల్ఎన్ మీడియా పేర్కొంది.

పాటలోనే కథ చూపించారు

– ఎస్ఎస్ తమన్



● వైశాలి, తమన్, దీపు జాను

''ఫస్ట్ లవ్ టైటిల్ సాంగ్ మ్యూజిక్ వీడియో చాలా అందంగా ఉంది. ఈ పాటలోనే ఒక అద్భుతమైన కథ చూపించారు. మంచి సినిమా చూసిన అనుభూతి కలిగింది'' అని సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్ అన్నారు. దీపు జాను హీరోగా బాలరాజు ఎం దర్శకత్వం వహించిన చిత్రం 'ఫస్ట్ లవ్'. వైశాలీ రాజ్ హీరోయిన్‌గా నటించి, నిర్మించారు. సంజీవ్ .టి సంగీతం అందించిన ఈ మూవీ టైటిల్ సాంగ్ ('ఫస్ట్ లవ్') లాంచ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఎస్ తమన్ మాట్లాడుతూ– ''ఫస్ట్ లవ్' పాటలు వినగానే 'వైశాలి, ఖుషి' సినిమాలు గుర్తుకు వచ్చాయి. మధు పొన్నాస్ అద్భుతమైన నేపథ్య సంగీతం ఇచ్చారు'' అన్నారు. ''చాలా కష్టపడి ప్రేమతో 'ఫస్ట్ లవ్.' పాట చేశాం'' అన్నారు. ''అందరూ సెలబ్రేట్ చేసుకునే స్పెషల్ ఆల్బమ్ ఇది'' అన్నారు బాలరాజు ఎం.

స్వేచ్ఛ కోసం పోరాటం

– విక్రమ్



● పార్వతి తిరువోతు, విక్రమ్, మాళవిక

''**తం**గలాన్' అనేది ఒక తెగ పేరు. ఈ సినిమాలోని నా లుక్‌ని ఫస్ట్ టైమ్ రిలీజ్ చేసినప్పుడు 'కేజీఎఫ్' మూవీలా ఉంటుందా? అన్నారు. అలాగే తెగ నాయకుడి గెటప్ రిలీజ్ చేశాక రా అండ్ రస్టిక్‌గా ఉంటుందన్నారు. కానీ 'తంగలాన్' లో ప్రేక్షకులకు కావాల్సిన అన్ని అంశాలున్నాయి'' అని హీరో విక్రమ్ అన్నారు. పా.రంజిత్ దర్శకత్వంలో విక్రమ్ హీరోగా, పార్వతి తిరువోతు, మాళవికా మోహనన్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'తంగలాన్'. కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ మూవీ ఈ నెల 15న రిలీజ్ కానుంది. ఈ చిత్రాన్ని తెలుగులో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ సంస్థ రిలీజ్ చేస్తోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో విక్రమ్ మాట్లాడుతూ– ''రంజిత్ నా ఫేవరెట్ డైరెక్టర్. ప్రపంచంలో ప్రతి ఒక్కరికీ రిలేట్ అయ్యే స్టోరీ 'తంగలాన్'. బంగారం వేట అనేది హైలైట్ అవుతున్నా.. ఈ కథలో స్వేచ్ఛ కోసం చేసే పోరాటం ఉంది'' అన్నారు. పాన్ ఇండియా అని మనమే అంటున్నాం. నేను ఎక్కడ నటించినా అది అన్ని భాషల ప్రేక్షకులకు చేరువకావడం సంతోషం'' అన్నారు.

సర్దార్ ప్రపంచంలోకి...



● ఆషికా రంగనాథ్

సర్దార్ ప్రపంచంలోకి హీరోయిన్ ఆషికా రంగనాథ్‌కి స్వాగతం పలికారు మేకర్స్. కార్తీ హీరోగా పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'సర్దార్ 2'. కార్తీ–మిత్రన్ కాంబినేషన్‌లో సూపర్‌హిట్‌గా నిలిచిన 'సర్దార్' మూవీకి సీక్వెల్‌గా 'సర్దార్ 2' రూపొందుతోంది. ఈ చిత్రంలో ఓ హీరోయిన్‌గా మాళవికా మోహనన్ నటిస్తున్నట్లు ఇటీవల ప్రకటించారు. తాజాగా ఆషికా రంగనాథ్ మరో హీరోయిన్‌గా కనిపించనున్నట్లు ప్రకటించారు. సోమవారం (ఆగస్టు 5) ఆషికా బర్త్ డే. ఈ సందర్భంగా ఆమెను 'సర్దార్ 2' ప్రాజెక్ట్‌లోకి స్వాగతం పలుకుతూ ఆమె లుక్ రిలీజ్ చేశారు మేకర్స్. ప్రిన్స్ పిక్చర్స్‌పై ఎస్. లక్ష్మణ్ కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: యువన్ శంకర్ రాజా.

అవార్డులు ఉత్సాహం ఇస్తాయి

– మారుతి



● విజయ్ బుల్గానిన్, అనంత శ్రీరామ్, సాయి రాజేశ్, మారుతి, ఎస్‌కేఎన్, వైష్ణవి, శ్రీరామచంద్ర

''అవార్డ్స్ అంటే పెద్ద సినిమాలకే వస్తాయి.. చిన్న చిత్రాలకు రావు' అని నిరాశ పడేవారికి ఉత్సాహాన్నిచ్చేలా 'బేబి'కి ఐదు ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ దక్కడం ఆనందంగా ఉంది. అవార్డులు సరికొత్త ఉత్సాహం ఇస్తాయి. 'బేబి' టీమ్‌కి అభినందనలు'' అని దర్శకుడు మారుతి అన్నారు. ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్, వైష్ణవి చైతన్య లీడ్ రోల్స్‌లో సాయి రాజేశ్ దర్శకత్వం వహించిన చిత్రం 'బేబి'. ఎస్‌కేఎన్ నిర్మించిన ఈ సినిమా 2023లో విడుదలై హిట్‌గా నిలిచింది. కాగా 69వ 'శోభ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్ 2024'లో వివిధ విభాగాల్లో 'బేబి' మూవీ ఐదు అవార్డులు అందుకుంది. ఈ నేపథ్యంలో సోమవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో సాయి రాజేశ్ మాట్లాడుతూ– ''మా సినిమాకు ఐదు అవార్డ్స్ దక్కడం సంతోషంగా ఉంది'' అన్నారు. ''ఉత్తమ నటిగా పురస్కారం అందుకోవడం హ్యాపీ'' అన్నారు వైష్ణవి. ''నేనొక మంచి మూవీ చేయాలి.. అలాగే ఒక ఫిల్మ్‌ఫేర్ అందుకోవాలనుకునేవాణ్ణి. ఈ రెండు ఆకాంక్షలు 'బేబి'తో తీరడం సంతోషంగా ఉంది'' అన్నారు సంగీత దర్శకుడు విజయ్ బుల్గానిన్. ''నాకు తొలి ఫిల్మ్‌ఫేర్ అవార్డ్ వచ్చిన పుష్కరకాలం తర్వాత రెండో అవార్డ్ రావడం సంతోషంగా ఉంది'' అన్నారు రచయిత అనంత్ శ్రీరామ్. ''బేబి'లో నేను పాడిన 'ఓ రెండు మేఘాలిలా..' పాటకు బెస్ట్ సింగర్‌గా నాకు అవార్డ్ దక్కడం ఆనందంగా ఉంది'' అన్నారు శ్రీరామచంద్ర. ''ఒక మంచి సినిమా చేస్తే తప్పకుండా అన్నీ వస్తాయని చెప్పేందుకు 'బేబి' ఓ ఉదాహరణ'' అన్నారు నిర్మాత ఎస్‌కేఎన్. 'బేబి' చిత్ర సహ నిర్మాత ధీరజ్ మొగిలినేని మాట్లాడారు.



"పరాజయాలకు ఆటగాళ్లు కూడా బాధ్యత వహించాల్సిన సమయం వచ్చింది. ఫలానా సౌకర్యాలు కావాలని అడగడమే కాదు... అవన్నీ ఇచ్చాక ఫలితాలతో పాటు పతకాలు కూడా తీసుకురావాలి. లక్ష్య సేన్ మరింత మెరుగవ్వాల్సి ఉంది. తప్పులు జరగడం సహజమే కానీ కోర్టులో పరిస్థితిని బట్టి ఆటను మార్చుకోవాలి. ఈ విషయంలో సేన్‌కు మానసికంగా కూడా కొంత శిక్షణ అవసరం. భారత బ్యాడ్మింటన్‌లో ఒకరిద్దరు టాప్ ఆటగాళ్లపై మాత్రమే దృష్టి పెట్టకుండా తర్వాతి స్థాయిలో వారిని కూడా తీర్చిదిద్దితేనే విజయాలు లభిస్తాయి. -ప్రకాశ్ పదుకోన్, లక్ష్య సేన్ కోచ్


ఏం తప్పు జరిగిందో కూడా చెప్పలేని స్థితిలో ఉన్నాను. నేను మ్యాచ్‌ను బాగా మొదలు పెట్టినా దానిని కొనసాగించలేకపోయాను. ఫలితంతో చాలా నిరాశ చెందాను. గత మ్యాచ్, ఈ మ్యాచ్‌లను ఎలా పోల్చాలో కూడా అర్థం కావడం లేదు. రెండూ కీలక మ్యాచ్‌లే. కానీ రెండూ ఓడిపోయాను. కీలక దశలో ఒత్తిడిని ఎదుర్కొన్నాను. నేను చాలా తప్పులు చేశాను. నా ప్రత్యర్థి రెండో గేమ్ నుంచి అద్భుతంగా పుంజుకున్నాడు. కుడి చేతికి గాయంతో కొంత రక్తం రావడంతో మధ్యలో ఆటను ఆపి చికిత్స చేయించుకోవాల్సి వచ్చింది. అయితే మ్యాచ్ ఫలితానికి దీనికి సంబంధం లేదు. -లక్ష్య సేన్

ఊరించి... ఉసూరుమనిపించి

రెండు కాంస్య పతకాలను చేజార్చుకున్న భారత క్రీడాకారులు

- బ్యాడ్మింటన్‌లో ఓడిన లక్ష్య సేన్
- షూటింగ్ స్కీట్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో ఒక్క పాయింట్‌తో ఓటమి పాలైన అనంత్‌జీత్-మహేశ్వరి జోడీ
- రెజ్లింగ్ క్వార్టర్ ఫైనల్ బౌట్‌లో చివరి నిమిషంలో తడబడిన నిషా

ఒలింపిక్స్‌లో పతకాలు సాధించాలంటే అపార నైపుణ్యంతోపాటు, చెక్కు చెదరని విశ్వాసం, మానసిక దృఢత్వం కలిగి ఉండాలి. లేదంటే కచ్చితంగా మెడలో పతకం వేసుకోవాల్సిన చోట... కీలకదశలో ఒత్తిడికిలోనై... అనవసరపు ఆందోళనతో తడబడి... ప్రత్యర్థికి పతకాలు అప్పగించాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. పారిస్ ఒలింపిక్స్‌లో సోమవారం భారత క్రీడాకారులకు ఇలాంటి అనుభవమే ఎదురైంది. రెండు కాంస్య పతకాల వేటలో బరిలోకి దిగిన మనోళ్లు ముందుగా ఊరించి చివరికొచ్చేసరికి ఉసూరుమనిపించారు. బ్యాడ్మింటన్‌లో లక్ష్య సేన్... షూటింగ్‌లో మహేశ్వరి-అనంత్‌జీత్ జోడీ మంచి అవకాశాలను వదులుకున్నారు. ఫలితంగా రెండు పతకాలు రావాల్సిన చోట ఒక్క పతకమూ దక్కలేదు. ఇక మహిళల రెజ్లింగ్ 68 కేజీల విభాగంలో నిషా దహియా అయితే చివరి నిమిషంలో ఏకంగా తొమ్మిది పాయింట్లు సమర్పించుకొని ఓటమిని మూటగట్టుకుంది.



లక్ష్య సేన్



నిషా

పారిస్: ఒలింపిక్స్ పురుషుల బ్యాడ్మింటన్‌లో పతకం గెలిచిన తొలి భారత క్రీడాకారుడిగా చరిత్ర సృష్టించే అవకాశాన్ని లక్ష్య సేన్ వదులుకున్నాడు. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ కాంస్య పతక మ్యాచ్‌లో ప్రపంచ 22వ ర్యాంకర్ లక్ష్య సేన్ 21-13, 16-21, 11-21తో ప్రపంచ ఏడో ర్యాంకర్ లీ జి జియా (మలేసియా) చేతిలో ఓడిపోయాడు. 71 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో లక్ష్య సేన్ తొలి గేమ్ గెల్చుకున్నప్పటికీ అదే జోరును తర్వాత కొనసాగించలేకపోయాడు. లక్ష్య సేన్ ఓటమితో 2008 బీజింగ్ ఒలింపిక్స్ తర్వాత బ్యాడ్మింటన్‌లో పతకం లేకుండానే భారత క్రీడాకారులు ఇంటిముఖం పట్టారు. 2012 లండన్‌లో సైనా నెహ్వాల్ కాంస్యం సాధించగా... 2016 రియోలో పీవీ సింధు రజతం, 2020 టోక్యోలో పీవీ సింధు కాంస్యం గెలిచారు. ఈసారి పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీపై భారీ అంచనాలు ఉన్నా వారు క్వార్టర్ ఫైనల్లో ఓటమి పాలయ్యారు. లీ జి జియాతో జరిగిన మ్యాచ్‌లో లక్ష్య సేన్ శుభారంభం చేశాడు. దూకుడుగా ఆడుతూ తొలి గేమ్‌ను అలవోకగా దక్కించుకున్నాడు. రెండో గేమ్ ఆరంభంలోనూ లక్ష్య తన ఆధిపత్యం చాటుకొని 8-3తో ఆధిక్యంలోకి వచ్చాడు. ఈ దశలో లక్ష్య సేన్ ఒక్కసారిగా గాడి తప్పాడు. వరుసగా తొమ్మిది పాయింట్లు సమర్పించుకున్నాడు. ఇక్కడి నుంచి లీ జి జియా జోరు మొదలైంది. 3-8తో వెనుకబడిన లీ జి జియా 12-8తో ఆధిక్యంలోకి వచ్చి చివరకు 21-16తో గేమ్‌ను సొంతం చేసుకొని మ్యాచ్‌లో నిలిచాడు. నిర్ణాయక మూడో గేమ్‌లో లీ జి జియా పూర్తి ఆధిపత్యం కనబరిచి 9-4తో ఆధిక్యంలోకి వెళ్లాడు. ఆ తర్వాత కూడా మలేసియా ప్లేయర్ ఎలాంటి తప్పిదాలకు తావివ్వకుండా ఆడటంతో లక్ష్య సేన్ కోలుకోలేకపోయాడు. పురుషుల సింగిల్స్ విభాగంలో విక్టర్ అక్సెల్‌సన్ (డెన్మార్క్) తన స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకున్నాడు. ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ అక్సెల్‌సన్ 21-11, 21-11తో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ వితిద్‌సర్న్ కున్లావత్ (థాయ్‌లాండ్)పై విజయం సాధించాడు. మహిళల సింగిల్స్ ఫైనల్లో అన్ సె యంగ్ (దక్షిణ కొరియా) 21-13, 21-16తో హి బింగ్‌జియావో (చైనా)పై విజయం సాధించి పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది.



అనంత్‌జీత్



మహేశ్వరి

ఫినిషింగ్ 'గురి' తప్పింది...

షూటింగ్ పోటీల చివరిరోజు భారత్‌కు మరో పతకం వచ్చే అవకాశాలు కనిపించాయి. ఒలింపిక్స్‌లో తొలిసారి మెడల్ ఈవెంట్‌గా ప్రవేశపెట్టిన స్కీట్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు చెందిన మహేశ్వరి చౌహాన్-అనంత్‌జీత్ నరూకా జోడీ కాంస్య పతక పోరుకు అర్హత సాధించింది. కాంస్య పతక మ్యాచ్‌లో మహేశ్వరి-అనంత్‌జీత్ ద్వయం 43-44 పాయింట్లతో జియాంగ్ యిటింగ్-జియాన్లిన్ లియు (చైనా) జంట చేతిలో ఓడిపోయింది. ఒక్క పాయింట్ తేడాతో భారత జోడీకి కాంస్య పతకం చేజారడం గమనార్హం. ముందుగా 15 జోడీలు పాల్గొన్న క్వాలిఫయింగ్‌లో మహేశ్వరి-అనంత్‌జీత్.. జియాంగ్ యిటింగ్-జియాన్లిన్ (చైనా) జోడీలు 146 పాయింట్ల చొప్పున సాధించి వరుసగా మూడు, నాలుగు స్థానాల్లో నిలిచి కాంస్య పతక మ్యాచ్‌కు అర్హత సాధించింది. డయానా బకోసి-గాబ్రియెలా రొసెట్టి జోడీ (ఇటలీ; 149 పాయింట్లు), ఆస్టిన్ జెవెల్-విన్సెంట్ హాన్‌కాక్ ద్వయం (అమెరికా; 148 పాయింట్లు) తొలి రెండు స్థానాల్లో నిలిచి స్వర్ణ-రజత పతక మ్యాచ్‌కు అర్హత పొందాయి. ఫైనల్లో డయానా-రొసెట్టి ద్వయం 45-44తో జెవెల్-హాన్‌కాక్ జంటను ఓడించి స్వర్ణ పతకం సాధించింది.

చివరి నిమిషంలో 'పట్టు' కోల్పోయి...

మహిళల రెజ్లింగ్ 68 కేజీల విభాగంలో భారత రెజ్లర్ నిషా దహియా క్వార్టర్ ఫైనల్లో 8-10 పాయింట్ల తేడాతో పాక్ సోల్ గుమ్ (ఉత్తర కొరియా) చేతిలో ఓడిపోయింది. బౌట్ ముగియడానికి ఒక నిమిషం ఉన్నంతవరకు నిషా 8-1తో ఆధిక్యంలో నిలిచింది. అయితే ఆఖరి 60 సెకన్లలో నిషా పట్టు కోల్పోయింది. ఉత్తర కొరియా రెజ్లర్ ధాటికి నిషా తొమ్మిది పాయింట్లు కోల్పోయి ఓటమి పాలైంది. అంతకు ముందు నిషా తొలి రౌండ్‌లో 6-4తో తెతియానా సొవా (ఉక్రెయిన్)పై గెలిచింది. ఒకవేళ ఉత్తర కొరియా రెజ్లర్ ఫైనల్ చేరుకుంటే నిషాకు 'రెపిచాజ్' పద్ధతిలో కాంస్య పతకం సాధించే అవకాశం లభిస్తుంది.

3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్ ఫైనల్లో అవినాశ్

పురుషుల 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్ ఈవెంట్‌లో భారత అథ్లెట్ అవినాశ్ సాబ్లే ఫైనల్‌కు అర్హత సాధించాడు. రెండో హీట్‌లో అవినాశ్ 8 నిమిషాల 15.43 సెకన్లలో గమ్యానికి చేరి ఐదో స్థానంలో నిలిచి ఫైనల్లోకి ప్రవేశించాడు. 12 మంది అథ్లెట్స్‌తో కూడిన మూడు గ్రూప్‌లకు హీట్స్ నిర్వహించారు. మూడు గ్రూపుల్లో టాప్-5 నిలిచిన వారు ఫైనల్‌కు చేరారు. గురువారం రాత్రి ఫైనల్ జరుగుతుంది.





మనిక మెరిసె

క్వార్టర్ ఫైనల్లో భారత మహిళల టీటీ జట్టు

పారిస్: ఒలింపిక్స్ టేబుల్ టెన్నిస్ (టీటీ) మహిళల టీమ్ ఈవెంట్‌లో భారత జట్టు శుభారంభం చేసింది. తొలి రౌండ్ మ్యాచ్‌లో భారత్ 3-2తో రొమేనియా జట్టును బోల్తా కొట్టించింది. ఈ గెలుపుతో టీమిండియా క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. స్టార్ ప్లేయర్ మనిక బత్రా రెండు మ్యాచ్‌ల్లో గెలిచి భారత విజయంలో ముఖ్యపాత్ర పోషించింది. తొలి మ్యాచ్‌లో తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ-అర్చనా కామత్ జోడీ 11-9, 12-10, 11-7తో అదీనా దియకోను-ఎలిజబెటా సమారా (రొమేనియా) జంటను ఓడించి భారత్‌కు 1-0 ఆధిక్యాన్ని అందించింది. రెండో మ్యాచ్‌లో మనిక 11-5, 11-7, 11-7తో బెర్నాడెట్టి జాక్స్‌పై గెలిచింది. దాంతో భారత్ ఆధిక్యం 2-0కు పెరిగింది. మూడో మ్యాచ్‌లో భారత నంబర్‌వన్ శ్రీజ 11-8, 4-11, 11-7, 6-11, 8-11తో ఎలిజబెటా సమారా చేతిలో ఓడిపోయింది. నాలుగో మ్యాచ్‌లో అర్చన 5-11, 11-8, 7-11, 9-11తో బెర్నాడెట్టి జాక్స్ చేతిలో ఓటమి పాలైంది. దాంతో స్కోరు 2-2తో సమమైంది. నిర్ణాయక ఐదో మ్యాచ్‌లో మనిక 11-5, 11-9, 11-8తో అదీనా దియకోనుపై గెలిచి భారత్‌కు 3-2తో విజయాన్ని అందించింది. నేడు అమెరికా, జర్మనీ జట్ల మధ్య మ్యాచ్ విజేతతో బుధవారం జరిగే క్వార్టర్ ఫైనల్లో భారత జట్టు ఆడతుంది.

గన్ పేలింది... పురుషుల 100 మీటర్ల పరుగు ప్రారంభమైంది... ఎనిమిది మంది అసాధారణ అథ్లెట్లు దూసుకుపోయారు. 30 మీటర్లు ముగిసేసరికి థాంప్సన్ తొలి స్థానంలో, కెర్లీ రెండో స్థానంలో ఉండగా... అందరికంటే నెమ్మదిగా 0.178 సెకన్ల రియాక్షన్ టైమ్‌తో ఆలస్యంగా మొదలుపెట్టిన లైల్స్ చివరగా ఎనిమిదో స్థానంలో ఉన్నాడు. 60 మీటర్లు ముగిసేసరికి థాంప్సన్, కెర్లీ తొలి రెండు స్థానాల్లోనే కొనసాగగా... లైల్స్ మూడో స్థానానికి దూసుకుపోయాడు. కానీ తర్వాతి 40 సెకన్లలో కథ పూర్తిగా మారింది. లైల్స్ ఒక్కసారిగా అద్భుతాన్ని చూపించాడు. మెరుపు వేగంతో చిరుతలా చెలరేగిపోయి లక్ష్యం చేరాడు. 90 మీటర్ల వరకు కూడా ఏ దశలోనూ అగ్రస్థానంలో లేని లైల్స్ అసలైన ఆఖరి 10 మీటర్లలో అందరినీ వెనక్కి నెట్టేశాడు. ఒలింపిక్స్ 100 మీటర్ల పరుగులో కొత్త చాంపియన్‌గా అవతరించాడు.

ప్రపంచంలో అత్యంత వేగవంతమైన అథ్లెట్‌ను నిర్ణయించడం అంత సులువుగా జరగలేదు. నోవా లైల్స్ (అమెరికా), కిషాన్ థాంప్సన్ (జమైకా) ఇద్దరూ 9.79 సెకన్లలోనే రేసు పూర్తి చేశారు. దాంతో 'ఫోటో ఫినిష్'ను ఆశ్రయించాల్సి వచ్చింది. చాలాసేపు ఉత్కంఠ నెలకొంది. తామిద్దరిలో ఎవరూ గెలిచామో కూడా తెలీని లైల్స్, థాంప్సన్ ఒకరి భుజంపై మరొకరు చేయి వేసి ఏం జరిగిందో ఎదురు చూస్తూ వచ్చారు. చివరకు ఇద్దరి మధ్య తేడా సెకనులో 5000వ వంతు మాత్రమే అని తేలింది. లైల్స్ టైమింగ్ 9.79 (.784) సెకన్లు కాగా, థాంప్సన్ టైమింగ్ 9.79 (.789)గా వచ్చింది. దాంతో 20 ఏళ్ల తర్వాత ఒలింపిక్స్‌లో 100 మీటర్ల పరుగు గెలిచిన అమెరికా అథ్లెట్‌గా లైల్స్ ఘనత సాధించగా... 98 మీటర్ల పాటు ఆధిక్యంలో ఉండి కూడా థాంప్సన్ రజతానికే పరిమితమయ్యాడు. ఫ్రెడ్ కెర్లీ (అమెరికా; 9.81 సెకన్లు) కాంస్య పతకం గెలుచుకున్నాడు.



సెకనులో 5000వ వంతు తేడాతో...

100 మీటర్ల స్ప్రింట్‌లో కొత్త విజేత

స్వర్ణం గెలుచుకున్న అమెరికన్ నోవా లైల్స్	జమైకా అథ్లెట్ థాంప్సన్‌కు రెండో స్థానం	ఇద్దరూ 9.79 సెకన్లలో రేసు పూర్తి	ఫోటో ఫినిష్‌తో తేలిన ఫలితం

పారిస్: అథ్లెటిక్స్ ప్రపంచంలో అత్యంత ప్రతిష్టాత్మక ఈవెంట్ పురుషుల 100 మీటర్ల పరుగు ఊహించినంత ఉత్కంఠను రేపి అదే స్థాయిలో ఆసక్తికర ఫలితాన్ని అందించింది. గత కొంత కాలంగా స్ప్రింట్స్‌లో అద్భుత ప్రదర్శనలు చేస్తూ ప్రస్తుత వరల్డ్ చాంపియన్ కూడా అయిన నోవా లైల్స్‌పై అంచనాలు పెరిగాయి. దానికి తగినట్లుగా అతను సిద్ధమయ్యాడు. తాజా రేసులో కూడా లైల్స్ తన స్థాయికి తగ్గ ప్రదర్శనతో విజేతగా నిలిచాడు. పరుగు పూర్తి చేసేందుకు లైల్స్‌కు 44 అంగలు పట్టగా, థాంప్సన్ 45 అంగలు తీసుకున్నాడు. చివరకు ఇదే తేడాను చూపించింది. 27 ఏళ్ల లైల్స్ తన కెరీర్ అత్యుత్తమ టైమింగ్‌తో ఒలింపిక్ స్వర్ణాన్ని అందుకున్నాడు. ఒలింపిక్స్ చరిత్రలో అత్యంత హోరాహోరీగా సాగిన 100 మీటర్ల పరుగు ఇది. ఫైనల్లో పాల్గొన్న ఎనిమిది మంది కూడా 10 సెకన్లలోపు పరుగు పూర్తి చేయడం ఇదే మొదటిసారి. విజేతకు, చివరి స్థానంలో నిలిచిన అథ్లెట్ టైమింగ్‌కు మధ్య అతి తక్కువ (0.12 సెకన్లు) తేడా మాత్రమే ఉండటం కూడా మరో విశేషం. ఈ రేసులో 4వ, 5వ, 6వ, 7వ, 8వ స్థానాల్లో నిలిచిన అథ్లెట్లు ఆయా స్థానాల్లో కొత్త ప్రపంచ రికార్డు టైమింగ్స్‌ను నమోదు చేయడం మరో ఆసక్తికర అంశం. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించిన ఇటలీ స్ప్రింటర్ మార్సెల్ జాకబ్స్ ఈసారి ఐదో స్థానంతో ముగించాడు.

పురుషుల 100 మీ. స్ప్రింట్ ఫలితం

1. నోవా లైల్స్ (అమెరికా)	9.79 సెకన్లు (.784)
2. కిషాన్ థాంప్సన్ (జమైకా)	9.79సె. (.789)
3. ఫ్రెడ్ కెర్లీ (అమెరికా)	9.81 సె.
4. అకానీ సిమ్‌బైన్ (దక్షిణాఫ్రికా)	9.82 సె.
5. మార్సెల్ జాకబ్స్ (ఇటలీ)	9.85 సె.
6. లెట్సిలె టెబొగో (బోట్స్‌వానా)	9.86 సె.
7. కెన్నెత్ బెడ్‌నరెక్ (అమెరికా)	9.88 సె.
8. ఒబ్లిక్ సెవిల్లె (జమైకా)	9.85 సె.



అనామకుడేమీ కాదు!

100 మీటర్ల పరుగులో విజేతగా నిలిచి 'ఫాస్టెస్ట్ మ్యాన్'గా గుర్తింపు తెచ్చుకున్న నోవా లైల్స్ అనూహ్యంగా దూసుకు రాలేదు. గత కొంత కాలంగా అతను అంతర్జాతీయ పోటీల్లో నిలకడగా రాణిస్తున్నాడు. ఎనిమిదేళ్ల క్రితం ప్రొఫెషనల్‌గా మారిన అతను స్ప్రింట్స్‌లో మంచి విజయాలు సాధించాడు. వరుసగా మూడు వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో అతను పతకాలు గెలుచుకున్నాడు. 2019లో 200 మీ., 4x100 మీటర్ల రిలేలో 2 స్వర్ణాలు గెలుచుకున్న అతను 2022లో కూడా ఇవే ఈవెంట్లలో స్వర్ణం, రజతం సాధించాడు. అయితే 2023లో బుడాపెస్ట్‌లో జరిగిన వరల్డ్ చాంపియన్‌షిప్‌లో అతని కెరీర్‌లో హైలైట్ ప్రదర్శన వచ్చింది. ఈ ఈవెంట్‌లో 100 మీటర్లు, 200 మీటర్లు, 4x100 మీటర్ల రిలేలలో స్వర్ణాలు సాధించిన అతను... దిగ్గజం ఉసేన్ బోల్ట్ (2015) తర్వాత ఒకే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 'ట్రిపుల్' సాధించిన తొలి ఆటగాడిగా ఘనత సాధించాడు. ఈ ప్రదర్శన వల్లే ఒలింపిక్స్‌లోనూ అతనిపై అంచనాలు పెరిగాయి. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో 200 మీటర్ల పరుగులో కాంస్యం గెలవడంలో సఫలమైన లైల్స్... అంతకు ముందు అమెరికా ఒలింపిక్ ట్రయల్స్‌లో విఫలం కావడంతో 100 మీటర్ల పరుగులో పాల్గొనే అవకాశం దక్కలేదు. ఇప్పుడు అదే ఈవెంట్‌లో స్వర్ణం గెలుచుకున్న అతను, 200 మీటర్ల పరుగులోనూ స్వర్ణంపై గురి పెట్టాడు.



'ఫోటో ఫినిష్' ఈ విధంగా...

రేస్ సమయంలో నిర్వాహకులు 'స్లిట్ వీడియో సిస్టం'ను ఏర్పాటు చేసి దీనిని ఫినిషింగ్ లైన్‌కు అనుసంధానిస్తారు. అథ్లెట్లు లైన్‌ను దాటే సమయంలో ఈ వీడియో సిస్టం సెకనుకు 2000 చొప్పున అత్యంత స్పష్టమైన చిత్రాలు (స్కానింగ్) తీస్తుంది. ఎవరైనా అథ్లెట్ అడ్డు వచ్చి మరో అథ్లెట్ స్పష్టంగా కనిపించే అవకాశం ఉండే ప్రమాదం ఉండటంతో ట్రాక్‌కు రెండోవైపు కూడా అదనపు కెమెరాను ఏర్పాటు చేస్తారు. ఈ రేసు ముగింపు క్షణాన్ని చూస్తే లైల్స్‌కంటే ముందే థాంప్సన్ కాలు లైన్‌ను దాటినట్లుగా కనిపిస్తోంది. కానీ అంతర్జాతీయ అథ్లెటిక్స్ సమాఖ్య నిబంధనల ప్రకారం అథ్లెట్ కాలుకంటే అతని నడుము పైభాగం (ఛాతీ, పొత్తికడుపు, వీపు) ముందుగా లైన్‌ను దాటాలి. సరిగ్గా ఇక్కడే లైల్స్ పైచేయి సాధించాడు. ఫోటో ఫినిష్‌లో దీని కారణంగానే టైమింగ్ విషయంలో మరింత స్పష్టత వచ్చింది.

పతకాల పట్టిక



ర్యాంక్	దేశం	స్వ	ర	కాం	మొ
1	చైనా	21	17	14	52
2	అమెరికా	19	29	27	75
3	ఆస్ట్రేలియా	13	11	8	32
4	ఫ్రాన్స్	12	15	18	45
5	బ్రిటన్	11	13	17	41
6	దక్షిణ కొరియా	11	8	7	26
59	భారత్	0	0	3	3

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం. స్వర్ణాల సంఖ్య ఆధారంగా ర్యాంక్ వరుస క్రమాన్ని నిర్ణయిస్తారు.

సాక్షి బిజినెస్

మంగళవారం
6-8-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
	2,223	662
	78,759	24,055

విదేశీ సూచీలు (సోమ వారం రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	16,301 ▽	475
డోజోన్స్	38,856 ▽	881
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,008 ▽	166
డాక్స్	17,339 ▽	550
షాంఘై	2,861 ▽	45
నికాయ్	31,458 ▽	4,451

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	69,117
బంగారం (99.5 స్వచ్ఛత)	68,840
వెండి (కేజీ)	78,950

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.38	84.40
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	106.08	108.67
€	యూరో	ఎస్‌బీఐ	90.45	92.83
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.21	58.52
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.56	55.49
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	61.03	65.70
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.47	23.02
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.94	23.72
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.89	12.71

బేర్ విశ్వరూపం 'అమ్మో'రికా!

- కుప్పకూలిన ప్రపంచ మార్కెట్లు
- సెన్సెక్స్ 2223 పాయింట్లు క్రాష్ 79 వేల స్థాయిని కోల్పోయిన సూచీ
- నిఫ్టీకి 662 పాయింట్ల నష్టం
- ఒక్క రోజులో రూ.15 లక్షల కోట్లు ఆవిరి

ముంబై: అమెరికాలో మాంద్యం భయాలు మార్కెట్లను ముంచేశాయి. జపాన్ కరెన్సీ యెన్ భారీ వృద్ధి బెంబేలెత్తించింది. పశ్చిమాసియా యుద్ధ ఉద్రిక్తతలు వణికించాయి. వెరసి దలాల్ స్ట్రీట్ సోమవారం బేర్ గుప్పిట్లో విలవిలలాడింది. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్ల ప్రతికూల సంకేతాలకు తోడు దేశీయ షేర్ల విలువ భారీగా పెరిగిపోవడంతో అమ్మకాల సునామీ వెల్లువెత్తింది. ఫలితంగా సెన్సెక్స్ 2,223 పాయింట్లు క్షీణించి 80 వేల స్థాయి దిగువన 78,759 వద్ద ముగిసింది. నిఫ్టీ 662 పాయింట్లు పతనమై 24,055 వద్ద నిలిచింది. సార్వత్రిక ఎన్నికల ఫలితాల ప్రకటన రోజు జూన్ 4న (5.76% పతనం) తర్వాత ఇరు సూచీలకిదే భారీ పతనం.

రోజంతా నష్టాల కడలిలో ...

అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందుకున్న సూచీలు ఏకంగా 3% నష్టాలతో మొదలయ్యాయి. సెన్సెక్స్ 2,394 పాయింట్ల నష్టంతో 78,588 వద్ద, నిఫ్టీ 415 పాయింట్లు క్షీణించి 24,303 వద్ద ట్రేడింగ్ ప్రారంభించాయి. ఇన్వెస్టర్ల కొనుగోళ్లకు సాహసించకపోవడంతో సూచీలు రోజంతా నష్టాల్లో కొట్టిమిట్టాడాయి. ఒకదశలో సెన్సెక్స్ 2,686 పాయింట్లు క్షీణించి 78,296 వద్ద, నిఫ్టీ 824 పాయింట్లు కుప్పకూలి 23,893 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు దిగివచ్చాయి.

- బీఎస్‌ఈలోని అన్ని రంగాల సూచీలు ఎరుపెక్కాయి. సర్వీసెస్ సూచీ 4.6%, యుటిలిటీ 4.3%, రియల్టీ 4.2%, క్యాపిటల్ గూడ్స్ 4.1%, ఇండస్ట్రీయల్ 4%, విద్యుత్ 3.9%, ఆయిల్అండ్‌గ్యాస్, మెటల్ 3.75% చొప్పున క్షీణించాయి.
- సెన్సెక్స్ సూచీలో హెచ్‌యూఎల్(0.8%,) నెస్లే (0.61%) మాత్రమే లాభాలతో గట్టెక్కాయి. మిగిలిన 28 షేర్లు నష్టపోయాయి. ఇందులో టాటా మోటార్స్ 7%, అదానీ పోర్ట్స్ 6%, టాటాస్టీల్ 5%, ఎస్‌బీఐ 4.50%, పవర్ గ్రిడ్ 4% షేర్లు అత్యధికంగా పడ్డాయి.
- చిన్న, మధ్య తరహా షేర్లలో భారీ లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ సూచీలు 4%, 3.6% చొప్పున క్షీణించాయి.
- బీఎస్‌ఈ ఎక్స్ఛేంజీలో లిస్టయిన మొత్తం 4,189 కంపెనీల షేర్లలో ఏకంగా 3,414 కంపెనీల షేర్లు నష్టాలు చవిచూశాయి.
- రిలయన్స్ 3% పడి రూ. 2,895 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో 4.50% పతనమై రూ.2,866 కనిష్టాన్ని తాకింది. మార్కెట్ క్యాప్ రూ. 70,195 కోట్లు ఆవిరై రూ. 19.58 లక్షల కోట్లకు తగ్గింది.
- మార్కెట్లో ఒడిదుడుకులు సూచించే వొలటాలిటీ ఇండెక్స్(వీఐఎక్స్) 42.23 శాతం పెరిగి 20.37 స్థాయికి చేరింది. ఇంట్రాడేలో 61% ఎగసి 23.15 స్థాయిని తాకింది. లేమాన్ బ్రదర్స్, కోవిడ్ సంక్షోభాల తర్వాత ఈ సూచీకిదే ఒక రోజులో అత్యధిక పెరుగుదల.

2 రోజుల్లో రూ.19.78 లక్షల కోట్ల ఆవిరి

ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలోని నమోదిత కంపెనీల మొత్తం విలువ సోమవారం ఒక్కరోజే రూ.15.32 లక్షల కోట్లు హరించుకుపోయాయి. శుక్రవారం కోల్పోయిన రూ.4.46 లక్షల కోట్లను కలిపితే గడచిన రెండు ట్రేడింగ్ సెషన్లో ఇన్వెస్టర్లకు మొత్తం రూ.19.78 లక్షల కోట్ల నష్టం వాటిల్లింది. బీఎస్‌ఈలో మార్కెట్ విలువ రూ. 441.84 లక్షల కోట్లకు పడింది.



84 దిగువకు రూపాయి

కొత్త ఆల్‌టైమ్ కనిష్టం



ఈక్విటీ మార్కెట్ల భారీ పతనంతో రూపాయి విలువ సరికొత్త జీవితకాల కనిష్టానికి పడిపోయింది. డాలర్ మారకంలో 37 పైసలు క్షీణించి 84 స్థాయి దిగువన 84.09 వద్ద స్థిరపడింది. ఫారెక్స్ మార్కెట్లో ఉదయం 83.78 వద్ద మొదలైంది. విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు, దలాల్ స్ట్రీట్ భారీ పతన ప్రభావంతో ఇంట్రాడే, జీవితకాల కనిష్టం 84.09 వద్ద స్థిరపడింది.

ముసిరిన మాంద్యం భయాలు..

- ఉద్యోగాల కోత.. హైరింగ్ తగ్గుముఖం..
- మూడేళ్ల గరిష్టానికి నిరుద్యోగం.. 4.3%కి అప్
- పశ్చిమాసియాలో యుద్ధ మేఘాల ఎఫెక్ట్...
- ఫెడ్ రేట్ల కోత సుదీర్ఘ వాయిదా ప్రభావం కూడా

జపాన్ నికాయ్	4451(13.5%)
కొరియా కాస్పీ	235(10%)
తైవాన్ వెయిటెడ్	1087(9%)
షాంఘై కాంపోజిట్	45(2.5%)
హాంకాంగ్ హాంగ్‌సెంగ్	247(1.50%)
జర్మనీ డాక్స్	550(3%)
ఫ్రాన్స్ సీఏసీ	103(1.50%)
బ్రిటన్ ఎఫ్‌టీఎస్‌ఈ	166(2%)
నాస్‌డాక్	475(3%)
ఎస్అండ్‌పీ	148(3%)
డోజోన్స్	881(2%)

(అమెరికా సూచీలు ఇంట్రాడేలో)

అమెరికాకు జలుబు చేస్తే.. ప్రపంచమంతా తుమ్ముతుందనే నానుడిని నిజం చేస్తూ, ప్రపంచ స్టాక్ మార్కెట్లు అతలాకుతలం అవుతున్నాయి. యూఎస్ తయారీ, నిర్మాణ రంగంలో బలహీనతకు గత వారాంతంలో విడుదలైన జాబ్ మార్కెట్ డేటా ఆజ్యం పోసింది. జూలైలో హైరింగ్ 1,14,000 ఉద్యోగాలకు పరిమితమైంది. అంచనాల కంటే ఏకంగా 1,80,000 జాబ్స్ తగ్గాయి. మరోపక్క, జూన్‌లో 4.1 శాతంగా ఉన్న నిరుద్యోగ రేటు.. జూలైలో 4.3 శాతానికి ఎగబాకింది. 2021 అక్టోబర్ తర్వాత ఈ స్థాయికి చేరడం ఇదే తొలిసారి. అంతేకాదు, ప్రపంచ చిప్ దిగ్గజం ఇంటెల్‌తో సహా మరికొన్ని కంపెనీలు తాజా కొలువుల కోతను ప్రకటించడం కూడా అగ్గి రాజేసింది. ఈ పరిణామాలన్నీ ఇన్వెస్టర్లలో మాంద్యం ఆందోళనలను మరింత పెంచాయి. వెరసి, గత శుక్రవారం అమెరికా మార్కెట్లు కకావికలం అయ్యాయి. నాస్‌డాక్ 2.4% కుప్పకూలింది. డోజోన్స్ 1.5%, ఎస్అండ్‌పీ-500 ఇండెక్స్ 1.84 చొప్పున క్షీణించాయి. కాగా, గత నెలలో ఆల్‌టైమ్ రికార్డుకు చేరిన నాస్‌డాక్ అక్కడి నుంచి 10% పైగా పతనమై కరెక్షన్‌లోకి జారింది. ఆసియా, యూరప్ బాటలోనే సోమవారం కూడా అమెరికా మార్కెట్లు 3-6% గ్యాప్ డౌన్‌తో మొదలై, భారీ నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

టెక్ స్టాక్స్.. ట్రిలియన్ డాలర్లు ఆవిరి

రెండో త్రైమాసిక ఫలితాల నిరాశతో నాస్‌డాక్‌లో టాప్-7 టెక్ టైటాన్స్ (యాపిల్, మైక్రోసాఫ్ట్, ఆల్ఫాబెట్, అమెజాన్, ఎన్‌వీడియా, టెస్లా, మెటా) షేర్లు అతలాకుతలం అవుతున్నాయి. ఏఐపై భారీగా వెచ్చిస్తున్న మైక్రోసాఫ్ట్, ఆల్ఫాబెట్ వంటి కంపెనీలకు ఆశించిన ఫలితాలు రావడం లేదనే ఆందోళనలు నెలకొన్నాయి. ఇక బలహీన ఆదాయంతో అమెజాన్ షేర్లు 10% క్రాష్ అయ్యాయి. ఫలితాల నిరాశతో ఇంటెల్ షేర్లు ఏకంగా 26% కుప్పకూలాయి. 1985 తర్వాత ఒకే రోజు ఇంతలా పతనమయ్యాయి. కంపెనీ ఏకంగా 15,000 మంది సిబ్బంది కోతను ప్రకటించడంతో జాబ్ మార్కెట్లో గగ్గోలు మొదలైంది. వెరసి, షేర్ల పతనంతో టాప్-7 టెక్ షేర్ల మార్కెట్ విలువ ట్రిలియన్ డాలర్లకు పైగా ఆవిరైంది. కాగా, సోమవారం ఈ షేర్లు మరో 6-10% కుప్పకూలాయి. ఎకానమీ పరిస్థితి బయటికి కనిపిస్తున్న దానికంటే చాలా బలహీనంగా ఉందని సీఈఓలు సిగ్నల్స్ ఇస్తున్నారు.

యుద్ధ సైరన్..: పశ్చిమాసియాలో హమాస్ చీఫ్ హనియేను ఇజ్రాయిల్ తుదముట్టించడంతో పరిస్థితులు మరింత దిగజారాయి. ఇజ్రాయిల్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ ప్రకటించడంతో పూర్తి స్థాయి యుద్ధానికి తెరలేస్తోంది. రష్యా-ఉక్రెయిన్ ఉద్రిక్తతలు సద్దుమణగక ముందే మరో వార్ మొదలైతే క్రూడ్ ధర భగ్గుమంటుంది. బ్యారల్ 100 డాలర్లను దాటేసి, ద్రవ్యోల్బణాన్ని ఎగదోస్తుంది. వెరసి ఎకానమీలు, మార్కెట్లపైనా తీవ్ర ప్రభావం పడుతుంది.

జపాన్.. సునామీ

అమెరికా దెబ్బతో ఆసియా, యూరప్ మార్కెట్లన్నీ సోమవారం కూడా కుప్పకూలాయి. జపాన్ నికాయ్ సూచీ ఏకంగా 13.5 శాతం క్రాష్ అయింది. 1987 అక్టోబర్ 19 బ్లాక్ మండే (14.7% డౌన్) తర్వాత ఇదే అత్యంత ఘోర పతనం. నికాయ్ ఆల్‌టైమ్ హై 42,000 పాయింట్ల నుంచి ఏకంగా 31,000 స్థాయికి దిగొచ్చింది. గత శుక్రవారం కూడా నికాయ్ 6% క్షీణించింది. ముఖ్యంగా జపాన్ యెన్ పతనం, ద్రవ్యోల్బణం 2% లక్ష్యంపైకి ఎగబాకడంతో అందరికీ భిన్నంగా బ్యాంక్ ఆఫ్ జపాన్ వడ్డీరేట్ల పెంపు బాటలో వెళ్తోంది. గత బుధవారం కూడా రేట్ల పెంపు ప్రకటించింది. దీంతో డాలర్‌తో ఇటీవల 160 స్థాయికి చేరిన యెన్ విలువ 142 స్థాయికి బలపడి ఇన్వెస్టర్లకు వణుకు పుట్టించింది. జపాన్, అమెరికా ఎఫెక్ట్ మన మార్కెట్ సహా ఆసియా, యూరప్ సూచీలను కుదిపేస్తోంది.

- సాక్షి, బిజినెస్ డెస్క్

ఫెడ్ రేట్ల కోత పైనే ఆశలు..

కరోనా విలయం తర్వాత రెండేళ్ల పాటు ఫెడ్ ఫండ్స్ రేటు 0-0.25% స్థాయిలోనే కొనసాగింది. అయితే, ద్రవ్యోల్బణం ఎగబాకి, 2022 జూన్‌లో ఏకంగా 9.1 శాతానికి చేరడంతో అమెరికా సెంట్రల్ బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ మళ్లీ రేట్ల పెంపును మొదలెట్టింది. 2023 జూలై నాటికి వేగంగా 5.25-5.5% స్థాయికి చేరి, అక్కడే కొనసాగుతోంది. మరోపక్క, ద్రవ్యోల్బణం ఈ ఏడాది గతేడాది జూన్‌లో 3 శాతానికి దిగొచ్చింది. ఈ ఏడాది జూన్ క్వార్టర్లో (క్యూ2) యూఎస్ జీడీపీ వృద్ధి రేటు 2.8 శాతంగా నమోదైంది. ద్రవ్యోల్బణం దిగొచ్చినప్పటికీ, ఫెడ్ మాత్రం రేట్ల కోతను సుదీర్ఘంగా వాయిదా వేస్తూ వస్తోంది. గత నెలఖర్లో జరిగిన పాలసీ భేటీలోనూ యథాతథ స్థితినే కొనసాగించింది. అయితే, తాజా గణాంకాల ప్రభావంతో సెప్టెంబర్‌లో పావు శాతం కాకుండా అర శాతం కోతను ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. ద్రవ్యోల్బణం దిగొచ్చినప్పటికీ రేట్ల కోత విషయంలో ఫెడ్ సుదీర్ఘ విరామం తీసుకుందని, దీనివల్ల ఎకానమీపై, జాబ్ మార్కెట్‌పై ప్రభావం పడుతోందనేది వారి అభిప్రాయం. అధిక రేట్ల ప్రభావంతో మాంద్యం వచ్చేందుకు 50% అవకాశాలున్నాయని జేపీ మోర్గాన్ అంటోంది!

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

ప్యాసింజర్ వాహనాల జోరు	5 ఐపీవోలకు సెబీ ఓకే

సి.ఆర్.ఐ పంప్స్‌కు ప్రతిష్టాత్మక ఈఈపిసి అవార్డు



పుదుచ్చేరి: ఇంజనీరింగ్ ఎగుమతి రంగంలోని సి.ఆర్.ఐ పంప్స్ 20వ సారి ప్రతిష్టాత్మక ఈఈపీసీ అవార్డు దక్కించుకుంది. పుదుచ్చేరిలో జరిగిన 45వ దక్షిణ ప్రాంత ఎగుమతి అవార్డు ప్రధాన కార్యక్రమంలో భారత వాణిజ్య శాఖ జాయింట్ సెక్రటరీ విమల్ ఆనంద్ చేతుల మీదుగా కంపెనీ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ ఆర్.భూపతి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా భూపతి మాట్లాడుతూ 'అవార్డులు మా సమిష్టి కృషికి, కస్టమర్లు మాపై ఉంచిన నమ్మకానికి నిదర్శనం. ఫ్లూయిడ్ మేనేజ్‌మెంట్‌లో అగ్రస్థానంలో ఉన్నందుకు గర్విస్తున్నాము. మరింత మన్నికైన ఉత్పత్తుల తయారీకి ప్రయత్నిస్తూనే ఉంటాం' అన్నారు.

ఎయిర్‌టెల్ దూకుడు

క్యూ1 లాభం రూ. 4,160 కోట్లు



న్యూఢిల్లీ: భారతీ ఎయిర్‌టెల్ ఈ ఏడాది తొలి త్రైమాసికం (2024-25, క్యూ1) లో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం 2.5 రెట్లు దూసుకెళ్లి రూ. 4,160 కోట్లను తాకింది. గతేడాది (2023-24) ఇదే కాలంలో కేవలం రూ. 1,613 కోట్లు ఆర్జించింది. ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం(ఏఆర్‌పీయూ) మెరుగుపడటానికితోడు.. రూ. 735 కోట్ల అనూహ్య లాభం నికర లాభాల్లో వృద్ధికి దోహదపడింది. మొత్తం ఆదాయం మాత్రం 3 శాతం పుంజుకుని రూ. 38,506 కోట్లకు చేరింది. గత క్యూ1లో రూ. 37,440 కోట్ల టర్నోవర్ నమోదైంది. దేశీ ఆదాయం మరింత అధికంగా 10 శాతం ఎగసి రూ. 29,046 కోట్లను తాకింది. ప్రస్తుత సమీక్షా కాలంలో ఎయిర్‌టెల్ ఏఆర్‌పీయూ రూ. 200 నుంచి రూ. 211కు ఎగసింది.

ఫలితాల నేపథ్యంలో ఎయిర్‌టెల్ షేరు 2.6 శాతం నీరసించి రూ. 1,059 వద్ద ముగిసింది.

సాక్షి స్పోర్ట్స్



ఒలింపిక్స్ ముగింపు వేడుకల్లో భారత బృందం పతాకధారిగా మనూ భాకర్

పారిస్ ఒలింపిక్స్‌లో తన అద్భుత ప్రదర్శన ద్వారా దేశానికి రెండు పతకాలు అందించిన స్టార్ షూటర్ మనూ భాకర్‌కు మరో గౌరవం దక్కింది. ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు గెలిచిన తొలి భారత ప్లేయర్‌గా రికార్డుల్లోకెక్కిన మనూ... 'పారిస్' క్రీడల ముగింపు వేడుకల్లో పతాకధారిగా వ్యవహరించ నుంది. ఈనెల 11న జరగనున్న ముగింపు వేడుకల్లో మనూ.. జాతీయ జెండా చేబూని భారత బృందాన్ని నడిపించనుంది. 'ముగింపు వేడుకల్లో మనూ ఫ్లాగ్ బేరర్‌గా వ్యవహరించనుంది. దీనికి భాకర్ పూర్తి అర్హురాలు' అని భారత ఒలింపిక్ సంఘం తెలిపింది. ఒలింపిక్స్ ఆరంభ వేడుకల్లో స్టార్ షట్లర్ పీవీ సింధు, టేబుల్ టెన్నిస్ (టీటీ) ప్లేయర్ ఆచంట శరత్ కమల్ పతాకధారులుగా వ్యవహరించారు. ముగింపు వేడుకల్లో ఫ్లాగ్ బేరర్‌గా వ్యవహరించనున్న పురుష అథ్లెట్ పేరు తర్వాత ప్రకటించనున్నారు.

నీరజ్ వస్తున్నాడు

నేడు పురుషుల జావెలిన్ త్రో క్వాలిఫయింగ్ పోటీలు

ఫేవరెట్‌గా భారత స్టార్ నీరజ్ చోప్రా • కిశోర్‌పై కూడా ఆశలు

మధ్యాహ్నం గం. 3:20 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



పారిస్: భారీ అంచనాలతో పారిస్ ఒలింపిక్స్‌లో అడుగు పెట్టిన ఒలింపిక్ డిఫెండింగ్ చాంపియన్, భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా మంగళవారం క్వాలిఫయింగ్ బరిలోకి దిగనున్నాడు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో నీరజ్ పసిడి పతకం సాధించి దేశ అథ్లెటిక్స్ చరిత్రలో కొత్త అధ్యాయానికి నాంది పలికాడు. 'పారిస్' లోనూ టోక్యో ప్రదర్శనను పునరావృతం చేయాలని పట్టుదలతో ఉన్నాడు. టోక్యో విశ్వ క్రీడల తర్వాత అంతర్జాతీయ స్థాయిలో నిలకడైన ప్రదర్శన కొనసాగించిన 26 ఏళ్ల నీరజ్ గత ఏడాది ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించి విశ్వవిజేతగా నిలిచాడు. 'పారిస్' నుంచి కూడా పతకంతో తిరిగి వస్తాడని యావత్ భారతావని ఆశలు పెట్టుకోగా... వాటిని అందుకోవడమే లక్ష్యంగా నేడు నీరజ్ మైదానంలో అడుగు పెట్టనున్నాడు. గాయాల బారిన పడకుండా ఉండేందుకు ఆచితూచి టోర్నీల్లో పాల్గొన్న 26 ఏళ్ల నీరజ్.. ఈ ఏడాది బరిలోకి దిగిన మూడు టోర్నీల్లోనూ ఆకట్టుకున్నాడు. ఈ విభాగంలో భారత్ నుంచి నీరజ్ చోప్రాతో పాటు.. కిశోర్ కుమార్ జేనా కూడా పోటీ పడుతున్నాడు. రెండు గ్రూప్‌ల్లో కలిపి మొత్తం 32 మంది త్రోయర్లు బరిలోకి దిగుతున్నారు. గ్రూప్ 'బి'లో నీరజ్... కిశోర్ గ్రూప్ 'ఎ'లో ఉన్నారు. ఫైనల్ చేరడానికి అర్హత ప్రమాణంగా 84 మీటర్లు నిర్ణయించారు. క్వాలిఫయింగ్ రౌండ్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన 12 మంది ఫైనల్‌కు అర్హత సాధించనున్నారు. ఒకవేళ 12 మంది కంటే ఎక్కువ మంది 84 మీటర్లను దాటి జావెలిన్‌ను విసిరితే ఇందులో నుంచి టాప్-12 మందికి ఫైనల్ బెర్త్‌లు లభిస్తాయి. ఫైనల్ గురువారం జరుగుతుంది. పాకిస్తాన్ త్రోయర్ నదీమ్ అర్షద్, జాకబ్ వాద్లెచ్ (చెక్ రిపబ్లిక్), వెబర్ (జర్మనీ), ఒలీవర్ (ఫిన్‌లాండ్) నుంచి నీరజ్‌కు ప్రధాన పోటీ ఎదురయ్యే అవకాశాలున్నాయి. నీరజ్ టైటిల్ నిలబెట్టుకుంటే.. ఒలింపిక్స్‌లో ఆ ఘనత సాధించిన ఐదో జావెలిన్ త్రోయర్ కానున్నాడు. విశ్వక్రీడల చరిత్రలో ఎరిక్ లామింగ్ (స్వీడన్; 1908, 1912), జానీ మైరా (ఫిన్‌లాండ్; 1920, 1924), జాన్ జెలెన్జీ (చెక్ రిపబ్లిక్; 1992, 1996, 2000), ఆండ్రీస్ థోర్‌కిల్డ్‌సెన్ (నార్వే; 2004, 2008) స్వర్ణాన్ని నిలబెట్టుకున్నారు.



కిశోర్



ఫైనల్ వేటలో...

నేడు సెమీఫైనల్లో జర్మనీతో భారత్ 'ఢీ'

- రాత్రి గం. 10:30 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

పారిస్: ఒలింపిక్స్‌లో భారత హాకీకి పూర్వ వైభవం తీసుకొచ్చే క్రమంలో పురుషుల జట్టు మరో కీలక పోరుకు సిద్ధమైంది. హోరాహోరీగా సాగిన క్వార్టర్ ఫైనల్లో బ్రిటన్‌ను 'షూటౌట్'లో ఓడించిన భారత్... మంగళవారం జరిగే సెమీఫైనల్లో ప్రపంచ చాంపియన్ జర్మనీతో అమీతుమీ తేల్చుకోనుంది. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన టీమిండియా... ఇప్పుడు పతకం రంగు మార్చాలని కృతనిశ్చయంతో ఉంది. 1980కి ముందు ఒలింపిక్స్‌లో ఎనిమిది స్వర్ణాలతో తిరుగులేని ఆధిపత్యం కనబర్చిన భారత్.. తిరిగి ఆ దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది. స్వర్ణ పతకమే లక్ష్యంగా పారిస్‌లో అడుగు పెట్టిన హర్మన్‌ప్రీత్ సింగ్ బృందం.. క్వార్టర్స్‌లో బ్రిటన్‌పై అసమాన ప్రదర్శన కనబర్చింది. స్టార్ డిఫెండర్ అమిత్ రోహిదాస్ రెడ్ కార్డుతో మైదానాన్ని వీడగా.. మిగిలిన 10 మందితోనే అద్భుతం చేసింది. ఇక 'షూటౌట్'లో గోల్ కీపర్ పీఆర్ శ్రీజేశ్ అడ్డుగోడలా నిలవడంతో 1972 తర్వాత భారత్ వరుసగా రెండోసారి ఒలింపిక్ సెమీఫైనల్లోకి అడుగుపెట్టింది. అదే జోరులో జర్మనీని కూడా చిత్తుచేస్తే.. 44 ఏళ్ల తర్వాత టీమిండియా విశ్వక్రీడల తుదిపోరుకు అర్హత సాధించనుంది. చివరిసారి భారత జట్టు 1980 మాస్కో ఒలింపిక్స్‌లో ఫైనల్ చేరి విజేతగా నిలిచింది. పారిస్ ఒలింపిక్స్ అనంతరం కెరీర్‌కు వీడ్కోలు పలకనున్న శ్రీజేశ్ మరోసారి కీలకం కానుండగా.. పెనాల్టీ కార్నర్ స్పెషలిస్ట్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్‌పై భారీ అంచనాలు ఉన్నాయి. రోహిదాస్‌పై ఓ మ్యాచ్ నిషేధం పడటంతో అతడు జర్మనీతో సెమీస్ పోరుకు అందుబాటులో లేడు. అయితే ఇలాంటివి తమ చేతిలో లేవని... మైదానంలో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చడంపైనే దృష్టి పెడతామని ఈ టోర్నీలో ఏడు గోల్స్ చేసిన భారత సారథి హర్మన్‌ప్రీత్ పేర్కొన్నాడు. టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక పోరులో జర్మనీపై విజయంతోనే పతకం దక్కించుకున్న టీమిండియా... మరోసారి జర్మనీని చిత్తు చేసి ముందంజ వేయాలని ఆశిద్దాం. మరో సెమీఫైనల్లో నెదర్లాండ్స్‌తో స్పెయిన్ తలపడనుంది.

రోహిదాస్‌పై ఒక మ్యాచ్ నిషేధం

భారత డిఫెండర్ అమిత్ రోహిదాస్‌పై ఓ మ్యాచ్ నిషేధం పడింది. బ్రిటన్‌తో క్వార్టర్ ఫైనల్ సందర్భంగా.. రోహిదాస్ హాకీ స్టిక్ బ్రిటన్ ప్లేయర్ తలకు తగిలింది. ఉద్దేశపూర్వకంగా చేయకపోయినా.. మ్యాచ్ రిఫరీ అతడికి రెడ్ కార్డు చూపి మైదానం నుంచి తప్పించాడు. దీనిపై భారత జట్టు అప్పీల్ చేయగా.. వాదనలు విన్న అనంతరం అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ఒక మ్యాచ్ నిషేధం విధిస్తున్నట్లు వెల్లడించింది. దీంతో అతడు నేడు జరిగే సెమీఫైనల్‌కు అందుబాటులో లేకుండా పోయాడు. 'నియమావళిని అతిక్రమించినందుకు అమిత్ రోహిదాస్‌పై ఒక మ్యాచ్ నిషేధం విధించాం' అని ఎఫ్ఐహెచ్ పేర్కొంది.

ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ థోర్ప్ మృతి



లండన్: మాజీ ఇంగ్లండ్ బ్యాటర్ గ్రాహమ్ థోర్ప్ సోమవారం మృతి చెందాడు. 55 ఏళ్ల థోర్ప్ 2022 నుంచి తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఆ ఏడాది అఫ్గానిస్తాన్‌కు హెడ్ కోచ్‌గా నియమించారు. కానీ అప్పటి నుంచి థోర్ప్ ఆరోగ్య పరిస్థితి క్షీణించింది. అయితే స్పష్టమైన వ్యాధి, ఏ రకమైన అనారోగ్యమన్న సంగతి మాత్రం వెల్లడికాలేదు. ఆయనకు భార్య అమెండా, నలుగురు పిల్లలు హెన్రీ, అమెలియా, కిట్టీ, ఎమ్మా ఉన్నారు. ఎడంచేతి బ్యాటర్ అయిన థోర్ప్ 1993 నుంచి 2005 వరకు తన కెరీర్‌ను కొనసాగించాడు. కీలకమైన మిడిలార్డర్ బ్యాటర్‌గా సేవలందించాడు. 100 టెస్టులు ఆడిన థోర్ప్ 44.66 సగటుతో 6,744 పరుగులు చేశాడు. ఇందులో 16 సెంచరీలున్నాయి. 82 అంతర్జాతీయ వన్డేలు ఆడి 37.18 సగటుతో 2,830 పరుగులు సాధించాడు. కౌంటీ జట్టు సర్రేతో థోర్ప్‌ది సుదీర్ఘబంధం! అండర్-11 స్థాయిలోనే ఆ జట్టులో చేరిన థోర్ప్ ఏకంగా 17 ఏళ్ల పాటు సేవలందించి దాదాపు 20 వేల పరుగులు చేశాడు. అంతర్జాతీయ కెరీర్ ముగిశాక కోచ్‌గా పని చేశాడు.

క్లుప్తంగా...

ఎండీఎస్ సీట్ల కేటాయింపు

సాక్షి, అమరావతి: మాస్టర్ ఆఫ్ డెంటల్ సర్జన్ (ఎండీఎస్) కోర్సు సీట్ల భర్తీలో భాగంగా తొలిదశ కౌన్సెలింగ్‌లో కన్వీనర్, యాజమాన్య కోటా సీట్లను ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం కేటాయించింది. కన్వీనర్ కోటాలో 224, యాజమాన్య కోటాలో 110 మంది విద్యార్థులు అడ్మిషన్ పొందారు. అడ్మిషన్ పొందిన వారు ఈ నెల 7వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల్లోగా కళాశాలల్లో రిపోర్ట్ చేయాలని విశ్వవిద్యాలయం ఆదేశించింది. ఈ నెల 8వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపింది.

డిసెంబర్ 8న ఎన్ఎంఎంఎస్ పరీక్ష

సాక్షి, అమరావతి: ప్రస్తుత విద్యా సంవత్సరం (2024-25)లో జరిగే 'నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్' (ఎన్ఎంఎంఎస్) పరీక్ష కోసం షెడ్యూల్ విడుదల చేసినట్లు పాఠశాల విద్యాశాఖ పరీక్షల విభాగం డైరెక్టర్ దేవానందరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులుగా పేర్కొన్నారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.3.50 లక్షల లోపు ఉండాలన్నారు. సెప్టెంబర్ 6వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. వివరాలకు www.bse.ap.gov.inలో గాని సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో గాని తెలుసుకోవచ్చన్నారు.

'టెట్'కు 4.27 లక్షల దరఖాస్తులు

సాక్షి, అమరావతి: ఏపీ టెట్(జూలై)-2024కు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల మూడో తేదీతో గడువు ముగిసిందని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 4,27,300 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 3 నుంచి 10వ తేదీ వరకు టెట్ పరీక్షలు ఉంటాయన్నారు. ఈ నెల 22వ తేదీ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, పరీక్ష పూర్తయిన మరుసటి రోజు ప్రాథమిక కీ విడుదల చేస్తామని, ఫైనల్ కీ అక్టోబర్ 27వ తేదీన విడుదల చేస్తామని పేర్కొన్నారు. టెట్ ఫలితాలను నవంబర్ రెండో తేదీన వెల్లడిస్తామని తెలిపారు.

విశాఖకు యూనిటీ మాల్


కొమ్మాది (విశాఖ జిల్లా): విశాఖ నగరానికి యూనిటీ మాల్ రానుంది. మాల్ నిర్మాణానికి అవసరమైన స్థలం కోసం ఇప్పటికే అధికారులు అన్వేషణ ప్రారంభించారు. భీమిలి బీచ్ రోడ్డు తిమ్మాపురంలోని రామానాయుడు ఫిల్మ్ స్టూడియో సమీపంలో స్థలాన్ని సోమవారం కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పరిశీలించారు. మాల్ నిర్మాణానికి స్థలం అనుకూలమా కాదా అనే విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

వాకింగ్‌కు వెళ్లిన మహిళకు వేధింపులు



యశవంతపుర: తెల్లవారుజామున వాకింగ్‌కు వెళ్లిన మహిళ (33) లైంగిక వేధింపులకు గురైన ఘటన కర్ణాటకలో శుక్రవారం జరగ్గా.. సోమవారం వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. బెంగళూరులోని కోణనకుంటే సమీపంలోని కృష్ణానగరలో రోజూ మాదిరిగానే ఓ మహిళ వాకింగ్‌కు వెళ్లింది. స్నేహితులు వస్తారని రోడ్డు పక్కన వేచి ఉండగా ఎక్కడి నుంచో ఓ కీచకుడు వచ్చాడు. ఆమెను వెనుక నుంచి నోరు మూసేసి కావలించుకుని అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె గట్టిగా ప్రతిఘటించడంతో అక్కడి నుంచి పారిపోయాడు. ఒక నిమిషం పాటు జరిగిన ఈ నిర్వాకం అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. ఈ క్లిప్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. బాధితురాలు ఫిర్యాదు చేయడంతో స్థానిక పోలీసులు ఆ కామాంధుడి కోసం గాలింపు చేపట్టారు. నిందితుణ్ణి గుర్తించామని, త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

ఘనంగా విట్ 39వ స్నాతకోత్సవం



చెన్నై: వెల్లూర్‌లోని వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విట్) 39వ స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నేషనల్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ ఫోరమ్ (ఎన్ఈటీఎఫ్) చైర్మన్ ప్రొఫెసర్ అనిల్ డి.సహస్రబుద్ధి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు ఏ వృత్తిని ఎంచుకున్నా ఆ రంగంలో ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని అయితే ఉద్యోగానికి తగ్గట్టుగా బహుళ నైపుణ్యాలను వృద్ధి చేసుకోవడమే ముఖ్యమన్నారు. అసోచామ్ కర్ణాటక రాష్ట్ర అభివృద్ధి మండలి చైర్మన్ పరశురామన్ మాట్లాడుతూ.. కష్టపడి పనిచేయడానికి వేరే ప్రత్యామ్నాయాలుండవని, ఫెయిల్యూర్స్ నుంచే ఎన్నో నేర్చుకుంటామని ఆయన తెలిపారు. గ్రామీణ, పేద, మధ్యతరగతి విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ కూడా అందిస్తున్నామని విట్ వ్యవస్థాపక చాన్స్‌లర్ డాక్టర్ జి.విశ్వనాథన్ పేర్కొన్నారు.





కుమారదేవంలో గోదావరి ఒడ్డున వృక్షరాజం (ఫైల్)

కుమారదేవంలో నేలకూలిన భారీ సినిమా చెట్టు

నీ జ్ఞాపకం.. సినిమాల్లో పదిలం

150 ఏళ్ల చరిత్ర కలిగిన భారీ వృక్షం

మూడొందలకు పైగా సినిమాలు ఈ చెట్టు నీడలోనే చిత్రీకరణ

సినిమా చెట్టు.. సినిమాల్లో ఓ జ్ఞాపకంగా మిగిలిపోయింది. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవంలో గోదావరి ఒడ్డున గల భారీ వృక్షం సోమవారం నేలకొరిగింది. 150 ఏళ్ల చరిత్ర గల ఈ నిద్రగన్నేరు చెట్టు కింద సుమారు 300కి పైగా చిత్రాలు తెరకెక్కాయి. సినిమాలో ఒక్క సీన్ అయినా ఇక్కడ తీస్తే హిట్ ఖాయమన్న సెంటిమెంట్ టాలీవుడ్‌లో బలంగా నాటుకుపోయింది. ముఖ్యంగా విశ్వనాథ్, బాపు, వంశీ, జంధ్యాల, రాఘవేంద్రరావు వంటి దర్శకులు ఈ చెట్టు నీడలోనే ఎన్నో చిత్రాలు తెరకెక్కించారు. 1964లో విడుదలైన మూగమనసులు, 1975లో పాడి పంటలు సినిమాలతో పాటు శంకరాభరణం, హిమ్మత్‌వాలా, సీతారామయ్యగారి మనవరాలు, త్రిశూలం, పద్మవ్యూహం, చట్టంతో పోరాటం వంటి చిత్రాల నుంచి.. ఇటీవల రంగస్థలం లాంటి ఎన్నో సూపర్‌హిట్ సినిమాలను ఈ చెట్టు నీడలోనే చిత్రీకరించారు. ఎన్నో తుపానులు, వరదలను సైతం తట్టుకుని నిలబడిన ఈ వృక్షరాజం సోమవారం తెల్లవారుజామున రెండుగా చీలి కూలిపోయింది. గోదావరి ఒడ్డును ఆనుకుని ఉండటంతో ఏటా వచ్చే వరదలకు గోదావరి ఒడ్డు కోతకు గురవుతూ వచ్చింది. ఈ సినిమా చెట్టు కుమారదేవం గ్రామానికి సైతం ఎంతో గుర్తింపు తెచ్చింది. గ్రామానికి చెందిన సింగులూరి తాతబ్బాయి అనే వ్యక్తి ఈ మొక్కను నాటినట్టు గ్రామస్తులు చెబుతున్నారు. రెండున్నర ఎకరాల్లో విస్తరించిన చారిత్రక వృక్షం కూలిపోవడం వృక్ష ప్రేమికులను తీవ్ర ఆవేదనకు గురి చేసింది. - కొవ్వూరు

టీడీపీ ఆఫీసుపై దాడి కేసులో వైఎస్సార్‌సీపీ నేతలకు బెయిల్

- పలు షరతులు విధించిన హైకోర్టు
- ముందస్తు బెయిల్ వ్యాజ్యాలపై విచారణ 8కి వాయిదా



సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో అరెస్టయిన గుంటూరు వైఎస్సార్‌సీపీ నేతలకు హైకోర్టు సోమవారం బెయిల్ మంజూరు చేసింది. ఈ సందర్భంగా పలు షరతులు విధించింది. రూ.15 వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. చార్జిషీట్ దాఖలు చేసేవరకు ప్రతి నెల 1, 15 తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట మధ్య దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలని స్పష్టం చేసింది. అవసరమైనప్పుడు దర్యాప్తు అధికారికి అందుబాటులో ఉండాలంది. కేసుకు సంబంధించిన వాస్తవాలు తెలిసిన వారిని బెదిరించడం, ప్రలోభపెట్టడం, హామీలివ్వడం వంటివి చేయరాదని స్పష్టం చేసింది. తిరిగి ఇలాంటి చర్యలకు పాల్పడరాదని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ రాధాకృష్ణ కృపాసాగర్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. 2021లో జరిగిన టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో పోలీసులు ఇటీవల గుంటూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు అచ్చాల వెంకటరెడ్డి, బత్తుల దేవానంద్, షేక్ ఖాజా మోహిద్దీన్, షేక్ మస్తాన్ వలీలను అరెస్ట్ చేశారు. కింది కోర్టు బెయిల్ నిరాకరించడంతో వీరు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాలపై విచారించిన జస్టిస్ కృపాసాగర్ సోమవారం షరతులతో బెయిల్ మంజూరు చేశారు. పిటిషనర్లు నెలకు పైగా జైల్లో ఉన్నారని న్యాయమూర్తి తెలిపారు. దీని తరువాత దర్యాప్తు పూర్తిస్థాయిలో జరిగిందని, పిటిషనర్ల సామాజిక స్థితిగతులు, వారి శాశ్వత చిరునామాలపై ఎలాంటి వివాదం లేదని చెప్పారు. రికార్డులను బట్టి చూస్తే వీరు దర్యాప్తునకు విఘాతం కలిగిస్తారని అనిపించడం లేదన్నారు. అందువల్ల వీరి నిర్బంధం అవసరం లేదని పేర్కొన్నారు. మరోవైపు ఇదే కేసులో తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, మాజీ ఎంపీ నందిగం సురేష్, విజయవాడ నేత దేవినేని అవినాష్, పలువురు కార్యకర్తలు దాఖలు చేసిన వ్యాజ్యాలపై విచారణను జస్టిస్ కృపాసాగర్ ఈ నెల 8వ తేదీకి వాయిదా వేశారు.

నీట్ పీజీ నిర్వహణపై దుమారం

- కీలక దస్త్రం లీక్ అయిందంటూ సోషల్ మీడియాలో వదంతులు
- పరీక్ష కేంద్రాల కేటాయింపుపైనా అభ్యర్థుల ఆందోళన



సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా వైద్య విద్య పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే నీట్ పీజీ-2024పై సోషల్ మీడియాలో దుమారం రేగింది. పరీక్ష నిర్వహణకు సంబంధించి నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ (ఎన్‌బీఈ)కు చెందిన కీలక దస్త్రం లీక్ అయిందంటూ ప్రచారం ఊపందుకుంది. ఆ దస్త్రాన్ని ఆల్ ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్‌తో పాటు మరికొందరు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఎన్‌బీఈ అధ్యక్షుడు డాక్టర్ అభిజిత్ సేన్ సంతకంతో కూడిన ఆ దస్త్రంలో 'దేశవ్యాప్తంగా 169 నగరాల్లో 376 పరీక్ష కేంద్రాల్లో 2,28,542 మంది అభ్యర్థులు నీట్ పీజీ రాయనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు రెండు షిఫ్టుల్లో పరీక్ష ఉంటుంది (ఒక విద్యార్థికి ఏదో ఒక షిఫ్టులో మాత్రమే పరీక్ష). పరీక్ష సజావుగా నిర్వహించేందుకు ఆయా జిల్లాల కలెక్టర్‌లు సహకరించాలి' అని ఉంది. ఈ నేపథ్యంలో 'కీలకమైన దస్త్రం లీకైంది.. నీట్ పీజీ పేపర్ భద్రతపై ఎలా నమ్మకంగా ఉండగలం?' అంటూ పలువురు అభ్యర్థులు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. కాగా దేశవ్యాప్తంగా గత నెల 23న నిర్వహించాల్సిన నీట్ పీజీ పరీక్షను ఈ నెల 11కి వాయిదా వేసిన సంగతి తెలిసిందే.

అభ్యర్థుల ఆందోళన..

మరోవైపు పరీక్ష కేంద్రాల కేటాయింపుపైనా అభ్యర్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వెయ్యి కి.మీ.లకుపైగా సుదూర ప్రాంతాల్లో పరీక్ష కేంద్రాలను కేటాయించారని ఆందోళన చెందుతున్నారు. దీనిపైనా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. ఈ వ్యవహారాన్ని ఎంపీలు సైతం కేంద్ర మంత్రి జేపీ నడ్డా దృష్టికి తెచ్చారు.

పిన్నెల్లి బెయిల్ పిటిషన్లపై విచారణ వాయిదా

పూర్తి వివరాలు సమర్పించాలని పోలీసులకు హైకోర్టు ఆదేశం



సాక్షి, అమరావతి: పోలింగ్ రోజు, ఆ మరుసటి రోజు తనపై రెంటచింతల, కారంపూడి పోలీసులు నమోదు చేసిన రెండు వేర్వేరు కేసుల్లో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యాలకు సంబంధించి పూర్తి వివరాలను తమ ముందుంచాలని సోమవారం హైకోర్టు పోలీసులను ఆదేశించింది. విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ ఉత్తర్వులు జారీచేశారు. పోలింగ్ రోజున పాల్వాయి గేటు పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ధ్వంసం చేసి, అడ్డువచ్చిన టీడీపీ ఏజెంట్ శేషగిరిరావుపై దాడి చేశారంటూ రెంటచింతల పోలీసులు రామకృష్ణారెడ్డిపై కేసు నమోదు చేశారు. మరుసటి రోజు కారంపూడిలో సీఐ నారాయణస్వామిపై దాడిచేసి గాయపరిచారంటూ రామకృష్ణారెడ్డిపై కారంపూడి పోలీసులు మరో కేసు నమోదు చేశారు. ఈ రెండు పోలీస్‌స్టేషన్లలో హత్యాయత్నం కింద కూడా రామకృష్ణారెడ్డిపై కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో ఆయనకు బెయిల్ ఇచ్చేందుకు ఇటీవల గురజాల కోర్టు తిరస్కరించిన విషయం తెలిసిందే.

ఇసుక ట్రాక్టర్ల సీజ్‌పై టీడీపీ శ్రేణుల ఆగ్రహం



పోలీస్ స్టేషన్ వద్ద టీడీపీ శ్రేణులతో మాట్లాడుతున్న చిత్తూరు సీఐ శ్రీనివాసులు

తవణంపల్లె: చిత్తూరు జిల్లా తవణంపల్లె మండలంలో ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ఎస్ఐ అనిల్‌కుమార్ సీజ్ చేయడాన్ని నిరసిస్తూ సోమవారం టీడీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. ఇక్కడ అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను ఆదివారం ఎస్ఐ సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ సీఎం చంద్రబాబును దూషించారని, తమ పార్టీవారితో దురుసుగా ప్రవర్తించారని వారు ఆరోపించారు. టీడీపీ వర్గీయులు పోలీస్ స్టేషన్‌కు వచ్చిన విషయం తెలుసుకున్న చిత్తూరు సీఐ శ్రీనివాసులు అక్కడికి చేరుకుని వారితో చర్చించారు. ఎస్ఐపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో టీడీపీ వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీనిపై ఎస్ఐ అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం అనుమతించిన రీచ్‌ల నుంచి మాత్రమే ఇసుక తరలించాలని స్పష్టం చేశారు.

ఎయిడెడ్ టీచర్లకు ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహించాలి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా ఎయిడెడ్ ఉపాధ్యాయులను కూడా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా సర్దుబాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.చిట్టిబాబు, ఎల్‌కే చిన్నప్ప, ప్రతినిధి ప్రభాకర్ రెడ్డి ఓ ప్రకటనలో కోరారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 595 ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న 1,950 మంది ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందికి, విద్యార్థులు లేని 145 ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే సిబ్బందికి టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టంలో పొందుపరిచిన డేటా ఆధారంగా విద్యార్థుల నిష్పత్తి ప్రకారం సర్దుబాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

సర్దుబాటుకు ముందే జీవో నం.117 రద్దు చేయాలి: ఆప్టా

ఉపాధ్యాయ సంఘాలతో ప్రభుత్వం చర్చించకుండా, జీవో నం.117 రద్దు చేయకుండా ఉపాధ్యాయుల సర్దుబాటు బదిలీలు చేయడం తగదని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) ఓ ప్రకటనలో పేర్కొంది. విద్యాశాఖ మంత్రి రాష్ట్రంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాలతో ప్రత్యక్షంగా సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలని కోరింది. ఈ మేరకు సోమవారం ఆప్టా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏజీఎస్ గణపతిరావు, కె.ప్రకాష్‌రావు ప్రకటన విడుదల చేశారు.

ఏపీ ఇన్ పార్లమెంట్


రాజ్యసభ

విశాఖలో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్‌కు పార్టీల ఆహ్వానం



సాక్షి, న్యూఢిల్లీ: విశాఖపట్నంలో బిల్డ్, ఓన్, ఆపరేట్ పద్ధతిలో ఏడాదికి ఐదు కిలోటన్నుల ఉత్పత్తి సామర్థ్యం (5 కేటీపీఏ) ఉన్న గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ ఏర్పాటుకు పార్టీల నుంచి ఆసక్తిని ఆహ్వానించడానికి హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) సిద్ధంగా ఉందని పెట్రోలియం, సహజవనరులశాఖ సహాయమంత్రి సురేష్ గోపి తెలిపారు. రాజ్యసభలో సోమవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. విశాఖ రిఫైనరీలో 0.37 కేటీపీఏ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి హెచ్‌పీసీఎల్ గత నెలలో పైలట్ ప్రాజెక్టు ప్రారంభించినట్లు చెప్పారు.

పోలవరం ఇరిగేషన్ కాంపొనెంట్ మాత్రమే కేంద్రానిది




పోలవరం ప్రాజెక్టులో 2014 ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే పనులకు ఇరిగేషన్ కాంపొనెంట్ మాత్రమే విభజన చట్టం ప్రకారం వందశాతం కేంద్రం భరించాలని జలశక్తి శాఖ సహాయమంత్రి భూషణ్ చౌధరి తెలిపారు. పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించామని, ఏపీ ప్రభుత్వం కేంద్రం తరఫున పనులు చేస్తోందని వైఎస్సార్‌సీపీ ఎంపీ బీద మస్తాన్‌రావు ప్రశ్నకు సమాధానమిచ్చారు.

7,30,712 ఇళ్లలోకి లబ్ధిదారులు



ప్రధానమంత్రి ఆవాస్ యోజన-అర్బన్ (పీఎంఏవై-యూ)లో ఏపీలో ఇప్పటివరకు 7,30,712 ఇళ్లల్లోకి లబ్ధిదారులు చేరారని కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాలశాఖ సహాయమంత్రి తోఖన్ సాహూ తెలిపారు. ఏపీకి 16,33,562 ఇళ్లు మంజూరు చేయగా 15,37,605 గ్రౌండ్ అయ్యాయని వైఎస్సార్‌సీపీ ఎంపీ పరిమళ్ నత్వానీ ప్రశ్నకు జవాబిచ్చారు.

2030 కల్లా 1.5 బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం



2030 నాటికి 1.5 బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. దేశీయ అవసరాల కోసం 2028 నాటికే 1.39 బిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చారు.

పార్లమెంట్ ఓబీసీ సంక్షేమ కమిటీల్లో వైఎస్సార్‌సీపీ ఎంపీలు

లోక్‌సభ కమిటీలో తనూజారాణి, రాజ్యసభ కమిటీలో బీద మస్తాన్‌రావు

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్‌లోని ఓబీసీ సంక్షేమ కమిటీల్లో వైఎస్సార్‌సీపీ ఎంపీలు సభ్యులుగా ఎన్నికయ్యారు. లోక్‌సభ ఓబీసీ సంక్షేమ కమిటీ (2024-25) సభ్యురాలిగా వైఎస్సార్‌సీపీ ఎంపీ తనూజరాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మొత్తం 20 మంది ఉండే ఈ కమిటీకి 23 నామినేషన్లు వచ్చాయి. ముగ్గురు ఉపసంహరించుకోవడంతో మిగిలినవారు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు లోక్‌సభ సచివాలయం పేర్కొంది. ఈ కమిటీలో మాణిక్యం ఠాగూర్ (కాంగ్రెస్), టీఆర్ బాలు (డీఎంకే), కల్యాణ్ బెనర్జీ (టీఎంసీ), జి.లక్ష్మీనారాయణ (టీడీపీ) తదితరులున్నారు. రాజ్యసభ ఓబీసీ సంక్షేమ కమిటీ సభ్యుడిగా వైఎస్సార్‌సీపీ ఎంపీ బీద మస్తానరావు ఎన్నికయ్యారు. ఈ కమిటీకి ఇటీవల జరిగిన ఎన్నికల్లో పదిమంది ఎన్నికైనట్లు రాజ్యసభ సచివాలయం తెలిపింది.

సెంట్రల్ సిల్క్ బోర్డు సభ్యుడిగా లక్ష్మీనారాయణ

నలుగురు సభ్యులుండే సెంట్రల్ సిల్క్ బోర్డుకు టీడీపీ ఎంపీ జి.లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు. ఈ కమిటీకి లోక్‌సభ నుంచి జి.సెల్వన్, రాధాకృష్ణ, కె.సుధాకర్ కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

లోక్‌సభ

ఏపీకి మరిన్ని నిధులు విడుదల చేయండి

లోక్‌సభలో మత్స్యశాఖ పద్దులపై చర్చలో వైఎస్సార్‌సీపీ ఎంపీ గురుమూర్తి



సాక్షి, న్యూఢిల్లీ: సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు, రొయ్యల ఉత్పత్తిలో ముందుండి బ్లూ ఎకానమీకి తోడ్పడుతున్న ఆంధ్రప్రదేశ్‌కు మరిన్ని నిధులు మంజూరు చేయాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ గురుమూర్తి కేంద్రాన్ని డిమాండ్ చేశారు. సముద్ర ఉత్పత్తులు నిల్వ చేయడానికి కోల్డ్ చైన్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరారు. లోక్‌సభలో సోమవారం మత్స్యశాఖ పద్దులపై చర్చలో ఆయన మాట్లాడారు. తిరుపతి నియోజకవర్గం పరిధిలోని పూడిరాయదొరువులో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ భూసర్వే ఇంకా ప్రారంభం కాలేదని చెప్పారు. ఈ సర్వేని వీలైనంత త్వరగా ప్రారంభించాలని కోరారు. పులికాట్ సరస్సు ముఖద్వారానికి అడ్డంగా ఇసుకమేటల వల్ల వేసవిలో మత్స్యసంపద క్షీణించడంతోపాటు వేలాదిమంది మత్స్యకారుల జీవనోపాధి ప్రమాదంలో పడిందని వేదన వ్యక్తం చేశారు. పులికాట్ సరస్సు ముఖద్వారం పూడిక తీయడానికి ఇప్పటికే రూ.128 కోట్ల ఖర్చు అంచనా వేశారని గుర్తుచేశారు. మత్స్యకారుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని కొండూరుపాలెం, పూడిరాయదొరువు వద్ద ముఖద్వారాన్ని తెరిచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మత్స్యకారుల ఇబ్బందుల్ని దృష్టిలో ఉంచుకుని పులికాట్ సరస్సు పరిధిలోని ఏడు మండలాలకు రహదారి కనెక్టవిటీ అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. రెండు దశాబ్దాలుగా తమిళనాడు, పుదుచ్చేరి మత్స్యకారులు ఏపీలోని రిజర్వ్‌డ్ జోన్‌లోకి అక్రమ ప్రవేశాలతో ఏపీ మత్స్యకారుల పడవలు, వలలకు తీవ్రనష్టం వాటిల్లుతోందన్నారు. ఈ సమస్యను సున్నితంగా పరిష్కరించాలని కోరారు. ఏపీలో మత్స్యసంపద పరిశోధనలు మెరుగుపరచడానికి పరిశోధన మండలి ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమశాఖ నుంచి ఎక్కువగా ఆంధ్రప్రదేశ్‌కే నిధులు కేటాయించినట్లు చర్చకు సమాధానంగా ఆ శాఖ మంత్రి లల్లన్‌సింగ్ తెలిపారు.

రూసా నిధులు రూ.338.21 కోట్లు విడుదల

ఆంధ్రప్రదేశ్‌లోని 158 ఉన్నత విద్యాసంస్థలకు రూసా పథకంలో భాగంగా రూ.662.19 కోట్లు అనుమతించి రూ.338.21 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి సుకాంత మజుందార్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ మద్దిళ్ల గురుమూర్తి, టీడీపీ ఎంపీలు అప్పలనాయుడు, లక్ష్మీనారాయణ ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు.

ఇంటర్ మోడల్ బస్ స్టేషన్ నిర్మాణ పనులు సత్వరమే ప్రారంభించాలి


తిరుమల శ్రీవారి దర్శనార్థం రోజూ లక్షలాదిమంది యాత్రికులు తిరుపతి వస్తుంటారని, ఈ నేపథ్యంలో తిరుపతి బస్ టెర్మినల్‌ను అత్యాధునిక ఇంటర్ మోడల్ బస్‌స్టేషన్‌గా మార్చేపనులు సత్వరమే చేపట్టాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ గురుమూర్తి డిమాండ్ చేశారు. ఆయన సోమవారం లోక్‌సభ జీరోఅవర్‌లో మాట్లాడారు. దీనికి నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ ప్రణాళికలు ప్రారంభించిందని గుర్తుచేశారు. పనుల ప్రతిపాదనలు ఇప్పటికే వచ్చాయని తెలిపారు. ఈపీసీ మోడల్‌లో పూర్తిచేయాలని ఆయన కోరారు.

బొర్రాగుహల అభివృద్ధికి రూ.29.87 కోట్లు



అరకు-లంబసింగి పర్యాటక అభివృద్ధిలో భాగంగా స్వదేశ్ దర్శన్ 2.0లో 2023-24లో రూ.29.87 కోట్లు అనుమతించినట్లు కేంద్ర పర్యాటకశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ తెలిపారు. ప్రస్తుతం పనులు పురోగతిలో ఉన్నాయని వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చారు. ఈ పథకంలో చాలెంజ్ బేస్డ్ డెస్టినేషన్ డెవలప్‌మెంట్ ఉప పథకంలో ఏపీలో నాగార్జునసాగర్, అహోబిలం ఆలయం, అన్నవరం, వేదగిరి లక్ష్మీనారాయణ ఆలయం ప్రసాద్ పథకంలో భాగంగా అభివృద్ధి చేయడానికి గుర్తించినట్లు చెప్పారు.

ఐఐటీల్లో ఎస్సీ, ఎస్టీ సెల్స్ సేవలు



దేశవ్యాప్తంగా అన్ని ఐఐటీల్లోను ఎస్సీ, ఎస్టీ సెల్స్ సేవలందిస్తున్నాయని కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి సుకాంత మజుందార్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ గుమ్మా తనూజరాణి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. ఆయా సంస్థలందించే మౌలికసదుపాయాలు, నిధులతో ఎస్సీ, ఎస్టీ సెల్స్ సేవలందిస్తున్నాయని చెప్పారు.



కడప-బెంగళూరు రైల్వేలైను పనులు వేగవంతం చేయాలి

రైల్వే మంత్రికి ఎంపీ మిథున్‌రెడ్డి విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: కడప-బెంగళూరు మధ్య 2008-09లో అనుమతించిన కొత్త రైల్వేలైను పనుల్ని వేగవంతం చేయాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వైఎస్సార్‌సీపీ లోక్‌సభాపక్ష నేత పి.వి.మిథున్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాజంపేట నియోజకవర్గం పరిధిలోని పీలేరు, పుంగనూరు, మదనపల్లి వంటి ప్రధాన పట్టణాల మీదుగా వెళ్లే ఈ లైను రాయలసీమ ప్రాంతంలో ఎంతోమందికి ఉపకరిస్తుందని చెప్పారు. పార్లమెంటులోని రైల్వేమంత్రి కార్యాలయంలో మంత్రి అశ్విని వైష్ణవ్‌తో భేటీ అయిన మిథున్‌రెడ్డి పలు పెండింగ్ అంశాలపై చర్చించి వినతిపత్రం ఇచ్చారు. కలికిరి రైల్వేస్టేషన్‌లో వసతులు మెరుగుపరిచి, పలు రైళ్లకు స్టాపింగ్ ఇవ్వాలని కోరారు. రాజంపేట, నందలూరు స్టేషన్లలో కొన్ని రైళ్లను ఆపాలని విజ్ఞప్తి చేశారు. నందలూరులో లోకోషెడ్ పునరుద్ధరించాలని, 240 ఎకరాల విలువైన రైల్వే భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని, క్రూ కంట్రోల్ స్టేషన్ ఏర్పాటు చేయాలని అయన కోరారు.

సమగ్ర శిక్ష నిధులకు ఏపీ ప్రతిపాదనలు పంపలేదు

- కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

సాక్షి, న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సమగ్ర శిక్ష పథకం నిధుల విడుదల కోసం ఏపీ కేంద్రానికి ఇంకా ప్రతిపాదనలను పంపలేదని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చెప్పారు. ప్రతిపాదనలు అందిన తర్వాతే నిధులు విడుదలవుతాయని తెలిపారు. లోక్‌సభలో సోమవారం కాంగ్రెస్ ఎంపీ ఆంటో ఆంటోని పున్నతనియిల్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి జవాబిచ్చారు. ఆంధ్రప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీ సహా 15 రాష్ట్రాలు/యూటీలు తమ ప్రతిపాదనలను కేంద్రానికి ఇప్పటికీ పంపించలేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 66,199 మంది ఎల్ఐసీ ఏజెంట్లు ఉన్నారని కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్‌చౌదరి తెలిపారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

తుంగభద్రకు తగ్గుతున్న వరద


తుంగభద్ర డ్యాం నుంచి విడుదలవుతున్న నీరు

హొసపేటె: తుంగభద్రకు వదరద తగ్గుముఖం పట్టింది. గత పది రోజుల నుంచి భారీగా వరద నీరు పోటెత్తిన విషయం తెలిసిందే. సోమవారం డ్యాంకు 83 వేల క్యూసెక్కుల మేర వరద నీరు వచ్చి చేరడంతో డ్యాం వద్ద 12 గేట్లను రెండు అడుగులు మేర పైకెత్తి దిగువకు సుమారు 32 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. జలాశయం ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కొద్దిగా తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం డ్యాంలో నీటిమట్టం 1631.59 అడుగులకు, నీటి నిల్వ 98.820 టీఎంసీలకు వరకు చేరుకొంది.

తల్లి పాలు బిడ్డకు శ్రేష్టం


మాట్లాడుతున్న సరోజ

రాయచూరు రూరల్: పిల్లలు అపౌష్టికత నుంచి పౌష్టికతను పొందాలంటే తల్లి పాలు బిడ్డకు శ్రేష్టమని ఉప ఆరోగ్యాధికారిణి సరోజ పేర్కొన్నారు. సోమవారం యాపలదిన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రపంచ స్తన సప్తాహ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. తల్లి గర్భిణిగా ఉన్న సమయంలో మంచి పౌష్టిక ఆహారాన్ని తినాలన్నారు. పిల్లల ఎదుగుదలకు తల్లి పాలు ప్రొటీన్‌లాంటిదన్నారు.

ఘనంగా చౌడేశ్వరి దేవి జయంతి


ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరి దేవి

బళ్లారిటౌన్: నగరంలోని తొగట వీర క్షత్రియ కులదేవత చౌడేశ్వరి జయంతిని ఆదివారం రాత్రి రైల్వే కాలనీలోని చౌడేశ్వరి ఆలయంలో ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి లలిత పారాయణ పఠనం గావించారు. అదే విధంగా రూపనగుడి రోడ్డులోని చౌడేశ్వరి ఆలయంలో జయంతి ఉత్సవాలను జరిపారు. ఈ కార్యక్రమంలో ఇరు ఆలయ కమిటీల ధర్మకర్తలు నాగభూషణ, చంద్రశేఖర్, ఆ సమాజ నేతలు ఈ.దేవానంద, బీరే ధనుంజయ, చంద్రశేఖర్, బాలకృష్ణ తదితర నేతలు పాల్గొన్నారు.

ధార్వాడ జైల్లో ఖైదీ ఆత్మహత్య

హుబ్లీ: జీవిత ఖైదు శిక్ష అనుభవిస్తున్న ఖైదీ కేంద్ర కారాగృహంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం వెలుగు చూసింది. గదగ్ జిల్లా రోణ తాలూకా నందిగవాడ గ్రామానికి చెందిన బసవరాజ్(47) మృతుడు. 2013లో భార్యతో ఘర్షణ పడుతుండగా విడిపించడానికి వచ్చిన పెద్దనాన్న కుమారుడిపై ఆయన భార్యపై కోపంతో కొడవలితో దాడి చేసి హత్య చేశాడు. దీంతో బసవరాజ్ యావజ్జీవ కారాగార శిక్షకు గురి అయ్యాడు. అయితే అతడు కారాగృహంలో మంచి నడత పెంపొందించుకున్నాడు. ఆ మేరకు జైల్లోని ఆవుల సంరక్షణ, పాలు పితికేవాడు. ఆదివారం పశువుల దొడ్డిలో ఎవరూ లేని వేళ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ధార్వాడ ఉపనగర పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

తుంగభద్రలో మునిగి రైతు మృతి


రైతు ఈర నాగప్ప(ఫైల్)

సిరుగుప్ప: తుంగభద్రా నది వరద నీటిలో మునిగి ఓ మృతి చెందిన ఘటన సిరుగుప్ప పోలీస్ స్టేషన్ వ్యాప్తిలో చోటు చేసుకొంది. మృతుడు తాలూకాలోని బాగేవాడి గ్రామ కురుబ రైతు ఈరనాగప్ప(45) సోమవారం ఉదయం పొలానికి పంప్‌సెట్ ద్వారా నీరు పెట్టడానికి వెళ్లి తుంగభద్రానది వరద నీటిలో కాలు జారి పడి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టు నిమిత్తం సిరుగుప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తరలించినట్లు వారు తెలిపారు.

దోపిడీ కేసులో ఆరుగురి అరెస్ట్

హుబ్లీ: ధార్వాడ తాలూకా హొసతేగూరు వద్ద జరిగిన దోపిడీ కేసుకు సంబంధించి గరగ పోలీసులు ఆరుగురిని అరెస్ట్ చేశారు. కిత్తూరు నవీన్ (34), సంతోష్ (25), అక్షయ్(19), సాగర యల్లప్ప(20), మల్లాపుర విరుపాక్షి (21), సాగర ఫక్కీరప్ప(21) అరెస్ట్ అయిన నిందితులు. వీరి నుంచి దోపిడీ చేసిన రూ.25 వేల నగదుతో పాటు దోపిడీకి వినియోగించిన కారును స్వాధీనం చేసుకున్నారు. పూనా- బెంగళూరు రోడ్డులో హొసతేగూరు వద్ద గ్రీన్ డాబా ముందున్న రోడ్డులో ఈ నెల 22న ఈ దోపిడీ జరిగింది. ఈ కేసులో ఏడుగురికి గాను ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. పరారైన మరో నిందితుడి ఆచూకీ కోసం గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

గవర్నర్ నోటీసు అప్రజాస్వామికం

- సిద్దరామయ్యపై కుట్రలు నిరసిస్తూ భారీ ఎత్తున ర్యాలీలు
- కదం తొక్కిన అహింద నాయకులు, కాంగ్రెస్ నాయకులు, శ్రేణులు

బళ్లారిటౌన్: ఇటీవల ముఖ్యమంత్రి సిద్దరామయ్యను ప్రతిపక్షాలు కుట్ర పన్ని ఆయన్ను గద్దె దించేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపిస్తూ అణగారిన వర్గాల మహాసమాఖ్య, వెనుకబడిన వర్గాల సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని గాంధీ భవన్ నుంచి జిల్లాధికారి కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి ఎంపీ ఈ.తుకారాం, ఎమ్మెల్యేలు గణేష్, భరత్‌రెడ్డి, మేయర్ ముల్లంగి నందీష్, బుడా అధ్యక్షుడు ఆంజనేయులు, ముండ్రగి నాగరాజ్, మించు శ్రీనివాసులు, ప్రభంజన్‌కుమార్, తదితరులు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజలను మన్నలు పొందుతోందని, దీనిని సహించలేకే బీజేపీ కుట్రలు పన్నుతోందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో నేతలు కేఎస్ఎల్ స్వామి, మానయ్య, గాదిలింగనగౌడ, శివశంకర, మోహన్, కెరెకోడప్ప, సంగనకల్లు విజయ్‌కుమార్, వెంకటేష్ హెగ్డే, ఎం రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


హొసపేటెలో భారీ ర్యాలీ చేస్తున్న నేతలు, కార్యకర్తలు

హొసపేటెలో..

హొసపేటె: విజయనగరలో జిల్లా కేంద్రం హొసపేటె నగరంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్యపై గవర్నర్ నోటీసు, తప్పుడు ముడా స్కాంపై నోటీసులిచ్చి ప్రజాప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు చేస్తున్న కుట్రను ఖండిస్తూ విజయనగర జిల్లా అహింద సంఘం నాయకుల ఆధ్వర్యంలో సోమవారం భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ర్యాలీని సాయిబాబా సర్కిల్ నుంచి ప్రారంభించి జిల్లాధికారి కార్యాలయం వరకు నిర్వహించారు. నిరసనలో మాజీ మంత్రి పీటీ పరమేశ్వర్ నాయక్, హామీల కమిటీ అధ్యక్షుడు కూరి శివమూర్తి, కేపీసీసీ ప్రధాన కార్యదర్శి రాణి సంయుక్త, విజయనగర జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శిరాజ్ షేక్, సీనియర్ నాయకులు సిద్దనగౌడ, హాలప్ప, కాంగ్రెస్ పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు సైరా బాను, అమ్మ యోగ లక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షురాలు సునందమ్మ, రాష్ట్ర కార్యదర్శి తారా హిరేమఠ, నాయకురాళ్లు పల్లవి, గంగమ్మ, అనిత, రుక్సానా కార్యకర్తలు పాల్గొన్నారు.


రాయచూరులో ఆందోళన చేస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

రాయచూరులో...

రాయచూరు రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్యను సీఎం పదవి నుంచి దించడానికి రాష్ట్ర గవర్నర్ కార్యాలయాన్ని బీజేపీ, జేడీఎస్‌లు కుట్రలు పన్ని దుర్వినియోగపరచడం తగదని అహింద వర్గాల వేదిక జిల్లా కమిటీ పేర్కొంది. సోమవారం అంబేడ్కర్ సర్కిల్ వద్ద చేపట్టిన ఆందోళనలో అధ్యక్షుడు శాంతప్ప మాట్లాడారు. ముడా, వాల్మీకి మండలిలో కోట్లాది రూపాయల మేర కుంభకోణాల్లో అక్రమాలు, అవినీతి చోటు చేసుకుందని, రెండు పార్టీలు రాష్ట్ర గవర్నర్‌ను అడ్డం పెట్టుకొని ప్రాసిక్యూషన్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

మృతదేహం కోసం బంధువుల ఆరాటం

- 9 రోజుల తర్వాత ఎట్టకేలకు లభ్యం

హుబ్లీ: అవయవదానంతో పాటు దేహదానంపై ప్రజలకు ఎంత అవగాహన కల్పించినా కొందరు మాత్రం ప్రాచీన ఆచారాలు, వ్యవహారాల ఫలితంగా మృతదేహాన్ని దానం చేయడానికి అంగీకరించరు. ఇలాంటి ఘటనకు నిదర్శనమే ఈ సంగతి. కుటుంబ సభ్యుల అనుమతి లేకుండా కిమ్స్ ఆస్పత్రిలో మృతదేహాన్ని విద్యార్థుల బోధన ప్రయోగాలయంలో వినియోగించడానికి ప్రయత్నించారని ఆరోపణలు వచ్చాయి. కుటుంబ సభ్యుల ఒత్తిడి పెరిగిన నేపథ్యంలో 9 రోజుల తర్వాత ఎట్టకేలకు మృతదేహాన్ని బంధువులకు అప్పగించిన ఘటన కిమ్స్‌లో చోటు చేసుకుంది. స్థానిక ఉణకల్‌లోని సుభానినగర చెందిన అతాఉల్లాఖాన్ (40) మృతదేహాన్ని ప్రయోగాలయంలో వినియోగించడానికి ప్రయత్నించినట్లుగా కుటుంబ సభ్యులు ఆరోపించారు. అనుమతి లేకుండా స్వచ్ఛందంగా నిర్ణయం తీసుకొని మృతదేహాన్ని ప్రయోగాలయానికి పంపారు.

ప్రయోగాలయానికి ఇవ్వాలని వినతి

సదరు మృతదేహాన్ని అప్పగించాలని అడగడానికి వచ్చిన బంధువులకు కిమ్స్ వైద్యులు ఆ మృతదేహాన్ని విద్యార్థుల బోధన కోసం ప్రయోగాలయానికి ఇవ్వాలని కుటుంబ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. దీనికి కుటుంబ సభ్యులు నిరాకరించారు. దీంతో ఒత్తిడి పెరిగిన నేపథ్యంలో శవాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అసలు విషయం ఏమంటే గత నెల 27న విద్యానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అతాఉల్లాఖాన్ శవం లభ్యమైంది. అనాథ వ్యక్తి అంటూ స్థానికులు కిమ్స్‌కు తరలించారు. ఇది జరిగిన నాలుగైదు రోజులు గడిచినా మృతుడి బంధువులు ఎవరూ రాని నేపథ్యంలో సదరు మృత దేహాన్ని కిమ్స్ ఆస్పత్రిలోని ప్రయోగాలయానికి తరలించారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతాఉల్లాఖాన్ నాలుగైదు రోజులు గడిచినా తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు వెతికారు.

పోలీసుల జోక్యంతో మృతదేహం అప్పగింత

ఈ క్రమంలో స్థానికులు కుటుంబ సభ్యులకు ఓ శవాన్ని కిమ్స్ ఆస్పత్రికి తరలించినట్లుగా తెలియజేయడంతో తక్షణమే కిమ్స్ శవగారానికి వెళ్లగా మృతదేహం అక్కడ లేదు. దీంతో కంగారు పడిన బంధువులు పోలీసుల సహకారంతో ప్రయత్నించగా శవం కిమ్స్ ప్రయోగాలయంలో ఉన్నట్లు తెలిసింది. దీంతో తమ బంధువు మృతదేహాన్ని అప్పగించాలని తగిన ఆధారాలతో అడిగినా నిరాకరించారు. అయితే పోలీసుల జోక్యంతో మృతదేహాన్ని అప్పగించినట్లు మృతుడి భార్య పర్వీన్‌భాను తెలిపారు. ఈ విషయమై కిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎఫ్ కమ్మరా మాట్లాడుతూ కిమ్స్‌కు వచ్చిన గుర్తు తెలియని శవాన్ని పోలీసులు ద్వారా కిమ్స్ విద్యార్థులు బోధన కోసం తీసుకున్నాం. అయితే మృతుడి కుటుంబ సభ్యులు పరిస్థితి తెలపడంతో పోలీసుల వివరణ మేరకు నిబంధనల మేరకు కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించినట్లు ఆయన స్పష్టం చేశారు.

భక్తిశ్రద్ధలతో నాగుల అమావాస్య


నాగదేవతకు విశేష అలంకరణ దృశ్యం

హొసపేటె: ఆషాఢ మాసం ముగిసి శ్రావణ మాసం ప్రారంభం కావడంతో రాష్ట్రంలోని ఆలయాలన్ని నిండాయి. నాగర అమావాస్య సందర్భంగా విజయనగర జిల్లా కొట్టూరు తాలూకాలోని గురు కొట్టూరేశ్వర స్వామి ఆలయంలో జనం పోటెత్తారు. ఉదయం నుంచే రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వచ్చి స్వామి వారి దర్శనం కోసం క్యూలో నిల్చున్నారు. నాగర అమావాస్య సందర్భంగా నాగర ఆలయానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. అన్ని అమావాస్యల కంటే ఈ నాగ, భీముని అమావాస్య రోజున ఆలయం కిక్కిరిసిపోయింది. దర్శనానంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

పెన్షన్ బకాయిల విడుదలకు వినతి

సిరుగుప్ప: తమకు రావలసిన నాలుగు నెలలు పెన్షన్ బకాయిలు మంజూరు చేయాలని తాలూకా దేవదాసి మహిళా సంఘం సోమవారం బృహత్ ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రికి మనవి పత్రాన్ని అందజేశారు. అనంతర సంఘం గౌరవ అధ్యక్షులు ఆదివప్ప మాట్లాడుతూ 2024 ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకు పెన్షన్ విడుదల కాలేదన్నారు. సంఘం అధ్యక్షురాలు ఉలిగెమ్మ మాట్లాడుతూ ప్రతి దేవదాసీ మహిళకు 5 ఎకరాలు భూమి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.


తహసీల్దార్‌కు మనవిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

ఈసందర్భంగా తాలూకాలోని దేవదాసీ మహిళలు, నాగరాజ్, ఉపాధ్యక్షురాలు లక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులపై ఒత్తిడి వద్దు

హుబ్లీ: ప్రభుత్వ ఉద్యోగులు ఎంతో ఒత్తిళ్ల మధ్య పని చేస్తున్నారు. రాష్ట్రం ప్రభుత్వం వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న సుమారు 2.66 లక్షల పోస్టులను భర్తీ చేయడం ద్వారా ఆ పని ఒత్తిళ్లను తగ్గించాలని విధాన పరిషత్ స్పీకర్ బసవరాజ్ హొరట్టి సూచించారు. స్థానిక గౌరమ్మ హిరేమఠ కళ్యాణ మంటపంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ధార్వాడ జిల్లా ఏర్పాటు చేసిన ప్రతిభా పురస్కారాలు, సర్వ సభ్యుల సాధారణ సమావేశం, 7వ వేతన కమిషన్ అమలుకు సహకరించిన ఎమ్మెల్యేలకు అభినందన కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్క ప్రభుత్వ ఉద్యోగి ఓ రాయబారిలా విధులు నిర్వహించి ప్రభుత్వం పట్ల ప్రజల్లో సదభిప్రాయం కలిగిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై గురుతరమైన బాధ్యత ఉందన్నారు. నేటి ప్రభుత్వాలు ప్రజాసంక్షేమానికి పెద్ద పీట వేయడం వల్ల కొత్త పథకాలు అమలు అవుతున్నాయన్నారు. ఇలాంటి పథకాలకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయడంలో కీలక బాధ్యత ఉద్యోగులదేనన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ షడక్షరి మాట్లాడుతూ ప్రభుత్వ నిర్వహణలో ఉద్యోగుల పాత్ర ముఖ్యమన్నారు. ప్రభుత్వ ఆదాయ కల్పనకు అధికారులు శ్రమిస్తున్నారన్నారు. ప్రభుత్వం 7 వేతన కమిషన్ డిమాండ్‌ను నెరవేర్చిందన్నారు. ఎన్‌పీఎస్‌ను ఓపీఎస్ చేసే ప్రక్రియ ప్రభుత్వ దశలో ఉందని నవలగుంద ఎమ్మెల్యే ఎన్‌హెచ్ కోనరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏడీసీ గీత, వైశు దీప ఫౌండేషన్ అధ్యక్షురాలు శివలీల కులకర్ణి, జిల్లా అధ్యక్షులు ఎస్ఎఫ్ సిద్దనగౌడర, రమేష్, రేణుక మదబావి తదితరులు పాల్గొన్నారు.

కంది తెగులు నివారించాలి


హొసపేటె: తాలూకాలో కందిపంటలో కస్కూటా తెగులు నిర్మూలనకు చర్యలు తీసుకోకుంటే రైతులకు న్యాయం చేయాలని సహాయ వ్యవసాయ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని రైతు నాయకుడు గోపాల్ ఎంపీ గారంపల్లి హెచ్చరించారు. వెంటనే పొలాన్ని సందర్శించి పరిశీలించాలని తెలిపారు. 9 ఎకరాల వరకు పంట దెబ్బతిందని తాలూకాకు చెందిన కాకుబాళు రైతు శివకుమార్ తెలిపారు. పంట బాగా వచ్చింది. కానీ దురదృష్టవశాత్తు మొక్కల నరికివేత మొదలైందని, చేతికి వచ్చిన పంటను నేలమట్టం అయ్యే పరిస్థితి ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. తాలూకాలోని పలు గ్రామాల్లో కంది పంటకు అనేక రకాల వ్యాధులు, తెగుళ్ల సోకుతున్నా తగిన పరిష్కారం లేదన్నారు. వ్యవసాయ అధికారులు ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోకుండా చేతులు దులుపుకున్నారన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

రాయచూరు రూరల్ : బాల్య వివాహాల నియంత్రణకు ప్రతిఒక్కరూ సహకరించాలని జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు మల్లికార్జున అభిప్రాయపడ్డారు. సోమవారం తాలూకాలోని కురుబదొడ్డి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నగరంలో సేట్‌చున్నీలాల్ న్యాయ కళాశాలలో ఏర్పాటు చేసిన జాతీయ సేవా పథకం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సమాజం అభివృద్ధిలో విద్యార్థుల పాత్ర అమోఘమన్నారు. విద్యార్థులు విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆరోగ్యం, పరిసరాల శుభ్రత, సంరక్షణ అంశాలపై దృష్టి సారించాలన్నారు. న్యాయ కళాశాల అధ్యక్షుడు శ్రీకాంత్, జగదీష్, కురుబదొడ్డి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెడ్ మాస్టర్ విద్యావతి, పంచాయతీ ఉపాధ్యక్షురాలు సంగీత, సభ్యురాలు హేమలత, మహేష్, సునీల్ కుమార్, భీమన గౌడ, నారాయణ స్వామిలున్నారు.

కార్మికులకు వైద్య సేవలు


నేత్ర పరీక్షలు చేస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్ : పేద కార్మికులకు సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవలందిస్తామని రోటరీ క్లబ్ అధ్యక్షుడు ప్రభునగౌడ అభిప్రాయపడ్డారు. సోమవారం నగరంలోని షరాఫ్ భవనంలో రోటరీ క్లబ్, కాటన్‌సిటీ, రోటరీ జనసేవా ప్రతిష్టాన ఆధ్వర్యంలో రక్తదాన, ఉచిత వైద్య పరీక్ష శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. దాతల నుంచి 11 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. 30 మందికి కంటి పరీక్షలు, కీళ్ల వ్యాధులకు చికిత్సలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సుధీర్, సందీప్, రోటరీక్లబ్ సభ్యులు హనుమంతు, వెంకటేష్, శివరాజ్, గురు, ప్రసాద్, అశోక్, ఈరణ్ణ, లక్ష్మణ్‌లున్నారు.

కనీస చట్టపరిజ్ఞానం అవసరం


మాట్లాడుతున్న జడ్జి హేమలత హళ్లూర

హొసపేటె: పిల్లలకు చట్టంపై అవగాహన ఉంటే రానున్న రోజుల్లో మెరుగైన సమాజ నిర్మాణంలో ముఖ్యపాత్ర పోషిస్తారని ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి, తాలూకా లీగల్ సర్వీస్ కమిటీ అధ్యక్షురాలు హేమలత బి.హళ్లూర తెలిపారు. సోమవారం నగరంలోని గురుకుల పూర్వ గ్రాడ్యుయేషన్ కళాశాలలో బాల్య వివాహాల నిషేధం, లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం- 2012పై చట్టపరమైన అవగాహన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. చట్టాలపై ప్రజలకు ముఖ్యంగా విద్యార్థులకు చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అక్షరాస్యత తక్కువగా ఉన్న కారణంగా బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. విద్యార్థులు ఈ చట్టం గురించి తెలుసుకొని వారి చుట్టూ ఉన్న ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆడపిల్లలు లైంగిక వేధింపులకు గురైతే, వారు తమ తండ్రికి, తల్లికి, సంరక్షకులకు లేదా ఉపాధ్యాయుడికి తెలియజేయాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలన గురించి పిల్లలకు తెలియజేయాలన్నారు. మీకు వేరొకరి వల్ల ఇబ్బంది ఉంటే న్యాయ సహాయం తీసుకోవాలన్నారు. పిల్లలు ఎట్టి పరిస్థితుల్లోను చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని సూచించారు. అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ మంజునాథ్ మాట్లాడుతూ ఈ రోజుల్లో పాఠశాలలు, కళాశాలల్లో చేరుతున్న విద్యార్థుల్లో 50 శాతం మంది బాలికలే కావడం హర్షణీయమన్నారు. పిల్లలు అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలన్నారు.

వేదావతికి నీరు వదలరూ

సిరుగుప్ప: హగరి(వేదావతి)నదికి నీటిని విడుదల చేయాలని, తుంగభద్రా నది నుంచి మణ్ణూరు సూగూరు వంక ద్వారా బైరాపురం మీదుగా నీటిని హగరికి అనుసంధానం చేయాలని రైతులు డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం రైతు సంఘం అధ్యక్షులు జె.సిద్దరామనగౌడ మాట్లాడుతూ వేదావతి నది ద్వారా తాలూకాలో కొన్ని గ్రామాల రైతులకు పంటల సాగు, పశువులకు తాగునీటి కోసం ఎంతో మేలు జరిగేదన్నారు. గత రెండేళ్ల నుంచి బొత్తిగా హగరి ఎండిపోవడంతో రైతుల పంటలకు, పశువులకు తాగునీరుకు కష్టమైందన్నారు. వేదావతి నది సాగునీటి ద్వారా గోనబాళ, మైలాపుర, బలకుంది, అరళిగనూరు, పప్పునాహళ, గర్జగినహాళ, కుడుదరహాళ్, నాగలాపుర, కురువళ్లి, టి.రాంపుర, తొండేహాళ్, రారావి, సాలిగనూరు, కోటెహాళ్, కె.సూగూరు, ముదేనూరు, బెంచి క్యాంప్ తదితర గ్రామాల రైతులు పంటలు పండించుకునే వారన్నారు. గత కొన్నేళ్ల నుంచి వర్షాలు అడపాదడపా రావడంతో హగరికి నీరు రావడం లేదన్నారు. దీంతో పశువులకు తాగునీరు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. తుంగభద్ర నది నుంచి దాదాపు 200 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారని, అవి వృథా అవుతున్నందున రైతుల శ్రేయస్సు కోసం తుంగభద్ర నది నుంచి మణ్ణూరు సూగూరు వంక ద్వారా బైరాపురం మీదుగా వేదావతి నదికి నీటిని అనుసంధానం చేయాలని కోరారు. ఈసందర్భంగా రాజేష్, మల్లికార్జునగౌడ, జి.భీమనగౌడ, బసవరాజగౌడ, వీరేశ్, ఎం.చంద్రు తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న రైతులు

ఎమ్మెల్యేపై చర్యలకు డిమాండ్


ఎస్ఐ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న జేడీఎస్ నేతలు

రాయచూరు రూరల్: ఎస్ఐ పరశురామ మృతికి బాధ్యుడైన యాదగిరి శాసన సభ్యుడు చెన్నారెడ్డి పాటిల్‌పై చర్యలు చేపట్టాలని జేడీఎస్ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం రాయచూరు ఐడీఎస్ఎంటీ కాలనీలో నివాసముంటున్న శ్వేత తండ్రి నివాసంలో జేడీఎస్ జిల్లాధ్యక్షుడు విరుపాక్షి ఆధ్వర్యంలో కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామి ఎస్ఐ భార్య శ్వేతను, కుటుంబ సభ్యులను దూరవాణి సంభాషణలో పరామర్శించి ఆమెకు ధైర్యం చెప్పారు. తప్పు చేసిన వారిపై బాధ్యులపై చర్యలు తీసుకొనేలా సర్కార్‌తో చర్చిస్తామన్నారు. కుమారుడి విద్యాభ్యాస వ్యయాన్ని ప్రభుత్వం భరిస్తుందని, సర్కార్ నుంచి ఉద్యోగం ఇప్పించేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఈ సందర్భంగా మహంతేష్ పాటిల్, శివ శంకర్, బుడ్డన గౌడ, నరసింహ నాయక్, రామకృష్ణ, నాగరాజ్, హంపయ్య నాయక్, రాజు, నరసప్ప, వెంకట స్వామిలున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి


మునియప్ప (ఫైల్)

హొసపేటె: విజయనగర జిల్లా కూడ్లిగి పట్టణ శివారులోని కుప్పినకేరి క్రాస్ సమీపంలో బైక్, పాఠశాల వాహనం మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. ఈ ఘటనలో అమ్మనకేరి ప్రభుత్వ పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు మునియప్ప(53) చెందాడు. మృతుడు మునియప్ప వాస్తవానికి హరపనహళ్లి తాలూకాలోని హుణసెహళ్లి గ్రామానికి చెందినవాడు. కూడ్లిగి తాలూకాలోని అమ్మనకేరి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయునిగా పని చేస్తున్నాడు. కూడ్లిగిలోని ప్రభుత్వ యునైటెడ్ ప్రీ-గ్రాడ్యుయేట్ కళాశాలలో ప్రస్తుతం జరుగుతున్న ఎస్ఎస్ఎల్‌సీ సప్లిమెంటరీ పరీక్షకు రూం ఇన్‌స్పెక్టర్‌గా విద్యా శాఖ ఆయనను నియమించింది. ప్రస్తుతం కొట్టూరులో నివాసం ఉంటున్న ఇతను కొట్టూరు నుంచి కూడ్లిగికి ఉదయం బైక్‌లో వెళుతుండగా కుప్పినకేరి క్రాస్ సమీపంలో తాలూకాలోని బడేలడుకు గ్రామంలో ఓ ప్రైవేట్ పాఠశాల వాహనం ఉపాధ్యాయుడి బైక్‌ను బలంగా ఢీ ఢీకొనడంతో బైక్ నుజ్జునుజ్జు కాగా ఉపాధ్యాయుడు మునియప్ప స్థలంలోనే మృతి చెందాడు. ఘటనపై కూడ్లిగి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

దళితులకు రక్షణ కరువు


కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న అశోక్

రాయచూరు రూరల్: రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్‌లో దళితులకు రక్షణ కరువైందని విధాన సభ ప్రతి పక్ష నాయకుడు అశోక్ ఆరోపించారు. ఆదివారం యాదగిరి, కొప్పళ జిల్లా సోమనాళలో ఎస్ఐ పరశురామ్ తల్లిదండ్రులు కుటుంబ సభ్యులను పరామర్శించి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ అధికారం చేపట్టినప్పటి నుంచి దళిత అధికారుల మరణానికి కారణమవుతున్నారన్నారు. వాల్మీకి మండలిలో చంద్రశేఖర్, యాదగిరిలో ఎస్ఐ పరశురామ మృతి చెందడానికి బాధ్యులైన శాసన సభ్యులపై చర్యలు చేపట్టాలన్నారు. ఎస్ఐ పరశురాం మృతిపై విచారణ కోసం కేసును సీబీఐకి అప్పగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన వెంట మాజీ మంత్రులు హాలప్పాచార్, రాజు గౌడ, కుష్టిగి శాసన సభ్యుడు దొడ్డనగౌడ పాటిల్‌లున్నారు.

మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలి


మాట్లాడుతున్న సాజిద్

రాయచూరు రూరల్: జిల్లాలో మరుగుదొడ్ల నిర్మాణాలకు శాసన సభ్యులు చర్యలు చేపట్టాలని అఖిల కర్ణాటక రైతు సంఘం అధ్యక్షుడు సాజిద్ పేర్కొన్నారు. సోమవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ఏడు తాలుకా కేంద్రాలు, జిల్లా కేంద్రంలో మహిళలకు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలకు మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈవిషయంలో జిల్లాలోని ప్రజాప్రతినిధులు మౌనం వహించడం తగదన్నారు.

విద్యార్థి వేతనాల కోసం ధర్నా


నినాదాలు చేస్తున్న విద్యార్థులు


రాయచూరు రూరల్: రాష్ట్రంలో పీయూసీ విద్యార్థులకు విద్యార్థి వేతనాలు చెల్లించాలని ఏఐడీఎస్ఓ డిమాండ్ చేసింది. సోమవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో జిల్లాధ్యక్షుడు అయ్యాళప్ప మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, వెనుక బడిన వర్గాలు, మైనార్టీ విద్యార్థులకు విద్యార్థి వేతనాలు చెల్లించకుండా కాలయాపన చేయడాన్ని ఖండించారు. కార్మికుల పిల్లలకు ఇచ్చే వేతనాల్లో కోత విధించడం తగదన్నారు. విద్యార్థులకు విద్యార్థి వేతనాలు చెల్లించాలని కోరుతూ స్థానికాధికారి ద్వారా విద్యాశాఖా మంత్రికి వినతిపత్రం సమర్పించారు.

దళిత సంఘాల ధర్నా


ఆందోళన చేస్తున్న కార్యకర్తలు

రాయచూరు రూరల్: ఎస్ఐ పరశురామ మృతికి బాధ్యుడైన యాదగిరి శాసన సభ్యుడు చెన్నారెడ్డి పాటిల్‌ను శాసన సభ స్థానం నుంచి తొలగించాలని ప్రగతిశీల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో విశ్వనాథ్ పట్టి మాట్లాడారు. బదిలీ కోసం యాదగిరి శాసన సభ్యుడికి రూ.30 లక్షలు డబ్బులు ముట్టచెబితే యాదగిరి నగర పోలీస్ స్టేషన్‌కు పోస్టింగ్ ఇచ్చారన్నారు. అయితే శాసన సభ్యుడు మరో మారు డబ్బులు లంచం అడిగాడన్నారు. చేసిన అప్పులకు వడ్డీ కట్టలేని స్థితిలో ఉన్న పరశురామ్ జీవితంపై విరక్తి చెంది మరణించడానికి కారణమైన శాసన సభ్యుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానికాధికారి ద్వారా రాష్ట్ర గవర్నర్‌కు వినతిపత్రం సమర్పించారు. అంతకు ముందు అంబేడ్కర్ సర్కిల్ నుంచి జిల్లాధికారి కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.

చివరి ఆయకట్టుకు నీరివ్వండి


రాస్తారోకో చేస్తున్న రైతులు

రాయచూరు రూరల్: తుంగభద్ర ఎడమ కాలువ ఆయకట్టు చివరి భూములకు సక్రమంగా నీరందాలంటే గేజ్‌ను అమర్చాలని రైతులు డిమాండ్ చేశారు. ఆదివారం మాన్వి తాలూకా నీరమాన్వి వద్ద రైతులు చేపట్టిన రాస్తారోకోలో సంచాలకులు శంకరగౌడ, చామరస మాలి పాటిల్ మాట్లాడారు. మైల్ నంబర్ 69, 89 వద్ద నీటి గేజ్ నిర్వహణలో లోపంతో ఆయకట్టు చివరి భూములకు నీరందడం లేదన్నారు. 69 మైలు వద్ద గేజ్ నిర్వహణలో జరిగిన లోపంతో కింది భాగానికి నీరందడం కష్టతరంగా మారిందన్నారు. 69వ మైలు పైభాగంలో ఉన్న దాదాపు 2 లక్షల వరకు అక్రమంగా నాన్ ఆయకట్టును తొలగిస్తే చివరి భూములకు నీరు అందుతుందన్నారు.